
గత శతాబ్దపు సాంస్కృతిక ప్రవంతి

(శతాబ్ది సూరీడు - మాలతీ చందూర్ నవల)

జె. కనకదుర్గ





మాలతీచందూర్

'శతాబ్ది సూరీడు' అనే శీర్షికతో సజీవమైన పాత్రలతో నవలను వ్రాసిన శ్రీమతి మాలతీచందూర్ తెలుగు ప్రజానీకానికి సుపరిచితురాలే. 1930-2013 మధ్యకాలంలో జీవించిన ఉత్తమ సాహిత్యసృజనశీలి, సామాజిక సేవాతత్పరురాలు, మానవతామూర్తి అని అందరి ప్రశంసలు అందుకొన్న విదుషీమణి. కేంద్రసాహిత్య, ఆంధ్రరాష్ట్ర సాహిత్య అకాడమి, రాజాలక్ష్మి ఫౌండేషన్, మద్రాసువారి కళాసాగర్ వంటి విశిష్ట అవార్డులు ఈమెను అలంకరించాయి. **'శతాబ్ది సూరీడు'** అనే శీర్షికతో సజీవమైన పాత్రలతో నవలను వ్రాసిన శ్రీమతి మాలతీచందూర్ తెలుగు ప్రజానీకానికి సుపరిచితురాలే.

ఆమె జీవించిన శతాబ్దంలోని యథార్థ సాంఘిక-సాంస్కృతిక, ఆర్థిక-రాజకీయ పరిణామాల ప్రభావిత సమాజాన్ని తరతరాలకు అందించిన అమరజీవి. తెలుగులో 27 నవలలు, పాతకెరటాల పేరుతో 300కు పైగా ఆంగ్ల రచనలకు అనువాదాలు చేశారు. సమాజాన్ని దగ్గరగా చూసి, సమస్యలపట్ల స్పందించి, అభివృద్ధికరమైన స్వీయ సంస్కారపు ఆలోచనలను పాత్రలపరంగా నిక్షిప్తం చేసి రచనలు చేసారు. అందుకే అశేష పాఠకజనదృష్టిని తన సాహిత్యంవైపు మళ్ళింపచేయగలిగారు. అందునా మహిళలయొక్క స్వీయ వ్యక్తిత్వాలకున్న విలువలను గుర్తింపచేసే రచనలు అవటంచేత మహిళాప్రగతికి రాచబాటను వేయగలిగాయి. ఏ నవలకు ఆ నవలే ప్రత్యేకమైన ఇతివృత్తంతో తగిన కథనశిల్పంతో సామాజికప్రయోజనం కలిగి ఉంటాయి.

గత శతాబ్దపు సాంస్కృతిక స్రవంతి

(శతాబ్ది సూరీడు - మాలతీచందూర్ నవల)

డా. జంధ్యాల కనకదుర్గ

జంకదు ప్రచురణలు

గత శతాబ్దపు సాంస్కృతిక ప్రవంతి

(శతాబ్ది సూరీడు – మాలతీచందూర్ నవల)

ప్రథమ ముద్రణ, మార్చి - 2025

కాపీలు - 500

జంకదు ప్రచురణలు - 9491140299

వెల : రూ.150

ప్రతులకు - చిరునామా

జె.కనకదుర్గ

హౌస్ నెం.5 - 35 - 18,

3వ లైను, 18 వ అడ్డరోడ్డు, బ్రాడీపేట

గుంటూరు – 522002

గతశతాబ్దపు సాంస్కృతిక స్రవంతి

'శతాబ్దిసూరీడు'- శ్రీమతి మాలతీచందూర్ (నవల)

ఈ నవలాచరిత్రలో గత శతాబ్దపు సామాజికవ్యవస్థలోని మొదటి, రెండు తరాల సమ్మిశ్ర సంస్కృతి ప్రభావం గల మహిళల జీవనానికి సాక్షీభూతమైన మా అక్కయ్య **శ్రీమతి గుంటూరు సరస్వతికి,-**

(రిటైర్డ్ అకౌంట్స్ ఆఫీసర్, బి.ఎస్. ఎన్.ఎల్, విడయవాడ,**)**

మూడు, నాలుగు తరాలనుండి నేటికీ కొనసాగుతున్న మహిళా సాంస్కృతిక ప్రస్థానానికి వీక్షకులైన మా మరదళ్ళు(తమ్ముళ్ళ భార్యలు)

శ్రీమతి గన్నవరపు లక్ష్మీప్రసన్న,(పూర్వఉపాధ్యాయిని, హైద్రాబాదు)

మరియు

అమరావతి అన్నపూర్ణ (ఎస్.సి.-విద్యుత్ సౌధ, హైద్రాబాద్.) లకు

ఈ విమర్శనా పరిశోధక గ్రంథాన్ని ప్రేమతో ముందుగా అందిస్తూ...

జంకదు

(జంధ్యాల కనకదుర్గ)

మున్నుడి



ఆచార్యడా. కొలకలూరి మధుజ్యోతి
(పూర్వ ఉపకులపతి - ద్రవిడియన్ యూనివర్సిటి, కుప్పమ్, ఆంధ్రప్రదేశ్)
తెలుగుస్టడీస్ శాఖాధిపతి, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

డా. జె. కనకదుర్గగారు **'గత శతాబ్దపు సాంస్కృతిక స్రవంతి'** అని తాను రాసిన పరిశోధనాత్మక విమర్శనాగ్రంథానికి మున్నుడిగా నా అభిప్రాయాన్ని రాయమని కోరారు.

డా. జె. కనకదుర్గ మంచివక్త. వాక్ ప్రవాహం. ఆ లక్షణం ఈ రచనలోను కనిపిస్తూ ఉంది.

'శతాబ్దిసూరీడు' మాలతీచందూర్ రాసిన విశిష్టనవల. సూరమ్మ (సూరీడు) ప్రధానపాత్రగా శతాబ్దకాలంలో నాలుగు తరాల జీవితాల్ని చిత్రించింది ఈ నవల. ఈ సమయంలో సంతరించుకొన్న రాజకీయ పరిణామాలు, ఆర్థిక పురోగతి, సాంస్కృతిక చైతన్యం అనేక రంగాల పురోగమనం నవలలో అంతర్లీనంగా కలిసిపోయి నిల్చాయి. ఇవి అన్నీ మానవజీవితాలపై విశేషంగా ప్రభావం చూపాయి అని డా. జె.కనకదుర్గగారు తన విశ్లేషణలో భాగంచేసారు. సమాజ పరిణామశీలతను గమనించి అవగాహనతో రాసిన నవల ఇది.

స్త్రీవాద సాహిత్యాధ్యయనం చేసిన డా. జె.కనకదుర్గగారు ఆ చేతనతో నాలుగు తరాల స్త్రీలు ఆయా కాలాలలో తమ పరిధిలో పొందిన చైతన్యాన్ని గుర్తించారు. నవలలో తొలితరం పురుషాధిక్యసమాజపు ప్రభావంలో ఉంటూనే కందుకూరి స్ఫూర్తిని పొందింది. తర్వాతి తరం పురుషాధిక్యతను ధిక్కరించి ఆర్థిక స్వావలంబన సాధించింది. ఆపైతరం ఆధునికతను అందిపుచ్చుకొని

తన జీవితంపై పట్టుసాధించింది. నాలుగోతరం, ఆధునికకాలంలో ఆటంకాలు లేని స్వేచ్ఛతో విదేశీవిద్యకు పయనించే స్థాయికి చేరింది. నవలలో నాలుగుతరాల స్త్రీల జీవితతాపత్రయం,ఆరాటపోరాటాలు, రాజీలవిజయాలు డా.జె. కనకదుర్గగారు సుదీర్ఘవివరణతో క్రోడీకరించారు.

ఇతివృత్తం, మానవీయత, పాత్రలవిశ్లేషణ అనే అధ్యాయాలలోపునరుక్తి ఎక్కువగానే కనిపిస్తుంది. విశ్లేషణలో ఇది తప్పినట్లు లేదు డా.జె.కనకదుర్గగారికి..

నాలుగు తరాలలోను స్త్రీలు స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగలగటం గుర్తించదగ్గ అంశం. ముఖ్యంగా ముందుతరపు సూరమ్మ ఆడపిల్లను పెంచుకోవటానికి సమాజకృత్రిమ నియమాలను, విధినిషేధాలను దాటి నిర్ణయించుకోవటం ఒక అద్భుతం. అదే భావనను తన విశ్లేషణలో కన్పింపచేసారు డా. జె. కనకదుర్గగారు.

పితృస్వామ్య పరిరక్షణ బాధ్యతలను మోసే(చిన్నన్న) పురుషపాత్ర, అటువంటి భావాలకు, ఆధునికయుగ భావాలకుమధ్యన నలిగే(బుల్లన్నయ్య) పురుషపాత్ర, అసమర్థ(సత్యం)పురుషపాత్ర, ఆధునికభావజాలంతో ఉన్న పురుషపాత్ర(రామశేషు)లను సందర్భోచితంగా ఈ రచనలో విశ్లేషించారు. రామశేషు పాత్ర వ్యక్తిత్వాన్ని రచయిత్రి రూపొందించినంత విశేషంగాను డా.జె.కనకదుర్గగారు విశ్లేషించారు.

స్వాతంత్ర్యం రాకపూర్వం, తిరుగుబోతు భర్తకు విడాకులిచ్చే అవకాశం స్త్రీలకు లేదు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో రాధాసుబ్బరాయన్ బిల్లు ప్రవేశపెట్టాలనే ఆలోచన ఉన్నట్లూ; స్త్రీలకు ఆస్తిహక్కులేని కాలంలో కనుపర్తి వరలక్ష్మివంటివారు చేసిన ప్రయత్నమూ తన విశ్లేషణలో డా.జె.కనకదుర్గగారు ప్రస్తావించటం ప్రశంసింపదగ్గది. హిందూమ్యారేజ్ యాక్ట్-1955, విడాకుల మంజూరు వివిధకారణాలతో ఇవ్వవచ్చని పేర్కొంది. హిందూ సక్సెషన్ యాక్టు-1956, స్త్రీకి వారసత్వపు హక్కును ఇచ్చింది. అయితే అవి ఎంతవరకు అమలు అవుతున్నాయి అన్నదే నేటికీ ప్రశ్న.

గత శతాబ్దంలోని సాంస్కృతిక స్రవంతిగా 'శతాబ్దిసూరీడు'లోని మహిళల జీవనయానాన్ని గుర్తించి, విస్తారంగా విశ్లేషించి ఈ పుస్తకాన్ని రచించిన డా.జె.కనకదుర్గగారిని అభినందిస్తున్నాను.

కొలకలూరి మధుజ్యోతి

ఆత్మీయతతో....



డా.జె.కనకదుర్గ

శ్రీమతి మాలతీచందూర్ రాసిన **'శతాబ్దిసూరీడు'** అనే నవల ఒక పరిణామశీలమైన మానవసాంస్కృతిక ప్రవంతి. సమాజంలో స్త్రీపురుష సంబంధాలలోని అనుబంధాల విలువలను గ్రహింపుకుతెచ్చి పాఠకులు ఎవరికివారే తమలోకి తాము తొంగిచూసుకొని చైతన్యవంతులు కావటానికి ఈ నవల దోహదకారి అవుతుంది. గత శతాబ్దకాలంలో జీవించిన నాలుగుతరాలకు చెందిన స్త్రీల జీవనయానాన్ని ప్రభావితంచేసిన సామాజిక చలనసూత్రాల నేపథ్యాన్ని నమోదుచేసిన చారిత్రక-సామాజిక నవల ఈ శతాబ్దిసూరీడు. గత శతాబ్దంలో మారుతున్న సామాజికవ్యవస్థలో తమకు నిర్దేశించిన సమాజసంస్కృతిపట్ల ఘర్షణచెంది స్త్రీలు స్వయంచోదకమైన వ్యక్తిత్వాలతో తమ జీవితాలకు తామే చుక్కానిగా తయారవటమే మహిళాసాంస్కృతిక పరిణామశీలత. దానికి తగ్గట్టుగానే పితృస్వామ్య సంస్కృతి మార్పుకు గురికాకతప్పని పరిస్థితులు ఏర్పడతాయి. కుటుంబంలో స్త్రీపురుష సంబంధాలలోని స్త్రీలనిక్కచ్చితనం వల్ల పురుషులు ఎదుర్కొన్న అనుభవాల ప్రక్షాళనలోనుంచి పుట్టుకొచ్చి వారిలో కలిగే చిత్తసంస్కారం ఒక చైతన్య స్వరూపమే. నేటికీ సమాజంలో చెలామణి అవుతున్న పురుషాధిక్యతకు మందును కనిపెట్టిన నవల ఇది. స్త్రీలు పితృస్వామ్య సమాజసంస్కృతిని ఆచరించటమే తమ జీవితధ్యేయంగా చేసుకోవటం కాకుండా, మారుతున్న వ్యవస్థలో తమముందున్న సాంస్కృతికసవాళ్ళను ఎదుర్కొంటూ నిర్భీతియుత చైతన్యంతో తమ జీవితాలకు విలువలను సంతరింపచేస్తూ ముందుకుసాగటమే

పరిణామశీలతగల జీవన సంస్కృతి. అటువంటి సాంస్కృతిక స్రవంతిని ప్రతిఫలింపచేసిన నవలగా'శతాబ్దిసూరీడు' తరతరాలకు పాఠకులమనసులలో నిలబడేటట్లు చేయటానికి వారధి వంటి ఈ విమర్శనాగ్రంథాన్ని రూపొందించటం జరిగింది.

మాలతీచందూర్ రాసిన 'గత శతాబ్దపు సాంస్కృతిక స్రవంతి'- శతాబ్దిసూరీడు-మాలతీచందూర్(నవల), అనే ఈ నా విమర్శనా పరిశోధక గ్రంథం పాఠకులలో పరస్పరప్రేరణను రగిలించి సహృదయ చైతన్యాన్ని కలిగించే విధంగా అడిగినంతనే అభినందిస్తూ మున్నుడిని రాసిన ఆచార్య మధుజ్యోతి గారికి (శ్రీ పద్మావతి విశ్వవిద్యాలయం, తిరుపతి) ఆత్మీయతతో కూడిన కృతజ్ఞతలు తెలుపుకోవటం నాకు సంతోషదాయకం.

కళాశాల ప్రిన్సిపాల్గా ఉద్యోగాన్ని నిర్వహిస్తున్నా, అడగగానే తీరికచేసుకొని అందమైన చిత్రాలతో రూపకల్పన చేసి ముఖచిత్రాన్ని సంతరింపజేసి అలంకరించిన శ్రీ ఎస్. చంద్రమోహన్ గారికి కృతజ్ఞతలు తెలియచేయటం నా బాధ్యత. పుస్తక ముద్రణలో సహకరించిన శ్రీ ఎమ్.వి. శాస్త్రి, పెద్ది సాంబశివరావుగారికి, తదితరులకు హృదయపూర్వక కృతజ్ఞతలు..

డా. జంధ్యాల కనకదుర్గ
రిటైర్డ్. ప్రిన్సిపాల్
సింగరేణి కాలరీస్ హిళా డిగ్రీ కళాశాల
భద్రాద్రి కొత్తగూడెం.

గత శతాబ్దపు సాంస్కృతిక స్రవంతి

(శతాబ్ది సూరీడు - మాలతీచందూర్ నవల)

విషయసూచిక **పేజీలు**

1. 'శతాబ్ది సూరీడు'-నవలారచయిత్రి

'శతాబ్ది సూరీడు' అనే శీర్షికతో సజీవమైనపాత్రలతో నవలను వ్రాసిన శ్రీమతి మాలతీచందూర్ తెలుగుప్రజానీకానికి సుపరిచితురాలే. 1930-2013 మధ్యకాలంలో జీవించిన ఉత్తమ సాహిత్యసృజనశీలి, సామాజికసేవా తత్పరురాలు. 'మానవతామూర్తి' అని అందరి ప్రశంసలు అందుకొన్న విదుషీమణి. కేంద్రసాహిత్య, ఆంధ్రరాష్ట్ర సాహిత్య అకాడెమి, రాజాలక్ష్మి ఫౌండేషన్, మద్రాసువారి కళాసాగర్ వంటి విశిష్ట అవార్డులతోపాటు అనేక పురస్కారాలు ఈమెను వరించి పునీతం అయ్యాయి. 'ప్రమదావనం'లో పరిమళించిన సాహిత్యమాలతీ సుగంధవల్లిక. ప్రముఖ పాత్రికేయులు చందూరు నాగేశ్వరరావుగారితో వివాహం జరిగి మాలతీచందూర్‌గా ప్రసిద్ధి చెందారు. రచయితల సాంగత్యంలో జ్ఞాననేత్రానికి మనస్సును జోడింపచేసి పాఠకచైతన్యాన్ని కలిగించే రచనలతో మానవత్వపు మంచితనాన్ని విస్తృతంచేసిన రచయిత్రి. తాను జీవించిన శతాబ్దంలోని యథార్థ సాంఘిక-సాంస్కృతిక,ఆర్థిక-రాజకీయ పరిణామాల ప్రభావిత సమాజాన్ని తరతరాలకు అందించిన అమరజీవి. తెలుగులో 27 నవలలు, పాతకెరటాల పేరుతో 300 కుపైగా ఆంగ్లరచనలకు అనువాదాలు చేసారు. మద్రాసులోని శ్రీపొట్టిశ్రీరాములు స్మారకసమితి సంస్థాపక సభ్యురాలిగా, అధ్యక్షులుగా చెన్నైలో తెలుగుసాహితీ వైభవానికి చిరస్మరణీయ ముద్రను వేసారు.సమాజాన్ని దగ్గరగా చూసి, సమస్యలపట్ల స్పందించి, అభివృద్ధికరమైన స్వీయసంస్కారపు ఆలోచనలను పాత్రలపరంగా నిక్షిప్తంచేసి సాగించిన రచనలు అవటంచేత అశేష పాఠకజనదృష్టిని తన సాహిత్యంవైపు మళ్ళించ గలిగారు. అందునా మహిళల స్వీయవ్యక్తిత్వాలకున్న విలువలను గుర్తింపచేసే రచనలు అవటంచేత మహిళాప్రగతికి రాచబాటను వేయగలిగాయి.వారి రచనలు అబలలని అనుకొనేవారిని ప్రబలలుగా మారేవిధంగా చైతన్యపరుస్తాయి.స్త్రీలపట్ల

వకాల్తాపుచ్చుకొన్నట్లున్నా, ద్వేషాతీతంగా ఉండటంతో పురుషులుకూడా తమలోకి తాము తొంగి చూసుకొనే రీతిలో ఉంటాయి. సామాజికసంస్కృతిలో భాగంగా కుటుంబసంబంధాలలో స్త్రీలకు సమస్యలను సృష్టించేవారు ఆధికారాన్ని చెలాయించే వ్యక్తులే. అయితే అదే కుటుంబవ్యవస్థలో సంస్కారంగల వ్యక్తులుంటే వారిసాన్నిహిత్య సహకారాలు స్త్రీలసమస్యలకు పరిష్కారాలుగా కనపడతాయి. ఆక్రమంలోనే మనుష్యుల్లో మంచితనాన్ని మేలుకొలిపి జీవితలక్ష్యాలను ఏర్పరచుకొనే విధంగా ఈమె వ్రాసిన నవలల్లో 'ఆలోచించు', 'బ్రతకనేర్చినజాణ', 'ఏది గమ్యం? 'ఏదిమార్గం?', 'ఎన్నిమెట్లెక్కినా', 'గౌతమీపుత్రి', 'కలలవెలుగు', 'కాంచనమృగం', 'లావణ్య', 'మధురస్మృతులు', 'మనసులోనిమనసు', 'మేఘాల మేలిముసుగు', 'శతాబ్దిసూరీడు', హృదయనేత్రి', 'రేణుకాదేవి ఆత్మకథ', 'సద్యోగం', 'భూమిపుత్రి', 'ఓమనిషికథ', 'రాగరక్తిమ', 'జయలక్ష్మి', 'కృష్ణవేణి', 'శిశిరవసంతం', 'రెక్కలచుక్కలు','వైశాఖి', 'ఏమిటి జీవితాలు' వంటినవలలు, 'చంపకం-చెదపురుగులు'వంటి కథలు,పాతకెరటాలవంటి అనువాద రచనలు ప్రసిద్ధి పొందినవి. ఏనవలకానవలే ప్రత్యేకమైన ఇతివృత్తంతో తగిన కథనశిల్పంతో సామాజిక ప్రయోజనం కలిగిఉంటాయి.

మాలతీచందూర్ రచించిన 'ఆలోచించు' అనే నవలలో స్త్రీపురుష సంబంధాలను అర్థంచేసుకొనే క్రమంలో స్త్రీల సమస్యలకు వెనకాల ఉన్న మూలకారణాలను అన్వేషించగలిగి ఎవరిస్థితి ఏమిటో తెలియచేసుకొనేటట్టు చేసిన నవల. స్త్రీ తన అస్తిత్వంగురించిన ఆలోచనలను పెంచుకొంటూ సమాజంలో తనకంటూ ఒకస్థానాన్ని ఏర్పరచుకోవటమనే చైతన్యస్పృహను, తాత్వికదృష్టిని కలిగించే నవల. ఎంతో ఆదర్శవంతమైన వివాహాలలోకూడా మానవత్వం వెనకాలఉన్న పురుషస్వార్థం స్త్రీని మానసిక హింసకుగురి చేస్తుందని, పురుషాధిక్యత స్త్రీల జీవితాలను బలిచేయటాన్ని 'ఏదిగమ్యం? ఏది మార్గం?' లో అర్థమౌతుంది. కేంద్రసాహిత్య అకాడెమి అవార్డును అందుకొన్న 'హృదయనేత్రి' నవలలో,ఆంధ్రప్రాంతంలో చీరాల-పేరాల ఉద్యమంతో

ప్రారంభమైన జాతీయోద్యమంనాటి ఆశయాలు, ఉద్యమఘట్టాలు, ఖద్దరు ధారణ, హరిజనోద్ధరణ, స్త్రీలు ఉద్యమంలోపాల్గొనటాన్ని వ్యక్తంచేసింది. కాని స్వాతంత్ర్యానంతరం మానవీయ విలువలు తగ్గి మనుషులలో స్వార్థంపెరగటం, రాజకీయాలు భ్రష్టుపట్టటంతో కొత్తసిద్ధాంతాలు సమాజంలో పుట్టుకురావటం అనివార్యమవటం నవలాంశంవల్ల అర్థమౌతుంది. స్వాతంత్ర్యానంతరం జాతీయోద్యమ స్ఫూర్తి విలువలు కోల్పోయి విప్లవోద్యమంగా రూపాంతరం చెందటం అర్థమౌతుంది. అదేమేరకు మానవీయవిలువలతో యువత కర్తవ్యాన్ని స్ఫురింపజేయటం ఈ నవల ప్రత్యేకత.'కాంచనమృగం' నవలలో మానవసంబంధాలకు కులం, వర్గం అడ్డుగోడలుకావని తెలుస్తుంది. ఆకలి, ఇంటిచాకిరి, ఆర్థికపరిస్థితుల ప్రేరేపణ కుటుంబ సంస్కృతిని అధిగమింపచేస్తుందని తెలియచేసే నవల. సూక్ష్మస్థాయిలో పరిశీలిస్తే ఇటు కుటుంబంలోని స్త్రీపురుషసంబంధాల సంక్లిష్టతలు, అటు సామాజికంగా మానవసంబంధాల పరిణామాలమధ్యన మానవమనస్తత్వాల విశ్లేషణ పాఠకులను చైతన్యపరుస్తాయి. 'లావణ్య' నవలలో డాక్టరు దంపతుల సేవలలోని మానవత్వపు గుబాళింపును మధురస్మృతిగా మిగిల్చి, మనస్సుల్లోనుంచి వచ్చే ప్రేమాభిమానాలకుండే విలువలను తెలియచేసే నవల అది.'సద్యోగం' నవలలో స్త్రీపురుష లైంగికసంబంధాల విషయాలలో స్త్రీలు జీవితంలో మోసపోయినా, అందులోంచి బయటకువచ్చి ఉద్యోగంలో తనశక్తిని నిరూపించుకుంటూ వ్యక్తిగతానికి తావులేకుండా విధినిర్వహణచేయటమే సద్యోగం అని భావింపచేసే నవల. ఓల్గా చెప్పినట్లుగా ఆమె నవలల్లో "వాస్తవజీవితం, ఆధునిక దృష్టి, సంప్రదాయాల నిరసన, కొత్తదారులలో నడిచేవారి జీవితాలలో వచ్చేసమస్యలపట్ల సానుభూతి, స్త్రీలసమస్యలను ఆధునికదృష్టితో పరిశీలించటం, వివిధజీవన సందర్భాలలో చిక్కుకున్న పాత్రల మానసికవిశ్లేషణ" కనపడుతుంటాయి.

ప్రస్తుత నవలాపరిశోధనాత్మక విమర్శ మాత్రం **'శతాబ్ది సూరీడు'**కు పరిమితం. ఈ నవలలో దాదాపుగా గత శతాబ్దపుకాలపు ప్రారంభంనుండి సూరమ్మ జీవితం మొదలై, ఆ శతాబ్దపుముగింపు వరకు జీవించిన 'సూరమ్మ/సూరీడు'జీవిత చరిత్ర. దాదాపుగా శతాబ్దకాలంలో సూరీడు జీవనగమనం ఎలాఉందో, లేదా కాలాన్నే సూరమ్మ నడిపించిందో తెలియటానికి ఈ నవలాపఠనం అవసరం. అందుకోసం రచయిత్రి ప్రత్యేకంగా నవలాప్రక్రియని ఎంచుకోవటానికున్న వెసులుబాట్లను అర్థంచేసుకోవటానికి నవలాప్రక్రియ లక్షణాలను తెలుసుకోవాలి.

* * * * * *

2. నవలాప్రక్రియ -లక్షణాలు

ఆధునిక యుగంలోని సాహిత్య ప్రక్రియలలో నవలారచనకు ఒక విశిష్టస్థానం ఉంది. విస్తృతసమాజ ప్రతిఫలానికి ఆలవాలమై కాలక్రమానుగత సామాజిక యదార్థ జీవనాన్ని ప్రతిబింబించేది నవల. అవసరమైతే గతకాలపు లోతుల్లోకికూడా తొంగిచూసి ఆనాటినుండి నేటివరకు ఉన్న పరిణామ సమాజాన్ని వాస్తవికంగా దర్శనీయంచేయగల అవకాశం ఉన్న రచన నవల. క్రమానుగతమైన కాలం నవలలో అంతస్సూత్రంగా ఉంటుంది. చరిత్రలో సామాజిక-సాంస్కృతిక, ఆర్థిక-రాజకీయాలు మానవజీవనాన్ని ప్రభావితం చేసినప్పుడు మనుష్యుల జీవితాలలో ఆటుపోట్లు సంభవిస్తాయి. వాటిమధ్యన నిలదొక్కుకోవటానికి నిండైన చైతన్యాన్ని అందించేది నవల. జీవితం, జీవించటం ఒక కళ. అందుకే లార్డ్‌డేవిడ్ నవలగురించి చెప్తూ 'సజీవమానవ జగత్తుతో పరిచయంచేసే కళాకృతి నవల" అన్నాడు. జీవితాన్ని ప్రతిబింబించే నవలారచన కథాత్మక కళగా రాణిస్తుంది.

సమగ్రజీవితాన్ని ప్రతిబింబిస్తూ సంఘంలో మూఢవిశ్వాసాలను రూపుమాపే సాధనంగా మానవజీవితాలలోని చెడునుపోగొట్టి మంచిని పెంచేదిగా ఉండేదే నవలారచన అని భావించారు. ఆధునిక యుగంలో ప్రాథమికంగా వచనప్రబంధంగా పేర్కొనబడి, తరువాత నవలగా ప్రక్రియ స్థిరపడింది. ఈ నవలలు ప్రధానంగా వస్తుపరంగా సామాజికనవలలు, చారిత్రకనవలలు, పౌరాణిక నవలలు, విప్లవాత్మక నవలలుగా, కాలానుక్రమానుగతంగాను విభజించి చెప్పటం తెలిసిందే. నవల కథాత్మక కళ. సంభాషణలు, నాటకీయతవంటి దృశ్యకావ్యకథనంతో కూడిన సమాహారకళా శ్రవ్యకావ్యపేటిక. దాన్ని గురించిన అవగాహనకై, స్థూలంగా నవలారచన స్వరూపస్వభావాలను తడిమి చూడాలి. 'యథార్థజీవనాన్ని యథార్థదృష్టితో అధ్యయనంచేసి దానిని గద్యరూపంలో వ్యక్తం చేసేదే నవల' అని రిచర్డ్స్ క్రాస్ ఉటంకింపు మాలతీచందూర్ గారి నవలలకు సరిగ్గా

సరిపోతుంది. సజీవమైన జగత్తుతో సంబంధంకల కళాకృతి నవల. వాస్తవిక జీవితాన్ని కాల్పనికకథగా మలిస్తే రూపొందేది నవల. మొదలి నాగభూషణశర్మగారు నవలా లక్షణాలను క్రోడీకరిస్తూ యుగచిత్రణ నవల ధ్యేయమని, దానిలో సమకాలీన సమాజ మానవజీవితాల చిత్రణ ఉండాలని నిర్దేశించారు.

కథేతివృత్తం కాలక్రమానుగతంగా ముందుకు సాగేవిధంగా ఉండవచ్చు. వెనకనుంచి ముందుకువచ్చి క్రమానుగతిలో సాగవచ్చు. జలం బిందువునుండి సింధువు వరకు విస్తరించినట్లు మానవజాతి సంభృతమైన విశాలవిశ్వం వరకు జీవనయానం సాగించవచ్చు. సామాజిక-సాంస్కృతిక, ఆర్థిక-రాజకీయ స్వభావంతో కూడుకొన్న సంఘటనాత్మకమైన ఇతివృత్తంలో వ్యక్తుల అభిప్రాయాలను, భావాలను విభిన్నకోణాలనుండి అభివ్యక్తీకరిస్తూ సమగ్ర సమాజాన్ని ప్రతిఫలింపచేయగల సాహిత్యప్రక్రియ నవల. ఆయా సంఘటనల ప్రభావం పాత్రలద్వారా వ్యక్తీకరింపబడుతుంది. పాత్రలకు సంఘటనలకు సంబంధం ఉన్నప్పుడే కథేతివృత్తం సజావుగా సాగిపోతూ పాఠకులకు ఉత్కంఠను కలిగిస్తుంది. అప్పుడే ఆ విషయం పాఠకుల మనస్సులలో స్థిరంగా చోటుచేసుకొంటుంది. ప్రణాళికాబద్ధంగా కార్యకారణసంబంధాలతో కూడిన మానవచర్యల ప్రధానంగా సాగేది ఇతివృత్తం. అందుకే పాత్రల స్వభావచిత్రణ సహజంగా ఉండాలి.

కథేతివృత్తంలో భాగంగా సజీవపాత్రచిత్రణతో సామాజికసంస్కృతిని వ్యక్తంచేస్తూ అర్థవంతమైన పరిణామచైతన్యాన్ని విస్తృతంచేయగల సృజనాత్మక రచన నవల. కల్పనచేయటం కళకోసమే, కాని సామాజిక వాస్తవికచిత్రణ మానవాభివృద్ధికోసం జరగాలి. సామాజిక జీవితసత్యాలను చెప్పాలనుకొన్న రచయిత ఆయా కథాసంఘటనలలో పరోక్షంగా పాత్రలపరంగా చెప్పించటం ఉత్తమరచనా లక్షణం. అందుకే పాత్రచిత్రణ నవలకు ఆత్మ వంటిదంటారు. ఇతివృత్తాన్ని,పాత్రలను వేరుచేసి చూపించకూడదని విమర్శకులు భావిస్తారు. సంభాషణద్వారా కథావికాసగమనం జరుగుతుంది. రచయిత దృక్కోణంలో

ఉన్న సత్యాలను పాత్రల మనస్తత్వాలలో, వారిచర్యలలో పొందుపరచాలి. ఎంతో అవసరమైనప్పుడు మాత్రమే రచయిత కథనం కనిపించటం రచనాశిల్పానికి దోహదం చేస్తుందనేది విమర్శకుల భావన. కథేతివృత్తంలోని ప్రతి సన్నివేశం కేంద్రకం చుట్టూ అల్లుకొని ఉంటుంది. దానినే కథాసంవిధానం అంటారు. సూదికి, దారానికి ఉన్నసంబంధంలాగా కథావస్తువుకు,శిల్పానికి సంబంధం ఉంటుంది. కాబట్టి రచయిత కళాత్మకత నవలకథాశిల్పంలో ప్రతిఫలిస్తుంది. ప్రారంభంనుండి ముగింపువరకు రచయిత ఎన్నుకొన్న వస్తువిషయం ప్రణాళికాబద్ధమైన కథానిర్వహణలో నవలాశిల్పం ఉంటుంది. పాత్ర పరిశీలనాదృష్టి, ప్రపంచజ్ఞానం, హృదయ సంస్కారాలపై కథాపరిణామ, వికాసాలు ఉంటాయి. ఆ పాత్రలను ఏ నేపథ్యపు శక్తులు నడిపిస్తున్నాయో వాచ్యం చేయకుండానే ప్రతిపదంలోను స్ఫురింపచేస్తూ రచనచేయటం, సామాజికభావాలకుతప్ప పక్షపాతబుద్ధి లేకుండా మానవ సంబంధాలలోని స్త్రీపురుషపాత్రచిత్రణ చేయటంలోనే రచయిత గొప్పతనం యిమిడి ఉండి శాశ్వతవిలువలతో అది గొప్ప సాహిత్యమౌతుంది.

మానవజీవితాలకు విలువలుంటాయని భావించి వ్యక్తిత్వస్పృహ ఏర్పడినప్పుడు సంఘర్షణలకు లోనవటం, కుటుంబసంబంధాలలో సంక్లిష్టతలు చోటుచేసుకున్నప్పుడు గుండెనిబ్బరంతోకూడిన మానవీయత సమస్యలకు పరిష్కారం చూపుతుంది. అది స్థిరంగా ఉంటేనే మనిషికి శాశ్వతవిలువలు ఏర్పడతాయి.ఇదంతా పరిణామశీలక పాత్రచిత్రణలో స్పష్టమౌతుంది. అయితే ఆ పరిణామం సహేతుకత, కార్యకారణ సంబంధాలతో సమంజసంగా ఉంటూ మిగిలినపాత్రల చర్య,ప్రతిచర్యల ఫలితంగా స్పష్టమవ్వాలి. రచయిత పాత్రలరూపురేఖలను వర్ణించటంకన్నా సంఘటనాత్మక చర్యలలో ఆయా పాత్రల క్రియాశీలతలో వాటిని స్ఫురింపచేయాలి. ఒక్కొక్కప్పుడు పాత్రల అంతరంగమనో విశ్లేషణరూపంలో పాత్రల స్వభావం అర్థమౌతుంటుంది. చారిత్రక కాలగమనంలో సామాజిక చలనసూత్రాల పరిణామాలు

చోటుచేసుకుంటున్నా కుటుంబజీవన సంస్కృతిలో ఉండే మౌలికత అంతస్స్రూత్రంగా ఉంటూనే ఉంటుంది. మానవసంబంధాలలోని ప్రజాస్వామికత వ్యక్తుల ఆలోచనలను ప్రేరేపించినప్పుడు, క్రియాశీలకమైన అనుభూతులు, అనుబంధాలను పటిష్ఠంచేసే విధంగా పాత్రచిత్రణ ఉన్నచోట అంతర్గత రచనాశిల్పం యిమిడి ఉంటుంది. పాత్రలు కథేతివృత్తానికి లొంగి ఉండటంకంటేకూడా సన్నివేశాలకూర్పుతో పాత్రలే కథని, కాలాన్ని నడిపించటం ఉత్తమ రచనా లక్షణం. అప్పడే కథాశిల్పం రచనను కళాత్మకం చేస్తుంది.

కథానుగుణంగా సన్నివేశకల్పనలో సామాజికవ్యక్తుల సామీప్యతతో రూపొందింపబడిన పాత్రలను కట్టెదుట నిలబెట్టగలిగిన వాస్తవికత పాఠకహృదయాల్ని మమేకంచేసి చైతన్యాన్ని ఇవ్వగలుగుతుంది. రచయిత తన ఆలోచనలను, ఆశయాలను, ఉద్దేశ్యాలను కథావస్తుగతంగా నాటకీయంగా పాత్రలద్వారా చెప్పించినప్పుడే రచన విలువైనది అవుతుంది. పాత్రల పూర్వాపరాలు, స్వభావాలు సంఘటనలకు ప్రాణంపోస్తాయి. అటువంటి పాత్రలే ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక భేదాలకతీతమై మానవత్వపు శక్తిగా ప్రకాశిస్తాయి. అందుకే ఉత్తమ నవల సమాజసంబంధాలలోనుండి ఆవిర్భవించి అనుభూతిని ఇవ్వగలిగే విభిన్నజీవితాల పరస్పర ఆధారితాలైన పాత్రచిత్రణతో ఉంటుంది. ప్రధానపాత్రచుట్టూ పరిణామశీలమైన సమాజం కనపడుతూ ఉంటుంది. కాని ఒకొక్కప్పుడు పాత సంస్కృతిమాత్రం పట్టి ఉంచుతున్నప్పుడు, బాహిరపరిణామశీలత లేకపోయినా అంతర్గత సంస్కారయుతమైన మానవత్వం ఉట్టిపడుతుంది. పరిణామశీలమైన ప్రతిపాత్రకు కథేతివృత్తంలో విలువ ఉంటుంది. అప్పుడే రచయిత ఉద్దేశ్యంతో పాఠకహృదయం మమేకం కాగలుగుతుంది. అవసరమైనచోట పాత్రని లోతుగా అర్థంచేసుకొని సహానుభూతిని చెందాల్సి వచ్చినప్పుడు రచయిత ఉద్దేశం స్పష్టంచేయటం అర్థమౌతుంది. రచయితవ్యాఖ్యానం ఎంత తక్కువ ఉంటే అంతగా పాత్రలు కథకు ప్రాణంపోస్తాయి. సృజనకారులు మాత్రమే

గ్రహించే విషయం ఇది. ఒక్కొక్కప్పుడు ఉద్దేశ్యపూరితంగా తప్పిదపుచేతలు లేనప్పుడు జరిగిన సంఘటనలకు నైతికబాధ్యతవహిస్తూ పాత్రలు అంతర్మథనం చెందుతూ మనోవిశ్లేషణలోకి జారుతుంటాయి. వ్యక్తి హృదయంలోని ఉద్విగ్నతలో చైతన్యస్రవంతి జాలువారుతుంటే పాఠకుల జీవితాలలోని తుల్యసంఘటనలు ప్రభావితంచేయటంతో వారు తమలోకి తాము తొంగి చూసుకొనే ప్రయత్నంచేస్తారు. పాత్రల సుప్తచేతనకూడా దీనికి మినహాయింపు కాదు. సంఘటనలలో, పాత్రలలో సామాజిక వాస్తవికత ఉంటే ఆ రచన పాఠకులకు అంత దగ్గరగా ఉండి చైతన్యశీలతను సంతరించుకొంటుంది.

సమాజంలోని మానవసంబంధాలలో వ్యక్తులుగా, ఆ యా జీవన సంఘటనల్లో వారి కదలికలు, నడవడిక, సంభాషణలోని మంచి-చెడులు కలిసి సమ్మిశ్రమంగా కలిగించే కుతూహలత్వం పాఠకుల అంతర్ముఖత్వంతో సంవాదంచెంది ప్రేరేపించే చైతన్యం వెరసి సమాజాభివృద్ధి దిశగా నడిపింపచేయటం నవలాప్రయోజనంగా భావించవచ్చు. కాలానికి తగినట్లుగా అభివృద్ధికరమైన విప్లవాత్మక ఆలోచనలను కలిగిస్తే ఒక నూతనత్వాన్ని పొంది పాఠకులలో నూతనచైతన్యానికి నవల నిధివంటిది అవుతుంది. ముగింపులో సామాజిక పరిణామ ప్రభావం కథను తరతరాలకు ఇంకాకొనసాగించేటట్లుగా ఉండాలి. అటువంటి రచనలే సార్వకాలికం అవుతాయి. పాఠకులచేత మళ్ళీమళ్ళీ చదివింపచేస్తాయి.

సామాజిక ప్రయోజనకర సజీవ పాత్రచిత్రణతో సాహిత్యచైతన్యం సిద్ధించటంలోనే నవలా శిల్పం ఉంటుంది. స్థల,కాలాదులనుబట్టి పాత్రల మనస్తత్వాల ఆధారంగా కథాగమనం, సాంఘిక-సాంస్కృతిక,ఆర్థిక పరిణామాల వాతావరణంలో పాత్రల అభివృద్ధికర నిర్ణయాత్మకత, క్రియాశీలత్వం, మానవీయసంబంధాల పురోగతి, స్త్రీపురుషసంబంధాలలో వ్యక్తిత్వస్ఫూర్తి కలబోతగా సాహిత్యచైతన్యానికి పట్టుగొమ్మలుగా ఉండే రచనలు విలువలను సంతరించుకొని పదికాలాలపాటు మన్నన పొందగలుగుతాయి.

ప్రారంభవిషయం ముగింపువరకు ఉండి ఫలితాలరూపంలో అభివృద్ధికరంగా కనబడినప్పుడు రచనోద్దేశ్యం స్పష్టమౌతుంది. రచయిత కథాగమనదృష్టితో పాత్రలమనస్తత్వాలలో పరకాయ ప్రవేశంచెంది సాహిత్యప్రయోజనం సిద్ధించే రీతిలో ఆయాపాత్రలను సామాజిక వాస్తవపరిధిలో సంస్కారవంతంగా నడిపింపజేయటమే కథనశిల్పం. ఇటువంటి పరిపూర్ణ నవలా లక్షణాలు వాటంతట అవే చోటుచేసుకొన్న నవలాశిల్పం గలది మాలతీచందూర్ రచించిన **'ఈ శతాబ్ది సూరీడు'** నవల.

రచయిత తెలియ చెప్పాలనుకొన్న సామాజిక మానవ విలువలు సంఘటనల్లోనుంచి సహజంగా పుట్టుకొచ్చినప్పుడే చైతన్యస్పృహను కలిగించి నవలాప్రయోజనం సిద్ధింపచేస్తుంది. అటువంటి ఉత్తమ రచన **'శతాబ్దపు సూరీడు'** అనే ఈ నవలను అవలోకించాలి. దానికై ఈ నవలలోని కథాగమనంలోని పాత్రచిత్రణ ప్రాముఖ్యతను తెలుసుకోవాలి. ఒక శతాబ్దకాలపు చరిత్రలోని రాజకీయ-ఆర్థిక చలనసూత్రాల ప్రభావంవల్ల పరిణామశీలతను సంతరించుకొన్న మహిళాసంస్కృతి అభివృద్ధికరంగా ఉందా? లేదా? అని ఈ 'శతాబ్దిసూరీడు' నవల ఆలోచింపచేస్తుంది. అటువంటి సాంస్కృతిక స్రవంతి మానవసంబంధాలలో మార్పులు తేగలిగి చిత్తసంస్కారాన్ని కలిగించిందా? లేదా? అనీ, అది తరతరాలను ఆలోచింపచేస్తుందా, లేదా అని తర్కించుకోగలిగిన పాఠకులకు ఆ సాహిత్యపు విలువ అర్థమౌతుంది. అప్పుడే రచయిత ఉద్దేశం అర్థమౌతుంది. పితృస్వామ్యసంస్కృతియే సమాజంలోని మహిళల సమస్యలకు కారణమని ప్రశ్నించటం మొదలుపెడితే స్త్రీవాదమనే ముద్రవేస్తారు. కాని స్త్రీలసమస్యలకు మూలకారణమైన పితృస్వామ్యసంస్కృతిని వాచ్యంచేయకుండా సమాజంలో మనుషుల సామాజికవాస్తవ జీవనసంఘటనలలో, సందర్భానుసారంగా ఆయా పాత్రల స్వభావాలలో, నడతలలో ఆసంస్కృతి విశ్వరూప విన్యాసాన్ని విశదీకరించి, మనుషులలో ఏర్పడాల్సిన చిత్తసంస్కారాన్ని స్ఫురింపచేసే విధంగా రచనచేయగలగాలి. అప్పుడది మానవసంబంధాలలో ప్రజాస్వామ్య సంస్కృతిని అభివృద్ధిచేయగలుగుతుంది. అదే మానవీయతగా పరిణామం

చెందుతుంది. ఆర్థికపరాధీనత వల్ల స్త్రీలు చైతన్యరహితులుగా మారతారు. పితృస్వామ్యసంస్కృతి స్త్రీలపాలిటి గొడ్డలిపెట్టువంటి విషయమే. దాన్ని ప్రశ్నించటం ఒకపద్ధతి. కాని సంస్కృతిని ప్రశ్నకుపెట్టటంవల్ల సాంస్కృతిక పరిణామం సాధ్యంకాదు. అందుకనే ఏ బలమైన ఆర్థిక-సామాజిక పరిస్థితులు పితృస్వామ్యసంస్కృతి ఏర్పడటానికి పునాదిభూతమయ్యాయో, అవే తిరిగి బలహీనమై సామాజిక తిరస్కరణకు గురియైనప్పుడు మాత్రమే మానవత్వపు స్పృహ కలిగి, మానసిక ప్రక్షాళన జరుగుతుంది. అప్పుడు ఆ ఆధిపత్య సంస్కృతి మటుమాయమయ్యే అవకాశం ఉంటుంది. మనిషిలోని మార్పుమాత్రమే ఆ సంస్కృతిని దానంతట అదే తరిమిగొట్ట గలుగుతుందని, అప్పుడే మనిషిలో చిత్తసంస్కారం కలిగే అవకాశం ఉంటుందనే భావన ఈ రచయిత్రికి ఉందనిపిస్తుంది. ఆక్రమంలోనే పితృస్వామ్యప్రక్షాళనకు దారి సుగమం అవుతుంది. ఏప్రయాణమైనా ఒక అడుగుతోనే ప్రారంభం అవుతుంది. అలాగే ఒకమనిషిలో సంస్కారం మొదలయితే దానంతట అదే సమాజం అంతటా వివృతమై విస్తృతమౌతుంది. స్త్రీపురుషులు పరస్పరం స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను గౌరవిచుకుంటూ కలిసిఉంటే కుటుంబం అభివృద్ధి చెందుతుంది, ఆమేరకు పితృస్వామ్యంలో అణగద్రొక్కపడిన స్త్రీ కుటుంబ హింసకు గురికాకుండా ధైర్యసాహసాలతో నిలబడితే, వైవాహిక లైంగిక దోపిడిని కూడా ఎదుర్కొనే చైతన్యాన్ని పొందుతుంది. అందుకే స్త్రీపురుష సంబంధాలలోని అమానవీయత, అధికారసంబంధాలను తిరస్కరించి, నియంత్రణలేని, వ్యక్తిత్వాలను నిర్మించుకొనే అవశ్యకతను సంఘటనాత్మకంగా పాత్రలచర్యలద్వారా రచయిత్రి స్ఫురింపచేసింది. అయితే దాన్ని సానుకూలంగా అర్థంచేసుకొనే ఉత్తమసంస్కారం పురుషులలో ఏర్పడాల్సిన అవసరాన్నికూడా తెలియచేస్తుంది ఈ నవల. స్త్రీపురుషులు ఒకరి మనస్తత్వాలను ఒకరు తెలుసుకొని పరస్పరం సహకరించుకుంటూ, గౌరవించుకుంటూ ఉండాలని, పురుషుల సహకారం ఉండాలంటే స్త్రీలుకూడా తమలోని ఆత్మికశక్తిని అభివృద్ధిచేసుకొనే చైతన్యాన్ని తెచ్చుకోవాలని సూచించటం జరిగింది. అంతేకాక ఈ రచన సమాజంలోని చుట్టుపక్కల

వాళ్ళను అవగాహన చేసుకోవటానికి, స్వీయ అనుభవాలలోకి తొంగి చూసుకొంటూ తన యుద్ధం తనే చేసుకుంటూ ప్రజాస్వామిక మానవ సంబంధాల అభివృద్ధి దిశగా స్త్రీలు జీవనయానం సాగించేటట్లు చేయగలుగుతుంది.

ఒకశతాబ్దపు కథాచరిత్రలోనాటి సామాజిక-సాంస్కృతిక, ఆర్థిక-రాజకీయ, వైజ్ఞానికాభివృద్ధి మొదలైనవాటి ప్రభావం చోటుచేసుకుంటుంది. **శతాబ్ది సూరీడు** ఈ నవలలో, 20వ శతాబ్దపు మొదటిదశకంలోఅనాదిగా ఉన్న భూస్వామ్యవ్యవస్థకు సమాంతరంగా పెట్టుబడిదారి ఆర్థికవిధానం చోటుచేసుకోవటంతో వచ్చిన మార్పులకు సంకేతంగా రైళ్ళరవాణ ఉండటం, సూరమ్మయింట్లో మట్టి అలకటంమానేసి గచ్చుచేయించటం, ఉమ్మడివ్యవస్థ కూలిపోతూ అన్నదమ్ములు వేరువేరుగా యిళ్ళను కట్టుకోవటం వంటి పరిణామాలు, పల్లెలో పట్టణీకరణ చేసుకోవటంవంటివి మానవసంబంధాలలో మనుషులను దూరంగా జరుగేటట్టు చేస్తున్న అవగాహన కలుగుతుంది. వైజ్ఞానికంగా అభివృద్ధి చెందుతూ సంఘసంస్కరణ ఉద్యమ రూపాన్ని అందుకొని స్త్రీవిద్య, బాల్యవివాహాలనిషేధం, స్త్రీపునర్వివాహసంస్కృతిని ప్రోత్సహించింది. అయినా ఆచరణలో పితృస్వామ్యసంస్కృతి మాత్రం చెక్కు చెదరకపోవటంతో సమాజంలో స్త్రీలు యింటి చదువుకే పరిమితం అయ్యారు. స్త్రీవిద్య, వివాహ సంస్కృతిలో మార్పులేక సమాజం అభివృద్ధి చెందలేకపోయిందని, అందుకే భూస్వామ్యవ్యవస్థలో పుట్టి పెరిగి పితృస్వామ్య సంస్కృతికి బలియైన సూరమ్మ మొదటితరానికి చెందినదిగా భౌతికంగా, మానసికంగా కష్టాలు పడిందని అర్థమౌతుంది. కాని రెండవతరంలోని కమల పెరిగే నాటికి వీధిదీపాలు, వీధిపంపులువచ్చి మిశ్రమ ఆర్థికవ్యవస్థలో పల్లెలు పూర్తిగా పట్టణాలుగా మార్పుకు లోనవుతున్నప్పడు వ్యక్తికుటుంబాలలో స్త్రీలు స్కూళ్ళకువెళ్ళి చదువుకొని స్వీయవ్యక్తిత్వాలను పెంచుకోవటం జరిగింది. పితృస్వామ్యసంస్కృతి వివక్షాస్వభావాన్ని గుర్తించటం, ధైర్యంతో వివాహ సంస్కృతిలోని అసమాన నైతికతను, లైంగికహింసను నిరసించి, కుటుంబంలోని భార్యాభర్తల సంబంధాలలో దూరాన్ని పెంచుకొనే దృక్పథం

ఏర్పడి, ఆర్థికస్వావలంబన దిశగా స్త్రీలు అడుగులు వేయటం, కమల పాత్ర తెలియచేస్తుంది. మూడవతరం నాటికి దేశస్వాతంత్ర్యంవచ్చి ప్రజాస్వామ్య రాజ్యాంగం ఏర్పడటం, పట్టణాలు నగరీకరణచెందటం, స్త్రీలువేరే ఊరికివెళ్ళి ఉన్నతచదువులు చదవగలగి ఆత్మవిశ్వాసాన్ని, సమాజంలో నిలదొక్కుకునే విధంగా సొంతవ్యక్తిత్వాన్ని పెంచుకోవటం, పాతతరం సంస్కృతితో విభేదించటం, స్త్రీపురుష సమానత్వాన్ని కోరుకోవటం, పద్మపాత్ర తెలియచేస్తుంది. ఇక నాలుగోతరంలో పిల్లలు ఆ నాటికి వృద్ధులైన పాతతరం వ్యక్తులనే భరించలేని స్థితిరావటం, తమ భవిష్యత్తుకై ప్రపంచీకరణ సందర్భంలో విదేశీచదువులకై చిన్నతనంలోనే తల్లిదండ్రులకు దూరంగా వెళ్లిపోవాలనుకోవటం జరిగింది. పితృస్వామ్య కుటుంబసంస్కృతిని విచ్ఛిన్నం చేస్తూ ప్రజాస్వామిక కుటుంబనిర్మాణం జరగాల్సిన ఆవశ్యకతను గుర్తించిన రచయిత్రి సామాజికచైతన్యం కలగగించటానికే ఈ **శతాబ్దిసూరీడు** అనే మహాకావ్యమనతగ్గ నవలారచనను చేయటం జరిగింది. ఇది ఈ శతాబ్దంలోనివారికి లభ్యమైన స్వర్ణసాహిత్యనిధి. ఈ నవలాంశ సంస్కృతిని చారిత్రకంగా తరాలవారీగా అర్థంచేసుకుంటేనే ఆ యాసంస్కృతి సామాజిక అభివృద్ధికి నిరోధకంగా ఉన్నదా,లేదా ప్రగతికారకంగా ఉన్నదా అని తెలియచేసే స్పృహనుపెంచుతుంది. అది పాఠకుల సహృదయ సంస్కారం గీటురాయివంటిదై వారిలో చైతన్యాన్ని కలిగిస్తుంది. అయితే తరతరాల పితృస్వామ్య సంస్కృతి ప్రతితరంలోను చాపకింద నీరులాగా ప్రవహిస్తున్నా, సామాజికచలనసూత్రాలకు అనుగుణంగా మార్పునకు లోనవుతున్నప్పుడు ఆ సంస్కృతి అభివృద్ధికర పరిణామానికి దారితీస్తుంది. కాబట్టి ప్రతితరంలోను చోటుచేసుకొన్న ఆ సాంస్కృతికస్రవంతి పరిణామాన్ని అర్థంచేసుకోవడానికి **శతాబ్దిసూరీడు** నవలలోని కథేతివృత్తాన్ని తెలుసుకొన్నప్పుడే ఈ నవలాప్రయోజనం సిద్ధిస్తుంది.

* * * * * *

3.'శతాబ్దిసూరీడు'-నవల-ఇతివృత్తం
(నాలుగు తరాల మహిళల జీవనం)

'శతాబ్దిసూరీడు' అనే నవలలోని కథావస్తువును గురించి స్థూలంగా తెలుసుకొని సూక్ష్మపరిశీలనకై ముందుకు కొనసాగటం పరిపాటి. ఇది ఒక శతాబ్దకాలంలో నాలుగుతరాలపాటు జీవితాన్ని గడిపిన ఒక మహిళాజీవనయానం 'శతాబ్దిసూరీడు'లోని కథాంశం. ఈ కథ 20 శతాబ్దపు ప్రారంభంనుండి 20 శతాబ్దపు చివరివరకు కొనసాగింది. అంటే బ్రిటిష్ వలసపాలనలో గతశతాబ్దకాలంలో భారతీయ భూస్వామ్య వ్యవస్థతోపాటు సమాంతరంగా బ్రిటిష్ పెట్టుబడిదారి వ్యవస్థ కొనసాగుతున్న రోజులలో మొదలయి, భారతదేశప్రజాస్వామ్యం ఏర్పడిననాటి నుండి నేటిప్రపంచీకరణ ప్రారంభదశ వరకు గడిచిన కాలం. సంఘసంస్కరణ ఉద్యమంలో భాగంగా ఆడపిల్లల చదువు గృహనిర్వహణకు అవసరమని భావించారు. స్త్రీవిద్యకు ప్రాముఖ్యతను ఇవ్వాలనుకొన్న కాలం. స్త్రీల గృహబానిసత్వానికి, అస్వతంత్రతకు మహిళల అవిద్య కారణం అని అర్థమయి స్త్రీవిద్యాభివృద్ధికి, బాల్యవివాహాలనిషేధానికి, స్త్రీపునర్వివాహాలకు పూనుకొన్న సంఘసంస్కర్తతో పాటు పట్టణాలలో స్త్రీసమాజాలు కృషిచేస్తున్నరోజులవి. స్త్రీసమాజాల కృషితో పల్లెలలోకూడా బడులు అభివృద్ధిచెందాయి. కాని అటు పల్లె, ఇటు పట్టణంకాని ఉళ్ళో పుట్టింది నవలలోని ప్రధానపాత్రయైన సూరమ్మ. కాని సూరమ్మ యింట్లో ఆ సాంస్కృతికపరిణామాల చైతన్యపుగాలులు చొరబడలేక పోవటానికి కారణం నవలలోని సూక్ష్మాంశపరిశీలనలోనే అర్థం కాగలుగుతుంది. పల్లెలలో పాఠశాలల ఏర్పాటు జరిగినప్పటికి, కొంతమంది ఆడపిల్లలు ఇంట్లోనే అక్షరాస్యులు కాగలిగారు. ఆ కోవకు చెందినదే నవలలోని సూరమ్మ.

సూరమ్మ తల్లిఅష్టమగర్భాన భానువారంనాడు పుట్టింది. అల్లారుముద్దుగా ఐదేళ్ళు గడిచేసరికి తండ్రిమరణం, తల్లివితంతుతనంవల్ల బాల్యంలోనే సూరమ్మజీవితంలో భయం, పరాయితనం చోటుచేసుకొన్నాయి. పురుషాధిక్య

సమాజసంస్కృతిని ఆచరణలో పెట్టేవిధంగా అన్నలు సూరమ్మకు బాల్యవివాహాన్ని చేసారు. పెళ్ళిపీటలమీద పక్కనకూర్చున్న మగపిల్లవాడిని భర్తగా భావించింది. ఆమె కాపురానికి వెళ్ళేవయస్సురాక మునుపే విషజ్వరంసోకి ఆ భర్త మరణించటం జరిగింది. ఎనిమిదేళ్ళకే భర్తమరణం, సామాజికసంస్కృతిలో భాగంగా వితంతునియమాలతో గడిపే భయంకరమైన బతుకు సూరమ్మ నరనరాలలో భయాన్ని చొచ్చుకొనేటట్లు చేసింది. మనోవర్తికై అన్నలు సూరమ్మను కాపురానికి తీసుకెళ్ళి దింపగా అక్కడ మామ కామవికారానికి భయపడి నేర్చుకున్న అక్షరంముక్కను ఉపయోగించుకొని కార్డురాసి బుల్లన్నయ్యను రప్పించి పుట్టిల్లుచేరుకొంది. అన్నావదినలు తనను దురదృష్ట, నష్టజాతకురాలిగా ఆడిపోసుకుంటూనే సమస్తచాకిరీ చేయించుకునేవారు. బుల్లన్నయ్య యింట్లో ఉన్న వీరేశలింగంగారి పత్రికలను సూరీడు దొంగచాటుగా చదవటంతో తానుకూడా వీరేశలింగంగారి యింటికి వెడితే బాగుంటుందని భావించినా వెళ్లే ధైర్యం చేయలేకపోయింది. ఒకనాడు అన్నలు ఆమెకు చెప్పకుండా, గోదావరిగట్టుకు తీసుకొని వెళ్ళి ఆమెకు గుండు గీయించేసరికి భయవిహ్వలతతో స్పృహతప్పగా బండిమీదపడేసి అన్నలు ఇంటికి తెచ్చిపడేసారు. తల్లివైధవ్యానికి తన వైధవ్యానికి తేడా లేదనుకుని అన్నల దౌష్ట్యాన్ని గ్రహించగలుగుతుంది. కానిఆర్థికంగా, సాంస్కృతికంగా ఏమీ చేయలేని నిస్సహాయతతో పుట్టింటివారి యింటి చాకిరికి పరిమితంఅయింది.

సూరీడుకి పద్దెనిమిదేళ్ళ వయసున్నప్పుడు అక్కకూతురు పురిటి చాకిరికి వెళ్ళగా ఆమె కూతురిని కని చనిపోతుంది. ఆడపిల్ల అని అందరూ నిరసించగా కాగితం రాయించుకొని ఆ పిల్లను దత్తత చేసుకొని కమల అనిపేరుపెట్టి పెంచుకుంది. అన్నలు ఎవరికివారే సొంతయిళ్ళను ఏర్పాటుచేసుకొని వేరుగా ఉండాలని అనుకోవటంతో సూరమ్మను, తల్లిని పాతయింట్లోనే ఉంచుతారు. సూరమ్మతల్లి మరణించింది. బుల్లన్నయ్య సూరమ్మ మనోవర్తిడబ్బుపై వచ్చిన వడ్డీ డబ్బుతో పొలం కొనటమేకాక

సూరమ్మఉన్న పాతయిల్లు పడగొట్టి కొత్తది కట్టిస్తాడు. అప్పటి వీరేశలింగంగారి పత్రికాపఠనంతో సూరమ్మ ఆడపిల్ల చదువు ప్రాధాన్యతను తెలుసుకోవటం వల్లనేమోగాని సూరమ్మ కమలను బడికి పంపిస్తూనే తనకు యిష్టమైన సంగీతంకూడా ఆమెకు నేర్పించింది. కమల బడికి వెళ్ళగానే సూరమ్మ బుల్లన్నయ్య యింటినుంచి తెచ్చుకొన్న వారపత్రికలు చదివేది. ఆ రకంగా సమాజాన్ని అర్థంచేసుకోవటం మొదలు పెట్టటంతో సూరమ్మకు లోకజ్ఞానంతోపాటు ఆమెలో మానవత్వం కూడా చోటుచేసుకొంది. అందుకే పురుళ్ళుపుణ్యాలప్పుడు తనపుట్టింటివారికే కాక ఆ వీధిలో ఉన్నవారికి తనకు చేతనైన సహాయం చేసేది. కమలను స్కూల్ ఫైనల్ వరకు చదివించి పెళ్ళిచేయాలనుకొంది. చిన్నక్క కొడుకు సత్యానికి ఉన్న చెడు అలవాట్లు సూరమ్మకు నచ్చకపోయినా చిన్నక్క ప్రోద్బలంతో తనకు యిష్టంలేకపోయినా, తొమ్మిదో తరగతిచదువుతున్న కమలను అతనికిచ్చి పెళ్ళిచేయక తప్పలేదు. సత్యం కమలను చదువుకోనీయలేదు. కమల గర్భవతిగా ఉన్నప్పుడు సత్యానికి అంతకు మునుపే పెళ్ళి అయిందని కమలకు తెలిసి అతనిని కుటుంబ సంబంధాలకు దూరంగా పెడుతుంది. సత్యం తన మొదటి పెళ్ళాంబిడ్డల దగ్గరకు చేరుతాడు. (అప్పటికి దేశానికి స్వతంత్రం రాలేదు కాబట్టి కుటుంబంలో ఒక భార్య, ఒక భర్త ఉండాలనే అనే హిందూ వివాహచట్టం రాలేదు. విడాకుల చట్టంకూడా లేదు.) కూతురు పద్మ పుట్టినతరువాత తన చదువును కొనసాగించటానికై ట్యూషన్లుచెప్పి టీచరుట్రైనింగ్ పూర్తిచేసి ఉద్యోగంలో చేరి ఆర్థికస్వావలంబనను పొందింది. స్వీయచైతన్యంతో కమల ఎదగాలనుకొంది. అంతేకాదు తనకు యిష్టమైన సినిమాలు చూసే స్వేచ్ఛను పొందింది. కమలకున్న నిక్కచ్చితనం ఆమెనొక స్వతంత్రవ్యక్తిత్వం కలదానిగా చేసింది.

కమలకు అమ్మమ్మ, అత్త అయిన సూరమ్మ చిన్నక్క బొంబాయిలో కొడుకుల దగ్గర బందిఖానాలో ఉన్నట్లు గడపలేక, పుట్టినఊరుమీద గాలిమళ్ళి సూరమ్మ యిల్లుచేరింది. దయతలచిన కమల ఆమె యింట్లో ఉండాలంటే

అత్తగా కాక, అమ్మమ్మగా ఉండవచ్చనీ, ఆమెకొడుకు సత్యం మాత్రం రాకూడదని షరతు పెడుతుంది. కమల జీతంలో మిగుల్చుకొన్న డబ్బుతో ఇంటికి వెనకవైపు రెండుగదులు, మేడమీద రెండుగదులు వేసి అద్దెకు యిచ్చి ఆదాయాన్ని పెంచుతుంది. కమలకూతురు స్కూల్‌కి వెళ్ళి చదువుకుంటున్న రోజుల్లో ఒకనాడు సత్యం పెళ్లాం ఆకలిని జయించలేక మిషనరికి పిల్లలతో వెళ్ళిపోగా సత్యం తిండిలేక సూరమ్మ యింటిముందరికి వచ్చాడు. వీధిలో ఆకలితో అలమటిస్తుంటే కమల మానవత్వంతో అతనికి బయటనే అన్నం పెట్టమంటుంది. కొడుకు మీద వ్యామోహం తగ్గిన అమ్మమ్మ కమలకూతురు పద్మ చదువు కోసం చేసిన ఇన్సూరెన్స్ కాలపుగడువు తీరటంతో సమయానికి వచ్చిన ఆ డబ్బుతో పద్మ యూనివర్సిటి చదువుకు విశాఖపట్నం వెడుతుంది. పద్మకు తండ్రి సత్యంబయటి పనులు చేసిపెడుతూ ఉంటాడు. అమ్మమ్మ అభ్యర్థనతో ఇంట్లోకి ప్రవేశం లభ్యమవుతుంది.

కొన్నాళ్ళకు అమ్మమ్మ చనిపోతుంది. అప్పుడు కమల సత్యంతో కొద్దిగా మాట్లాడుతుంది. బుల్లన్నయ్య భార్యరోగంతో ఉంటే సూరమ్మ సేవచేసింది. కొంతకాలానికి ఆమె చనిపోగా అతడు పదిహేడేళ్ళ కన్యయైన సుభద్రను మళ్ళీ పెళ్ళిచేసుకొంటాడు. కానిఒకసంవత్సరం కాపురంచేసాక, ఒకరోజు వంటినిండా నగలతో ముసలిమొగుడిని, యింటిని వదలిపెట్టి వెళ్ళిపోతుంది. పరువుపోయిన దిగులుతో బుల్లన్నయ్య మంచానపడితే సూరమ్మ అతడికి సేవలు చేసింది. కొన్నాళ్ళకు బుల్లన్నయ్యకూడా మరణించటంతో సూరమ్మకు తానుదిక్కులేని ఒంటరిదాన్నన్న బాధ కలిగింది.

పద్మ ఎమ్మెస్సీ పూర్తిచేసి లెక్చరరు ఉద్యోగంలో చేరుతుంది.పెళ్ళిచూపుల అనంతరం రామశేషు, పద్మలు పరస్పరం అభిప్రాయాలను పంచుకొన్న తరువాత ఇద్దరికి పెళ్ళి జరుగుతుంది. పద్మకు ఒకకొడుకు,కూతురు పుడతారు. సత్యం గుండెపోటుతో చనిపోయినప్పుడు అతడ్ని సరిగా అర్థం చేసుకోలేకపోయానంటూ కమల బాధపడుతుంది. సూరమ్మకుకూడా ఆరోగ్యం అంతంతమాత్రంగా ఉంటుంది. కొన్నాళ్ళకు కమల కేన్సరుతో చనిపోతుంది.

సూరమ్మకు చెప్పరు. ఆమెను పద్మా, రామశేషులు విశాఖపట్నం తీసుకొని వెడతారు.

తొంబైఏళ్ళు దాటిన సూరమ్మ జీవితంలో మరో అధ్యాయం చోటుచేసుకుంటుంది. విశాఖపట్నం వెళ్ళిన తరువాత కమల కనపడనందుకు కమలకోసం బెంగపెట్టుకొని అప్పుడప్పుడు మతిస్థిమితాన్ని కోల్పోతూ ఉంటుంది. చిత్తచాంచల్యంతో సూరమ్మచేస్తున్న చేష్టలకు నగరంలోని అద్దె యిళ్లల్లో పద్మ కష్టపడుతూనే రామశేషు సహకారంతో నెట్టుకొస్తూ ఉంది. ఒకరోజు పద్మకు తెలియకుండా తను బతికిన ఊరికి వెళ్ళగా, కబురు తెలుసుకొని రామశేషు, పద్మ వెళ్ళి తీసుకొని వస్తారు. తన ఊరికి వెళ్లివచ్చినప్పటినుండి సూరమ్మ మాములుగానే ఉంది. పద్మతనకు ఆరోగ్యం బాగాలేక డాక్టరు సలహాతో ఒక నెలరోజులపాటు కొత్తచోట గడపాలని భావించి సూరమ్మను ఒక వృద్ధుల ఆశ్రమంలో పెట్టగా అక్కడ సూరమ్మ విరేచనాలతో చివరి క్షణంలో తనవాళ్ళందరిని గుర్తుకు తెచ్చుకొని అడుగుతూ చివరకు ఒంటరిగా చనిపోతుంది.

పద్మ తాను సూరమ్మవిషయంలో తప్పుచేసానని బాధపడుతుంది. సూరమ్మ మనోవర్తి డబ్బును వినియోగించి ఆ పల్లెటూళ్ళో కొన్నయింటిని అమ్మగా, ఆ వచ్చిన డబ్బుతో ఇప్పుడు సూరమ్మ మునిమనమరాలు సౌజన్య చదువుకోసం అమెరికా ప్రయాణానికి బయలుదేరింది. ఫ్లైట్ ఎక్కిన కూతురిని విమానాశ్రయంలో చూస్తూ ఉన్న పద్మకు (సౌజన్య ప్రయాణానికి అవసరమైన డబ్బుకు సంబంధించిన) సూరమ్మ తలపుకువచ్చి సూరమ్మ గతశతాబ్దపు జీవితచరిత్రను గుర్తుచేసుకోవటంగా నవలారచన ప్రారంభమౌతుంది.

ఇది స్థూలంగా ప్రధాన కథావస్తువు.1930 లో జన్మించిన రచయిత్రికి తన ఊహ తెలిసినప్పటినుండి తన చుట్టూఉన్న భూస్వామ్యవ్యవస్థలోని పితృస్వామ్య సంస్కృతి వల్ల బాధితమహిళగా ఉన్న సూరమ్మపాత్ర మొదటితరానికి చెందిన సంస్కృతికి ప్రతినిధి. ఈ కథ ఐదుతరాలకు సంబంధించినా నాలుగు తరాలకథగా భావించటానికి 20 శతాబ్దపు మొదటిదశకంలోని

రెండుతరాలకు చెందిన తల్లీకూతుళ్ళ జీవితాలలో బాహిరమైన సామాజిక-సాంస్కృతిక సారూప్యత ఉండటంతోపాటు ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన మార్పులేని కారణంగా వారిది ఒక తరం సంస్కృతిగానే భావించటం జరిగింది. రాజకీయ-ఆర్థికపరిణామాలలోని సాంస్కృతిక మార్పును అందిపుచ్చుకొని స్వాతంత్ర్యోద్యమ స్ఫురణతో స్వతంత్ర వ్యక్తిత్వాన్ని పెంచుకొని ఆత్మాభిమానంతో జీవితాన్ని గడిపిన కమల అటుపాతతరానికి, ఇటుకొత్తతరానికి వారధిగా రెండవతరానికి చెందిన సంస్కృతికి ప్రతీక. భారతదేశ స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన ప్రజాస్వామిక దృక్పథంతో వివక్షారహితంగా మహిళల అస్తిత్వానికి సమానసాంస్కృతిక విలువలను పెంచిన పద్మ మూడవతరపు సంస్కృతికి ప్రతినిధి. అయితే ప్రపంచీకరణ సందర్భంలో వివాహానికంటే విదేశీచదువుకే ప్రాధాన్యతనిచ్చి ఉజ్జ్వల భవితవ్యాన్ని చూసుకుంటున్న సౌజన్య నాలుగోతరానికి చెందినది. వీరంతా నాలుగుతరాల వారసులుగా పరిణామశీలమైన సామాజికసంస్కృతికి ప్రతినిధులుగా నవలాకథేతివృత్తంలో తారసపడతారు. ఈ నాలుగుతరాల మహిళలు 20వ శతాబ్దపు మహిళాజీవనసాంస్కృతిక పరిణామస్రవంతికి మచ్చుతునకలు. ఒకశతాబ్దకాలం అనే అమూర్తభావానికి మూర్తీభవించిన సామాజిక మానవ స్వభావాలలోని బలాలు, బలహీనతలు కాలానికి ప్రాణం పోసినట్లు అనిపిస్తుంది. నవలలోని స్త్రీపురుషసంబంధాలలోని విప్లవాత్మక ధోరణి ఆలోచింపచేస్తుంది. సమాజంలో వేళ్ళూనుకొని ఉన్న పితృస్వామ్య సమాజ సంస్కృతి అడుగడుగున మహిళలజీవితాలపై చూపించిన ప్రభావం ఈ నవల సూక్ష్మాతిసూక్ష్మ పరిశీలనలో మాత్రమే అర్థంచేసుకోగలరు. ఐదుతరాల స్త్రీలుజీవితం కనపడుతున్నా ముందు,వెనకతరాలమధ్యన ఉన్న మూడుతరాల చరిత్రను ప్రధానంగాచేసుకొని కథనడుస్తుంది.

ఈ నవలలో ప్రధానంగా నాలుగు స్త్రీ పాత్రలు, నాలుగు పురుషపాత్రలు కథను నడిపిస్తాయి. ఈ పాత్రలు విభిన్నమనస్తత్వాలకు ప్రతీకలు. ఏ పాత్ర ఎటువంటి స్వభావంతో మిగిలిన పాత్రలతో ఉన్న పరస్పరసంబంధాలను

ప్రభావితం చేసిందో, ఆయాపాత్రల అస్తిత్వ-వ్యక్తిత్వస్ఫురణ అభివృద్ధిబాటలో అడుగులు వేయించిందా, లేదా, ఒకవేళ వేయకపోవటానికి ఏ శక్తులు ఆటంకపరిచాయో అనుశీలనచేయాలి. సామాజిక-సాంస్కృతిక,ఆర్థిక-రాజకీయపరిణామాలమధ్య స్త్రీపురుషసంబంధాలలోని బలాలు, బలహీనతలను మహిళాప్రగతి, ప్రజాస్వామికత, ప్రపంచీకరణ ప్రభావం వంటి సమాలోచనతో పరిశీలిస్తేనే నవలాప్రయోజనాన్ని పొందగలిగే మార్గం ఏర్పడుతుంది. సాహిత్యాన్ని విలువకట్టేటప్పుడు ఆ సాహిత్యం చరిత్రకు సంబంధించిన సామాజిక సంస్కృతిని ప్రతిబింబిస్తున్న కాలంలో స్త్రీలజీవనావకాశాల్ని అర్థంచేసుకుంటూ, ఆ అవకాశాలలోనే స్త్రీలుపొందిన చైతన్యం, సామాజిక ప్రయోజనాన్ని అంచనా వేయాలి. అందుకే నవల ప్రయోజనం సిద్ధించాలంటే నవలలోని సామాజిక జీవితాలను ప్రభావితం చేసిన సాంస్కృతిక అంశాలను సైద్ధాంతికంగా నిర్ణయించటానికి సూక్ష్మపరిశీలనా దృష్టితో చూడటానికి దీక్షతో ముందడుగు వేయాలి.

* * * * * *

4. సిద్ధాంత ప్రాతిపదిక

సాహిత్యసృజనలో ఒక అంతర్గత సిద్ధాంతం ప్రతిఫలిస్తూనే ఉంటుంది. సామాజిక సిద్ధాంత ప్రతిపాదనకు సాహిత్యం దోహదకారి అవుతుంది. సాహిత్యసిద్ధాంతాలు రెండురకాలు. ఒకటి కావ్యవస్తువులోనుండి సిద్ధాంతం రూపొందటం, రెండోది సిద్ధాంతానికి అనుగుణంగా కథావస్తువును రూపొందించటం. అయితే పరిణామశీలమైన కాలానికి ఏ సిద్ధాంతమూ కట్టుబడి ఉండదు. కాని సిద్ధాంతరూపకల్పనకు కారణభూతమైన కారకాల కొనసాగింపు ఉన్నంతకాలం ఆ సిద్ధాంతవాదన సజీవంగానే చైతన్యాన్ని కలిగిస్తూనే ఉంటుంది. కాని సజీవసమాజ మానవసంబంధాలలోనుండి సహజంగా పుట్టుకొచ్చిన మానవీయత కాలంతోపాటు సమాంతరంగా శాశ్వతమనుగడ సాగిస్తుంది. ఏ రచనావిషయాన్నైనా ఆయాకాలాలనాటి సామాజిక-సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయపరిణామాల సంబంధంతో అధ్యయనం చేస్తేనే ఇతివృత్తంలోంచి పుట్టుకొచ్చిన సిద్ధాంతంసహజమై సమగ్రంగా ఉంటుంది. ఈ 'శతాబ్దిసూరీడు' నవలలో సామాజిక వాస్తవచిత్రణలో భాగంగా గతశతాబ్దంలోని సామాజిక-సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయవిషయాలు మానవసంబంధాలను ప్రభావితం చేస్తున్నప్పుడు పరిణామాలు చోటుచేసుకోవటం జరుగుతుంది. పరిణామాలను ఆస్వాదించలేని మనుషులు నిస్సహాయస్థితికి చేరుకొంటారు.ఆ దశలో ఒకానొక సుప్తచైతన్యం తుళ్లిపడిలేచి మనిషిలోని చెడును ప్రక్షాళనదిశగా ప్రేరేపింపచేస్తుంది. అప్పుడు అంతర్గత చిత్తసంస్కారం చైతన్యవంతమై మానవీయత మనుగడలోకి వచ్చి మానవసంబంధాల అభివృద్ధిని ఆకాంక్షిస్తుందనే సిద్ధాంతం శతాబ్దిసూరీడు నవలలో ప్రతిఫలించింది. ఈ విషయంలోరచయిత్రి ఉద్దేశ్యం స్పష్టమవటానికి కథావస్తువులోని సంఘటనలు, పాత్రచిత్రణ దోహదంచేయటం నవలలో కనిపిస్తుంది. సమాజంలోని మానవసంబంధాలలో అసమనైతిక సంస్కృతి వల్ల ఏర్పడిన

స్త్రీలసమస్యలకు కారకులను అర్థంచేసుకొనే క్రమంలో సామాజిక-సాంస్కృతిక, ఆర్థిక-రాజకీయ పరిస్థితుల ప్రభావం వారిని అలా ప్రవర్తింపచేసిందనే అవగాహన ఏర్పడుతుంది. తిరిగి ఆయాపరిస్థితుల ప్రాబల్యం తగ్గగానే మానవ ప్రక్షాళనకు అవకాశం ఏర్పడి, చిత్తసంస్కారం ఉత్తేజాన్ని పొంది, మానవీయత వెలికిరావటమే స్త్రీలసమస్యలకు పరిష్కారంగా భావించటం జరుగుతుంది.

నవలలో కథావస్తువులోని సైద్ధాంతిక దృక్పథాన్ని వెలికి తీసే ముందు స్త్రీలసమస్యలకు కారకమై అనాదిగా ఆచరణలో ఉంటున్న పితృస్వామ్య సంస్కృతి మూలాలలోకి తొంగి చూడాలి. పితృస్వామ్యంఅంటే పురుషాధిక్య సమాజం. మానవనాగరికతలో భాగంగా వ్యవసాయం అభివృద్ధిచెందింది. క్రీ.పూ.3000సం.లనాటికే విస్తరించిన వ్యవసాయవర్గ సమాజాలకు పితృస్వామ్యానికి అంతర్గత సంబంధం ఉంది. మిగులుసంపదతో సొంతఆస్తి ఏర్పడి దాని రక్షణ క్రమంలో కుటుంబనిర్మాణం జరిగి, స్త్రీని పునరుత్పత్తిశక్తికి పరిమితం చేయటం, పనివిభజన చోటుచేసుకోవటం, ఉత్పత్తిపై పురుషుల ఆధిపత్యం ఏర్పడటంవంటి పరిణామాలు పితృస్వామ్యం ఏర్పడటానికి మూలాలనేది చారిత్రకమైన వాస్తవం. ఆ క్రమంలోనే స్త్రీ తనకి యిష్టమైనన్ని రోజులు పురుషుడితో జతకూడి వెళ్ళిపోయే మునుపటి వ్యవస్థలోని స్త్రీ స్వేచ్ఛను అరికట్టడానికి కుటుంబంలో పాతివ్రత్యనియమం అవసరమైంది. కుటుంబ నిర్మాణం జరిగింది. సంతానం తనకు సంబంధించినది అనే ఖచ్చితత్వానికై స్త్రీలలైంగితను అదుపుచేయాలనే క్రమంలో స్త్రీలశరీరం, మనస్సుచుట్టూ అభివృద్ధిచేసిన భావజాలాలచట్రమే పితృస్వామ్యసంస్కృతి. కుటుంబ నిర్మాణంలో స్త్రీల స్థిరత్వంకోసమై పనివిభజనతోపాటు స్త్రీలు ప్రాతివత్య నియమాన్ని పాటించటమనేది కుటుంబసంబంధాలలో ముఖ్యమైనదిగా భావించారు. అందుకే స్త్రీలు పాతివ్రత్యాన్ని పాటించటమే తమ జీవితాశయంగా చేసుకొనేటట్లుచేసి పితృస్వామ్యం ఎప్పటికప్పుడు స్త్రీల లైంగికతపై అదుపునుఆచరణలో పెట్టింది. పురుషప్రయోజనాలు ప్రధానంగా ఏర్పాటుచేసుకొన్న స్త్రీపురుష సంబంధాలలోని అసమసంస్కృతి రూపంలో

అంతరాలను ఏర్పరచింది. స్త్రీపురుషవివక్షా సంస్కృతిని ప్రోదిచేసిదాన్ని పితృస్వామ్యం సమాజసంస్కృతిగా స్థిరీకరించింది. విషయంలో పురుషుడి పరంగా అభివృద్ధిచెందిన ఆస్తి, రాజకీయ ఆధిపత్యానికి కారణం అయి సామాజికఉత్పత్తిలో స్త్రీలభాగస్వామ్యం తగ్గించటంతో, స్త్రీ ఇంటిబానిసగా భావింపబడే క్రమంలో పితృస్వామ్యసంస్కృతికి బీజారోపణ జరిగింది. స్త్రీ సంతానాన్ని కని పెంచటం, ఇంటిచాకిరి చేయటం అనవాయితిగా మారింది. స్త్రీ యింటినుండి పలాయనం చిత్తగించకుండా స్త్రీలైంగికతపై అదుపు ప్రధానంగా పితృస్వామ్య కుటుంబసంస్కృతి రూపొందింది. స్త్రీలలైంగికతపై అదుపు అనగా స్త్రీలజీవితాలకు సంబంధించిన అన్ని విషయాలలో స్త్రీలశరీరం, మనసుచుట్టూ పురుషాధిక్యసంస్కృతి అల్లిన భావజాలం. ఆ క్రమంలోనే ఒకరకంగా స్త్రీల శరీరాలమీద, మనస్సుమీద పురుషుడు తనకు అధికారం ఉండేటట్లు చేసుకొన్నాడు. అధికారవర్గ ప్రయోజనాలకు వీలుగా సామాజిక సంస్కృతి రూపొందింపబడటంతో స్త్రీవిలువ తగ్గి, స్త్రీని కింది స్థాయిలో ఉంచింది. దానితో అనాదిగా స్త్రీలలో ఆర్థికపరాధీనత, చైతన్య రాహిత్యం చోటు చేసుకొన్నాయి. పితృస్వామ్యపు అధికారస్వభావం కుటుంబ నిర్మాణంలోని స్త్రీపురుషసంబంధాలలో అసమనైతికసంస్కృతికి వీలు కల్పించింది.

ఆధునికకాలంలో రాజకీయార్థికపరిస్థితుల ప్రేరేపణతో స్త్రీలకు సామాజికసంబంధాలు అనివార్యమవటంతో స్త్రీల జ్ఞానం విస్తృతమై, విద్యాచైతన్యంతోపాటు వ్యక్తిస్వాతంత్ర్యపు స్పృహ ఏర్పడింది. బ్రిటిష్ పాలనలో సంఘసంస్కరణోద్యమ సమయంలో స్త్రీలు సామాజిక రంగాలలోకి ప్రవేశించే అవకాశాలు పెరిగాయి. దానితో స్త్రీలవ్యక్తిస్వాతంత్ర్యం ప్రాధాన్యతను అందుకొన్నదనే విషయం స్వాతంత్ర్యానికి పూర్వం వచ్చిన స్త్రీలసాహిత్యం తెలియచేస్తుంది. స్వాతంత్ర్యోద్యమ సమయంలోకూడా భూస్వామ్య పెత్తందారీవర్గమే అధికారంలో ఉండటంతో పితృస్వామ్యసంస్కృతియే కొనసాగుతూ స్త్రీల అభివృద్ధికి ఆటంకంగానే పరిణమించింది. ఆధునికయుగంలో స్త్రీలచదువు, వివాహం, స్త్రీపురుష సంబంధాలవంటి

విషయాలలో వివక్షతోకూడిన అప్రజాస్వామిక ధోరణి స్త్రీలసమస్యలకు కారణభూతమౌతోంది అనే గ్రహింపు కలిగింది. స్త్రీపురుషులమధ్యన ఉన్న ఆర్థిక అసమానతలకు సాంస్కృతిక కారణాలను గుర్తించి వాటిని అధిగమించే చైతన్యాన్ని స్త్రీలు సంతరించుకున్నారు. ఆర్థికస్వావలంబన దిశగా స్త్రీలు అడుగులు వేసారు. పితృస్వామ్య కుటుంబాలలోని అసమనైతికతను, అధికార సంబంధాలను తిరస్కరించి, కుటుంబసంస్కృతిని అధిగమించి స్వేచ్ఛాయుతమైన, నియంత్రణలేని జీవితాలను నిర్మించుకోవటం మొదలుపెట్టారు. స్వాతంత్ర్యానంతరం స్వతంత్రభావాలు అభివృద్ధిచెంది అణచివేత సంస్కృతిని ఎదిరించే స్వభావం వారిలో చోటుచేసుకొంది. అందుకే స్త్రీని నియంత్రించే ఆధికారవ్యవస్థలోని వివక్షను ప్రశ్నిస్తూ స్త్రీవాదం ముందుకొచ్చింది. ప్రశ్నించినకొద్దీ స్త్రీల చైతన్యస్థాయిమాత్రం పెరిగిందికాని ఇంకా అణగారని పురుషాహంకారంవలన కుటుంబ సంబంధాలు మరింతగా ద్వేషపూరితంగా మారే అవకాశం ఉంటుంది. అందుకే స్త్రీలు ముందుగా ఆర్థికస్వావలంబన దిశగా అడుగులు వేసి అవసరమైతే కుటుంబసంస్కృతిని పాటించాల్సిన అవసరం లేదని భావించారు. ఆర్థికంగా ఆధారపడని స్థితిలో స్త్రీ కుటుంబసంస్కతిని అధిగమించాలని అనుకున్నప్పుడు సమాజంలో మానవసంబంధాలు మరింతగా విచ్ఛిన్నం అయ్యేఅవకాశాలు ఉండటంతో సమాజశ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని వాటి నివారణకై రచయితలు ముందుకురావటం జరుగుతుంది. కుటుంబసంఘర్షణల నివారణకు పురుషులలో చిత్తసంస్కారం ఏర్పడితేగాని స్త్రీసమస్యలకు పరిష్కారం ఉండదని భావించిన రచయితలు సానుకూలధోరణిని అవలంబించి, చారిత్రకంగా ఏ పరిస్థితులు పితృస్వామ్యసంస్కృతి బలపడటానికి కారణభూతమయ్యాయో తిరిగి ఆ పరిస్థితులలో మార్పులే పురుషులలో మార్పును తేగలుగుతాయని ఆశించటం జరిగింది. స్త్రీపురుషులు వైవాహికసంబంధాలతో ఒకేకుటుంబంలో జీవిస్తున్నా పితృస్వామ్య లైంగిక వివక్ష కారణంగా వారు రెండువర్గాలుగా విడిపోతారు. అణచివేతకు గురిఅయిన వర్గం ఒకటి, ఆధికారవర్గంగా

మరొకటి ఏర్పడినప్పుడు స్త్రీలజీవితం తమదికాకుండా పోయేవిధంగా లైంగిక రాజకీయం చోటు చేసుకుంటుంది. దాన్నికూడా స్త్రీవాదం ముందుకువచ్చి ప్రశ్నించింది.స్త్రీలకు స్వస్వరూపజ్ఞానంపెరిగి స్త్రీపురుషసంబంధాల స్వభావాన్ని స్త్రీలు అవగాహన చేసుకోగలగాలి. ముందుగా స్త్రీపురుషులమధ్యన ఉన్న కౌటుంబిక-సామాజిక సంబంధాలసంస్కృతి స్త్రీల అభివృద్ధికి వీలుగా ఉండకపోతే అది మార్పుకు గురికావాల్సిందే. దానికోసం స్త్రీ అవసరమైతే కుటుంబపరిధిలో ఉంటూనే సాంస్కృతిక విప్లవాత్మకధోరణిని అవలంబించి మానవత్వపు వ్యక్తిత్వం నిలపెట్టుకోగలిగితే పురుషులలో చిత్తసంస్కారానికి మార్గం ఏర్పడి, వారిలో ప్రజాస్వామికదృక్పథం అభివృద్ధిచెందే అవకాశం ఉంటుంది. స్త్రీపురుషసంబంధాలలోని అధికారస్వభావం తగ్గితేనే ప్రజాస్వామికత చోటుచేసుకొని సకలసామాజిక సంబంధాలు మానవీకరణం చెంది సామాజిక సంస్కారంకూడా అభివృద్ధిచెందుతుంది. దానికోసం స్త్రీలు గడుపుతున్న జీవితాన్ని విశ్లేషణకు పెట్టి స్త్రీలజీవితాన్ని అణచిపెడుతున్న సంస్కృతిని, స్త్రీల మానసిక సంఘర్షణలను ప్రతిఫలింపచేసే రచనలు వస్తాయి. స్త్రీలజీవితాలనుండి పుట్టిన కథావస్తువులో స్త్రీ పుట్టినప్పటినుండి మరణించేవరకు సాగించిన జీవితంలో అడుగడుగునా ఆమె సాగించిన పోరాటం స్పష్టమవుతుంది. అయితే ఆ పోరాటానికి స్త్రీలకు చదువు, ఆర్థికస్వావలంబన అవసరమౌతుంది. ఆ కృషియే స్త్రీలను లైంగికపీడననుండి కాపాడకలుగుతుందనే స్పృహను పెంచుతుంది. ఆ క్రమంలో తరతరాల సంస్కృతి మార్పుకు గురిఅవుతున్నపుడు స్త్రీలచైతన్యం వెలుగుచూస్తుంది. కాని అదే స్థాయిలో సమాంతరంగా కొనసాగుతూ వస్తున్న పితృస్వామ్య భావజాలంతో పెంచబడి నరనరాల్లో ఆ సంస్కృతిని జీర్ణింపచేసుకొనేటట్లు చేయటంతో, స్త్రీ పరాయీకరణ చెందే అవకాశం కూడా ఉంటుంది. స్త్రీలజీవితాలలోని సంప్రదాయభావాలను మార్చటానికి కొత్తభావాలను జొప్పించటానికి స్త్రీలు చేసిన ప్రయత్నాలలో ఉద్వేగం చోటుచేసుకుంటుంది. అప్పుడు సంఘర్షణలు, సంవాదాలు ఏర్పడతాయి. స్త్రీలు స్త్రీలతో

సంఘర్షించటం, స్త్రీలు పురుషులతో సంఘర్షించటం జరుగుతుంది. అప్పుడు స్త్రీలభావాలలో మార్పుచోటు చేసుకొంటుంది. కాలగమనంలో మానవ సమసమాజప్రగతి చరిత్రను సృష్టిస్తుంది. గతశతాబ్దపు మానవజీవిత చరిత్రలోని, విద్య, వివాహం, ఉద్యోగం, స్త్రీపురుషసంబంధాలలోని సంక్లిష్టతలలోని జీవితసత్యాలను, ఈ శతాబ్దపు వర్తమానంలో వెలికితీసి భవిష్యత్తుకు ప్రేరణ కలిగించేది చరిత్రయే. ఇది పాత అలవాట్లను పోగొట్టుకొనేటట్టు చేసి సమాజం బలమైన మార్పుకు గురి చేయగలుగుతుంది. పురుషులకు స్త్రీలపట్ల సరైన అవగాహనను పెంచగలుగుతుంది. సమాజ సాంస్కృతిక పరిణామ స్రవంతిలో స్త్రీల వ్యక్తిత్వస్పృహ మానవసంబంధాల అభివృద్ధికి సోపానం అవుతుంది. ఈనవలా రచయిత్రి పితృస్వామ్యసంస్కృతిని వాచ్యం చేయకపోయినా ఆ సామాజిక సంస్కృతిలోని వివక్షాస్వభావాన్ని పాత్రల నడతలద్వారా గుర్తింపచేసేవిధంగా ఉండటంతో విమర్శకులు ఆ పితృస్వామ్య స్వభావసంస్కృతిని స్పష్టంచేయాల్సిఉంటుంది. గత శతాబ్ద కాలానికి చెందిన కథావస్తువులో స్పష్టమయ్యే పితృస్వామ్య కుటుంబసంస్కృతి వివక్షాస్వభావంలోని ఆధిక్యతను స్త్రీలు గుర్తించి, స్త్రీలలైంగికతపై గలఅదుపును వ్యతిరేకించి,దానిని అధిగమించగల జీవనసంస్కృతిని రూపొందించుకున్నారు. ఈ పరిణామకర మహిళా సాంస్కృతికస్రవంతి, స్త్రీపురుషసమానత్వంగల నూతనకుటుంబసంస్కృతికై ప్రజాస్వామ్యసిద్ధాంతం మానవీయతను బలమైన పునాదిగా చేసుకొంది. అందుకే ఈ నవలలో ప్రజాస్వామ్యంలోని మానవతాసిద్ధాంత ధోరణిగల కుటుంబసంస్కృతి స్పష్టమౌతుంది. దానిస్పష్టతకై నవలావస్తువులోని సాంస్కతిక విశ్లేషణ సమగ్రంగా జరగాలి.

రచయిత్రికి స్త్రీవాదముద్రను వేయటంకన్నా ఆమెను ఒక ప్రజాస్వామ్యవాదిగా భావించాలి. పురుషులు పుణ్యపురుషులుగా మారాలంటే లోపభూయిష్టమైన సమాజసంస్కృతిని సానుకూలదృక్పథంతో అర్థం చేసుకొవాలనే స్ఫూర్తిని నింపే నవల ఇది. మహాకావ్య సదృశమైన ఈ నవలకు తగిన సిద్ధాంతప్రతిపాదనను చేసే క్రమంలో, కథేతివృత్తంలో అడుగడుగునా,

సంఘటనలలో, పాత్రలతీరులో అంతర్గతంగా విస్తృతంగా బలంగా పరచుకొన్న పితృస్వామ్యసంస్కృతి స్వరూపస్వాభావాలు స్పష్టమయ్యాయి. అందుకనే ఆ సంస్కృతి మూలాలను మహిళలు అర్థంచేసుకొనేందుకు వీలుగా విమర్శనాక్రమం ఏర్పడింది. గత శతాబ్దంలో మార్పుకు గురిఅవుతుమన్న సామాజిక చలనసూత్రాలు సమాజాన్ని ప్రభావితం చేస్తున్నప్పుడు చదువుకొని స్వీయవ్యక్తిత్వాన్ని రూపొందించుకొన్న మహిళలు, కరుడుకట్టిన ఆ పితృస్వామ్య కుటుంబసంస్కృతి లోని వివక్షను గుర్తించి దానిని అధిగమించే చైతన్యం తెచ్చుకోవటంతో సాంస్కృతికమార్పు ప్రారంభమైంది. దాని పర్యవసానంగా ప్రజాస్వామికకుటుంబం ఏర్పడి మానవసంబంధాల అభివృద్ధి దిశగాసాగటంతో సాంస్కృతిక పరిణామం జరిగిందనటం ప్రతిపాదిత సిద్ధాంతంగా భావించాలి. రచయిత్రి పితృస్వామ్యసంస్కృతిని వాచ్యం చేయకపోయినా విమర్శకులు ఎక్సరేకళ్ళతో అనుశీలించేటప్పుడు ఆ పితృస్వామ్యసంస్కృతి విస్తృతవిన్యాసం నేపథ్యంగా గల సామాజిక జీవనంలోని కథాంశంలోని ప్రతి సంఘటనలను విశ్లేషణకుపెట్టి,దాని స్వరూపస్వభావాలను ఎక్కడిక్కడ స్పష్టంచేయగలగాలి. అప్పుడే తరతరాలుగా పీడనరూపంలో ఉన్న సంస్కృతికి విరుగుడుగా ప్రత్యామ్నాయసంస్కృతి అభివృద్ధిచెందుతుంది. క్రమంలోనే సంస్కృతి పరిణామశీలతగల చరిత్రను అర్థం చేసుకొనే వీలుంటుంది. అందుకే ఈ నవల ప్రధానంగా మహిళాసాంస్కృతిక పరిణామచరిత్రగా అర్థమౌతుంది. అంతేకాదు, ఆధునికకాలంలో పురుషులు తమకు తామే నిర్దేశించుకోవాల్సిన సంస్కృతికి కారణభూతమౌతుంది. అందుకే ఇదొక సామాజిక మానవశాస్త్ర కళారూపం. మానవజీవితాలలో పరిణామసంస్కృతిని ప్రతిబింబించిన కళాకృతి. 20 వశతాబ్దిలోని చారిత్రక సామాజిక చలనసూత్రాలను తెలియచేయటంతో 21వ శతాబ్దంలోని మహిళాజీవన సంస్కృతికి ఈనవల దిక్సూచియైన వేగుచుక్కగా భాసిల్లుతుందని అనటంలో అతిశయోక్తిలేదు.

* * * * * *

5. క్రీ..శ.20వ శతాబ్దంలోని తరతరాల మహిళాసంస్కృతి

20 శతాబ్దపు ప్రారంభదశలో ఆనాడున్న భూస్వామ్యవ్యవస్థలోని కరుడుగట్టిన పితృస్వామ్యసంస్కృతి మహిళలను భోగవస్తువుగా, సంతానాన్నికని యిచ్చేసాధనంగా భావించి గృహబానిసత్వాన్ని ఆచరణలో పెట్టటం జరిగింది. కుటుంబనిర్మాణానికి మూలకారణమైన స్త్రీలలైంగికతపై అదుపులో భాగంగా ఉన్న బాల్యవివాహాలు, వితంతుసంస్కృతి స్త్రీలను నిస్సహాయస్థితిలో పడేసింది. పితృస్వామ్యప్రయోజనాలను సజావుగా పొందటానికై స్త్రీలకు సామాజిక సంబంధాలను నిషేధించిన వ్యవస్థ అది. అందువల్లనే స్త్రీలు తమపై అమలవుతున్న సాంస్కృతిక పీడనను ఎదుర్కొనే సామూహికశక్తి కొరవడింది. అయితే వర్తకానికై వచ్చిన బ్రిటిష్ వారు తమ వలసరాజ్యంగా చేసుకొన్న భారతదేశంలో పెట్టుబడిదారి వ్యవస్థ చోటు చేసుకోవటంతో ఆర్థిక-రాజకీయపరిణామాల ప్రభావంతో సామాజిక సంస్కృతిలో మార్పు అనివార్యమైంది. అటు కరువు కాటకాలతో, ఇటు శిస్తుల రూపంతో బ్రిటిష్ వారికి పన్నులు కట్టలేక భారతీయులు ఆర్థికంగా కుదేలు అయ్యారు. దానితో పరిశ్రమలలో భారతీయులు ఉద్యోగాలు చెయ్యాల్సిన పరిస్థితి ఏర్పడటంతో స్త్రీలు సమర్థతవంతంగా గృహనిర్వహణను చేపట్టాల్సివచ్చింది. దానికై స్త్రీలకు సామాజిక పరిజ్ఞానం అవసరమైంది. అందుకనే సంఘసంస్కర్తలు స్త్రీలు గృహబానిసత్వంనుండి విముక్తి కావాలనీ, వారికి స్వతంత్రత ఉండాలని భావించారు. మరోప్రక్క తమసంపదను తామే అనుభవించగల స్థితిలో భారతీయులు ఉంటేతప్ప ఆర్థికంగా కోలుకోలేమని భావించి ఆంగ్లేయుల పాలనను నిరసించటం మొదలయింది. బ్రిటిష్ పాలకులు హైందవసంస్కృతిలోని లోటుపాట్లను హేళనచేస్తున్న క్రమంలో సంఘసంస్కరణ అనివార్యమైంది. స్వీయసంస్కరణలలో భాగంగా కందుకూరి వీరేశలింగంగారు దేశానికి స్వాతంత్ర్యం రావాలంటే ముందుగా స్త్రీలు ఇంటాబయటా స్వాతంత్ర్యాన్ని అనుభవించగల స్థితిలో ఉండాలని

ఆలోచనచేసి, ఆంధ్రప్రాంతంలో స్త్రీవిద్యాభివృద్ధి జరగాలని భావించి బాలికా పాఠశాలలను అభివృద్ధిచేయటం జరిగింది. 20వశతాబ్దంలో భారతదేశ స్వాతంత్ర్యోద్యమ సాధనలో భాగంగా మొదలైన సంఘసంస్కరణోద్యమం ముందుగా మహిళాసంస్కృతిపట్ల ఆలోచనలను సాగించింది.

అయితే పితృస్వామ్యసంస్కృతిని కఠినంగా అమలుచేసే కుటుంబాలలో ఆడపిల్లచదువును ఆమోదించేవాళ్ళు కారు. అటువంటి నేపథ్యంలో 20 వ శతాబ్దపు ప్రారంభదశలో నవలలోని ప్రధాన పాత్రయైన సూరమ్మ జీవనయానం ప్రారంభమైంది. ప్రధానంగా నలుగురు మహిళలు, నలుగురు పురుషుల జీవన సంస్కృతిని ప్రభావితం చేసిన గతశతాబ్ద కాలంలోని పరిస్థితులు సూరమ్మ / సూరీడు జీవనయానానికి మచ్చుతునకలు.

భారతదేశ స్వాతంత్ర్యానంతరం నవలాంశంలో భాగంగా ప్రజాస్వామ్యంలో స్త్రీపురుషసమానత్వం ప్రధానంగా రాజ్యాంగంలో లిఖించబడింది. దానిని కార్యాచరణ రూపంలో సాధ్యంచేయాలంటే సమాజంలో సూక్ష్మాంశమైన కుటుంబవ్యవస్థలో అది ప్రయోగాత్మకం కాగలిగినప్పుడే సత్ఫలితాలను యివ్వగలుగుతుంది. కాని తరతరాలుగా కొనసాగుతున్న పితృస్వామ్య రాజ్యవ్యవస్థలోని కుటుంబాలలో దానంతట అదే స్త్రీపురుష అసమానత్వాన్ని సృష్టించేవిధంగా లింగవివక్షను పెంచి పోషించింది. స్త్రీపురుష లైంగికసంబంధాలకు నిలయం కుటుంబం. పురుషుల ఆధిక్య సంస్కృతిలో భాగంగా స్త్రీలలైంగికతపై అదుపువిషయంలో ఏ కుటుంబానికి ఆ కుటుంబంలోనే జరిపితే పితృస్వామ్యసమాజం బలపడి సజావుగా తన ఆధిక్యతను నిలుపుకోగలుగుతుంది. అందుకే పురుషాధిక్య సంస్కృతి స్త్రీలని అణచివేతకు గురిచేయటం పితృస్వామ్యం సమాజపు సహజపరిణామం. వివిధవ్యవస్థల జీవనయానంలో స్త్రీలలైంగికతపై అదుపు రకరకాలుగా ఉంటుంది. స్త్రీలపుట్టుక, చదువు, వివాహం వంటివిషయాలలో ఆ లైంగిక అదుపు వివక్షరూపంలో ఆచరణలో ఉండేది. దాని ఆచరణప్రభావంవల్లనే సూరమ్మ అన్నికష్టాలుపడిందనేది స్పష్టం. కాని 20 శతాబ్దంలో ప్రభుత్వం,

సంఘసంస్కర్తలప్రయత్నాలతో కొంతమంది స్త్రీలు చైతన్యవంతులు కాగలిగారు. దానికోసం వీరేశలింగం వంటివారు పత్రికలు నడిపారు. సూరమ్మలాంటివారు ఆ పత్రికలను చదివి అర్థంచేసుకొని సాంస్కృతిక అణచివేతనుండి తప్పించుకోవాలనుకున్నారు. కానితాము జీవించిన పరిస్థితుల ప్రాబల్యంవల్ల తగిన ధైర్యం చేయలేక ఆ సంస్కృతినే తమ జీవితాశయంగా మలచుకొన్నారు. కాని ఆ తరవాతి తరంవారు ఆ పితృస్వామ్యసంస్కృతి ప్రభావంతో ఏర్పడిన సమాజంలోని లింగవివక్షను గుర్తించి, దానికి తాము బలికాకూడదని అనుకొన్నారు. కుటుంబంలోని స్త్రీపురుషసంబంధాలలో లైంగికపీడననుంచి తమని తాము రక్షించుకునే క్రమంలో కుటుంబపరిధివరకు దానిని ఎదిరించి, కుటుంబసంబంధాలను వదిలించుకొని, తమ జీవితాలలో స్వేచ్ఛను పొందగలిగారు.దానికి ఉదాహరణ సూరమ్మకూతురు కమల. అందరు స్త్రీలు ఆస్థాయిలో చైతన్యవంతులు కాలేకపోవటానికి వారివారి కుటుంబనేపథ్య పరిస్థితులే కారణం. అంతేకాక కుటుంబాలు విచ్ఛిన్నమయితే సామాజికవ్యవస్థ బలహీనమయ్యే పరిస్థితులు ఏర్పడతాయి. అలా స్త్రీలు ఎన్నాళ్ళని తాముబలి అవుతూ కుటుంబవ్యవస్థను కాపాడుతూ వస్తారు? దానికి ప్రత్యామ్నాయంగా నూతన కుటుంబవ్యవస్థ ఏర్పడాలి. 20 వశతాబ్దపు అంచున ప్రపంచీకరణ సాంకేతిక కిరణాలపై ఆకాశంలోని సగం ఆవరణను అధిగమించాలనుకొని 21వశతాబ్దంలో తన భవితవ్యాన్ని ఊహిస్తూ అట్లాంటాకు(అమెరికా) పయనమైన నాలుగవతరానికి చెందిన మహిళ సౌజన్య. ఆమెను పంపటానికై వచ్చి విమానాశ్రయంలోని భారతభూమిపై నిలబడ్డ ఆమె తల్లి పద్మ తలంపుల నేపథ్యంలో ఆమె 20 వశతాబ్దపు మొదటి దశకంలోనికి వెళ్ళటంతో సూరమ్మ/సూరీడు జీవిత కథాఘట్టాలు స్మరణకు వచ్చే క్రమంలో కథాంశం ప్రారంభమవుతుంది.

నాల్గవతరానికి చెందిన సౌజన్య అట్లాంట(అమెరికా) ప్రయాణానికి మూలాలు 20 వ శతాబ్దపు మొదటి దశకంలోనే(1910) ఏర్పడినట్లు రచయిత్రి భావించటంలోని ప్రత్యేకత ఏమిటని ఆలోచించితే ఆ శతాబ్దంలో

సూరమ్మకి జరిగిన పెళ్ళి. అదే సూరీడుకి ఏడేళ్ళవయసులో జరిగిన పెళ్ళి. అక్కడినుంచి ఆమె పుట్టుక, చదువు, పెళ్ళి, వైధవ్యజీవితం, కమలను పెంచుకోవటం, కమల కూతురు పద్మ, ఆమె కూతురు సౌజన్యవరకు సాగింది సూరమ్మజీవనయానం. అంటే సూరమ్మశక్తి దాదాపుగా ఒక శతాబ్దంపాటు మహిళాశక్తిగా కొనసాగింది. రచయిత్రి కథాసందర్భానికి తగ్గ సంఘటనలలో పితృస్వామ్యసంస్కృతి పోకడలలోని సూక్ష్మాతి సూక్ష్మ అంశాలను స్ఫురింపచేస్తూ సమాజంలో పితృస్వామ్యం ఎంతబలంగా వేళ్ళూనుకొందో గ్రహింపుకు వచ్చేటట్లు తెలియచేయటం జరిగింది. ముఖ్యంగా 20వ శతాబ్దంలో స్త్రీపురుషసంబంధాలు ఎలాఉన్నాయో, ఆధునిక కాలంలో మానవసంబంధాలు ఎలాఉంటే బాగుంటాయో ఈ నవల తెలియచేసింది..

* * * * * *

5.1. మొదటితరం మహిళ - చదువు - వివాహం స్త్రీపురుషసంబంధాలు - మానవత

20 వ శతాబ్దానికి చెందిన సూరమ్మ తనజీవితమనే కేంద్రకంచుట్టూ అల్లుకున్న సామాజిక - సాంస్కృతిక ప్రభావంలో కొట్టుమిట్టాడుతూనే ఆర్థిక - రాజకీయ పరిణామాలను ఆస్వాదించి 20 వశతాబ్దపు అంచువరకు దాదాపుగా నిండునూరేళ్ళ జీవనయానాన్నిసాగించింది. గత శతాబ్దానికి చెందిన మహిళగా సూరమ్మ మొదటి తరానికి చెందినపాత్ర.2 0వశతాబ్దం ప్రారంభంనుండి ఏర్పడిన సామాజిక,రాజకీయ పరిస్థితుల ప్రభావం, రెండు ప్రపంచయుద్ధాల పరిణామాలమధ్య జీవించిన సూరమ్మ 20వ శతాబ్దపు అంచున ఏర్పడిన ప్రపంచీకరణ పరిస్థితులతో ముగిసింది. అదే ఈ నవలలోని సూరీడుజీవితం. ఒక శతాబ్దపు జీవితచరిత్రకు నిలువుటద్దం. కాలంతోపాటు ఈమె జీవితగమనం ఉందా? లేక సూరమ్మజీవనయానంతో కాలం నడిచిందా? అనే సందేహం కలుగుతుంది. పితృస్వామ్యంలో కరుడుగట్టిన సామాజికసంస్కృతికి మూర్తిమత్వం ఈ సూరీడు. మహిళాభివృద్ధికై సంఘసంస్కర్తలు సాంస్కృతిక పునర్నిర్మాణం జరగాలని ప్రయత్నించినప్పటికీ ఆ ప్రయత్నపు ప్రభావం సూరీడు జీవితం మీదలేక పోవటానికి కారణం సూరమ్మకు ఆమె జీవితం ఆమెది కాకపోవటమే. అంటే పితృస్వామ్యసంస్కృతి ఆమె జీవితాన్ని ఎలా నిర్దేశిస్తే అలా ఉందని అర్థం. పితృస్వామ్యసంస్కృతికి బలియైంది సూరమ్మ. ఆడపిల్లగా పుట్టినందుకు ఎనిమిదేళ్ళ బాల్యంలోనే సూరమ్మజీవితం మసకబారింది. చాకిరీకి తగిన నిర్వచనంకూడ ఈ సూరీడు. పౌరోహిత్యపు వృత్తిలో భాగంగా ఆమె చిన్నన్నయ్యకు ఉన్న పితృస్వామ్య సంస్కృతి ఆచరణ బాధ్యతకై, అది నిర్ణయించిన వివక్షాసంస్కృతిని మరింతగా బలపరచటంతో నిస్సారమైన జీవితాన్ని గడిపింది సూరమ్మ. కాని ఆ నిస్సారమైన జీవితంలోనే మానవత్వపు మొలకలు మొలిపించింది. కాబట్టే సూరమ్మ / సూరీడుపాత్ర ప్రత్యేకతని సంతరించుకొంది. చిన్నప్పటినుంచి

భయంగుప్పెట్లో బతికినా బలమైన వ్యక్తిగా నిలబడి మరొక ఆడపిల్లప్రాణాన్ని నిలబెట్టి మహిళామానవత్వానికి ప్రతీకగా నిలిచింది. సూర్యకిరణాలు ప్రసరిస్తే పుష్పకమలం వికసించినట్లు ఈ సూరమ్మపెంపకంలో కమల జీవనవికాసాన్ని పొందింది. అందుకే సూర్యుడివలె ఈ సూరమ్మ కమలజీవనశక్తికి ప్రతీక అయింది. అంటే అష్టకష్టాలనే అగ్నిలో తాపంచెంది, బంగారు కణికయై మానవత్వమనే సహజకాంతులను విరజిమ్మింది.

పితృస్వామ్యసంస్కృతిని ఎదుర్కొనలేకపోయినప్పటికి కేవలం ఒక శతాబ్దకాలపు జీవితాన్ని గడపటంతోపాటు, ఆమెలోని మానవత్వమే ఆ శతాబ్దపువ్యక్తుల జీవితాలకు కాంతిని ప్రసరింపచేయటంతో సూరమ్మ గత **శతాబ్దపు సూరీడు** అయింది. సామాజికసాంస్కృతిక చక్రాలమధ్య నలిగినా జీవితాన్ని పరిపూర్ణంచేసుకొని జీవితాన్ని గెలిచిన స్త్రీ. ఎవరిమీద ఆధారపడకుండా తనచుట్టూ ఉన్నవారికి సహాయసహకారాలను అందించిన మానవతామూర్తి సూరమ్మ. అందుకే రచయిత్రి ఆమె జీవితాన్ని తరచి చూడటానికై 21 వశతాబ్దపు పాఠకులకు అందించింది.

కాలచక్ర భ్రమణంలో 20 వ శతాబ్దపు మొదటిదశకంలో భానువారం సూరమ్మజీవితం వెలుగుచూసింది. భారతదేశంలో రైళ్ళరవాణా చోటుచేసుకొన్న రోజులవి. సూరమ్మ పల్లె, బస్తీకాని ఊళ్ళో పుట్టింది. తండ్రి చనిపోయేనాటికి ఆమెకు ఐదేళ్ళు. బుల్లన్నయ్య తెచ్చిచ్చిన పెద్దబాలశిక్ష చదువుతో ప్రొద్దుపొడిచిన సూరమ్మ, కార్డుముక్క రాయగలిగి అత్తగారింట్లో మామ లైంగికదాడినుండి కాపాడుకోగలిగి మధ్యాహ్నపు సూరీడుగామారి బలమైనశక్తిగా నిలబడగలిగింది. ఆమె గతశతాబ్దపు మహిళాశక్తి. కాని పితృస్వామ్యసంస్కృతిని ఆమె నరనరాల్లో జీర్ణింపచేస్తూ పెంచబడిన సూరమ్మ ఆ సంస్కృతిని పాటించటాన్నే అలవాటుచేసుకొంది.

రచయిత్రి చెప్పినట్లుగా ఆధునికయుగారంభం నాటికే వైజ్ఞానిక, అభివృద్ధి జరిగినా సూరమ్మజీవితంలో మాత్రం సాంస్కృతికంగా హేయమైన మార్పు జరిగిందనేది సత్యం. ముగ్గరన్నదమ్ములు, నలుగురు అప్పచెల్లెళ్ళ తరువాత

అష్టమగర్భాన పుట్టిన సూరమ్మ అష్టకష్టాలు పడ్డ ఆఖరి అమ్మాయి ఈ సూరమ్మ. ఆమెకు ఐదేళ్ళప్పుడే తండ్రి మరణం ఆమె జీవితంలోని మొదటి భయంకరపరిణామం. ఎందుకంటే పితృస్వామ్యసంస్కృతిలో భాగంగా తల్లికి జుట్టుతీయించి గుండుచేయించటంతో సూరమ్మకు భయంఏర్పడి తన తల్లి వికృతంగా మారటంతో ఆమెకు తన తల్లి పరాయిదానిగా అనిపించింది. ఇక్కడ పితృస్వామ్యసంస్కృతి ప్రకృతి సహజసంబంధాలను పరాయికరణం చెందేటట్లు చేయగలిగిందని అర్థమౌతుంది. తల్లిలో అలాంటి మార్పు ఎందుకొచ్చిందని అడిగినప్పుడు బుల్లి అన్నయ్య తల్లియే అటువంటి వికృతరూపాన్ని యిష్టపడిందని చెప్పటంలోని పితృస్వామ్యసంస్కృతి మాయను అర్థంచేసుకొనే వయసు సూరమ్మకు లేకపోయింది. అసలు సూరమ్మతల్లియైన సోదెమ్మకు ఇష్టాయిష్టాలుగాని ధైర్యంగాని లేవు. తనకున్న శౌచికం ఒకే యింట్లో పుట్టిన తన అక్కలకు ఎందుకులేదో అనే ఆలోచనలు సూరమ్మకు కలిగి వైవాహికసంస్కృతిలోని వివక్షను గుర్తించేటట్లు చేసాయి. అపరకర్మలనే మాటలఅర్థాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస ఆమెలో కలిగిందంటే బుల్లిఅన్నయ్యదగ్గర అక్షరాలు, చదవటం నేర్చుకోవటంవల్లనే. సూరమ్మ మెదడులో కదలికలు మొదలయ్యాయి. కాని అవి ఆమె పెళ్ళివల్ల కొనసాగలేదు. సూరమ్మకు బుల్లన్నయ్య పుస్తకాలిచ్చి చదువుకోమంటే చిన్నన్నయ్య ఆడదానికి చదువెందుకని, ఆడది చదువుకుంటే చెడిపోతుందని అంటాడు. అప్పటినుండి సూరమ్మకు చిన్నన్నయ్య అంటే భయం పుట్టుకొచ్చింది. ఆడవాళ్ళకు చదువు లేకుండా చేసి స్త్రీలను భయపెట్టటమే కుటుంబవ్యవస్థ లక్షణమని అర్థమౌతుంది. అలాంటి భయాన్ని కలిగించకపోతే స్త్రీలు తెలివిగలవాళ్ళుగా తయారయితే పితృస్వామ్యానికి పుట్టగతులుండవని ఆనాటి పురుషులకు అర్థమైనవిషయమే.

పితృస్వామ్యవ్యవస్థలో తండ్రి పెత్తనం కొడుకులకు వారసత్వంగా వచ్చింది. 'అష్టవర్షా భవేత్కన్యా' అనే నానుడికి తగ్గట్టుగా సూరమ్మకు ఏడేళ్ళునిండగానే తల్లి నగలు అమ్మి పెళ్ళిచేసారు. సూరమ్మదృష్టిలో పెళ్ళంటే

కొత్తబట్టలు తొడుక్కొని ఒక మగపిల్లవాడిప్రక్కన కూర్చొని సరదా పడటమని మాత్రమే తెలుసు. పెద్దకొడుకు ప్లీడరుగుమాస్తా అవటంతో పట్నంలో వేరే యిల్లు కొనుక్కొని వెళ్ళిపోతే అంతా సూరమ్మపెళ్ళివల్ల అదృష్టం కలిసి వచ్చిందని అనుకొన్నారు. అన్నయిల్లు కొనుక్కోవటానికి సూరమ్మపెళ్లికీ సంబంధం పెట్టటం అర్ధరహితం. ఇలాంటి అపోహలే తరువాత సూరమ్మజీవితం కృంగి కృశించేటట్లుచేస్తాయి. ఉమ్మడికుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావటం నాటి ఆర్థిక-సామాజిక పరిణామంలో భాగంగా జరిగింది. ఊళ్ళోనే పౌరోహిత్యం చేసుకొంటున్న చిన్నన్నకు ఇంటి పెత్తనంచేతిలోకి రావటం జరిగింది. సూరమ్మచేత నోములు నోయించి అత్తగారింట్లో కాలుపెట్టించినా కాపురానికి వెళ్ళేవయసు రాకపోవటంతో పుట్టింట్లోనే ఉంది. కాని ఏడాదిదాటిన తరువాత ఒకనాడు సూరమ్మభర్త మసూచిసోకి మరణించినట్లు, సూరమ్మకు జరగాల్సిన కర్మకాండలన్నీ పుట్టింట్లోనే జరపమని అత్తవారింటివాళ్లు కబురుచేసారు. అప్పుడు సూరమ్మ తన పెళ్లికూడా తాత్కాలికబొమ్మల పెళ్ళిలాంటిదే అనుకుంది. అంతేకాక, పితృస్వామ్య సమాజంకూడా ఆడపిల్లను ఒకమనిషిగా కాకుండా బొమ్మలాగానే చూస్తుందని ఆమెకు తెలుస్తుంది. పదోరోజు తెల్లారిగట్ల సూరమ్మను కాలువగట్టుకు తల్లి, మరో యిద్దరు వితంతువులు తీసుకొనివెళ్ళి మెడలో పుస్తెలు తీసినందుకు సూరమ్మకు ఆ ఊరి కాలువ అంటేకూడా భయం, అసహ్యం కలిగింది. అంటే స్త్రీలపాలిటి ఉన్న వైధవ్యపు సంస్కతి స్త్రీలు ప్రకృతినికూడా అసహ్యించుకొనేటట్లు చేసిందని అర్థమై ప్రతిస్త్రీకి గుండె చెరువు కాకుండా ఉంటుందా అని అనిపిస్తుంది.ఆనాటినుండి సూరమ్మ ఆయింటి వంటలక్కలా, బానిసగా మారిపోయింది. అప్పటికే ఇంట్లో గచ్చుచేయించటంతో ఇంటిని పేడతో అలికే పని తప్పి సూరమ్మజీవితంలో యింటిచాకిరిలో కాస్త వెసులుబాటును గలిగించిన అభివృద్ధికర పరిణామం అది. వదినలుకూడా పితృస్వామ్యంలో పెరగటంతో అధికారంగల భర్తకు భార్యగా తమని భావించుకోవటంతో సాటిస్త్రీలను అర్థంచేసుకొనే పరిస్థితి ఉండదు.

వితంతువులు తెల్లచీరె కట్టుకోవాలి. పూలుపెట్టుకోవటం నిషిద్ధం. తలకూడా దువ్వుకోకూడదు. కాబట్టి సూరమ్మ దొంగచాటుగా జుట్టుచిక్కు తీసుకొనేది. ఇంటికి బుల్లన్నయ్య తెచ్చిన వీరేశలింగంగారి పత్రికలు చాటుగా చదువుకుంటునప్పుడు కందుకూరి ఆశయాలంటే యిష్టం ఏర్పడింది .కాని ఆమె మనసులోమాత్రం పునర్వివాహం అంటే తిరగబడే ఆలోచనలు వచ్చేవి. సూరమ్మ మామగారు కోడలికి మనోవర్తికింద డబ్బుయివ్వాల్సివస్తుంది కాబట్టి సూరమ్మ ఒకపిల్లవాడిని పెంపకంచేసుకొనే ఏర్పాటు చేయాలని భావించి సూరమ్మను అత్తారింట్లో దింపమని కబురు చేస్తాడు. అంటే అర్థికవిషయం సూరమ్మ జీవితాన్ని శాసించటంగా అర్థమౌతుంది. సూరమ్మకు అప్పుడు పదిహేనేళ్ళు. బుల్లన్నయ్య సూరీడును అత్తవారింటిలో దింపటానికి వెళ్ళివచ్చేటప్పుడు ఉత్తరం రాయటానికి రెండుపోస్టుకార్డులు యిస్తాడు. సూరమ్మకు అత్తవారింటి చాకిరి నెత్తినపడింది. సూరమ్మ అత్తవారింటికి వెళ్ళటమంటే సూరమ్మచేసే చాకిరీకి బదలాయింపు జరగటమే అని అర్థమౌతుంది. మామ తనవైపు అదోలా చూడటం సూరమ్మకు గ్రహింపుకు రాగలిగింది. మామ రాత్రిపూట తనకాళ్ళు పిసకమని అంటుంటే స్త్రీ తన భర్తను తప్ప మరొకపురుషుడిని తాకరాదనే పితృస్వామ్య సాంస్కృతిక భావనలలో పెరిగిన సూరమ్మకు భయమేసింది. కాని ఏమీచెయ్యలేని దుస్థితి. ఒకరోజు రాత్రివేళ దగ్గరకువచ్చి కాలుగీకిన మామగారి కోరిక అర్థమై బయటకు ఆవిషయం చెప్పలేక సూరమ్మ **'పాము'** అని అరిచింది. దానితో ఆమామ తోకముడుస్తాడు. ఇక్కడ సూరమ్మ ఆ వచ్చింది తన మామే అని తెలిసిన బయటకు చెప్పలేక పోయిందంటే పితృస్వామ్యంలో పురుషుడివైపు తప్పున్నా లైంగికత విషయంలో స్త్రీనే అనుమానించే విధంగా ఉన్న సామాజిక సంస్కృతి సూరమ్మకు తెలుసని అర్థమౌతుంది. బుల్లన్నయ్య యిచ్చిన పోస్టుకార్డులు ఆమె పాలిటి వరమై బుల్లన్నయ్యను వచ్చి తీసుకెళ్ళమని ఉత్తరం రాసింది. ఆ రకంగా మామబారినుండి సూరమ్మ తననితాను రక్షించుకొంది. సూరమ్మ చిన్నప్పుడు నేర్చుకొన్న ఆ అక్షరాలే అక్కరకు రాగా సూరమ్మ తనను వచ్చి తీసుకొని

వెళ్ళమని ఉత్తరం రాస్తుంది. అన్నతో పుట్టింటికి తిరుగు ప్రయాణం అయింది. మామ కోడలిమీద అభాండాలు ప్రచారం చేస్తాడు. అందుకే 'అరిటాకు మీద ముల్లుపడ్డా అరిటాకుదే తప్పు' అన్న సామెత పుట్టి ఉంటుంది. సూరమ్మకు పుట్టింట్లోకూడా ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి.

పుట్టింటికి చేరుకొన్న సూరీడునుచూసి "జుట్టున్న వెధవముండను ఇంట్లో పెట్టుకొని శాస్త్రాలు వల్లించే అర్హత మీకులేదు" అని తోటివాళ్ళు నవ్వుతున్నారని అంటాడు. జుట్టున్నవితంతువు ఇంట్లో ఉన్నందుకు తన పౌరోహిత్యపు వృత్తిని అందరు విమర్శిస్తున్నారంటూ చిన్నన్నయ్య గోలపెడతాడు. అన్నదమ్ములిద్దరూ సూరమ్మకు చెప్పకుండా ఆమెను గోదావరి ఒడ్డుకు తీసికెళ్ళి గుండు గీయిస్తారు. నిస్సహాయురాలైన సూరమ్మ ఆక్రందన, రాజమండ్రిలోనే ఉన్నవీరేశలింగంగారికి వినిపించిందో లేదోకాని గోదావరిఘోషలో కలిసిపోగా సూరమ్మ సొమ్మసిల్లి విరుచుకు పడిపోయింది. అన్నదమ్ములిద్దరు సూరమ్మను బండిలో వేసికొని సత్రానికి చేరుస్తారు. పితృస్వామ్యసంస్కృతి స్త్రీని చావు అంచువరకు తీసుకెళ్ళగలదని అర్ధమౌతుంది. ఇక్కడ సూరమ్మకు మనసు చచ్చి శవాకారంతో యిల్లుచేరటం పాఠకులహృదయాలు కత్తికోతకు గురియై కంటనీరు తెప్పించకమానదు.

అందుకే 20 శతాబ్దపు ప్రారంభంలో వచ్చిన స్త్రీలసాహిత్యంలో వితంతుస్త్రీకి జుట్టుతీయించటం శిరచ్ఛేదనంతో సమానమని రచయిత్రులు రాసారు. ఆ బుల్లన్నయ్య ఆ నాటి స్త్రీలపత్రికలను తెప్పించిఉంటే సూరమ్మ ఆలోచనలలో కొంతైనా మార్పు వచ్చేదేమో అనిపిస్తుంది. స్త్రీలకు సహజాభరణంగా పుట్టినప్పటినుండి ఉన్న వెంట్రుకలను తీయించేసరికి సూరమ్మదేహం వికృతరూపంతో బండరాయిగా మారిపోయింది. పితృస్వామ్యసంస్కృతి వితంతువులను బండరాళ్ళుగా మార్చింది అనటానికి ఇంతకు మించిన మరో ఉదాహరణ ఉండదు. ఇటువంటి స్త్రీలమానసిక హత్యలతోనే ఆనాడు భరతమాత తన అస్తిత్వాన్ని కోల్పోయి పరాయిదాస్యంలోమగ్గి ఉండవచ్చని అర్ధమౌతుంది.

సూరమ్మ బాధపడేందుకు సమయం చిక్కనంతగా ఆమె అన్నదమ్ములు, అప్పచెల్లెళ్ళ ఇళ్ళల్లో జీతంబత్తెంలేని బానిస చాకిరికి సూరమ్మ జీవితం పరిమితమైపోయింది. పనులు పూర్తికాగానే సూరమ్మ మళ్లీ వాస్తవ ప్రపంచంలోకి వచ్చేది. అందుకే మధాహ్నంకూడా విశ్రాంతి తీసుకోకూడదనే వితంతునియమంపెట్టి కాలాన్ని విస్తళ్లు కుడుతూనో, వత్తులు చేస్తూనో గోవిందనామాలతో గడపాలనే వితంతు సంస్కృతి స్త్రీలను తమ జీవితాలనుగురించి ఆలోచించనీయకుండా చేసింది. ఇదికూడా పరోక్షంగా స్త్రీలలైంగికతపై అదుపు రూపంలో ఉన్న పితృస్వామ్యసంస్కృతి అని తెలుస్తుంది. కందుకూరివారి వివేకవర్ధని సతీహితబోధిని వంటి పత్రికలను అప్రాచ్యపు పత్రికలని నిరసిస్తూ చదవద్దని చిన్నన్నయ్య పెట్టే ఆంక్షల మధ్యన సూరమ్మ ఆ పత్రికలను దొంగచాటుగా చదివేది. కనీసం చర్చించుకొనే వాతావరణంకూడాలేక ఆ రకంగా సూరమ్మలో కలిగే ఆలోచనలను, ప్రశ్నలను ఆదిలోనే అణచిపెట్టబడేవి.

కుటుంబపరిస్థితుల్లో చర్చించుకొనే వాతావరణం లేకపోతే వ్యక్తులు కలలోనే చైతన్యం తెచ్చుకొంటారు. సూరమ్మకు ఇరవైఏళ్లువచ్చేసరికి ఆ పత్రికాపఠనంవల్ల తను వీరేశలింగంగారి దగ్గరకు వెళ్ళినట్లు, తనకు మళ్ళీ పెళ్ళిజరిగినట్లు కలలు కనేది. సంప్రదాయం, పరువు,ప్రతిష్ఠ వంటి మాటలు చిన్నన్నయ్య నోట్లోనుంచి వస్తుంటే అవి సూరమ్మను బాణాల్లాగా గుచ్చుతూ బాధగాఅనిపించేది. బుల్లన్నయ్య మాటలలో కూడా నమ్మకంపోయింది. అప్పటివరకు బుల్లన్నయ్యమాటలను వేదవాక్కులాగా భావించే సూరమ్మ ఆతని మాటలను గురించి స్వంతంగా ఆలోచించటం నేర్చుకొంది. పితృస్వామ్యంలోని స్వార్థం, ఆధిపత్యం స్త్రీలను బానిసలుగా చేసిందని తెలుస్తుంది. పితృస్వామ్యసంస్కృతి కుటుంబసంబంధాలలోనే మనుష్యులమధ్య అపనమ్మకాలను పెంచుతుంటే ఇక మానవసంబంధాలకు చోటెక్కడ ఉంటుంది! సూరమ్మకు తిరగబడాలని, తన గుండుతలమీద జుట్టు పెంచుకోవాలని, వీరేశలింగంగారిని కలిసి ఉంటే బాగుండేదనే ఆలోచనలు

వచ్చేవి. కాని, భయంతోకూడిన బలహీనతతో ఒంటరిగా తనలో తనే ఆలోచించుకుంటూ ఉండేదట. వితంతుసంస్కృతి స్త్రీలను ఒంటరిగా, బలహీనులుగా చేసిందని అర్థమౌతుంది. చిన్నవదిన చేసే సావిత్రినోములకు పదిరోజులపాటు నోముకు ఏర్పాట్లు, నైవేద్యాలు తయారుచేయటానికి పనికివచ్చిన సూరమ్మ, వచ్చిన ముత్తైదువులమధ్యన కూర్చొని పూజ చూడటానికి వీలులేని సంస్కృతి ఉండటంతో, పనిపూర్తయిన తరువాత దొడ్లో కూర్చొనేది.పెళ్ళిళ్ళలో గాడిపొయ్యి దగ్గరకూర్చొనేది కాని ఆమెను ఎవరు పట్టించుకొనేవారు, ఈమె ఉనికికి విలువిచ్చేవారుకాదు. పైపెచ్చు వితంతువును ఒక అశుభ చిహ్నంగా భావించేవారు. సమాజంలో వితంతువును చాకిరిచేసే గొడ్డుగాతప్ప ఒకమనిషికింద చూసేవారుకాదని అర్థమౌతుంది. ఆమె బాధను ఎవరూ పట్టించుకొనేవారుకాదు.

ఆ అన్నదమ్ములిద్దరూ విడివిడిగా ఇళ్ళుకట్టుకోగా సూరమ్మ, ఆమె తల్లి ఆ పాతయింట్లోనే ఉన్నారు. తల్లి చనిపోయినప్పుడు సూరమ్మ తడిబట్టలతో అన్నిపనులకు పనికివచ్చేది.జుట్టులేనిగుండుతో సూరమ్మ వంటచేయటంచేత ఆమె తల్లి సంతోషపడి కాకిరూపంలో వచ్చి పిండాలను తిన్నదని, సూరమ్మ తనభర్తను స్వర్గానికి తీసుకెళు తోందని యింట్లోవాళ్ళు అంటుంటే విని సూరమ్మ పుట్టింట్లో బానిస బతుకు బతికేకన్నా ఎవరన్నా తనని తన భర్తదగ్గరకు చేరిస్తే బాగుండు అనుకొనేది. పితృస్వామ్యం స్త్రీలలైంగికతపై అదుపుకై భర్తమరణానంతరం స్త్రీని వికృతంగా చేయటానికై పితృదేవతల పిండాలకు, వితంతువుల బోడిగుండుకు సంబంధంపెట్టే కట్టుకథలను ప్రచారంచేయటం, పితృస్వామ్యసంస్కృతి పరిరక్షణకైచేసిన సాంస్కృతిక రాజకీయ కుట్ర.అందుకే సూరమ్మకూడా దానినే నమ్మింది. తల్లిపోయిన తరువాత సూరమ్మ ఏకాకి అయింది. సూరమ్మ మనోవర్తి డబ్బుమీద, ఆమె చాకిరీకోసం చిన్నన్న అట్టిపెట్టుకోవాలనుకొన్నా, సూరమ్మ మాత్రం బుల్లన్నయ్యయింట్లోనే ఉండటానికి నిశ్చయించుకొంది. బుల్లొదిన చాకిరీ చేయిస్తున్నప్పటికీ, ఇక్కడ ఆంధ్రపత్రికలు చదువుకొనే వెసులుబాటు సూరమ్మకు ఉండేది. కానిమిగిలినవారింట్లో చాకిరి అవసరాలకు సూరమ్మను

వాళ్ళు పిలవటం, ఈమె వెళ్లాల్సిరావటం జరిగేది.పెళ్ళిళ్లకు చాకిరీ చేయంచుకొని పాతచీరెలు ఇచ్చేవారు. తీసుకోకపోతే సూరమ్మకు పొగరనేవారు.చిన్నక్క కూతురు పురిటికోసం సూరమ్మను పంపించమని అడిగితే బుల్లన్నయ్య ఆమెను చిన్నక్క యింటికి పంపించాడు, కాని ఈమె ఇష్టాన్ని మాత్రం ఎవరూ అడిగేవారు కాదు. ఉడుకుమోతుతనం వచ్చి గోలచెయ్యాలనిపించేది కాని 'వివేకం' అని పిలువబడే 'పిరికితనం' ఆమెను ఆపనిచేయించేది కాదు. చిన్నక్క తన మనోవర్తి డబ్బుమీద కన్నేసి అడిగినా మాట్లాడకుండా ఊరుకొనేది. చిన్నక్క తన కూతురు మొగుడు తిరుగుబోతని సూరమ్మతో చెప్పుకొని ఏడ్చేది. ఆ పిల్ల ఒక బిడ్డను కని పురిటిలోనే చనిపోతే ఆ బిడ్డ ఆడపిల్ల అని ఆపిల్లతండ్రివైపు అత్తవారు తీసుకొని వెళ్ళమని అన్నారు. చిన్నక్క మొగుడుకూడా ఆడపిల్లను పెంచుకోమన్నాడు. తనలాగా ఒంటరి, ఆనాథ అయిన ఆ పిల్లను సూరమ్మ పెంచుకొంటాననంటే బుల్లన్నయ్య ఆ విధంగా ఆ పిల్ల తండ్రి చేత కాగితం రాయించుకొన్నాడు. సూరమ్మ పిల్లను మూడవనెలలో తీసికెళ్ళవచ్చని భావించి అక్కడే ఉంటే, ఆ బావ పసిపిల్లకు పాలడబ్బాకూడా తెచ్చియివ్వడు. ఆమె బుల్లన్నయ్యదగ్గరనుండి డబ్బులు తెప్పించుకొని పిల్లను బతికించుకొంది. అంటే సూరమ్మ వైధవ్యపు భరణం ఆచంటిపిల్ల ప్రాణాల్ని నిలబెట్టిందని అర్థం అవుతుంది. ఆ రకంగా సూరమ్మ ఒక ఆడపిల్లవిషయంలో మానవత్వాన్ని నిరూపించుకొంది. పిల్లఏడిస్తే అందరూ పసిపిల్లను తిడుతుంటే సూరమ్మకు పిల్ల మీద జాలి కలిగేది. తనే లేకపోతే ఆగుడ్డును చంపేసే వాళ్ళనుకొంది. పెళ్ళితో తాను అనాథయైతే, ఆ పసిపిల్ల పుట్టుకతోనే అనాథ అయిందని భావించి, సానుభూతిని, సహానుభూతిని పొందింది. పితృస్వామ్యపు వివక్షాసంస్కృతి ఆడపిల్లపుట్టుకకు విలువలేకుండా చేసింది కాబట్టి అవాంఛనీయం అయింది. ఆయింట్లోనివారు తల్లిలేని అనాథ ఆడపిల్లను చంపేసేవారేమో! కాని ఇరవైఏడేళ్ళ సూరమ్మమాత్రం ఆ పిల్లకి పునర్జన్మను ఇచ్చింది. పసిపిల్ల రాత్రిపూట ఏడుస్తూ ఇంట్లో వాళ్ళ నిద్రను పాడుచేస్తోందని తిడుతున్నారని, తనకు నిద్రరాకుండా ఉండటానికి రాత్రిపూట సూరమ్మ అన్నంతినటం కూడా మానేసింది. సూరమ్మ

తాను కన్నతల్లికాకపోయినా నిద్రాహారాలు త్యాగంచేసి పసిపిల్లను పెంచిందంటే ఆమెలో ఒక మదర్ థెరీసా కనపడుతుంది. వితంతువుగా సూరమ్మ రాత్రిపూట అన్నం తినటం మానేసినందుకు చిన్నన్న పితృస్వామ్యపరిరక్షకుడిలా సంతోష పడ్డాడు. సూరమ్మ పిల్లపనితప్ప మిగిలిన పని చేయటంలేదని ఆడవాళ్ళకు కూర్చోపెట్టి అన్నంపెట్టలేనని చిన్నక్క విసుక్కొనేది. సూరమ్మకు పెళ్ళివలన వచ్చిన వైధవ్యం ఆమె అస్తిత్వానికి కూడా గొడ్డలి పెట్టువంటిదయింది. మూడునెలల తరువాత సూరమ్మ బుల్లన్నయ్య యింటికి చేరుకొంది. బుల్లివదినకూడా ఏడుపుగొట్టుపిల్ల అని విసుక్కుంటే తనకొక యిల్లుచూపించమనగా బుల్లన్నయ్య సూరమ్మ మనోవర్తి డబ్బుకు వచ్చిన వడ్డీతో ఒక పాతయిల్లుకొని సూరమ్మపేర రిజిష్టరు చేయించాడు. సూరమ్మజీవితం నాలుగు తరాలవరకు సాగుతుంది కాబట్టి సూరమ్మ పసిపిల్లతో సొంతయింట్లోకి ప్రవేశించినప్పటినుండి రెండవతరానికి సాగిన సూరమ్మ జీవితంలోని మలుపులను తెలుసుకోవాలి.

అయితే కుటుంబంలోని స్త్రీపురుషసంబంధాలు పితృస్వామ్యసంస్కృతికి అనుగుణంగానే ఉన్నాయి. సూరమ్మచదువు పెద్దబాలశిక్షతో ప్రారంభం మాత్రం జరిగింది. కాని బాల్యవివాహం వల్ల, ఆడపిల్ల చదువుకుంటే మాటవినరు అనే చిన్నన్నమాటలవల్ల ఇంటిదగ్గర చదువుకూడా కుంటుపడింది. స్త్రీపురుషసంబంధాలలో పితృస్వామ్యపు పురుషప్రయోజనాలే రాజ్యమేలినట్లు తెలుస్తుంది. చారిత్రకంగా పితృస్వామ్య కుటుంబనిర్మాణానికి పునాదియిన మహిళలలైంగికతపై అదుపుకై మహిళాపీడనంగా నిర్ణయించిన వితంతుసంస్కృతిని పకడ్బందీగా ఆచరించినట్లు అర్థమౌతుంది. మొదటితరంమహిళకు సమాజంలో గౌరవంగా బతికే హక్కులేకుండా పితృస్వామ్యపు వివాహసంస్కృతి చేసిందని స్పష్టమయింది.

* * * * * *

5.2. రెండవతరంమహిళ - చదువు - వివాహం - స్త్రీపురుషసంబంధాలు - మానవత

సూరమ్మ సొంతయింట్లోకి ప్రవేశించాక బుల్లన్నయ్యవదినలచేత ఆ పసిపిల్లకు కమల అని పేరు పెట్టించింది. మరి సూరమ్మసమక్షంలోనే కదాప్రాణంపోసుకొన్న కమల వికసించేది. కమల పుట్టినప్పుడు దురదృష్టవంతురాలు అన్నవాళ్లందరూ సూరమ్మ పెంపకంలోకి వచ్చేసరికి కమలను అదృష్టవంతురాలని మాట్లాడుతున్నారు. కమలకు పుట్టినరోజు పండగలు చేసేది. చిన్నన్నయ్య అయితే కొడుకును పెంచుకొంటే తలకొరివి పెట్టేవాడు, అనవసరంగా ఆడపిల్లను పెంచుకుంటున్నావని తక్కువచేసి మాట్లాడేవాడు. అంటే సమాజంలో ఆడపిల్లపుట్టుకకి విలువలేకపోయినప్పటికీ సూరమ్మ ఆడపిల్లను పెంచుకొవటంలోనే ఆమె మానవత్వం మహోన్నతదశకు చేరిందని తెలుస్తుంది. ఇప్పుడు సూరమ్మకు తన యిల్లు, కూతురు అనే భావాలు పెరిగి, కమలకోసం భారీ పెట్టుపోతలు తగ్గించుకొంది. స్వార్థం ఏర్పడి అంతకు మునుపున్న విశాలదృక్పథం కుంచించుకుపోయింది. మరి అలా ఉండకపోతే సూరమ్మకు కమలపెంపకం కష్టమయ్యేదని అనిపించకపోదు. కమలను బడికి పంపుతూ మరొకపక్క కమలకు ఏడవ ఏటనే సంగీతం కూడా నేర్పించిందంటే, సూరమ్మ తనకు బాల్యంలో దూరమైనవన్నీ కమలకు దక్కేటట్లుచేసింది. తన అభిరుచులను కమలద్వారా నెరవేర్చుకొనేది. కమలకు పదేళ్ళు వచ్చేసరికి సూరమ్మ చాకిరికి పిలిపించుకొనే బంధువుల యింటికి రాకపోకలు తగ్గించుకొంది. వీధిపంపులు వచ్చేసరికి సూరమ్మకు బయటికి వెళ్లి మంచినీళ్ళుతెచ్చేపని తగ్గింది.

మెల్లమెల్లగా సూరమ్మజీవితానికి కాస్త సుఖం దొరుకుతోంది. కొన్నాళ్ళకు బుల్లన్నయ్య సూరమ్మ మనోవర్తికి వచ్చిన వడ్డీడబ్బులతో పాత యింటి స్థానంలో కొత్తయింటిని రెండువాటాలుగా కట్టించి ఒకవాటాను అద్దెకు

ఇప్పించాడు. ఆ రకంగా సూరమ్మ ఆర్థికస్థితికూడా కాస్త మెరుగయింది. అణకువగా, సంప్రదాయబద్ధంగా పెరిగిన కమల అంటే బుల్లన్నయ్యకు యిష్టమట.పితృస్వామ్యం నిర్ణయించిన మహిళా సంస్కృతిప్రకారం అణకువతో పెరిగితేనే సంప్రదాయంగా పెరిగినట్లు. అంటే పితృస్వామ్యపు అదుపురూపంగానే చిన్నప్పటినుంచి ఆడపిల్లపెంపకం జరగాలని ఆతని ఉద్దేశం.

కమలకు పదహారేళ్లు దాటకుండా పెళ్ళిచేయాలని అంటే కమల తాను స్కూల్ ఫైనల్ వరకు చదువుకుంటానంది. కమల మిషనరీస్కూలుకు మారి ఇంగ్లీషు చదవటం రాయటం నేర్చుకొంది. అదే సమయంలో భారతదేశంలో స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా సత్యాగ్రహఉద్యమం ఊపందుకొంది.

కమల స్కూల్ కి వెళ్ళటంతో సూరమ్మకు కాస్త తీరికదొరికి తానుకూడా ఖద్దరు ఉద్యమంలో భాగంగా దేశసేవ చేయాలనుకొంది. కమలమాస్టారుగారి భార్యసహాయంతో నూలువడకటం, ఖద్దరు వస్త్రాలతయారీ నేర్చుకొని ఇంటింటికీ వెళ్లి అమ్మటంతో అది చిన్నన్నకు తెలిసి యింటిపరువు పోతుందని గగ్గోలు పెట్టి పిల్లపెళ్ళికాదని భయపెడతాడు. భయాన్నిజీర్ణించుకొని పెరిగినసూరమ్మకు దాన్ని తర్కించే వివేకం, ధైర్యమూ లేవు. పైపెచ్చు తనని తాను తక్కువచేసుకొని భావించటం అలవాటవటంతో తర్కించటం చేయదు. ఆడవాళ్ళకు పెళ్ళితో మూడుముళ్లుపడటం అంటే ప్రపంచంలోని అన్ని సంబంధాలతో ముడిపెట్టటమనే పితృస్వామ్య సంస్కృతిలోని జీవనసత్యాన్ని రచయిత్రి ఆ సంఘటనలో స్పష్టం చేయటం ఆలోచనలను రేకెత్తించక మానదు. దేశసేవకి, వివాహసంస్కృతికి ముడిపెట్టి మాట్లాడేసరికి కమలకు పెళ్ళికాదేమోననే భయంతో దానిని అంతటితో ఆపింది. పితృస్వామ్యసంస్కృతి నిర్ణయించిన స్త్రీలలైంగికతపై అదుపు, స్త్రీలకు దేశసేవచేసే భాగ్యంలేకుండా చేసింది. ఇంటిదగ్గర స్వాతంత్ర్యోద్యమంలో స్త్రీలు పాల్గొనటానికి పితృస్వామ్యసంస్కృతి అడ్డంకిగా తయారయింది. అందుకే కందుకూరి

వీరేశలింగం భారతదేశానికి స్వాతంత్ర్యం రావటానికి ముందే దేశంలో స్త్రీలకు స్వతంత్ర జీవనపరిస్థితులు ఏర్పడాలని భావించటం సత్యమనిపిస్తుంది.

సూరమ్మయింట్లోనే గోనెబట్టలాంటి ఖద్దరు పంచెలు తయారుచేసుకొని కట్టుకొనేది. కమల ఎనిమిదవ తరగతిలోకి వచ్చినప్పుడు రజస్వల అయింది. కమల వద్దన్నా ఐదురోజులు చిమ్మిలిచేసి పంచిపెట్టింది. కమల పాతగౌనులన్ని చిన్నప్పుడు కమలకు పాతగౌన్లు యిచ్చిన బంధువుల పిల్లలకు యిచ్చిబదులు తీర్చుకొని తృప్తి పడింది. దీనిని సూరమ్మ తనపరిధిలో చూపించగలిగిన నిరసనగా భావించవచ్చు.

నలభైఏళ్ళసూరమ్మకు కమలపెళ్లిచేసి నోములు వ్రతాలుచేయించి కమల పిల్లాపాపలను ఎత్తుకు మొయ్యాలనే కలలుకనేది. ఇంటి ముందుకు కరెంటు దీపస్థంభాలు వచ్చేసరికి ఇక ఇళ్ళలోకి వస్తాయనే నమ్మకం సూరమ్మకు ఏర్పడింది. కమల ఆకరెంటుదీపంకింద చదువుకోవాలని ఆదీపాలకిందనే కమలపెళ్లిచేయాలని అనుకొంది. బుల్లన్నయ్య సూరమ్మ వడ్డీడబ్బుతో రెండెకరాల భూమిని కొనిపెట్టాడు. కమల తొమ్మిదవ తరగతిలోకి రాగానే పెళ్ళిచేయాలని చూస్తే ఏడెనిమిది సంబంధాలు తప్పిపోయేసరికి సూరమ్మకు కమలపెళ్ళి విషయంలో దిగులు పట్టుకుంది. ఆ సమయంలోనే సూరమ్మ చిన్నక్కవచ్చి తనకొడుకైన సత్యానికి యిచ్చిపెళ్లిచేయమని అడుగుతుంది. కమల పసిపిల్లగా ఉన్నప్పుడు అడిగినా పాలసీసాకూడా కొని యివ్వని చిన్నక్క తన కోడలిగా కమలను చేసుకొంటానన్నా సూరమ్మయిష్టపడక నిర్లిప్తంగా ఉండి వాదానికి దిగలేకపోయింది. చిన్నక్క తాము కలిసిగట్టుగా ఉండటంచేతనే కమల తండ్రి సూరమ్మకు పెంపకానికి యిచ్చాడని ఆపిల్ల మీద తమకే హక్కు ఉన్నట్టుగా భయపెట్టచూసింది. కాని సూరమ్మ ఆమెతో కమలతండ్రి రాసిచ్చిన దత్తతకాగితాలు బుల్లన్నయ్యదగ్గర భద్రంగా ఉన్నాయని చెప్పి కమల విషయంలో తనకే హక్కు ఉన్నట్లు మాట్లాడుతుంది. బావకు మనుమరాలు కాబట్టి సూరమ్మకు బావ రాసివ్వలేదు కదా అని భయపెట్టింది. సూరమ్మకాస్త తగ్గి కమలకు యిష్టపడితే ఆలోచించుతానని అంది. దానికి

చిన్నన్నయ్య ఆడపిల్లకు తన పెళ్ళివిషయంలో నిర్ణయాధికారం ఉండటానికి వీల్లేదంటాడు. ఇక్కడ పితృస్వామ్య సమాజపుసంస్కృతి స్త్రీకి తనపెళ్ళి విషయంలో నిర్ణయంచేసుకొనే వీలులేకుండా చేసిందని రచయిత చెప్పకనే చెప్పినట్లయింది. సత్యానికి చదువులేదని, సిగిరెట్లు తాగుతాడని సూరమ్మ దోషాలను ఎత్తిచూపినా, అవి గిట్టని వాళ్ళమాటలని చిన్నక్క తోసిపుచ్చింది.

తన నగలన్నీ కమలకు పెడతానని కమల ఇద్దరి యిళ్ళల్లో ఎక్కడైనా ఉండవచ్చని అంటుంది. సూరమ్మకు కమలను బయటకు పంపించటం కన్నా అల్లుడే యిల్లరికం వస్తే బాగుంటుందని అనుకొంది. చిన్నక్కతన అన్నలను తన వైపుకు తిప్పుకొని కమలను సత్యానికి యివ్వకపోతే నూతిలో పడి చస్తానని సూరమ్మను బెదిరించింది అన్నలు ఆ చిన్నక్క నిర్ణయాన్ని బలపరిచారు. పితృస్వామ్య ప్రయోజనాలకు వీలున్నప్పుడు మాత్రమే స్త్రీలకు పురుషులవలన సహాయం అందుతుందని ఈ సందర్భం తెలియజేస్తుంది.

సత్యానికి కమలను ఇచ్చిపెళ్లిచేస్తే కమలజీవితం బాగుండదని సూరమ్మ ఆత్మ ప్రబోధం ఘోషించినా ప్రయోజనంలేక సత్యంతో కమలకు పెళ్లిజరిగిపోయింది. చిన్నక్క కమలపెళ్లప్పుడు చంద్రహారమిచ్చి తరువాత వడ్డాణం యిస్తానని చెప్పింది. కమల యిష్టాన్ని ఎవరూ అడగలేదు. కమల తన యిష్టాయిష్టాలను బహిర్గతం చేయనూలేదు. ఆమె తొమ్మిదవ తరగతి ఫస్టుక్లాసులో పాసయిన సంతోషంలో ఉందిగాని పెళ్లితో కాదనిపిస్తుంది. తాను ఫిఫ్త్ ఫారంలో చేరతానంటే సూరమ్మ సత్యాన్ని అడగమంటుంది. పదిహేనేళ్ళ కమలకు చదువుల గురించి తప్ప పెళ్ళినిగురించి అవగాహన చేసుకొనే వయసులేదు. ఆడపిల్లలకు తమ పెళ్ళివిషయంలో నిర్ణయాధికారం లేకుండా చేయటానికే పితృస్వామ్యం బాల్యవివాహసంస్కృతిని నిర్దేశించింది. సూరమ్మకు కమల చదువు యిష్టమైనా, పెళ్లిచేసిన తరువాత పెళ్ళితో స్త్రీలలైంగికతపై భర్తకు అధికారం వస్తుందనేది పితృస్వామ్యం నిర్ణయం. భర్త యిష్టం ప్రకారం నడవకపోతే స్త్రీలకు పుట్టగతులుండవని సూరమ్మకు తెలుసు కాబట్టే అలా అని ఉంటుంది. అందుకనే సూరమ్మ కమలతో సత్యాన్ని అడగమని అంటే,

సత్యంయిప్పటికే తనబుర్ర మట్టిబుర్ర అంటాడని, స్కూలుకి వెడితే మగపిల్లలు ఏడిపిస్తారని సత్యం చదువు ఆపేయమంటున్నాడని కమల చెప్పింది. ఆతడి మనసును గ్రహించిన సూరమ్మ ఆ ఏటికి చదువును ఆపమన్నది. కమలను చదువు కొనసాగించమంటే భర్తతో గొడవలు వస్తాయనుకున్నది. స్త్రీలు చదువుకుంటే వ్యక్తిస్వాతంత్ర్యపు స్పృహ పెరిగి సాంస్కృతిక సమానత్వాన్ని కోరుకుంటే అది పితృస్వామ్యానికి చుక్కెదురనే భయం ఉంది, కాబట్టే ఆడపిల్లలచదువును నిందించటానికి, నిరసించటానికే బాల్యవివాహసంస్కృతిని ఆచరణలో పెట్టింది.

సత్యం అక్కకొడుకుగాకాక అల్లుడిగా తనను గౌరవంగా సంబోధించాలని చెప్పటం, కమలతో ప్రతిక్షణం నీకేమి తెలీదని ఆమెను తక్కువచేయటం, సినిమాకు వెడుతుంటే ఆడవాళ్లు మగవాళ్ళకు వెనకాల నడవాలనీ, అంటూ పితృస్వామ్యం మగవాళ్ళకు ఇచ్చిన అధికారాలన్ని చెలాయించేవాడు. సత్యాన్నిచూస్తుంటే సూరమ్మకు ఏవగింపు, నిర్లక్ష్యం కలిగాయి. సత్యం యింట్లో ఉంటే సూరమ్మ దొడ్డివాకిలివైపు కూర్చొనేది. సూరమ్మకు పద్దనిమిదేళ్ల తరువాత మళ్ళీదొడ్డివాకిలి జీవితం తిరిగి మొదలవుతుంది. చిన్నక్కభర్త పోగానే కార్యక్రమాలన్ని యథావిధిగా జరిపించారు. స్త్రీలను స్వేచ్ఛగా ఎదగనీయకుండా చేయగలిగి స్త్రీలలైంగికతను అదుపుచేసే వితంతుసంస్కృతి పితృస్వామ్యానికి పెట్టనికోటకాబట్టి దానికై పుక్కిటిపురాణాలను మంత్రాలను కూడా సృష్టించి శాస్త్రంగా చేసి కర్మకాండలను చేయటం విధిగా నిర్ణయించి దానిని పితృస్వామ్యసంస్కృతిలో భాగంచేసింది. చిన్నక్క తన నగలన్నీ కమలకే దక్కనీయమని బుల్లన్నయ్య దగ్గర దాచి పెట్టింది. దానికి సత్యం కోపం తెచ్చుకొన్నాడు. కమలను సత్యానికిచ్చి పెళ్లిచేయించి గొంతుకోసినందుకు చిన్నక్కకు కాస్త పాపప్రక్షాళన చేసుకోవాలనిపించినా సూరమ్మమాత్రం తనగొంతును విధి కోస్తే, తాను కమలగొంతుకోసినట్లు బాధపడింది.

సత్యం పదిహేనురోజులకు ఒకసారి వచ్చినప్పుడు పడకగది నుండిబయటకు ఎర్రటి కళ్ళతో ఉబ్బినముఖంతో వచ్చిన కమలను చూస్తే

సూరమ్మకు విషయం తెలిసేది. కమలకూడా సత్యం యింట్లో ఉంటే భయం భయంగా ఉండేది. భర్త ఊళ్లోలేకపోతే ఆనందంగా ఉండేది. ఇదే కాపురాలలో ఉండే బోలుతనం అని అర్థంచేసుకోవచ్చు. భార్యను నిరంతరం భయానికి గురిచేయగలిగే విధంగా పితృస్వామ్యం సమాజంలో కుటుంబసంస్కృతిని ఆచరణలోపెట్టించి పురుషుని ఆధిక్యతకు అడ్డులేకుండా చేసుకోగలిగిందనే అవగాహన ఏర్పడుతుంది. అందుకే సత్యం ఆ సంస్కృతిని తు.చ.తప్పకుండా అనుసరించి భర్తగా తన ఆధిక్యతని నిలుపుకుంటున్నాడు. పితృస్వామ్యంలో ఆడవాళ్ళకే నోములు నిర్దేశింపబడ్డాయి. నోములు నోస్తున్నప్పుడు భర్తప్రేమ కలకాలం ఉండాలని దీవిస్తుంటే తనకు అటువంటి కాపురం కలకాలం కావాలా! అనికమలకు నవ్వువచ్చేదట. మృగంలాంటి భర్తకోసం నోములు నోయాలా అని ఒక్కొక్కసారి కమలకు ఏడుపుకూడా వచ్చేది. అంటే నోములలో ఉండే మిథ్య కమల ఏడుపులోదాగి ఉండటమే. కాని సూరమ్మకోసం నోములు నోచేదని, కమల నవ్వులో వ్యక్తం అవుతుంది. కాపురం కలకాలం ఉండేటట్లయితే నోములు నోచుకోకూడదనే భావన కమలకు కలగటంలోని తిరుగుబాటుతనం అది. పితృస్వామ్యం ఆ రకంగా స్త్రీలదృష్టిని భర్తలవైపునుండి మరల్చకుండా నోములు నోయిస్తూ జాగ్రత్తపడేది. ఇదంతా పితృస్వామ్య మాయాజాలం. సత్యానికి పెళ్లామంటే బొమ్మతో సమానమని కమల బాధపడేది. భర్త అంటే అసహ్యం, దాంపత్యం అంటే రోతగా కమలకు అనిపించేదట. ఒకపక్క సూరమ్మ, మరోపక్క హింసించే భర్త. పరస్పర వ్యతిరేకశక్తులు తన జీవితాన్ని శిలాశాసనంగా పాలిస్తున్నట్టు భావించేది కమల. తనగుండెలో చెలరేగుతున్న జ్వాలను తల్లికి చెప్పదు. తనలోనే అంతర్మథనం చెందేది. కమల మరబొమ్మలాగా తయారు అయిందని రచయిత్రి పేర్కొనటం పితృస్వామ్యవివాహసంస్కృతి స్త్రీని మరబొమ్మగా తయారుచేస్తుందనేది సత్యం. అంతేకాక, పితృస్వామ్యంలోని వివాహసంస్కృతి ప్రతితరంలోనూ ఏదో ఒకరూపంలో ఉండి స్త్రీల జీవనశక్తిని హరించేవిధిగా ఉందని కూడా గ్రహించాలి. మరో ఆరునెలలకు కమల గర్భవతి అయింది.

అందుకని సూరమ్మకు సత్యంమీద కోపం కాస్త తగ్గింది. సత్యానికి మాత్రం భార్య గర్భవతి అయినందుకు తానొకమగవాడినని, ఘనకార్యం చేసినట్లుగా గర్వంచూపిస్తున్నాడు. అందుకనే లైంగికసంబంధాలలోనే పితృస్వామ్య ఆధిపత్యానికి మూలాలు ఏర్పడ్డాయనిపిస్తుంది.

చిన్నప్పటినుంచి కమలకు సినిమాలన్నా పుస్తకపఠనం అన్నా యిష్టం. భారతదేశంలో సినిమాలు ఎప్పటినుండి మొదలయ్యాయో తెలిసిన విషయం కాబట్టి రచనలోని కాస్తముందు వెనకలుగా కథాకాలాన్ని తెలుసుకోవచ్చు తాను చదివిన నవలల్లో పెళ్ళాం గర్భందాలిస్తే భర్త ప్రేమగా లాలించి కృతజ్ఞత చూపిస్తాడని చదివింది. కాని సత్యం తాను మగాడినని గర్వం చూపిస్తుంటే సత్యం ప్రవర్తనపట్ల ఏహ్యత కలిగేది, జంతుస్వభావం అనిపించేది. అంటే సమాజంలోని స్త్రీపురుష లైంగికసంబంధాలలో భాగంగా సంతానాన్ని కనియివ్వటంలోని పితృస్వామ్యపు ఆధిక్యతాభావం కమలకు తెలియటమే. పిల్లాడుపుడితే సత్యం ఇంటిపట్టున ఉంటాడని సూరమ్మ భావించింది. కమల తనసూడిదలప్పుడు ముందుగా సూరమ్మకాళ్లకే నమస్కరించింది. వితంతువు శుభకార్యానికి పనికిరాదనే నానుడికి విరుద్ధంగా తను కాన్పులో చనిపోకూడదని తనలాగా తన బిడ్డ అనాథకాకూడదని గర్భవతియైన కమల తనను పెంచిన సూరమ్మదగ్గర దీవనలు తీసుకోవాలనుకొంది. సూరమ్మ దీవనలే ముఖ్యమనుకొందని భావించింది. వితంతువు అయినా కాకపోయినా తల్లిదీవెన ముఖ్యమని భావించాలని, నిజానికి మగవాడికి లేని వితంతుతనం ఆడవాళ్ళకెందుకనే సమానత్వపు ఆలోచనలను కలిగించి రచయిత్రి పరోక్షంగా హెచ్చరించటమే నవలాప్రయోజనం.

కమలకు ఆడపిల్లపుట్టింది. వంశాంకురం పుట్టకపోయినా సత్యం కాపురం నిలబడితే చాలని చిన్నక్క అనుకొంది. అయినా అప్పటికే ఆమెకు మనవళ్లు ఉన్నారుగా అనిపిస్తుంది. అంతేకాదు సత్యానికి ఇదివరకే పెళ్ళయినట్లు చిన్నక్కకు తెలుసు. సత్యం ఇంటికి రావటం మానేసాడు. ఒకరోజు సత్యం తనకు ఇదివరకే పెళ్ళయినట్లు బహిర్గతం చేసేసరికి సూరమ్మ విరుచుకు

పడిపోయింది. సత్యం భోగజీవితం, కమలకష్టం సూరమ్మ మనసును కలవరపరిచాయి. సత్యాన్ని చేసుకొన్న అవతలి అమ్మాయిదే తప్పు అని చిన్నన్నయ్య రంకెలు వేసాడు. ఆ అన్న పితృస్వామ్యపు ప్రతినిధిగా తప్పంతా స్త్రీదే అని నిర్ధారించాడు.

కమల సూరమ్మ ముఖంమీద నీళ్ళుజల్లగా సూరమ్మలేచి కమలజీవితాన్ని తానే నాశనంచేసానని బాధపడుతుంటే కమల సూరమ్మను ఓదార్చి ధైర్యం చెప్పింది. ఎందుకంటే అప్పటికే కమలకు సత్యం బాగా అర్థమయ్యాడు. అందుకే కమల మామూలు ఆడపిల్లలాగా గగ్గోలుపెట్టకుండా చాలా ధైర్యంగా ఉంది. అప్పటికే సత్యంపెళ్ళివిషయం తెలిసినా సూరమ్మకు చెప్పకుండా కమల తనగుండెనురాయి చేసుకొని ధృఢంగా తయారయింది.

ఇప్పటినుండి కమలజీవితంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. ఎవరూ ఎవరి జీవితాన్ని నాశనంచేయలేరని, తానే తన జీవితాన్ని సరిదిద్దుకొంటానని చెప్పి సూరమ్మను ధైర్యంగా ఉండమంది. సత్యం ఇక యింటికి రాడేమోనని సూరమ్మ అంటే కమల మరీమంచిదని అన్నది. ఇన్నాళ్ళనుంచి సత్యంపెళ్ళివిషయం తెలిసినా చెప్పలేక భయంగా బతికానని అతడుచేసిన మంచి పని తనకు కూతురును ఇవ్వటమని అంటుంది. అంటే సమాజంలో స్త్రీకి మాతృత్వం తమ అస్తిత్వాలకు విలువను యిస్తుంది. స్త్రీపురుషసంబంధాల ప్రయోజనం అయిపోయిందన్నట్లుగా తీసుకొంది.

ఎందుకంటే భార్యభర్తలిద్దరికి పరస్పరం ప్రేమలేదు కాబట్టిఒకస్త్రీగా కమల అలా భావించి ఉండొచ్చు. సత్యం యిక ఇంటిగడపతొక్కితే ఊరుకోనని, పోలీసుల్ని పిలిపించి పట్టిస్తానని ఆడపులిలా గాండ్రించింది. అంటే మొగుడనే చెరనుండి విముక్తి కలిగింది, ఆ పీడ విరగడయింది. ఆడపిల్లలు ఆడపులులుగా ఎప్పుడు మారతారో రచయిత్రి ప్రయోగాత్మకంగా నిరూపించటం ఆశ్చర్యాన్ని కలిగించక మానదు. చిన్నక్కముఖం చూపించలేనిస్థితిలో ఉంది. తప్పంతా అత్తగారిదే అని, కొడుకు చదువుల్లో తప్పిన విషయాన్ని కప్పిపెట్టిందనీ, సత్యం ముందే పెళ్ళి చేసుకొన్నవిషయం తెలిసికూడా దాచిపెట్టినందుకు అత్తగారికున్న

వ్యామోహాన్ని కమల కడిగిపారేస్తుంటే సూరమ్మ వారిస్తుంది. ఆ అత్తగారు అదే కమలకు అమ్మమ్మకూడా. ఆమె తనకి సత్యం అంటే ప్రాణమనీ, తాను సత్యాన్ని దారిలో పెట్టటానికే అబద్దం ఆడినట్లు ఒప్పుకుంది. కమల ఇక సత్యం తన దగ్గరకు వస్తే తననిమోసంచేసి రెండో పెళ్ళిచేసుకొన్నాడని కేసుపెట్టి పోలీసులకు పట్టిస్తానంటుంది. అలాఅని అతడిమీద కేసుమాత్రమే పెట్టగలుగుతుంది కాని విడాకులు యిచ్చే అవకాశంలేక పోయింది. ఎందుకంటే అప్పటికి ఇంకా దేశానికి స్వాతంత్ర్యం రాలేదు. హిందూవివాహం, విడాకులచట్టం లేవని నిర్ధారితమౌతుంది. ఆంధ్రదేశంలో భర్త తిరుగుబోతు అయితే విడాకులిచ్చే రాధాసుబ్బరాయనుబిల్లును ఉమ్మడి మద్రాసుప్రభుత్వ శాసనసభలో పెట్టాలనే ఆలోచనలు స్త్రీలలో పెరుగుతున్న రోజులుఅవి.

స్త్రీపురుషసంబంధాలలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని ఆనాటి స్త్రీలురాసిన సాహిత్యశోధనలో తేటతెల్లమైన విషయమే. ఆ రోజుల్లోనే కమల తన నిర్ణయాన్ని చెప్పటం అటువంటి పరిస్థితులలో మహిళలు చేయాల్సిన కర్తవ్యాన్ని తరతరాలకు తెలియచేయటమే. పరమ కిరాతుకుడైన సత్యాన్ని ఎంతతొందరగా వదుల్చుకుంటే అంతమంచిదని బుల్లితాతయ్యకు కమల చెప్పింది. సత్యంసామాన్లేవి ఇంట్లో లేవని, కూతురు తనపిల్ల అని సత్యంకోర్టు కెడితే అతడు తనమొదటిపెళ్ళిగురించి చెప్పకుండా మోసం చేసాడనీ, తనకావిషయం ఆర్నెల్లకిందటనే తెలిసినప్పుడే తాను నిర్ణయం చేసుకొన్నానని కమలచెప్పింది. కమలకు భవిషత్తుప్రణాళిక ఉందని రూఢి అవుతుంది. పితృస్వామ్యం ఏర్పడే క్రమంలో స్త్రీలలైంగికతపై అదుపుకోసం వివాహపు తంతును కుటుంబసంస్కృతిగా రూపొందించింది. కానిఆచరణలో అసమనైతిక కుటుంబసంస్కృతినిపాటించి తన ఆధిక్యతను నిలుపుకోగలిగింది. కాని కమల పితృస్వామ్యం అసమనైతిక లైంగికసంస్కృతిని బట్టబయలు చేసిందని, పితృస్వామ్య కుటుంబ సంస్కృతిని తిరస్కరించటం జరిగిందంటే పురుషాధిక్య సంస్కృతికి పుట్టగతులు లేకుండాచేయటమేనని తెలుస్తుంది. కమల కుటుంబంలో భార్యాభర్తలసంబంధాలలో ఒక పెద్దపీడనగా ఉన్న

లైంగికహింసను నిరసించింది. ముఖ్యంగా పితృస్వామ్యం ఆధిక్యసంస్కృతికి కారణమైన స్త్రీలలైంగికతపై అదుపును నిర్వీర్యంచేయటం పితృస్వామ్య సంస్కృతికి ఎదురైన పెద్దసవాలుగా భావించాలి. ప్రజాస్వామ్యం ఏర్పడినా, వైవాహికలైంగికదాడికి స్పష్టమైన చట్టం యింకా రూపొందింపబడలేదని విజ్ఞులకు తెలిసిన విషయమే. గతశతాబ్దంలో రెండవతరం మహిళా సంస్కృతిలో పెనుమార్పులు చోటుచేసుకున్న అవగాహన ఏర్పడుతుంది.

చిన్నక్క కమలకు అత్తగారిలా తాను లోగడ కమలకు పెళ్ళిలో యిచ్చిన సొమ్ములను గురించి అడగగా సత్యంవాటికోసం వెంటాడేవాడని చెప్పింది. అక్కడున్నవాళ్ళు కమలకంత దూకుడు పనికి రాదంటారు .కాని కమల పట్టించుకోకుండా పిల్లను ముద్దుచేస్తూ ఆడిస్తూ తనకేమి పట్టనట్టుకూర్చొని ఉంది. అంటేకమల తనజీవితంమీద నిర్ణయం తానుచేసుకోగలదని, ఎవరేమన్నా తన నిర్ణయాన్ని మార్చుకోదలచుకోదని ఖరాఖండిగా పట్టించుకోదలచలేదని విశదమౌతుంది. ఇది. కమల ధృఢనిర్ణయానికి ఇది మచ్చుతునక. పిల్లకు నామకరణం చేయటానికి తాను ఒక్కతే కూర్చోవాలనుకొంది,గాని భర్తబతికుండగా కుటుంబసంస్కృతి ఒప్పుకోదని భావించి బుల్లితాతయ్య, బుల్లిమామ్మలచేత చేయించాలనుకొంది. సత్యంపక్కన పీటలమీద కూర్చోనని భల్లూకపు పట్టుపట్టింది. కమల కుటుంబంలోని కార్యక్రమాలప్పుడైనా సత్యం పక్కన కూర్చోదలచుకోలేదంటే సమాజసంస్కృతి కోసం కూడా ఆమె తన నిర్ణయం మార్చుకోదలచుకోలేదు. అంటే కమల పితృస్వామ్య ఆధిక్యసంస్కృతిని అన్నివిషయాల్లో నిరసించటం స్పష్టమౌతుంది. సత్యం చంద్రహారం కావాలని వచ్చాడని, దాన్ని అతడికి యిచ్చివేసినట్టు కమల చిన్నమ్మమ్మకు అదే కమల అత్తగారికి చెప్పగా, సత్యంతల్లికి కమలయింకా దెబ్బలాడి ఉంటే బాగుండేదనిపించింది. కాని కమల నిర్లక్ష్యంగా భర్త పీడవదిలించుకున్నట్లు చేయటంతో సిగ్గుపడింది. కమల తన పిల్లనుయింట్లోసూరమ్మ చూసుకోగలదనే భరోసాతో తాను చదువును కొనసాగించి ఉద్యోగంకూడా చెయ్యాలని నిర్ణయించుకొంది.

పిల్లకు పద్మావతి అని పేరు పెట్టుకుంది. మరి సూరమ్మపెంపకంలో మరొకపద్మం విరియాలిగా. భర్త అలా మోసం చేసినందుకు ఏడుస్తూ బతుకుతారని పితృస్వామ్యం అనుకొంటుంది. కాని కమల అలాఏడుస్తూ కూర్చోకుండా కర్తవ్యోన్ముఖురాలవటం పితృస్వామ్యం ఉన్నన్నాళ్ళు ఆడపిల్లలు గుర్తుపెట్టుకోవాల్సిన విషయం. స్త్రీపురుషసంబంధాలలో విప్లవాత్మక ఆలోచనలు చోటుచేసుకోవటమంటే స్వాతంత్ర్యానికి పూర్వమే, పితృస్వామ్యం బీటలు వారటం మొదలైంది. మహిళలకు పీడాకరంగా ఉన్న కుటుంబ సంస్కృతిని నిరసించటమే రెండవతరంలో చోటుచేసుకున్న సాంస్కృతిక పరిణామం. పద్దెనిమిదేళ్ళకే జీవితం మలుపుతిరిగిన కమల సూరమ్మతోసహా మూడోతరం పద్మతో జీవనం కొనసాగించటంజరుగుతుంది.

కొత్తనీరు చోటుచేసుకొంటున్నా పాతనీరు అంతరప్రవాహంగా ఉంటూనే ఉంటుందికదా. ఈ తరంలో ముఖ్యంగా స్త్రీపురుష సంబంధాలలో విప్లవాత్మక పరిణామం చోటుచేసుకున్నది. కుటుంబంలోని స్త్రీపురుషసంబంధాలను స్త్రీల మనోదృక్పథంనుండి చూసే ప్రయత్నం జరిగింది. ఇక్కడ పితృస్వామ్యపు వైవాహిక వ్యవస్థలోని స్త్రీపురుషసంబంధాలలో సాంస్కృతికపరిణామం ప్రారంభమయినది. ఈ తరంలో రజస్వలానంతర వివాహం, కుటుంబంలోని పురుషాధిక్యత, వివాహానంతరం మహిళావిద్య కుంటుపడిందని అర్థమౌతుంది. బహుభార్యాత్వంవల్ల స్త్రీపురుషసంబంధాలలోని అసమనైతిక సంస్కృతిని ప్రతిఘటించటం, మహిళల్లో వ్యక్తిత్వగౌరవ జీవనచైతన్యం అభివృద్ధిచెందటం, కుటుంబసంబంధాలలో స్త్రీ ఒంటరిగా బతకాలనుకోవటంతో పితృస్వామ్య సంస్కృతి బీటలువారటం మొదలయింది. ఈ విషయాలు స్వాతంత్ర్యానికి పూర్వమే వచ్చిన స్త్రీలసాహిత్యంలో ప్రతిఫలించినట్లు మహిళల జీవనవిధానంలో స్పష్టమయింది. ఆ సామాజికచరిత్రకు తగ్గట్టుగానే కమల నిర్ణయం తీసుకున్నట్లు తేటతెల్లం అవుతుంది.

* * * * *

5.3. మూడవతరం మహిళ -చదువు -వివాహం -
స్త్రీపురుష సంబంధాలు -మానవత

కమల పదవతరగతిలో చేరి స్కూలుకు వెడుతుంటే సూరమ్మ పద్మను సాకేది. తల్లిపాలు తాగటంవల్ల పద్మ కమలలాగా రాత్రిళ్లు ఏడ్చేదికాదు. రాత్రిపూట తనచిన్నతనంలో సూరమ్మ తనకోసం అన్నంమానేసిన విషయం గుర్తుకువచ్చి ఆ రోజునుండి సూరమ్మ రాత్రిళ్ళు అన్నంతినకపోతే తాను తిననని భీష్మించుకొంది కమల. పిల్లతల్లిఅయిన తరువాత కమలకు పెద్దరికం వచ్చింది. తన గురించి పట్టించుకొన్నందుకు సూరమ్మకు ఎక్కడలేని ఆనందం కలిగింది.ఇన్నాళ్లనుంచి తాను అందరి బాగోగులు చూసేదికాని తనగురించి పట్టించుకొనే వాళ్లు ఎవ్వరూ లేకపోవటమే దానికి కారణం. కమల మొండితనం తెలిసిన సూరమ్మ క్రమంగా రాత్రిపూట అన్నంతినటం అలవాటు చేసుకొంది. కమలమామగారైన చిన్నతాత మంచాన పడ్డప్పుడు కొడుకులు ఇల్లంతా దోచుకొనేసరికి చిన్నమ్మమ్మకు పశ్చాత్తాపం మొదలయింది. అందుకే కమల మగపిల్లలు కావాలని పడి ఏడవకూడదని అంది. సూరమ్మకు కమలవాదం నచ్చలేదు. ఎందుకంటే ఇంకా ఆమె దృష్టిలో వంశాంకురమైన మగపిల్లవాడి పుట్టుకకు విలువ ఉండటమే. పితృస్వామ్యసంస్కృతి పురుషాధిక్యతను నిలపటానికే మగపిల్లవాడి పుట్టుకకు విలువనివ్వటం జరిగిందని మొదటితరం నుండి జీవనాన్ని సాగిస్తున్న సూరమ్మకు తెలియలేదు. పితృస్వామ్య సంస్కృతిలో పుట్టిపెరిగి ఆ సంస్కృతినే తనలో జీర్ణింపచేసుకోవటంతో సూరమ్మకు కమల వాదం నచ్చలేదు. కాని కమలకు ఆడపిల్ల పుట్టుకవిలువ తెలుసు కాబట్టి అలా భావించింది. సూరమ్మ తనచిన్నబావ చనిపోయినప్పుడు కర్మకాండలు సరిగా జరగలేదని సూరమ్మ అసంతృప్తితో ఉన్నదంటే ఇన్ని అనుభవాలు ఎదురైనా సూరమ్మకు ఇంకా సంప్రదాయం, ఆచారాలసంస్కృతి మీద నమ్మకం సడలలేదని తెలుస్తుంది. చిన్నక్క నోచిననోములు ఏమయ్యాయి! ఆమె ఇటువంటి కొడుకులకోసమేనా

అంతా కూడపెట్టింది! అని సూరమ్మ బాధపడింది. తల్లిదండ్రులను పట్టించుకోని కొడుకులు భూమికి భారమని సూరమ్మ అనుకొంది. అంటే సూరమ్మ ఆలోచనలలో అప్పుడప్పుడు మార్పువచ్చినా పితృస్వామ్యసంస్కృతిని పాటించడమే తన జీవితాశయం చేసుకున్న సూరమ్మలో ఆమార్పు స్థిరంగా ఉండలేకపోయింది. కాని కమల కొడుకులకోసం ఆరాటపడకూడదని అనుకొంది. అనే కంటే సందర్భాన్ని బట్టి సమాజానికి రచయిత్రి హెచ్చరికచేసిందంటే బాగుంటుందేమో. కమలకు బయటి ప్రపంచంతో సంబంధాలుండటంచేత అన్ని విషయాలు మనస్సులో పెట్టుకొనేది కాని సూరమ్మకు గుట్టుగా ఉండటం తెలిసేదికాదు. బంధువులు కాలగర్భంలో కలుస్తుంటే సూరమ్మకు తనకు తెలిసిన ప్రపంచం కొద్దికొద్దిగా కొట్టుకుపోతోందనే స్ఫురణ కలుగుతుంది. కాలం వేగాన్ని సూరమ్మ అందుకో లేకపోయినా ఆర్థికంగా ఇబ్బంది ఉండేదికాదు.

రెండవ ప్రపంచయుద్ధం పూర్తయిన కొత్తరోజులలో పల్లెపల్లెల్లో స్త్రీవిద్యపట్ల నూతన అవగాహన ఏర్పడింది. నర్సులు, టీచర్ల ఉద్యోగాల అవసరం ఏర్పడింది. కమల టీచరుట్రైనింగ్ కూడ పూర్తిచేసి టీచరు ఉద్యోగాన్ని సంపాదించుకొని ఆర్థికంగా తన కాళ్ళమీద తాను నిలబడ గలిగింది. ఆనాటి సామాజిక, ఆర్థిక, రాజకీయపరిస్థితులకు అనుగుణంగా కమల తన జీవితాన్ని తీర్చిదిద్దుకోగలిగింది. అంటే కమల కాలానికంటె ముందునడవటం నేర్చుకున్నది. అంతేకాదు, స్వాతంత్ర్యోద్యమ సమయంలో పల్లెల్లోని స్త్రీలు ఖద్దరు తయారుచేసి ఆర్థికస్వావలంబనను పొందేదిశగా అడుగులు వేస్తే, పట్టణాలలో చదువుకొన్న స్త్రీలు టీచర్లుగా ఉద్యోగంచేసి ఆర్థికస్వేచ్ఛను పొందాలనుకొన్నారు.

అంతేకాక స్త్రీవిద్యాభివృద్ధికై బాలికాపాఠశాలలను నెలకొల్పటంతో టీచర్ల నియామకాలు ఎక్కువగా జరిగేవి. అందుకే కమలటీచరుట్రైనింగ్ పూర్తిచేసి ఉద్యోగాన్ని పొందింది. ఇది ఒకరకంగా పితృస్వామ్య ఆధిక్యసంస్కతి పునాదులను కదిలించటానికి వీలుకలిగించిన మార్గం.

ఒకరోజుకమల స్కూలునుండి వచ్చేసరికి యింటిముందు గదిగుమ్మందగ్గర సత్యం నిలబడి ఉండేసరికి కమలలో అలజడి, భయం, కోపం కలిగి పద్మ ఎక్కడుందోఅనే అభద్రతా భావం చోటుచేసుకుంది. సూరమ్మను పిలిచి అతడు యిక్కడ ఉండటానికి వీల్లేదంది. కమలలో సాధారణ మహిళలాగా చాలరోజుల తర్వాత భర్తను చూసిన సంతోషం, పాతివ్రత్యభావన కలగలేదు. అంటే స్థిరచిత్తంగల కమల పితృస్వామ్యపు మాయలో పడలేదు. అటువంటి పరిస్థితులలో మహిళకు కావాల్సింది ధైర్యమేనని స్పష్టమౌతుంది.

ఎందుకొచ్చావని సత్యాన్ని అడిగితే తనపిల్లకు జబ్బుగా ఉందనీ, తన అమ్మ నగలు యివ్వమని అడిగాడు. ఆ నగలను అమ్మమ్మ తనకు ఇచ్చిందంటే ఆ నగలు తనతండ్రి చేయించినవి కాబట్టి తనవి అన్నాడు. అంటే ఆనగలు ఆమె స్త్రీధనంకాదని వాటిమీద తనకు పితృస్వామ్యపు వారసత్వపు హక్కుఉందనీ, ఆ నగలు యిచ్చేంతవరకు కదలనని భైఠాయించి సత్యాగ్రహం చేస్తున్నానని కూర్చొన్నాడు. దేశస్వాతంత్రోద్యమంలో ప్రముఖపాత్రవహించే సత్యాగ్రహోద్యమాన్ని పితృస్వామ్యసంస్కృతి తనకు అనుకూలంగా కూడా వాడుకుందని విశదమౌతుంది. బుల్లితాతయ్యను యింటికివెళ్ళి పిలుచుకు రాగా, ఆయన ఆ నగలను అమ్మేసానని చెప్పగా సత్యం దానికి ధరకట్టి నగదు రూపంలో ఇవ్వమన్నాడు. సూరమ్మకు యింటిఅల్లుడైన సత్యం బయటకూర్చొని ఉంటే పరువుపోతుందని భావించి ఆ నగలను యిచ్చేయమని చెప్పింది. మొండివాడైన సత్యం వెళ్ళగానే సూరమ్మ అతడు మనిషికాదనీ, కన్నకూతురి మీదకూడా ప్రేమలేదనీ, సత్యం మనిషికన్నా హీనమని అనుకొంది.

సత్యం పరాయివాడయితే అతనిమీద కేసుపెట్టి ఉండేవాడినని అనుకొన్న బుల్లితాతయ్యలో అలా చేయలేనందుకు వెనకటి ధైర్యం, గాంభీర్యం సడలింది. ఆ నగలను సత్యానికి యిచ్చిన తరువాత సత్యంతో తనకున్న ఆఖరి సంబంధం తెగిపోయిందనుకొన్న కమలకు మాత్రం నెత్తిమీద భారం తగ్గినట్లుగా అనిపించింది, మనసు తేలిక అయింది. అప్పటికింకా విడాకుల చట్టంరాలేదుగా మరి. భర్తతో తెగతెంపులు చేసుకొన్న తరువాత కమలకు

హాయిగా అనిపించింది. సత్యంతల్లి వస్తే అత్తగారిలా కాకుండా అమ్మమ్మగా భావించి చూస్తానంటుంది. అంటే సత్యంతరపున ఉన్న పితృస్వామ్యపు అధికారసంబంధాలను కమల ఎంతమాత్రం కొనసాగించ దలచుకోలేదు.

కమల తన వృత్తిగత సంబంధాలలో కొనసాగాలనుకుంది. కమల పద్మను స్కూల్‌లో చేర్పించింది. బుల్లన్నయ్యభార్య చనిపోయినప్పుడు, అక్కడ తాను ఒక్కతే ఆ శవంపక్కన ఉన్నా సూరమ్మ భయపడకుండా ఆమె మీద గుడ్డ కప్పింది. అంటే జీవిత సంఘటనలలో గుండె రాయిగా మారిన సూరమ్మలో ఒక నిర్భీతిఏర్పడింది. బంధువర్గం ఒక్కొకరిగా చనిపోతుంటే సూరమ్మచుట్టూ ఉన్న ప్రపంచంలో జీవనసౌధాలు కూలిపోతున్నట్టు అనిపించింది. సూరమ్మ వాస్తవప్రపంచాన్ని తెలుసుకున్నకొద్దీ ఆమెలో వేదాంతం చోటుచేసుకొంది. పక్క వాటాలో భార్యాభర్తలు సరసాలాడుకుంటుంటే తన అన్నయింట్లో తాను ఉన్నప్పుడు దొడ్లోకూర్చొనే విషయం గుర్తుకువచ్చి తనలాగా కమల బాధపడుతుందేమోనని రాత్రిపూట ఆరోగ్యం బాగాలేని బుల్లన్నయ్య యింటికి వెళ్లకుండా, కమలకు తోడుగా ఉంటూ పద్మతో కబుర్లుచెప్పుతూ గడిపేది. అంటే ఇక్కడ సూరమ్మకు జీవితనష్టాలను అంచనా వేయటంతెలుసని, అన్నావదినలమీద ఈర్ష్యాఅసూయలు చెందేదికాదని వ్యక్తం అవుతుంది. పితృస్వామ్యసంస్కృతి ఆ రకంగా స్త్రీలను శత్రుపూరితసంబంధాలలోకి నెట్టి తన ఆధిక్యతను నిలబెట్టుకోగలిగే వితంతుసంస్కృతిని నిర్దేశించింది. అంటే సూరమ్మ వయసులో ఉన్నప్పుడు కలిగే సహజశారీరక వాంఛలను నియంత్రించుకొనేదని అర్థమయినకొద్దీ సూరమ్మలోని గొప్పతనం తెలుస్తుంది. ప్రకృతి వాతావరణం, మానవస్వభావాలను అంచనావేయగలిగింది. పితృస్వామ్యసంస్కృతి పరోక్షంగా చేస్తున్న లైంగికఅణచివేత స్పష్టమౌతుంది.

నవలయందలి ఇతివృత్తపు సూక్ష్మాతిసూక్ష్మ పరిశీలనలో అర్థమయ్యే విషయాలివి. కమల రేడియో కొనుక్కొచ్చినప్పుడు సూరమ్మ తన పుట్టింట్లో గ్రామ్ ఫోనుగురించి బుల్లన్నయ్య చెప్పిన కాలక్షేపమనే మాటలు సూరమ్మ చెపుతుంటే కమలకు నవ్వూ, విసుగు వచ్చేవి. ఆమె వంటయిల్లు, నోములు,

అన్నలు, అక్కల విషయాల ఆలోచనలలోనే మోక్షం వెదుక్కునేదనీ, సూరమ్మకు ఇవేవి అర్థంకావని కమల తాను మునుపు సూరమ్మను గురించి చేసిన ఆలోచనలు తప్పని గ్రహించింది. అందరూ ఒంటరి వాళ్ళేనని, మనిషి సంఘజీవి అవ్వాలని భావించే కమల అందరి మధ్య ఉంటూ కూడా తన ఆలోచనలతో సతమతమవుతూ ఉండేది. మనిషి వ్యక్తిగతంగా ఉన్నప్పుడే ఒంటరి అని కమల భావించేది.

సూరమ్మ గతకాలాన్ని గుర్తుతెచ్చుకోవటం ఒకరకంగా సూరమ్మలో వృద్ధాప్యపు ఛాయలు తొంగి చూస్తున్నాయని తేటతెల్లమవుతాయి. సూరమ్మ బుల్లన్నయ్యతో కలిసి తీర్థయాత్రలకు వెళ్ళాలనుకొంది. కాని అతడు రాననేసరికి సూరమ్మ మిన్నకుండిపోయింది. అప్పుడు కమల తీర్థయాత్రలు స్త్రీలను ఆకర్షించినంత తీవ్రంగా మగవాళ్ళను ఆకర్షించవు అని భావించింది. దానికి కారణంగా, పురుషులు గుళ్ళల్లో మనశ్శాంతిని వెదుక్కోరని భావించట మంటే పరోక్షంగా స్త్రీలు వెళ్ళటానికి అనుమతి ఉన్నచోటు గుడి ఒక్కటేఅని, కాబట్టి అక్కడికి వెళ్లి స్త్రీలు తమ సమస్యలను మొరపెట్టుకోవటం అలవాటయి ఉంటుందని తెలుస్తుంది.

ఆ తరం సాహితీవేత్త కనుపర్తి వరలక్ష్మమ్మకూడా తన రచనలలో భర్తలు భార్యలను గుడికి వెళ్లటానికి ఒప్పుకొనేవారుగాని స్త్రీసమాజాలకు రానిచ్చేవారు కాదంటుంది. గుళ్ళల్లో పితృస్వామ్య పరిరక్షణనీతులు వల్లిస్తుంటారు. కాని స్త్రీసమాజాలలో స్త్రీలసమస్యలపై చర్చలు జరుగుతాయని, వాటి ప్రభావంతో స్త్రీలు తమ
అణచివేతకు కారణాలను అన్వేషిస్తే తమకు పుట్టగతులుండవని భర్తలకు ఉండే భయమేనని విశదం అవుతుంది. దానికి తగ్గట్టు బుల్లన్నయ్య ముసలితనంలో మళ్ళీపెళ్ళిచేసుకోటం దాన్ని బలపరుస్తుంది. కొన్నాళ్లకు సూరమ్మ తన భర్తకు స్వర్గగతి కలిగించటానికి తర్పణాలను వదలటానికి ఒక్కతే తీర్థయాత్రలకు వెడుతుంది. సూరమ్మకు భర్తతో పుస్తెకట్టించుకొన్న సంబంధంమాత్రమే ఉన్నా కమల ఒప్పకోకపోయినా సూరమ్మ స్వయంపాకంతో అయినా అతనికి

తద్దినాలు పెట్టించటం జరిగేది. ఆ విషయంలో కమలకు సూరమ్మమీద కోపం, జాలి కలిగేవి. సూరమ్మకు హైందవసంప్రదాయాలు, కర్మకాండలపై నమ్మకం ఎక్కువగా ఉండేది. ఆ తరానికి చెందిన సూరమ్మను భూస్వామ్య పితృస్వామ్యసంస్కృతి అట్లా ఆలోచింపచేసిందనీ, ఆ సంస్కృతి సామాజిక కుటుంబాలలో ఎంతబలంగా పాదుకొన్నదో తెలిసేది. భర్తమరణానంతరం కూడా భార్యలు అతడ్ని మరచిపోవటానికి వీలులేకుండా ఇటువంటి కర్మలను పితృస్వామ్యం ఏర్పాటుచేసిందనే భావనకూడా కలగకమానదు. పితృస్వామ్యపు మర్రిఊడలను రచయిత్రి కథాసందర్భాన్ని పట్టి ఎప్పటికప్పుడు విశదపరచటం కనపడుతూనే ఉంటుంది.

కమల మితభాషి కాబట్టి మిగిలిన వాళ్ళుచెప్పేది వినేది. అదే జ్ఞాని లక్షణం. అందుకే కమల ప్రపంచంలో డబ్బుపట్ల స్త్రీపురుషులమధ్య ఆకర్షణ ఉంటుందని,కొన్ని వివాహేతరసంబంధాలుకూడా ఉంటాయని, మనిషి వీటిమధ్య ద్విపాదజంతువులా నడుస్తుంటాడని భావించింది. ఇక్కడ కమలజ్ఞానం మనుషులలోని జంతుతత్వాన్ని గ్రహించేట్టుచేసింది. కమలకు చిన్నప్పటినుండి సినిమాలు చూసే అలవాటు.ఆ రకంగా సమస్యలనుండి, ఒంటరితనంనుండి కమల ఉపశమనం కలిగించుకొనేది.

పద్మ మూడో క్లాసులోకి వచ్చింది. పద్మ బడికి వెళ్ళినప్పుడు సూరమ్మ పత్రికలు చదువుతూ, యిరుగుపొరుగువారితో మాట్లాడుతూ గడిపేదంటే సామాజికసంబంధాలను మెరుగు పరుచుకుందనుకోవాలి. పుస్తకాలు చదవటం మొదలు పెట్టినప్పటినుండి సూరమ్మ ఆలోచనలలో మార్పు వచ్చింది. బుల్లన్నయ్య తన భార్యపోతే దిగులుపడేవాడుకాదని, అదే స్త్రీ అయితే భర్తపోతే బాధపడుతుందని, చిక్కిశల్యమౌతుందనీ, భార్యపోయిన మగవాడుకూడా గుండుతో బతకాలని సూరమ్మ అనుకోనేది.

సూరమ్మకు కొవ్వలి నవలలునచ్చక వాటిని పారవేసేది. కమలకు చలం నవలలంటే యిష్టం. దీన్నిబట్టి కమలకుఉన్న స్త్రీస్వేచ్ఛకు సంబంధించిన భావాలను తెలియచేయటంతో కమలవ్యక్తిత్వం విశదమౌతుంది. బుల్లన్నయ్య

పదిహేడేళ్ల చిన్నపిల్లను పెళ్లిచేసుకొనివచ్చి కమలను దిష్టి తీయమంటాడు. అంటే భార్యపోయిన మగవాడికి కూడా భర్తపోయిన సూరమ్మలాంటి వాళ్లు దిష్టితీయటానికి అర్హతలేదంటే పితృస్వామ్యపు వివక్షాసంస్కృతి స్వరూపం స్పష్టమౌతుంది.

ఆ సంఘటనతో కమల, సూరమ్మ నిశ్చేష్టితులయ్యారు. కమలకు ఆపిల్లమీద జాలివేసింది. ఇప్పుడు కమలకు తాతయ్యమీదకూడా ఒకప్పుడు సత్యాన్నిచూస్తే కలిగే జుగుప్స,కోపం కలిగాయి. పితృస్వామ్యసమాజంలో పురుషజాతి అంతా ఒకేతీరున ఉంటారని కమలకు అవగతమయింది. సూరమ్మ ఏడుస్తుంటే ఆమె ఏడవటమెందుకని మగవాడిపెళ్లికి వయసుతో సంబంధం ఉండదని చెప్పింది. బుట్టలో వేసుకొని ఈ పిల్లతన అన్నను చేసుకుందని ఆ పిల్లమీద సూరమ్మకు కోపం వస్తుంటే డబ్బుకోసం ముసలాడిని పెళ్లిచేసుకొన్న ఆ చిన్నపిల్లమీద జాలి చూపించమంటుంది కమల. మొగుడితో ఒక్కరోజుకూడా సుఖం అనుభవించని తన తల్లి, చిన్నప్పటినుండే వైధవ్యపు గుండును అనుభవిస్తున్న తల్లి, పద్దెనిమిదేళ్ళ పిల్లమీద జాలి పడలేదని అనుకొంది. ఆడవాళ్ళకు స్త్రీలపట్ల జాలి ఉండదనీ, మగవాళ్ళకయితే జాలి,దయకూడా ఉండదని చెప్పి సమాజాన్ని ఎలా అర్థంచేసుకోవాలో తెలిసేటట్లుచేసింది. కాటికిపోయేవాడు పెళ్లిపీటలను ఎక్కితే ఈసమాజం ఆమోదిస్తుందిగాని తనలాంటి వాళ్ళు ఉద్యోగంచేసుకొని బతుకుతుంటే హర్షించదనీ, ముసలివాడితో మనసు చంపుకొని కాపురంచేయాల్సి ఉంటుందని ఆ చిన్నపిల్లను గురించి కమల భావించింది. కాని తమలాంటి వాళ్లు వ్యక్తిత్వాన్ని, స్వతంత్రతను నిలబెట్టుకుంటే మాత్రం ఈ సమాజం భరించలేదనుకొంది. ఆడవాళ్ళంతా మూగజీవుల్లాపడి ఉంటున్నారని గ్రహించింది.

ఇక్కడ కమల భావనలో పితృస్వామ్యసంస్కృతికి బలిఅవుతున్న స్త్రీలను అర్థంచేసుకొనే ప్రయత్నం జరిగింది. అంతేకాక పితృస్వామ్యకుటుంబంలోని అసమనైతికసంస్కృతి అర్థమౌతుంది. సూరమ్మ చిన్నక్క కొడుకులు సరిగా

చూసుకోక పోయేసరికి సూరమ్మయింటికి వచ్చింది. బుల్లన్నయ్య పెళ్ళిచేసుకొన్నందుకు ఇద్దరక్కలు కావలించుకొని ఏడ్చారు. ఆపిల్లవైపువాళ్ళు కసాయివాళ్ళని తిడుతోందిగాని అమ్మమ్మ (కమల అత్తగారుకూడా), తన తమ్ముడిని తిట్టనందుకు కమలకు కోపంవచ్చింది. ఆడబడుచుల హోదాలో ఆ అమ్మాయిని సూటీపోటి మాటలంటుండేవారు. అంటే ఆమె మొగుడివైపు బంధువర్గంగా పితృస్వామ్యపు అధికారసంబంధాలలో భాగంగా అలా అనేవారు. అందుకే ఆ అమ్మాయికూడా వాళ్ళ ఆడబడుచు హక్కులను ప్రశ్నకు పెట్టేది. కాని కమలమాత్రం ఆ అమ్మాయిని బాగా చూసుకోవాల్సిందే అనేది. కమల అప్పచెళ్ళెళ్ళమాటలను ఖండిస్తుంటే కమలకు ఉద్యోగం చేస్తున్నాననే గర్వం ఉందనేవాళ్లు. తన కొడుకు అప్రయోజకుడైనా కోడలు ఉద్యోగం చేయటం ప్రకృతి విరుద్ధమనేది. పితృస్వామ్యసంస్కృతి పనివిభజనలో భాగంగా బయటపని పురుషులకు, యింట్లోపని స్త్రీలకు నిర్దేశించి, అది స్త్రీపురుషులశారీరక ప్రకృతిధర్మంగా జరిగిందని ప్రచారంచేసేది. అందుకే స్త్రీపోషింపబడే స్థానానికి పరిమితమయింది. ఇప్పుడు కమల పురుషునివలె పోషించే స్థితిలో ఉండటంతో చిన్నక్కదృష్టిలో స్త్రీ ఉద్యోగం చేయటం ప్రకృతి విరుద్ధం.ఆ చిన్నపిల్లకు వంటరాదని సూరమ్మ చేస్తుంటే, తాతయ్యపెళ్ళి సూరమ్మకు కష్టాలలు తెచ్చిపెట్టిందని కమల బాధపడేది. సూరమ్మ ఆ పిల్లను అనుమానపు దృష్టితో చూసేది. ఒకరోజు నగలపెట్టెతోసహా బుల్లన్నయ్య రెండోభార్యసుభద్ర ఉడాయించింది. సూరమ్మను ఓదారుస్తున్న కమల పాతనగలు అచ్చిరావని అంది.

భార్యలేచిపోయిందనే అవమానాన్ని తట్టుకోలేని బుల్లన్నయ్య మానసికవ్యధతో చచ్చిపోయాడు. కాని అందరూ నిద్రలోనే పోయాడు అదృష్టవంతుడని అంటే, కమలమాత్రం ఆయన అవమానపుబాధను సమాజం పట్టించుకోనందుకు బాధపడి చట్టిపోయాడని అనుకొంది. ఆతని అవమానానికి కారణం ఆతడు స్త్రీ లైంగికతపై అదుపును నిర్వహించటంలో తనని సమాజం అసమర్థుడికింద భావిస్తుందని ఆతని బాధ. ఇక్కడ

పితృస్వామ్య కుటుంబలోని అసమనైతికసంస్కృతిని సుభద్ర వ్యతిరేకించి కుటుంబాన్ని దాటటం పితృస్వామ్య ఆధిక్యసంస్కృతికి తూట్లుపడటమే. బుల్లితాతయ్యకర్మకాండల తరువాత బతికున్నప్పుడు ఏనాడూ చూడకపోయినా ఆతని ఆస్తికి తామంటే తాము వారసులమని అందరూ ముందుకొచ్చారు. అయితే బుల్లితాతయ్యకు పిల్లలులేనందున ఆస్తి ఆయన మొదటిభార్యయైన పద్మావతిపేరున ఉండటంలో ఆమె పుట్టింటితరపువారికి వస్తుందని ప్లీడరు చెప్పాడు. తాతయ్య అది స్త్రీధనమని తనపేరుమీద మార్పించుకోలేదని కమల అర్థంచేసుకొంది.

సత్యం తన అమ్మ యిక్కడ ఉందని యింటికి వస్తాడేమో పద్మను లాక్కుంటాడేమో అనే భయం కమలకు ఉండేది. అయితే సత్యం అప్పుడప్పుడు వచ్చి వాకిట్లో నిలబడి తల్లితో మాట్లాడి వెళ్ళేవాడు. కాని యింట్లోకి వచ్చే సాహసం చేయలేకపోయాడు. కమలకూడా పాతివ్రత్యాన్ని పట్టుకొని పాకులాడకుండా భర్తయింట్లోకి రాకూడదనే అనుకొనేది. చుట్టుపక్కల గ్రామాలలోని ఆడపిల్లలు ఉన్నత ప్రాథమికవిద్యాసంస్థను కళాశాలగా అభివృద్ధిపరిచేసరికి, దానిలో అభ్యసించటానికి వచ్చి వసతులు లేక యిబ్బంది పడుతున్న ఆడపిల్లలకోసం తాతయ్య యిచ్చిన డబ్బుతో డాబామీద రెండుగదులు కట్టి అద్దెకు యివ్వాలనుకొంది. సూరమ్మ ఆడబ్బు పద్మ చదువు కోసం తాతయ్య అట్టిపెట్టాడన్నా కమల వినలేదు. ఏ డబ్బు ఎలా వినియోగించాలో తనకు తెలుసని కమల అంటుంది. తనకూతురు అవసరంకోసం యిప్పటి ఆడపిల్లల చదువు కుంటుపడటం యిష్టంలేని కమల ఆడబ్బుతో గదులను కట్టించి అద్దెకు యిచ్చింది. ఈ విషయంలో చిన్నమ్మమ్మకు కోపం వచ్చి సూరమ్మను ఎగదోస్తుంటే కమల తన డబ్బు తన కూతురు, తనయిల్లు, తన యిష్టం వచ్చినట్లు చేస్తానని అంటుంది.అంటే కమల ఆర్థికస్వేచ్ఛను అనుభవించాలని అనుకోవటం, తననిర్ణయంమీద తాను సాధికారికత కలిగి ఉండాలనుకోవటం స్పష్టమౌతుంది. ఆ అత్త తన మాటను కమల గౌరవించనందుకు అవమానపడి తాను పద్మమీద ప్రేమతో అలా

అంటున్నట్లు చెప్పగా ఆమె కొడుకులు ఆమెను పట్టించుకోకపోవటాన్ని గుర్తుచేస్తూ ఖరాఖండిగా మాట్లాడేసరికి ఏడుస్తున్న చిన్నక్కతో సూరమ్మ తమ రోజులు అయిపోయాయని కృష్ణా, రామా, అనుకుంటూ బతకవలసిందేనని చెప్పి ఓదారుస్తుంది. స్వార్థంకంటెకూడా ఆడపిల్లలచదువు అభివృద్ధి చెందుతుందనే కమల ఆలోచనకు నీరాజనాలు పట్టాల్సిందే.

కమల అరుస్తుందికాని ముసలివాళ్ళిద్దరికి మందులు,సైనుపంచెలు, పటికబెల్లం తెచ్చియిచ్చి కావలసిన వంటలు చేసుకు తినమని చెబుతుంది. ఆరకంగా వాళ్ళకు స్వేచ్ఛగా బతికే అవకాశాలను కలిగిస్తుంది. ఆ అత్తకు కొడుకుపిచ్చి తగ్గకపోగా, కొడుకుకూతురైన మనవరాలుంది కాబట్టి తనకు ఆ యింట్లో హక్కులున్నాయను కుంటుంది. పైగా తానిక్కడుంటే కొడుకును అప్పుడప్పుడన్నా చూసుకొనే అవకాశం ఉంటుందనుకొంది. పురుషాధిక్య సమాజంలో వయసువచ్చిన కొడుకులతో తల్లులు మాట్లాడాలంటే భయంగా ఉంటుంది. కాని కొడుకు వచ్చి ఆ యింట్లోనే ఉంటే తనకు గౌరవం ఉంటుందనే భావన ఆమెది. సత్యం ఇంటికి వస్తే ఒక మగనలుసుకూడా పుట్టే వీలుంటుందని ఆలోచించేది. అయితే సత్యాన్ని లోపలకు పిలిచే ధైర్యం ఆమెకులేదు. సత్యంకూడా కూతురుపద్మవైపు చూడనందుకు కొడుకు మనిషికాదని జంతువని అమ్మమ్మకూడా నిర్ధారణకు వస్తుంది. గదులను అద్దెకు ఇవ్వటంతో ఆదాయం పెరిగేసరికి ముసలమ్మలిద్దరూ కమల తెలివితేటలను మెచ్చుకుంటారు. కాని ఇల్లుకట్టిస్తున్నప్పుడు కమల సూపర్ వైజర్ తో మాట్లాడుతుంటే అనుమానదృష్టితో నిఘాపెట్టేవారు. ఒకరోజు బయటపడి మాట్లాడితే కమల తాను తప్పుచేయదలచుకుంటే బయటికెళ్ళినప్పుడు తనకు అవకాశాలుంటాయని, సత్యంలాగా దొంగచాటు పెళ్ళిచేసుకోనని చెప్పేసరికి అమ్మమ్మ గుండెలు బాదుకుంటుంది. ఎందుకంటే అది తరతరాలుగా స్త్రీలలైంగికతపై ఉన్న అదుపును కమల నిరసించిందంటే పితృస్వామ్యపు గోడలను బద్దలు కొట్టినట్టు అమ్మమ్మ భావించటమే.

తాను అలా మాట్లాడినందుకు కమలకు మళ్ళీ ముసలాళ్ళమీద జాలి వేసింది. ఇక్కడ కమల తాను మగవాళ్ళతో మహిళలు మాట్లాడితే తప్పుపట్టకూడదనే భావనను వ్యక్తపరుస్తుంది. కాని పితృస్వామ్యంలో కోడలిప్రవర్తనమీద నిరంతరం నిఘాఉండే అధికారాన్ని భర్తతరపు ఆడవాళ్ళకు పితృస్వామ్యం ఏర్పాటు చేసిన దానిని అమ్మమ్మ వినియోగించుకోవటమే. అప్పటికీ స్త్రీని అనుమానిస్తే ఆమె ఎన్ని కష్టాలుపడుతుందో తెలుస్తుందని సంపూర్ణరామాయణం సినిమాకు తీసుకొని వెడితే ముసలాళ్ళిద్దరు ఎన్.టి.రామారావుని దారిపొడుగునా సాక్షాత్తు శ్రీరామచంద్రుడని పొగిడారు. వీళ్ళిద్దరిని భరిస్తున్న కమలమీద చుట్టుపక్కల వాళ్లకు జాలికలిగేది.

ఉద్యోగంలో చనువు తీసుకోవాలనుకొన్న మగవాళ్ళవిషయంలో వాళ్లను దూరంపెట్టటం ఎలాగో కమలకు తెలుసు. అటువంటి మగవాళ్ళల్లో సత్యంలాంటి మృగం కనపడేది. అలాంటి వాళ్ళను కమల విదిల్చి కొట్టేది. అంటే ఆడవాళ్లను వాడుకోవాలనిచూసే మగవాళ్ళ మనస్తత్వంలో ఉండే పితృస్వామ్యపు లైంగికసంస్కృతిలోని మృగస్వభావాన్ని గుర్తిస్తూ ఆడపిల్లలు చేయాల్సినపనిని అన్యాపదేశంగా కమలపాత్రద్వారా రచయిత్రి తెలియజేసింది.

పద్మ స్కూల్ ఫైనల్ (11వ తరగతి) పాసయిన రోజు అందరిని పిలిచి పార్టీ యిచ్చింది. పద్మ తండ్రిని తలచుకుంది. మూడోరోజు సత్యం పద్మను అభినందిస్తూ ఉత్తరం రాసేసరికి సత్యానికి హృదయముందా అని ఆశ్చర్యపోతుంది కమల. కొన్నాళ్ళకు ముసలమ్మలిద్దరు తీర్థయాత్రలకు వెడతారు. వాళ్ళు తిరిగివచ్చేసరికి పద్మ జుట్టుకత్తిరించుకొని పోనిటైలును, ఆమె వేసుకొన్న పంజాబిడ్రస్సును చూసి గుండెలు బాదుకొంటే కమలమాత్రం కూతురి యిష్టాన్ని వద్దనదలచుకోలేదు. కూతురుకు తన శరీరంమీద, తన యిష్టాఇష్టాలమీద ఆమెకు స్వేచ్ఛ ఉండాలని భావించింది. అలాగని కమలకు కూతురు చదువులో వెనకబడితే మాత్రం ఊరుకోనంటుంది. పితృస్వామ్యం నిర్దేశించిన కట్టుబొట్టును నిరసించటమేకాక, నూతనమార్పును అంగీకరించే కమల మనస్తత్వం కూడా అర్థమౌతుంది. అలాగని కమలకు సంప్రదాయం

మీద రోతకూడా లేదు.ఆడపిల్లలు స్వేచ్ఛగా ఉండకూడదనే భావన ముసలమ్మలదైతే, ఆడామగా సమానమనే జ్ఞానం కమలది. ఆడవాళ్ళ స్వతంత్రాన్ని గుర్తించాలంటుంది. ముసలాళ్ళిద్దరు తమ జీవితాలు సంప్రదాయంలో చీకిచితికిపోయినా, గుండుగీయించినా సంప్రదాయమే గొప్పదనే భావన వాళ్ళకు ఉండేది. కమల సూరమ్మలాగా పరిస్థితులతో రాజీపడదలచుకోలేదు. తన యిష్టాఇష్టాలను చంపుకోదలచుకోలేదు. అందుకనే ఇప్పుడు పద్మ విషయంలో సంప్రదాయం, కుటుంబగౌరవం, పరువు ప్రతిష్ఠ అని కమల పద్మను వెనక్కి లాగదలచుకోదు. అవి స్త్రీలకేకాదు, మగవాళ్ళకు కూడా కుటుంబగౌరవం ఉండాలికదా అని అనుకొంది. పరువుప్రతిష్ఠలను కాలరాసి కేవలం స్త్రీలనుమాత్రమే భద్రంగా కాపాడమనే వెనకటి తరం భరించినా ప్రస్తుతం, రాబోవుతరాలు తమకేది యిష్టమైతే అదే చేసితీరుతారని కమల అనుకొంది. పితృస్వామ్యం తన ఆధిక్యతకోసమే ఆ బాధ్యతను స్త్రీలపై పెట్టిందనే అవగాహన ఏర్పడుతుంది. ముఖ్యంగా యిప్పటి తరంవాళ్ళు ఆలోచించాల్సిన విషయంమిది. రాత్రిపూట అమ్మమ్మ నిద్రపోకుండా కొడుకు తిన్నాడోలేదో అని బాధపడుతుంటే తనకున్న అనుభవాలతో అర్థంచేసుకొన్న కమలకు ఆమెమీద జాలికలిగేది. సత్యానికి ఉద్యోగం దొరికే అవకాశం లేదని అమ్మమ్మ అనుకొనేది. ఆర్థికబాధ తట్టుకోలేక మతంమార్చుకొని భార్య మిషనరిలో చేరగా మూడురోజులనుండి పస్తు ఉన్న సత్యానికి తిండికోసం అమ్మమ్మ కమలను డబ్బు అడిగింది. పితృస్వామ్యసంస్కృతి ఎంతగా తలకిందులయిందో అర్థమౌతుంది. అన్నలు సత్యానికి ఏమీపెట్టరని అతనిదగ్గర అమ్ముకోవటానికి తల్లిమాత్రం మిగిలి ఉందనే మాటలకు జాలివేసింది. నిస్సహాయురాలైన తల్లి కడుపుతీపి ఆమెను నిలవనీయటంలేదని గ్రహించింది. అమ్మమ్మ తాను కమలగొంతు కోసానని అందుకే మిగిలిన కొడుకులవలెకాక వీడి బతుకు యిలా అయిందని, తిండిలేక కొడుకు ఆకలితో అలమటిస్తున్నాడని, దానికంటే కొడుకు చస్తే బాగుండును అని, తాను గారాబంచేసి పాడుచేసానని, అలాంటి కొడుకు పగవాళ్ళకుకూడా

వద్దని, తానుకూడా కమలలాగా నిక్కచ్చిలా ఉంటే వాడు బాగుపడేవాడని అంది. అమ్మమ్మలోని పశ్చాత్తాపాన్ని గ్రహించిన కమల శత్రువుకైనా ఆకలివేసినప్పుడు అన్నంపెట్టే ధర్మాన్ని న్యాయాన్ని తలచుకొని తన మొగుడిలాకాకుడా తనతల్లికి తమ్ముడిగా సత్యానికి అన్నం పెట్టమంటుంది. మగవాళ్ళ అధికారంమీద కమలకు కోపంఉందిగాని సంప్రదాయాలలోని మానవత్వంమీద గౌరవం ఉందని అర్థమౌతుంది. కాని అతని నీడ కూతురుమీద పడుతుందేమోఅనే భయం కమలకు కలిగింది.

కమల యింట్లో లేనప్పుడు సత్యం ధైర్యంగా వచ్చి అన్నంతినేవాడు. తల్లి చూపిన మానవత్వానికి పద్మ సంతోషపడింది. సత్యం పద్మ అడిగితే బయటపనుల్లో సాయంచేసేవాడు. అతనంతట అతను పద్మకు దగ్గరవటం లేదని కమల గుర్తించింది. పద్మ బి.ఏ. రెండవసంవత్సరంలోకి వచ్చేసరికి సూరమ్మ పద్మకు పెళ్ళిచేయమంటే పద్మ చదువుకోవాలని మనమరాలు యూనివర్సిటి చదువు చదివి ప్రిన్సిపాలు కావాలని అమ్మమ్మ అంది. కమల తనను ఆనాడు చదువుకోవద్దన్న అమ్మమ్మలోని మార్పుకు ఆశ్చర్యపోతుంది. పద్మ డిగ్రీ ఫస్టున పాసయింది. పద్మను యూనివర్సిటి చదువు చదివించాలిసిందేనని అమ్మమ్మ పట్టుపట్టింది. ఆఅమ్మమ్మ ఆడపిల్లచదువు విలువ తెలిసుకొని ముందునుండి ప్రణాళికవేసిందంటే ఆమెఎంతో ఎత్తుకు ఎదిగిందని కమల అనుకొంది. సూరమ్మ మాత్రం పద్మకు పెళ్ళిచేయాలంటే కమలకు నవ్వు వచ్చింది. దానికి సూరమ్మ చిన్నప్పటినుండి భయంతో పెరగటంచేత అలా అంటోందని అన్నది. నిజమే స్త్రీలు సామాన్యంగానే అదుపాజ్ఞలలో పెంచబడతారు. బాల వితంతువుగా సూరమ్మ మరింత భయంగా అందరికి అణిగి మణిగిభయంతో బతికింది కాబట్టి సూరమ్మకు సామాజికసంబంధాలు లేక, ఇల్లే వైకుంఠమని అనుకోవటంచేతనే లోకంలోని మార్పును తెలుసుకోలేకపోయిందని అంటుంది. కమల చదువుకోవటంచేతనే తామీనాడు బ్రతకగలుగుతున్నామని భావించి చదువు విలువను సూరమ్మ గ్రహించలేక పోయినందుకు అమ్మమ్మ బాధపడుతుంది.

పితృస్వామ్యపు సంస్కృతిని ఆచరిస్తూ ఆ సంస్కృతిక చట్రం నుండి సూరమ్మ ఇంకా బయటకు రాలేదని అమ్మమ్మ సూరమ్మను బాగా అర్థంచేసుకొందని కమల భావించింది. కాని కమలమాత్రం సూరమ్మకు తనసరదాలు తీరకపోయేసరికి తన మనమరాలి విషయంలో తీర్చుకోవాలనుకుంటోదని, పెళ్ళితోనే స్త్రీజీవితానికి పరిపూర్ణత ఉంటుందని సూరమ్మ అనుకుంటోందని కమల భావించింది. మానవమనస్తత్వాలను వాళ్ళ పరిస్థితుల నుండి అవగాహన చేసుకొంటే మనుష్యుల అజ్ఞానానికి కారణాలు తెలుస్తాయి. స్త్రీలు మారుతున్నారనివారి ఆశయాలు శిఖరాలనంటుతున్నాయని సూరమ్మకు తెలీదని, అమ్మమ్మ బొంబాయిలాంటి ప్రాంతాలకు వెళ్లి రావటంచేత ఆమెకు చదువు విలువతెలిసి వచ్చిందని భావించింది. అమ్మమ్మ మారుతున్న సమాజాన్ని చూడటం చేతనే పద్మ పెళ్ళివిషయంలో ఆమెకు ఒక అవగాహన ఏర్పడిందని కమల అనుకొంది.

కమల ఇంట్లోకి గ్యాసుపొయ్యి కొనుక్కువచ్చి జాగ్రత్తగా వాడమంది. సూరమ్మకు దాన్ని వాడాలంటే భయం. పద్మ బాబ్ చేయించుకోవటం, స్లీవ్ లెస్ బ్లౌజులు వేసుకోవటం సూరమ్మకు నచ్చేదికాదు. సత్యం బయటికి వెళ్ళి కాస్త సంపాదించుకుంటున్నాడని తెలిసినా ఎంత ఏమిటి ఎక్కడ అని కమల అడగలేదు. పద్మకు చుడీదార్ కొనుక్కొని వచ్చాడు. ఆ తండ్రికూతుళ్ళ బాంధవ్యం కమలకు తమాషాగా ఉండేది. పద్మ తనతండ్రికి ఎక్కువ చనువివ్వక పోయినా ఇద్దరు స్నేహితుల్లాగా ఉండేవారు. ఎక్కడో కమలకు గుర్రుగా ఉండేది. పద్మ పుట్టినప్పటినుండి ఆడవాళ్ళమధ్యన పెరగటంతో ఆ వాతావరణంమీద విసుగొచ్చి ఇమోషనల్ అవుతారా అని ఆలోచించేది. సాటి స్త్రీమనస్తత్వాన్ని అంచనా వేస్తోంది. సత్యం పద్మకు యూనివర్సిటినుండి అప్లికేషన్ తెప్పించి పూర్తిచేయించి పోస్టులో వేసివచ్చాడు. అవన్నీ మగపనులా అని, పనులలో ఆడపనులని మగపనులని వేరుగా ఉన్నాయా అని కమల ఆలోచించేది. మెల్లగా సత్యం ఇంట్లోకి వచ్చి ముందుగదిలోకి వచ్చి పడుకోవటం మొదలుపెట్టాడు. ఆ విషయాన్ని పట్టించుకోవటంకంటె పద్మ

యూనివర్సిటి చదువుకు డబ్బును ఎలాసర్దాలా అని కమలకు ముందున్న సమస్య. సూరమ్మ ఎవరింట్లో పురుడు వచ్చినా ఆమె ఆధ్వర్యంలోనే జరిపించేది. పురిటి నీళ్ళవరకు అన్ని దగ్గర ఉండి చూసి పురిటిల్లుకూడా కడిగించి వచ్చేది.సూరమ్మ తన పుట్టింటివాళ్ళకేకాక చాకిరివిషయంలోగాని మాటసాయంలోగాని ఇరుగుపొరుగువారి అవసరాలనుకూడా తీర్చేదని అర్థమౌతుంది. సూరమ్మలో ఉండేపరోపకారబుద్ధి, మానవత్వం అర్థమౌతుంది. అంతగా ఆసుపత్రిసౌకర్యాలు లేని రోజుల్లో సూరమ్మలాంటి వాళ్లు ఉండబట్టే మానవాభివృద్ధి జరిగిందనిపిస్తుంది. అమ్మమ్మ అలావెళ్లేదికాదట. అప్పచెళ్ళెల్ల విషయంలోఉన్న వైవిధ్యాన్నిచూసి కమల ఏకత్వంలో భిన్నత్వం అనుకొనేది. కమల సూరమ్మను ఆలాంటిపనులకు వెళ్ళద్దని అంటుంది. ఆమె దృష్టిలో జంతువులు పిల్లల్నికంటాయి కాబట్టి అదేదో ఘనకార్యం కింద చూడక్కరలేదని అంటుంది.

అమ్మమ్మ, సత్యంల దగ్గర కూడా డబ్బులేదని, తన నగలను తాకట్టు పెట్టాలనుకొన్నా ఎలాచేయాలో తెలియని కమల అయోమయస్థితిలో ఉంది. ఒకనాడు సూరమ్మలేని సమయంచూసి అమ్మమ్మ తాను పద్మచదువుకోసం పద్మచిన్నప్పుడే కమలతల్లి నగలు అమ్మి ఆడబ్బుతో ఇన్సూరెన్సుచేసిన విషయం చెప్పి, ఆ పాలసి గడువు తీరిందని డబ్బునుతెచ్చుకోమని అంది. పిల్లబాధ్యత నెత్తిమీద పడుతుందేమోననే భయంతో కమలతండ్రి ఆ నగలను అడగలేదని చెప్పింది. ఇన్సూరెన్సు కాగితాలు సత్యం కళ్ళపడకుండా తన దిండులో దాచిపెట్టానని అంటుంది. కమలకు తన అమ్మమ్మ అర్థమయింది. తాను అమ్మమ్మను గతంలో విదిల్చికొట్టి అవమానపరచిన విషయం గుర్తుకువచ్చి కమలకు సిగ్గుతో కన్నీళ్ళువచ్చాయి. అమ్మమ్మ పట్టుదల దృఢసంకల్పం ఎంతమందికి ఉంటుందనుకొంది. పద్మ విశాఖపట్నం వెళ్ళియూనివర్సిటిలో చేరింది. ముసలివాళ్ళిద్దరు పిండివంటలుచేసుకొని తింటుంటే కమలకు వాళ్లకు మందులు తీసుకు రావటంతో సరిపోయేది. వాళ్లను తినవద్దంటే తమ డబ్బు తమ యిష్టం అనేవాళ్ళు. వాళ్లను కమల చిన్నపిల్లలాగా చూసేది. సూరమ్మకు

జ్వరంవస్తే కమల రాత్రిపూట వంటచేసేది. ఆ పరిస్థితినుండి తన మనసు ఉపశాంతి కలగటానికి సినిమాకు వెళ్ళేదని అర్థమౌతుంది. కమల సినిమాకు వెడితే సూరమ్మకు కోపం వచ్చేదట. పద్మ యింటికి వచ్చినప్పుడు స్కర్టు ఫ్యాంటువేసుకున్నా వంకపెట్టేధైర్యంలేక సూరమ్మ ఏమి అనేదికాదు. అంటే సూరమ్మ మెల్లమెల్లగా పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోవటం నేర్చుకొందని అర్థమౌతుంది. పద్మనడకలో ఆత్మవిశ్వాసం ఉట్టిపడేది. ఆ తరం ముసలమ్మలకు పద్మకు మధ్యన పల్చటి తెర ఉన్నట్టుందని, ఇవి కొత్తగా దిగిన తెరలని కమల అనుకొంది. ఈ తరం అమ్మాయికి ప్రతినిధిగా పద్మ ఎదిగినట్లు తెలుస్తుంది. అమ్మమ్మ తాను కమలయెడల చేసిన ద్రోహాన్ని తలచుకొని తనను క్షమించమని ఆమె చనిపోయే నాలుగురోజులముందు కమలను అడిగింది.

అమ్మమ్మ అనారోగ్యంతో మంచమెక్కినప్పుడు కమల స్కూల్ కెళ్ళి పాఠాలు చెప్పాలని, అప్పుడు నిద్ర వస్తే కష్టమవుతుందంటూ రాత్రిళ్ళు సత్యం సేవచేసేవాడు. కమల సత్యం తనని ఆ నాడు అర్థం చేసుకోలేదుకాని ఈ రోజు తనమీద ఎందుకు సానుభూతి చూపిస్తున్నాడని అనుకొంటూ సత్యం తనకు అర్థంకావటం లేదనుకొంది. ఒకప్పుడు సత్యం మనిషికాదని, జంతువని భావించింది. కాని కష్టాలు సత్యం హృదయాన్ని తట్టిలేపాయి అని అనుకొంది. మారటానికి బహుశ అతడు జీవించటానికి ఉన్న అన్నిదారులు మూసుకుపోవటంతో సత్యంలో వివేకం వచ్చిందని కమల భావించింది. సూరమ్మకు జ్వరంవచ్చింది. ముసలాళ్ళిద్దరు తన పాలిటి గుదిబండలయ్యారని అనుకొంది కమల. ఆరోగ్యం క్షీణిస్తున్న అమ్మమ్మతో పద్మను పిలిపిస్తానంటే చదువు పాడౌతుందని ఆమె వద్దనేది. ఆవిడకోసం సూరమ్మ ఏడుస్తుంటే కమల తల్లిని విసుక్కున్నందుకు, సూరమ్మకు సత్యం సంగతి తెలిసికూడా కమలకు మొగుడు, సంసారం తెలియదనేది. కమల పైకిమాత్రం సూరమ్మలో ధైర్యాన్ని నింపేది. అమ్మమ్మ ముందుగదిలో కూర్చుంటే సత్యం భయపడేవాడు. అలాంటి అమ్మమ్మ చనిపోతే తాము ఎలాబతకటం అని అనుకొంటుంటే కమలలో పిరికితనం చోటుచేసుకుంది. ఇక్కడ కమల దృష్టిలో అమ్మమ్మ ఉంటే తన

లైంగికతకు భద్రత అనే భావమున్నట్టు అనిపించింది. సూరమ్మ తన అక్కలేకపోతే ఎలాబతకటం అని బాధపడేది. అంటే అమ్మమ్మ వృద్ధురాలైనా అందరికీ ఆమె ధైర్యాన్ని యివ్వగలిగేదని కమల అనుకొనేది. అమ్మమ్మ తనమొగుడు, కొడుకు తనని అన్యాయం చేసారని, తాను కమలకొంపలో పడి తింటున్నానని బాధపడుతుంటే అమ్మమ్మ ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. అమ్మమ్మ చనిపోతూతాను చచ్చిపోయిన తరువాత సత్యాన్ని యింటినుండి తరిమేయ వద్దని కమలదగ్గర మాట తీసుకొంది. కమల ఆమెకు అభయాన్ని యిస్తూ తాను బతికనన్నాళ్లు సత్యానికి తిండి, బట్టా లోటులేకుండా చూసుకుంటానని నిశ్చింతగా ఉండమని చెప్పింది. కమలపట్ల సత్యంచేసిన ద్రోహానికి అతడ్ని క్షమించమని అడిగింది. దానికి కమల అతడ్ని మొగుడిగాయింట్లో ఉండనీయనుగాని అతడుచేసిన పనులను మర్చిపోయానని చెప్తుంది. నిజానికి సత్యంలో ఈ మధ్యమార్పు వచ్చినా,అతడు చేసిన పనులను కమల మరిచిపోవటంచేతనే అతడిని మానవత్వంతో ఇంట్లో ఉండనిచ్చి తిండి తిననిస్తోందని అర్థమౌతుంది. ఎంతటివారైనా వారుచేసిన తప్పులను క్షమించటమే ఉత్తమ సంస్కారి లక్షణంకదా? సత్యం చచ్చినపాము అనీ, పద్మను కొన్నాళ్లు స్వేచ్ఛగా బతకనీయమని, ఉద్యోగం చేసుకొని దానిడబ్బు అది ఖర్చుపెట్టుకొనే స్థితిలో ఉండనీయమని, పెళ్లితప్పదని, పద్మకు ఇష్టమైన వానితో పెళ్లిచేయమని, తానుచేసినతప్పు కమలను చేయవద్దని అమ్మమ్మ తన చివరి క్షణాలలో కమలనుహెచ్చరించింది. వృద్ధురాలైన అమ్మమ్మ అత్యాధునిక భావాలతో ఆలోచించినట్లు కమల భావించింది. అమ్మమ్మ చనిపోయినప్పుడు సూరమ్మ తనకు ఇక దిక్కెవరని బాధపడుతుంది. సూరమ్మను పుట్టింటివాళ్ళు ఎంతగా హింసకు గురిచేసినా సూరమ్మకు మాత్రం వాళ్ళంటే ప్రాణమని అర్థమౌతుంది. సత్యంతన తల్లికి కర్మకాండలు చేసాడు. తల్లిపోయిన తరువాత అతనిలో అగ్నిగోళాలు పగిలి నిర్లిప్తత ఏర్పడింది. తడిబట్టలతో సత్యం వణుకుతూ దిగులుగా కూర్చుంటే, అతనిమీద జాలితో ఇన్నాళ్లకు కమలపొడిబట్టలు కట్టుకోమని అతనితో మాట్లాడింది. కమల భర్తగా

భావింపబడని సత్యం అనబడే ఆ మామయ్య ఉలిక్కిపడి కమలవైపు చూస్తాడు. అమ్మమ్మ మిగిలిన కొడుకులు మూడోరోజున వచ్చి, ఇంకా తాము ఉంటే ఖర్చులకు డబ్బు ఎక్కడ అడుగుతారోనని ఎవరిదారిన వారు వెళ్లిపోతారు. కమల కాఫీ తాగమనేసరికి అప్పటివరకు సత్యంలో గూడుకట్టుకొని ఉన్న దుఃఖం, తానుఏకాకినన్నభయం కన్నీటిలో కరిగేటట్లుగా సత్యం ఏడిచేసరికి, కమల తల్లిని పిలిచి దగ్గరకు తీసుకొని ఓదార్చమంటుంది. అంతేకాని అటువంటి పరిస్థితిలో కూడా కమల సత్యాన్ని తాకకూడదనుకొన్నది. సూరమ్మకు సత్యానికి మధ్యన ఉన్న పరోక్షద్వేషం కరిగిపోయి ఇద్దరు మనసారా అమ్మమ్మను తలచుకొని ఏడ్చారు. క్రమక్రమంగా అమ్మమ్మ పోయినప్పుడు దిక్కులేనివాళ్ళమని అనుకొన్నవారి దుఃఖంకరిగిపోయింది.

కమలకు తాను అమ్మమ్మను విదిలించి కొట్టినవన్నీ గుర్తుకువస్తున్నాయి. కాని ఆ అమ్మమ్మ తన కొడుకునికాక తననే నమ్ముకొని తనకు ధైర్యాన్ని యిచ్చిందని, తాను భర్తనుండి దూరం అవటం మంచినిర్ణయమని హర్షించింది. అటువంటి విశాలహృదయంగల పెద్దమ్మమ్మ డెబ్బైఏళ్ళు దాటిన వృద్ధాప్యంలో కూడా స్త్రీలచదువు, స్త్రీల ఆర్థిక స్వాతంత్ర్యం గురించి వాదించిందంటే ఎవ్వరూ నమ్మరని, ఆమెకి గనుక వెనకటి జీవితం తిరిగివచ్చి జీవించగల అవకాశంవస్తే అమ్మమ్మను తాను ఏమి అనకూడదని అనుకొంది. మిగతావాళ్ళను అలాగే ఉండమన్నది. తాను గతంలో బతికినట్లు బతకకూడదనుకొంది. అమ్మమ్మపట్ల సానుభూతితో, కాస్త ఉదారంగా ప్రవర్తించి ఉంటే తనకింత బాధ ఉండేదికాదనుకొంది. తాను అన్నమాటలను వెనక్కి తీసుకోలేననుకొంది కమల. పద్మ ఎమ్మెస్సీ పూర్తి అయ్యేవరకు అమ్మమ్మ ఉండిఉంటే బాగుండేదనుకుంది. అమ్మమ్మ పద్మకు యూనివర్సిటిలో చదవగల అవవకాశం కల్పించిందనీ, దొంగిలించబడలేని శాశ్వతమైన విద్యనిచ్చిందని కమల భావించింది.

పద్మ చదువు పూర్తయిన తరువాత తాను ఉద్యోగంలో చేరానని తల్లితో ఆమెను విశ్రాంతి తీసుకోమని లేదా యిష్టమైతే కొనసాగించమని పద్మ

అంటుంది. తనకు ముందుగా పద్మతాను ఉద్యోగంలో చేరిన విషయం చెప్పనందుకు కమలకు కోపం వచ్చేసరికి, పద్మ నవ్వుతూ సర్ది చెప్పేది. మూడేళ్లపాటు తాను రీసెర్చ్ కూడా చేస్తానంటే, కమల వారపత్రికలలో అనేక కథలలో తాను చదివినట్లుగానే ఆడపిల్లలు సంపాదనలో పడితే పెళ్ళికి ఒప్పుకోరని,పెళ్లిచేసుకునే టైము దాటితే పెళ్ళికొడుకులు దొరకరని భావిస్తుంటే సూరమ్మదానికి వత్తాసు పలికింది. కమల స్కూల్ కి, పద్మ కాలేజికి వెడుతున్నారు. పద్మ బ్యూటిపార్లర్‌కి వెళుతున్నందుకు డబ్బు తగలేస్తోందని సూరమ్మ గోలపెట్టేది. దానిడబ్బుఅది ఖర్చుపెట్టుకుంటున్నప్పుడు నీకు బాధ ఎందుకని, తల్లితరానికి పద్మ తరానికి రోజులుమారాయని గుర్తించమంటుంది కమల.

ఇరుగుపొరుగువారు పద్మను వింతగా చూసేవారు. అంటే సమాజం ఇంకా మార్పును అంగీకరించటానికి సిద్ధంగా లేదని తెలుస్తుంది. సూరమ్మకు మాత్రం కమలే పద్మను చెడకొడుతోందని అంటే దానికి కమల అది పద్మ యిష్టం అంటుంది. సూరమ్మకు తన అభిప్రాయాలకు విలువండటంలేదనే భావనతో తాను ఒంటరిదయినట్లుగా అభద్రతను భావించేది. పద్మ తన పెళ్ళివిషయంలో తనే నిర్ణయం తీసుకుంటానని, ఆవిషయాన్ని తెలియచేస్తానని చెప్పింది. కమల, పద్మల ఆలోచనలలోని ఆధునికతను అంగీకరించలేని సూరమ్మ తాను మరీ ఒంటరిదయినట్లు భావించేది. అమ్మసకూతురు కలిసి ముసలిదాన్ని మూలనకూర్చోమంటున్నారని సూరమ్మ అనేది. కమల తాను అలా అనలేదని కాలం మారిందని గమనించమని, సూరమ్మకాలంలో భర్తపోతే గుండుగీయించి సైనుబట్టలను యిచ్చేవారని, యిప్పుడు మొగుడుపోతే స్త్రీలు అప్పటిలా చేయరని, బొట్టుకూడా తీయరని, ఈరోజులు మారాయని గ్రహించమంటుంది. పద్మషోకులను సూరమ్మ వ్యతిరేకించేది. సూరమ్మ తనని తీర్థయాత్రలకు తీసుకెళ్ళమని సత్యాన్ని అడిగితే అతడు తీసుకెళ్ళననేసరికి, తను పనిచేసే స్కూలులో రిటైరైన టీచర్లు వెడుతుంటే కమల వారికి సూరమ్మను అప్పగించి పంపించింది. పితృస్వామ్యసంస్కృతి గతశతాబ్దంలోని మొదటితరం

స్త్రీల పెళ్లివిషయంలో ఆడపిల్ల అభిప్రాయంతో పనిలేదనుకొంది. కాని మూడవతరానికి వచ్చేసరికి ఆడపిల్ల తనే నిర్ణయించుకుంటాననటమే పితృస్వామ్యం ఆధిక్యత అగాధంలోకి పడిపోతోందని అర్థమౌతుంది.

ఇదే ప్రధానసాంస్కృతిక పరిణామం అనుకోవచ్చు. అంతేకాక మూడవతరంలో పద్మలాంటి స్త్రీలు పెళ్ళికంటే చదువుకే ప్రాధాన్యతనిచ్చినట్టు విశదమౌతుంది.

కమల వంటచేస్తుంటే పద్మసాయంచేసేది. సత్యం నీళ్ళుతోడి బయటికివెళ్ళి కూరలు తెచ్చేవాడు. పద్మకు తన ఫ్రెండ్స్ ఉన్నారు తనకే ఎవరూలేరు అని అనుకొనేదికమల. తాను అటు ఆధునికానికి, ఇటుపూర్వకాలానికి చెందకుండా ఉన్నాననుకుంది.అటుపూజలు చేయదు. పిల్లలు,మొగుడు ఉంటే శూన్యం ఉండదా

అని, తనకు పద్మ ఉన్నా తనకేమికావాలో చెప్పలేకపోతోందని అనుకొంది.

ఆ రోజు సెలవరోజు అయినా పద్మ కాలేజిలో పనుండి వెళ్ళగా యింటిపని పూర్తిచేసుకొన్న కమల తనగదిలోపడుకొని పత్రిక చదువుకుంటూన్న సమయంలో. ఏ నాడు ఆగదిలోకి అడుగుపెట్టని సత్యం ధైర్యంగా కమలగదిలోకి వెడతాడు. కమల మంచంమీదనుండి లేచి ఈగదిలోకి రాకూడదనిచె పితే ఎందుకు వచ్చావని పెద్దగా అరిచి బయటకు పొమ్మంది. అయినాసత్యం మంచందగ్గరకు సమీపించి మనం భార్యాభర్తలం అంటూ కలిసిబతికితే తప్పేమిటని తడబడుతూ అన్నాడు. కమల ఆడపులిలాగా గర్జిస్తూ సత్యంతో "ముందు బయటకుఫో" అంటూ "నువ్వుమారావనుకోవటం నాదే పొరపాటని, తమమధ్య భార్యాభర్తలసంబంధం ఏనాడో తెగిపోయిందని, యిద్దరిమధ్య ఎటువంటి సంబంధంలేదని బయటకు నడవమ"ని అంటూ ఎక్కడలేని ధైర్యంతో కళ్ళల్లో చింతనిప్పులు కక్కుతూతన ఆగ్రహాన్ని వెలిబుచ్చింది. అంతటితో ఆగకుండా "తిండిలేక పస్తులుంటున్నావని, యిల్లూవాకిలిలేక రోడ్లంబట తిరుగుతున్నావని, మీ అమ్మ ఏడిస్తే, మేనమామగా తిండిపెడుతున్నాగాని, నీకూనాకూ సంబంధంలేద"ని నిక్కచ్చిగా

అంది. మళ్లీ ఒకసారి చెబుతున్నానంటూ కమల "నువ్వు నాకేమి కావని, దయాధర్మంగా తిండిపెట్టి చోటిచ్చానని, కావాలంటే మేనమామగా ఉండదలచుకుంటే ఉండు,లేదా పెట్టెబేడతీసుకుపో" అన్నది కమల.

అయినా పట్టువదలని విక్రమార్కుడిలా సత్యం కమలతో "నువ్వురాత్రిళ్ళు తలుపు గడియ పెట్టుకోకపోతే.."అంటూ మళ్ళీ నసిగేసరికి, కమల సత్యంతో "తెలివితేటలకేమి తక్కువలేవని, నీకు చీమూనెత్తురు ఉందా? నువ్వుమనిషివేనా, తిండిపెట్టి చోటు యిస్తే నెత్తినెక్కుదామని చూస్తున్నావని, నీతల్లికి జబ్బుగా ఉన్నప్పుడు అర్ధరాత్రి లేపుతుందేమోనని తలుపు గడియపెట్టుకోలేదు. కాని నీమీదమోహంతో తలుపు గడియపెట్టకుండా ఉంచాననుకొన్నవా" అన్నది. "నీకుసిగ్గులేదు. మరోసారి యిలాంటి ఆలోచనలు చేసావంటే పెట్టెబేడా రోడ్డుమీదకు విసిరేస్తాను జాగ్రత్త, పోబయటికి, పోరా పో" అంటున్న కమలనుచూసిఆమె అపరకాళికాదేవిలా ఉందని భయపడి సత్యం బయటకువెళ్ళిపోయాడు. ఆ తరువాత ఇంటికి వచ్చిన పద్మ ఏడ్చినట్లు, కళ్ళు ఉబ్బినట్లుగాఎర్రగా ఉన్న తల్లిముఖంచూసి సత్యం అన్నానికి రాలేదేమని అడిగింది. కమల మాట్లాకపోయేసరికి పద్మకు ఏదో జరిగిందని అర్ధమయినా తల్లిని అడిగే సాహసం చేయలేకపోయింది.

పితృస్వామ్యంబలం అంతా స్త్రీల లైంగికతను అదుపుచేయటంలోనే ఉంటుంది. అదే పురుషాధిక్యతకు మూలం. అందుకే సత్యం కుటుంబంలో భార్యాభర్తలసంబంధాలకు దూరమైనా కమలపై తనకులైంగికహక్కు ఉందని భావిస్తాడు. కాబట్టి ఏ లైంగికఅదుపు స్త్రీలనుఅణచి ఉంచేటట్టు చేస్తుందో అదే స్థాయిలో దానిని ఎదుర్కో గలిగితేనే పురుషుడు తన ఆధిక్యతను పోగొట్టుకుంటాడు. పితృస్వామ్య కుటుంబసంస్కృతి నిర్మూలనం కావింపబడాలంటే ముందుగా కుటుంబసంస్కృతిలోని పురుషులకు స్త్రీల లైంగికతపైనున్న హక్కును లేకుండాచేయటమే విరుగుడని కమల గ్రహించింది. అంతేకాక, స్త్రీల ఆర్థికస్వావలంబనకూడా తోడవ్వాలి. దానికై స్త్రీ ముందుగా స్వయం పోషకురాలు కావాలి. స్త్రీలపై లైంగిక అదుపుకు,

ఆర్థికసంబంధాలకు ఉన్న సంబంధం తెలుస్తుంది. అంతేకాదు,గురజాడ అన్నట్లుగా ఆధునికయుగంలో స్త్రీ చరిత్రను తిరగవ్రాస్తుందని అనటం అంటే యిదే.

తీర్థయాత్రలనుండి వచ్చిన సూరమ్మకు సత్యం యింటికి రాకపోయేసరికి సత్యాన్నికమల వెళ్లగొట్టిందనే అనమానంతో వెళ్ళగొట్టావా? అని కమలను అడుగుతుంది. దానికి కమల తనంతట తానేవెళ్లాడు అన్నది. కారణంలేకుండా ఎందుకు వెడతాడు? అతడ్ని నువ్వే వెళ్ళగొట్టి ఉంటావంటూ కమలవైపే దోషం ఉందని చెప్పబోయింది సూరమ్మ. సత్యం ఏ రైలుకిందనన్నా పడ్డాడేమోనని కమలకుకూడా మనసు పీకుతూఉంటే సత్యం విషయంలో తానంత కఠినంగా ఉండకపోతే జంతువు అయ్యేవాడని, భార్య ఒకసారి లొంగిపోతే ఆమెజుట్టు చిక్కుకుపోతుందని భావించింది. మొగుడు ఆమెను ఆటబొమ్మలాగా ఆడిస్తాడని, సత్యం పంజావిప్పిన పులిలాగా అవకాశంకోసం ఎదురుచూస్తూ ఉన్నాడని, అతని ఆలోచన అలా ఉందని తాను ముందుగా ఆలోచించలేకపోయానని బాధపడింది.

తాను సత్యానికి అటువంటి అవకాశం (అంటే తలుపులోపల గడియపెట్టుకోకుండా ఉండటం) ఇవ్వకుండా ఉండాల్సిందని, సమస్య మళ్లీ వచ్చిందని కమల భావించింది. సత్యం ఇంట్లో ఉంటే తన తల్లికి తృప్తి అని కమల భావించింది. సూరమ్మకు సత్యం అంటే ప్రేమపెరిగింది. సత్యానికి అన్నంపెట్టే బాధ్యత అమ్మమ్మతరువాత సూరమ్మ తీసుకొంది. ఆమెకు సత్యం అంటే ఒకానొకప్పుడు కోపంగాని ఇప్పుడు దిక్కుమాలిన సత్యం అంటే యిష్టం అనికమలకు అర్థమైంది.

కొన్నాళ్ళతరువాత యింటికి వచ్చిన సత్యాన్ని చూడరాగానే సూరమ్మకు దేవుడ్ని చూసినంత ఆనందం కలిగి కమలను పిలిచింది. పద్మవచ్చి ఉత్తరం రాయకపోయావా అని తండ్రిని అడిగింది. దానికి సత్యం ఉత్తరం రాయాలనుకున్నా రాయలేకపోయానని అనేసరికి సూరమ్మ సత్యాన్ని నిమిరి తన ప్రేమంతా వెళ్లబోస్తూ అందరం బెంగపెట్టుకున్నామని అంటే కమల తాను

బెంగపెట్టుకోలేదని లోలోపల అనుకుంది. సత్యం ఇంట్లోకి వచ్చాడు. ఆ రాత్రి కమల గడియ బిగియపెట్టుకొని పడుకొంది. పద్మకి విషయం అర్థమయి ఆనాటినుండి కమల మరిచిపోయినా పద్మ కమల గదితలుపు గడియవేసేది. పద్మకుకూడా, తండ్రి కమలను కోరుకోకూడదనే అభిప్రాయంఉందని అర్థమౌతుంది. ఇక్కడ పద్మకు భార్యాభర్తసంబంధాలలోని సంక్లిష్టతలపై అవగాహన ఏర్పడినట్లు తెలుస్తుంది.

సూరమ్మ కాశీసమారాధన మొదలుపెట్టేసరికి కమలకు "సూరమ్మ పిచ్చిదని" అమ్మమ్మ చెప్పిన మాటలు గుర్తుకువచ్చాయి. "ఇప్పుడు సత్యంకోరలు తీసిన పాము" అని, "పాముపోతే, పాము చచ్చిపోవచ్చుగాని మనిషిలో మాత్రం కోరికలు బుసలుకొడుతూనే ఉంటాయి" అనీ, "బుల్లితాతయ్య తనలోని కోర్కెలు చంపుకోలేక ముసలితనంలో పెళ్లిచేసుకోలేదా అనీ, సత్యం అలాంటివాడే అనీ, పాము తన ప్రవృత్తిని మార్చుకోదు" అనుకొంది కమల. సత్యంలాంటి పాము కాటెయ్యకుండా తానే జాగ్రత్తపడాలని కమల అనుకొంది. అంటే పితృస్వామ్యంలో స్త్రీలలైంగికతకు భద్రతలేదని, స్త్రీలు ఆవిషయంలో నిరంతరం జాగ్రత్తవహించాలని కమల నిర్ణయించుకున్నది. సూరమ్మకు ఇన్ని అనుభవాలు అయినా పితృస్వామ్య సంస్కృతిని జీర్ణించుకొన్న వాతావరణంలో పెరగటంచేత జీవితాలను ఆ దృష్టికోణంలోనే అర్థంచేసుకుంటుంది. కాబట్టే అతను ఎలాంటివాడైనా సత్యం అంటే తనతల్లికి యిష్టమని కమల భావించింది.

సూరమ్మ పద్మకు పెళ్లిసంబధాలను చూడమని చెప్పింది. ఊళ్ళో టి.వి.లు వచ్చాయి. కమలకొన్నందుకు గోలపెట్టిన సూరమ్మ"బంగారం కొంటే పద్మకు కన్యధారపోయవచ్చు" అని అన్నదంటే పితృస్వామ్యసంస్కృతి స్త్రీని ఒకవస్తువుగా భావిస్తుందని సూరమ్మమాటల్లో తెలుస్తుంది. అందుకే పద్మ "నేనేమన్నాగొద్దునా, ధారపొయ్యటానికి అన్నది. అంటే పితృస్వామ్య సంస్కృతి లైంగిక అదుపు స్త్రీలను ద్వితీయస్థానంలోఉంచిన పాతతరానికి, ప్రజాస్వామ్యంలో స్వతంత్రవ్యక్తిత్వంతో పురుషుడితోపాటు "సమానహోదాలో

ఉండే స్త్రీలస్థితికి ఉండేతేడా స్పష్టమౌతుంది. అందుకే కమల సూరమ్మతో "మీరోజులుమారాయి, ఇప్పుడు 'ఎంగేజిమెంటు', 'రిసెప్షను' అనే మాటలే వాడాలి" అని అంటుంది. సూరమ్మ "ఏ పేరుమారినా పెళ్ళిపెళ్లేనని, పద్మ పెళ్లిచూసి చచ్చిపోతాను"అని అంటే "అలాఅయితే తాను పెళ్లేచేసుకోను" అంటుంది పద్మ. సూరమ్మకు తన మాటకు విలువలేదని ఏడుపూ, కోపం వచ్చాయి. సూరమ్మ "తనచేతులు పాపిష్టిచేతులని, కమలపెళ్లిచేస్తే అలాగయిందని, పద్మ పెళ్లిచేసుకోకపోతే తాను నూతిలోకి దూకిచస్తానని, అప్పుడుచేసుకో" అని అంది. కమలకూడా పద్మకు పాతికేళ్లువచ్చాయి గదా అనుకొంది. పద్మ పెళ్లిఖర్చుకోసం పాతికవేలు కూడపెట్టింది. చుట్టాలు వచ్చినా వాళ్ళమాటలు కమలకు, వాళ్ళ కొడుకులపోకిరి ప్రవర్తన పద్మకు తెలియటంతోగాని మొత్తంమీద ఏదోరకంగా నచ్చటంలేదు. పైపెచ్చు కొడుకులను వెనకేసుకొస్తున్న తల్లులనిచూస్తే ఆడవాళ్ళను ఆడవాళ్ళే గొంతులు కోస్తున్నారనుకొంది. పాతికేళ్ళనాటి చిన్నమ్మమ్మకు ఈనాటి వరుడి తల్లులకు తేడా లేదనిపించింది. అంటే కాలం మార్పుచెందుతూ ముందుకు నడుస్తున్నా వరకట్న సంస్కృతి మాత్రం గతంలోలాగానే ఉందని తెలుస్తోంది. కమలకు పద్మపెళ్లి సమస్యగా అనిపించింది.

పద్మకు నచ్చినసంబంధం ఒకటి ఉందికాని వాళ్లు ఇరవైవేల కట్నం అడిగేసరికి పద్మచేసుకోనంటుంది. అయితే నాలుగురోజుల తరువాత ఆ పెళ్లికొడుకు ఇంటికి వచ్చి కట్నంతీసుకోవటం మొగవాడు అమ్ముడు పోవటమేనని, తనకు యిష్టం లేకపోయినా తండ్రి దేశసేవలో డబ్బును పోగొట్టుకోవటంతో తన చెల్లెలిపెళ్లికి యివ్వలేని స్థితిలో తీసుకుంటున్నట్లు, అప్పుగా భావించి ఆ డబ్బును తిరిగి చెల్లిస్తానని చెప్పడానికి వచ్చానని అంటాడు. ఆతని మాటలలోని నిజాయితి కమలకు నచ్చి సానుభూతిని చూపించింది. వరకట్నం ఒక గొలుసు ప్రక్రియగా కమలకు అర్థమయంది. దీన్ని తెంపగలశక్తి ఎవ్వరికీ లేదని గుర్తించింది. ఆ విషయం చెప్పటానికి వచ్చానంటాడు.

వచ్చిన రామశేషు కమలతో సత్యంగురించి మాట్లాడుతూ మనుష్యులలో రకరకాలవాళ్ళు ఉంటారని, పూర్తిగా ఆయనను తప్పుపట్టటం కంటే కూడా ఏ పరిస్థితులు అతడ్ని అలా మార్చాయో సానుభూతితో అర్థం చేసుకోవాలంటాడు. మనుష్యులను వారి బలహీనతలు, లోపాలతోసహా స్వీకరించాలని, మనుష్యులు సుఖపడటానికి అదొక్కటే మార్గమంటాడు. స్త్రీలమనోభావాలను గౌరవించే యువకుడైన రామశేషు దొరికినందుకు కమలకు ఆనందం కలిగింది. కమల ఆ విషయం పద్మ దగ్గర ముందు దాచిపెడదామనుకొంది, గాని అబద్ధాలపెళ్ళిళ్లు ఎన్నాళ్ళో నిలబడవని భావించి పద్మ అర్థంచేసుకుంటుందని రామశేషు వచ్చిమాట్లాడిన విషయమంతా చెప్పింది. పద్మమీదతప్ప కమలకు మరొకరిమీద నమ్మకంలేదు. అమ్మమ్మ అబద్ధంచెప్పి అమ్మకు పెళ్లిచేసింది. బుల్లి తాతయ్య దొంగపెళ్లిచేసుకొన్నాడు. పెళ్ళిళ్ళవిషయంలో అందరు నిజాలు దాచిపెట్టారని కమల అనుకొంది. అందుకే పద్మపెళ్లివిషయంలో తాను నిజాయితిగా ఉండాలనుకొంది.

పద్మ రామశేషుని కలిసి కట్నం గురించి వాదిస్తూ కట్నం ఒక అనాగరిక ఆచారమని అనగా రామశేషు దానిని తాను వ్యతిరేకిస్తానని, కాని కట్నం అందరిదగ్గర చేతులు మారుతుందని, దానికి డబ్బు ఆశ అనటం న్యాయంకాదని అంటాడు. దానికి పద్మ మాట్లాడదు. ప్రతిమనిషికి సిద్ధాంతాలు ఉండాలి కాని అవి జీవితాన్ని మింగేసేవిధంగానో, అతడ్ని మూర్ఖుడిని చేసే విధంగానో ఉండకూడదని, తమయిద్దరిని ఇరవైవేలు దూరంచేయకూడదని ఆ డబ్బును అప్పుగా తీసుకొని ఉద్యోగంలో పొదుపుచేసి తీర్చుకోవచ్చని అంటాడు. జీతంగురించి ప్రస్తావన వచ్చినప్పుడు అతడు పద్మ జీతంతో తనకి సంబంధం లేదని, ఒకరిమీద ఒకరికి నమ్మకం ఉండాలిగాని సంపాదన కాదని రామశేషు అంటాడు. రామశేషులోని ఆత్మవిశ్వాసం నచ్చి పద్మ పెళ్ళికి ఒప్పుకొంది.వివాహం జరిగింది. రామశేషు రెండేళ్లపాటు డబ్బునుకూడపెట్టి యిరవైవేల కట్నండబ్బును పద్మకు యిచ్చేస్తాడు. పద్మ ఆడబ్బును తీసుకోనంది. రెండేళ్ళక్రితం తనకున్న విలువలు,సిద్ధాంతాలు మారుపోతున్నాయని పద్మ

అనుకొంది. వాటి ప్రాముఖ్యతకన్నా ఒకరిమీద ఒకరికి నమ్మకం ముఖ్యమనుకొంది. ఇ క్కడ అబద్ధపు శుష్కవాక్యాలకన్నా సంస్కారవంతుడైతే అవసరానికి వరకట్నరూపంలో డబ్బును నిజాయితితో అప్పుగా అడిగి తిరిగి యివ్వటానికి విలువ ఉంటుందని, అప్పుడది పితృస్వామ్య ఆధిక్యతఅని అనిపించుకోదని భావిస్తాడు. ఆర్థికపరిస్థితుల కోణంలో అనివార్యంగా వరకట్నం యివ్వటం సామాజిక ప్రయోగశాలలో ఒక కొత్తరూపాన్ని సంతరించుకోవాల్సిన అవసరాన్ని తెలియచేస్తోంది. రామశేషు ప్రతి శని, ఆదివారాలలో సూరమ్మకు,కమలకు, సత్యానికి చిన్నబహుమతులు, పద్మకుచీర లాంటివి తెచ్చి యిస్తుంటాడు.

సూరమ్మచెప్పే తన చిన్ననాటి సంగతులు శ్రద్ధగా వినేవాడు. పెద్దవాళ్ళతో ఉండవలసిన పద్ధతి రామశేషుకు తెలుసు. అందరికి రామశేషు అభిమాని. రామశేషుమీద పద్మ ఆధిపత్యం ఉన్నదనుకునేది కాదు. అంటే రామశేషు తనవాడని, తననుంచి ఎక్కడికీ పోడని పద్మకు నమ్మకం కలిగింది. పద్మకు పిల్లవాడు పుట్టినప్పుడు పద్మ ఆ ఉళ్లో ఉద్యోగానికి రాజినామాచేసి, పిల్లవాడిని యిక్కడే ఉంచి తాను రామశేషుతో పాటు విశాఖపట్నానికి వెళ్లింది. సత్యం ఆపిల్లవాడి పనులన్ని చూసే వాడు. తాతమనవళ్లది విచిత్ర బాంధవ్యం. అంటే సత్యానికి కమలతో సంబంధం లేకపోయినా కమలకూతురి కొడుకుతో చుట్టరికం ఉందికదా. సూరమ్మతన మునిమనవడైన సుధీర్ దగ్గర సత్యం పోలికలు ఉన్నాయనుకొనేది. ఆమాటలకు కమల ముఖంతిప్పుకొనేది. అంటే సత్యం రూపమంటేకూడా కమలకు ఏవగింపు అని అర్థమౌతుంది. సత్యం కమలనుచూసి భయపడేవాడు. పితృస్వామ్య కుటుంబసంస్కృతిలో భాగంగా ఒకానొకప్పుడు భర్త భార్యను భయపెట్టేవాడు. కాని ఎప్పుడైతే కమల కుటుంబంలోని ఆతనిలైంగికహక్కును తిరస్కరించిందో అప్పడినుండి భార్యను చూస్తేనే భర్త భయపడేస్థితికి రావటం జరిగింది. భార్యాభర్తలమధ్య అనుబంధంలేదు కాని తాత అమ్మమ్మలకు కొత్తఅనుబంధం ఏర్పడింది. బయటవారికి వీరిద్దరు సహజంగా సహజీవనం సాగిస్తున్న దంపతుల్లా

కనపడేవారు. కాని యిద్దరిమధ్యా మానసికంగా కొన్ని యోజనాల దూరం ఉందని పసికట్టలేకపోయేవారు. అంటే అది పితృస్వామ్య కుటుంబ సంస్కృతిలోని డొల్లతనాన్ని అర్థంచేసుకోలేక పోవటమే.

కమల కుట్టుమిషను కొన్నది. దానిమీద సత్యం కుట్టటం కమల చూసింది. కమల ఎప్పుడు నేర్చుకొన్నావని అడిగింది. తాను గతంలో టైలర్ దగ్గర అసిస్టెంట్‌గా పనిచేసానన్నాడు. అతని గత జీవితం గురించి, అతను పడ్డ అవమానాల గురించి ఇంట్లో ఎవరూ అడగలేదు. తానుకూడా అడగనందుకు కమలకు కన్నీళ్లు వచ్చాయి. సత్యం ఎదురుగా ఉన్నా అతన్ని ఒక హృదయం, అనుభూతులు ఉన్న మనిషిగా తాను చూడలేదనుకొంది.చాలా బాధలు పడ్డావా? అని కమల అడిగితే సత్యం తాను పడ్డ తిరస్కారాలు, అవమానాలు, ఆకలి మామూలు అయ్యాయని, అవి బాధలుకావని, ఆకలిముందు అవమానాలు ఏ పాటివని తత్వవేత్తలా అంటాడు. అంటే అతడు తన మనసులోని కోరికలను జయించే ఇంద్రియనిగ్రహం అతనికి ఏర్పడిందని తెలుసుకున్నది. తన కష్టాలను, బాధలను, అనుభవాలను ఎవరితో చెప్పినా సానుభూతి చూపించలేదనీ, పిచ్చికుక్కను తరిమికొట్టినట్లు కొడితే అవి జీవిత పాఠాలు నేర్పాయని అంటాడు. అంటే పితృస్వామ్యసంస్కృతిలోని ఆతని బలహీన ఆర్థికపరిస్థితులే ఆతని ఆధిక్యతను నశింపచేసాయి. పితృస్వామ్యసంస్కృతి చివరికి మనిషిని ఒంటరివాడిని చేసింది.

కమల సత్యాన్ని అర్థంచేసుకోవటం మొదలుపెట్టింది. కమలగదిలోకి తాను ఆనాడు వచ్చినందుకు సత్యం క్షమించమని ఆమెను అడిగి, ఇక తానెప్పుడు రానని చెప్పాడు. ఆవిషయాన్ని మరిచిపొమ్మని చెప్పి కమల గదిలోకి వెళ్లి ఏడ్చింది. కాని, తానెందుకు ఏడుస్తోందో తెలియటం లేదు. అల్లారుముద్దుగా పెరిగిన సత్యం చదువు లేకపోయినా కూలిపనిచేసి ఆలోచించుకోగల మనిషి ఎందుకు ఎవరికి అక్కరలేకుండా పోయాడని ప్రశ్నించుకొంది. ఆతని ఖర్మ, తలరాత అని జవాబు తట్టింది. పితృస్వామ్యంలోని కర్మకాండల సంస్కృతిని

ఆసరా చేసుకొనే స్థితిలోనే ఉన్న కమల పాతకొత్తల సంస్కృతుల మధ్యకాలాన జీవించటంతో అలా అనుకున్నది.

సుధీర్‌కి మూడేళ్లువచ్చిన తరవాత పద్మ మళ్లీ గర్భవతి అయింది. సూరమ్మ పద్మకు నలుగురు కొడుకులు పుడితే నాలుగుకొమ్మలు కాస్తే, ఐదవవాడు నిప్పు పట్టుకొని ముందు నడుస్తాడని అంటుంది. కాలంమారినా ఆ తరం మనిషిగా కొనసాగటంతో భూస్వామ్యపు పితృస్వామ్యంలోని కర్మకాండల సంస్కృతి ఆలోచనల స్థితిలోనే సూరమ్మ ఉంది. పద్మ తనతండ్రి టైలరింగ్ యూనిట్ పెడితే బాగుంటుదని అనుకొంది. పద్మతన భర్తను రామశేషు అని పిలవటం నచ్చకసూరమ్మ "ఆయుఃక్షీణమని, ఏమండి అని పిలవాలి" అని అంటే పద్మ "నీవు మొగుడ్ని పేరుపెట్టి పిలిచినందుకు చచ్చిపోయాడా?" అని ఆమెను ఆలోచనకు పెట్టింది. ఈకాలం పిల్లలతో మాట్లాడలేమని సూరమ్మ ఊరుకొనేది.

పద్మకు ఆడపిల్లపుట్టింది. సౌజన్య అని పేరుపెట్టారు. సూరమ్మ సున్నిపిండి, సాంబ్రాణి, ఆముదం వంటి నాటుపద్ధతులను వాడాలంటే బేబిసోప్ వాడాలని తెగేసి చెప్పింది. ఇలా ఆ తరం సూరమ్మకు, ఈతరంపద్మకు అన్నింటిలో యిద్దరిమధ్య అభిప్రాయాలు ఉండేవి. చిన్నప్పుడు పద్మ తనమాట వినేది. చిన్నక్క తన మాటకాదన్నా కమల సర్దిచెప్పేది. కాని పద్మ నాపిల్ల, నాయిష్టం అంటుంటే సూరమ్మతనని తాను పరాయిగా భావించుకునేది. మనిషి పరాయితనం ఆ మనిషి ఉనికికి ప్రమాదకరంగా మారుతుంది. రామశేషుమాత్రం ఎవరికీ కోపంరాకుండా చూసుకొనేవాడు. సుధీర్‌ని ఉంచమన్నా పద్మ తనతల్లి, సూరమ్మ కలిసి గారాబంచేస్తారు కాబట్టి తీసుకొని వెడతానంటుంది. కమల స్కూల్ కి కొన్నాళ్ళు సెలవుపెట్టి పద్మతో వస్తానంటే పెద్దావిడను వదిలి రావటమెందుకంటూ అని తన తండ్రి వస్తాడని పద్మ అంటుంది. పద్మ సత్యాన్ని అన్నిపనులు అడుగుతుంటే కమల తన అవసరం పద్మకు లేదని భావించింది. కమలకు ఉడుకుమోతుతనంగా ఉండి రామశేషును అడిగితే తాను పిల్లలవిషయంలో జోక్యం చేసుకొంటే పద్మ

గయ్యిమని లేస్తుందని తనకు భయం అంటాడు. దానితో భార్యాభర్తలిద్దరు ఆలోచించుకొనే నిర్ణయంచేసుకొన్నారని కమల భావించి గుడ్లనీరు గుడ్లన కుక్కుకొని వూరుకొంది. సూరమ్మ తరంలో స్త్రీలు పోషింపబడే బానిసస్థితిలో ఉండటంతో మొగుడు భయపెట్టేవాడు.

కాని నేడు మహిళలు స్వతంత్రవ్యక్తిత్వంతో ఆర్థికస్వావలంబనతో ఉండటంచేత కొంతమంది భర్తలు భయపడే స్థితిలో ఉంటున్నారు. పద్మ ,రామశేషు, వారిపిల్లలతోపాటు సత్యంఊరికి వెళ్ళటంతో కమల ఒంటరితనంతో బాధపడింది. ఇంట్లో సత్యం పులిలాగా ఉండేవాడని, సత్యం ఉన్నప్పుడు తనకు ధైర్యంగా ఉండేదని కమల అనుకొంది. స్కూల్ కి తరచు సెలవుపెట్టి తన జీవితం ఎందుకిలా అయిందని తననుగురించి ఆలోచించటం మొదలుపెట్టింది. పద్మ, రామశేషు మధ్యమధ్యలో ఇంటికి వస్తూపోతున్నారు. పద్మ పిల్లలకు తన తండ్రి అలవాటయ్యాడని, తండ్రిని తనతో తీసుకొని వెడుతానంటే కమల తామిద్దరూ ఆడవాళ్లమే ఉంటున్నామని అంటే "నాన్నరాకమునుపు ఇద్దరు ఆడవాళ్లేకదా ఉన్నది" అని పద్మ అంది. "ఆరోజుల్లో తన అమ్మమ్మ ఉండేదని, ఇప్పుడు తను స్కూల్కి వెళ్లినప్పుడు ఇంటో సామాన్లుపోతున్న విషయం అమ్మమ్మకు తెలియటంలేదు"అని కమల అంటే "నాన్న యింటికి కాపలానా?" అని పద్మ అడుగుతుంది. బహుశ తనతల్లికి తన తండ్రి విలువ తెలియాలని, ఆతని సమక్షాన్ని తల్లి భరించే స్థితిలో ఉందా లేదా అనిరెట్టించి తెలుసుకోదలచి ఉంటుంది కాని అంతగా స్వార్ధంతో మాట్లాడే స్వభావం చదువుకున్న పద్మదికాదనిపిస్తుంది. కాని ఆధునికయుగంలో కష్టం తెలియకుండా పెరిగినా అలా అనుకొనే వీలుంటుంది. పద్మ రమ్మన్నా కమల మనసును తెలుసుకొన్న సత్యం పద్మతో ఊరికి వెళ్లడు. ప్రేమలు, పెంపకాలు తాత్కాలికం అనుకొంది కమల. సత్యంకూడా డీలాపడి బలహీనంగా ఉన్నాడని కమలకు అనిపించింది. ఇప్పుడు సత్యం బాగోగులు కమల పట్టించుకుంటోంది. విశాఖపట్నంలో సత్యం అందరికి సహాయసహకారాలు అందించేవాడని సత్యంగురించి పద్మ

చెప్పినమాటలు గుర్తుకు వచ్చి, తనకు మాత్రం సత్యం ఒక అపరిచిత వ్యక్తి, పరాయివాడుగాఎందుకున్నాడని కమల తెగని ప్రశ్నవేసుకొనేది.

ఒకనాడు సత్యానికి గుండెపోటు వచ్చి చచ్చిపోతాడు. కమలక్రితంరోజు తాను యిచ్చిన హార్లిక్స్ తాగలేదని, తాగకూడదనుకొన్నాడా అని బాధ పడింది. పైపెచ్చు తాను గది గడియపెట్టుకోవటంచేత లోపలికి వచ్చి తన బాధ చెప్పలేకపోయుంటాడేమోనని అనుకొంది. అవమానాల్ని, తిరస్కారాలను నిశ్శబ్దంగా భరించినట్లు మరణవేదనని పెదవిమెదపకుండా భరించాడా అని భావించింది. మొదటినుండి సత్యం ప్రశ్నగానే ఉన్నాడు. ఆతని మరణం కూడా ప్రశ్నగానే మిగిలింది అనుకొంది. తానెక్కడో పొరపాటుచేసిన భయం కమలలో కలగసాగింది. సత్యాన్ని తానెందుకు అంతగా ద్వేషంచిందని, అతనిపట్ల నిర్లక్ష్యంతో తానెందుకు ఉన్నదని ఆలోచించి, అతడికి చిన్నవయసు అవటంచేత స్త్రీలలో ఉండే సున్నితత్వం అతనికి అర్థంకాలేదని అనుకొంది. దేహానికి మనసుకు ఉన్న అవినాభావసంబంధం అతనికి ఎవరూచెప్పలేదేమో! అతనితో చేసిన ఏడాది కాపురంలో అతడు సున్నితంగా ఉండి ఉంటే తనకు పరాయివాడు అయ్యేవాడు కాదనుకొంది. అనుకొన్నది అనేదానికంటే సత్యం తోఆమెకున్న భార్యాభర్తృసంబంధాలకు ఆమె మనసు అద్దం పట్టిందంటే బాగుండునేమో. సూరమ్మ తనని ఒంటరిదాన్ని చేసి సత్యం వెళ్లిపోయాడని ఏడ్చింది. రామశేషు సత్యానికి తలకొరివి పెట్టాడు. పద్మచేత తలకొరివి పెట్టించే మార్పు గతశతాబ్దపు చివరికి కూడా రాలేదని అర్థమౌతుంది. ఇప్పుడు జరుగుతున్నాయంటే 21వ శతాబ్దపు ప్రపంచీకరణ కాలంలో కొడుకులు లేకపోయినా, రాకపోయినా ఈ శతాబ్దంలో కూతుళ్లు అంత్యక్రియలు జరిపిస్తున్నారు.

సత్యం తనతో చెప్పకుండా వెళ్లిపోయాడని కమలకు గుండెల్లోనుంచి దుఃఖం తన్నుకు వస్తోంది. ఏనాడూ మాట్లాడని వ్యక్తికోసం,ఈసడించుకొన్న ప్రాణికోసం కమలచూపే దుఃఖానికి పద్మ ఆశ్చర్యపోతుంది. తల్లి నిజంగా తన భర్తను ద్వేషించటం తాను కళ్ళారా చూసింది. దయాధర్మంగా

మాదాకబళం వేసినట్లు తిండి పెట్టింది. బయట కూర్చోమంది. పురుగులా చూసింది. ఇప్పుడందుకు తనతల్లి బాధపడుతోందని రామశేషుతో అంటే అతడు "వాళ్లిద్దరికి ఒకరంటే ఒకరికి అభిమానం ఉందికాని, ఒకప్పుడు మీ నాన్నచేసిన పనులకు మీఅమ్మకు అతనిమీద అసహ్యం వేసి ద్వేషించిందని, ఆద్వేషాన్ని మర్చిపోలేక మాటిమాటికి గుర్తుచేసుకొని ద్వేషాన్ని ద్వేషిస్తోంది" అని అంటాడు. ఆమె వ్యక్తినికాదని ద్వేషం అనే భావనను ద్వేషిస్తోందని చెప్పాడు. సత్యం కర్మకాండలకు కమల ధారాళంగా ఖర్చుపెట్టింది. బ్రతికినన్నాళ్ళు ద్వేషించిన వ్యక్తితాలూకు చిహ్నాలను అతనితోపాటే తీసేసింది. తెల్లచీరను కట్టుకోవద్దని అన్నా, బొట్టుపెట్టుకోమని పద్మ అన్నా కమల వినలేదు. సంప్రదాయాన్ని యథావిథంగా పాటించింది. అంటే కమల పాతకొత్తల సంధియుగపు సంస్కృతిమధ్యన జీవించింది. అంతేకాదు కమల తాను కలిపియిచ్చిన హార్లిక్స్ తాగనందుకు సత్యానికి తనమీద కోపం వచ్చిందనే మానసిక వ్యథ ఆమెను బలహీనురాలిని చేసింది. తనమనస్సుకు సమాధానం చెప్పుకునే క్రమంలో ఆమె అలా సంస్కృతిని పాటించి ఉండవచ్చు కాని పాతతరంలోవలె నిర్బంధ పితృస్వామ్యసంస్కృతిని పాటించలేదు.

హేతుబద్ధంగా ఆలోచించే తనతల్లి నాన్నను బతుకంతా ప్రేమించినట్లు ప్రవర్తిస్తున్నందుకు కారణం ఏమిటని అలోచిస్తూ పద్మ రామశేషుతో అంది. రామశేషు స్పందిస్తూ ఆమె తండ్రి ద్వేషాన్ని త్యజించాడు. చివరకు అందరిపట్ల అభిమానాన్ని చూపించాడు . కోపాన్ని, కసిని మర్చిపోయాడు. భార్యమీద అభిమానం, సానుభూతి చూపించాడు. అయితే దాన్ని పైకి చెప్పలేకపోయాడు. పద్మ తల్లిలాగా అతడు అంతర్మథనంచెందలేదు. అందుకే ప్రశాంతంగా మరణించాడు. అని రామశేషు అన్న మాటలకు, ఈనాడు డాక్టరు ఆయన ఎటువంటి శారీరక బాధ లేకుండా, అంతర్మధనం చెందకుండా, మనశ్శాంతిగా కన్నుమూశాడని చెప్పిన మాటలకు, సంబంధం ఉందని పద్మ అనుకొంది. అవసరమైతే సహాయంచేసేవాడు, లేకపోతే పత్రిక చదువుకుంటూ ఉండేవాడని, తమ విషయాలలో కల్పించుకోలేదని, పిల్లల్తో కలిసి

ఆటలాడుకునేవాడని, అలా తనని తాను నియంత్రించుకోవటం మామూలు విషయంకాదన్నాడు రామశేషు. పద్మ తల్లిని, అమ్మమ్మను తమతో తీసుకుపోదామంటే రామశేషు ఇది కుటుంబాలలో ఉండే సమస్యే అని, ఇదివరకు పదిమంది పిల్లల్ని కనేవారుకాబట్టి ఒకఊళ్ళో గుంపుగా ఉండేవారని, ఇప్పుడు కాలం మారిందని, చదువుకొన్న చిన్నతరం ఉద్యోగాలకోసం పొరుగూళ్ళకుపోవటం, పెద్దతరం పండిన ఆకుల్లా రాలిపోవటం జరుగుతోంది. శక్తిఉండి కాలూచెయ్యి ఆడినంతవరకు ఆ ఊళ్లల్లోనే ఉంటారని, పిల్లలదగ్గరకు వెళ్లరని చెప్పి తన తల్లిని ఉదాహరణగా పేర్కొంటాడు. తనతల్లికి కర్మకాండలమీద నమ్మకం ఉందా అని పద్మ అనేసరికి రామశేషు నమ్మకం ఉన్నాలేక పోయినా ఆతనికి చేసే ఆఖరి క్రతువని, బ్రతికున్నప్పుడు చేయనందుకు, తరువాతైనా చేసి ఆమె తన మనోభారాన్ని తీర్చుకుంటోందని, ఆమె తన మనశ్శాంతికోసం చేస్తోందని చెప్పాడు. పద్మ తల్లిని తమతో రమ్మంటే తాను గుళ్లో నిద్రచేసి వస్తానంటే పద్మ 'నాన్సెన్స్' అంటుంది. కమల అలా అనటానికి కారణం పద్మ, పిల్లల క్షేమంగురించి రానంటోందని సూరమ్మ అంటే, అటువంటి పాతకాలపు కబుర్లు తన దగ్గరచెప్పవద్దని, తల్లిరాకపోతే గుమ్మం దగ్గరకూర్చొని తాను సత్యాగ్రహం చేస్తానని అంది. దానికి సత్యం ఒకనాడు నగలకోసం సత్యాగ్రహంచేస్తానని అన్న మాటలు గుర్తుకొచ్చి కమల తనని తాను ఓదార్చుకుంది. అంటే ఒకనాడు సత్యం తనని బాధించిన విషయమైనా అది గుర్తురాగా కమలకు దుఃఖంవస్తోంది..తల్లితో పోరాడి చివరకు ఇద్దరిని తీసుకొని పద్మావాళ్ళు విశాఖపట్నం చేరుకొంటారు. మొదటితరం సూరమ్మ, రెండవతరం కమల, మూడవతరం పద్మతో కలిసి, నాలుగవతరం సౌజన్యతో వారి జీవనయానం ప్రారంభమైంది.

మూడవతరంలో స్త్రీ యూనివర్సిటి చదువులు చదవటం, మహిళాసంస్కృతిలో పెనుమార్పును తెచ్చింది, ఆధునిక వేషధారణ, వ్యక్తిత్వ స్ఫురణ, తనశరీరము పైన తనకే హక్కు ఉందని భావించటం, ఉన్నత

ఉద్యోగం, పరిశోధనా దృష్టి, వివాహవిషయంలో స్వీయనిర్ణయాధికారం, ప్రజాస్వామ్యపు దృక్పథం, ప్రశ్నించే గుణం, మానవత్వపు లేమిని గురించి సమాలోచన చేయటం ఈతరం మహిళల లక్షణం. అయితే పాతకొత్తల సంస్కృతులమధ్యన పాతసంప్రదాయాన్నే ఇష్టపడటంతో పితృస్వామ్యం సందిగ్ధదశలో ఉన్నదనిపిస్తుంది. పురుషులలోని సున్నితత్వం భార్యభర్తల సంబంధాలలో ప్రధానపాత్ర వహిస్తుంది. మనుషి చెడు అనుభవాలతో ప్రక్షాళన చెంది మానవత్వం వికసించి జ్ఞాని అవుతాడు. పురుషులనుకూడా సానుభూతితో అర్థంచేసుకోవాలనే దృక్పథం స్పష్టమౌతుంది. పితృస్వామ్యసంస్కృతి నశించే దశ స్పష్టమౌతూ స్త్రీపురుష సమానత్వపుసంస్కృతి ప్రాతపదికన ప్రజాస్వామ్యకుటుంబ పునర్నిర్మాణ దిశగా అడుగులు వేయటం, మానవసంబంధాలు, అభివృద్ధికరబాటను పట్టినట్లు తెలుస్తుంది. స్త్రీలకు ఆస్తిహక్కు లేకపోవటం, కూతురుకంటేకూడా పితృస్వామ్యంలో దూరపు వారసత్వమున్నా ఆస్తి అతనికి చెందేటట్లుగా నిర్ణయించిన పితృస్వామ్యపు న్యాయసంస్కృతి తెలుస్తుంది.

* * * * * *

5.4. నాలుగవతరం మహిళ -చదువు -వివాహం - స్త్రీపురుషసంబంధాలు -మానవత - వారసత్వపు ఆస్తిహక్కు

విశాఖపట్నం వెళ్ళిన కమలతో సత్యానికి తెలిసినవాళ్లు పరామర్శకై వచ్చి అతడు చేసిపెట్టిన సహాయాన్ని చెపుతుంటే, సత్యానికి ఇంత 'సోషల్ లైఫ్' ఉందని తనకు తెలియదని, యింతమందికి ఇష్టుడని తెలియదని కమల అంటుంది. సత్యంచివరి రోజుల్లో ప్రశాంతంగా గడిపాడని కమల తెలుసుకున్నది. కాని చివరగా అతనికి తానిచ్చిన 'హార్లిక్స్ తాగకుండా తన నిర్లక్ష్యానికి జవాబుచెప్పాడనిపిస్తోంది. పద్మ మాత్రం సత్యానికి కమలమీద సానుభూతి, అభిమానం ఉందనుకునేది. తనతో మీఅమ్మకు కోపం వస్తుందని, బాధపడుతుందని అనే వాడని, అందరూ తనని వదిలేస్తే కమలే తనను కాపాడిందని చెప్పేవాడని పద్మ తన తండ్రి మాటలను చెప్తుంటే కమల కళ్ళల్లో కాంతి కనపడేది.

కొన్నాళ్లు విశాఖపట్నంలో గడిపి కమల, సూరమ్మ తిరిగి తమ ఊరు చేరుకొన్నారు. కమల మళ్లీ ఉద్యోగంలో చేరింది. తోటి స్త్రీలందరు కమలయెడల సానుభూతి చూపిస్తూ, సహాయ, సహకారాలు అందిస్తున్నా కమలలో తెలియని ఒక అధైర్యం ఉండేది. కమల తనలోని మానసిక, శారీరక శక్తినంతా సత్యం తీసుకెళ్లాడని భావించేది. పద్మ, రామశేషులు వచ్చినప్పుడు వాళ్లు పుస్తకాలు, రాజకీయాలు, భక్తివంటి విషయాలను మాట్లాడుతుంటే కమల కాస్త ఉత్సాహంగా గడిపేది.సూరమ్మ పండ్లు, పకోడీలు చేసి పెడుతూ వాళ్లతో తన చిన్ననాటి కబుర్లు చెప్పేది. వాళ్లు వెళ్లిపోగానే కమలకు జీవితం మళ్ళీ శూన్యంగా అనిపించేది.

కమల మధ్యమధ్యన స్కూల్‌కి సెలవుపెడుతుంటే అల్లుడిమీద బెంగపెట్టుకున్నావా? అని సూరమ్మ అడుగింది. తనని ఈ వయస్సులో అనుమానించినందుకు సూరమ్మకు మతిపోతోందనుకుంది కమల. సూరమ్మ మాటలకు భయపడ్డ కమల అల్లుడితో ముభావంగా ఉండేది. అంతా

శూన్యంగా అనిపించి కమల స్కూల్‌కి వెళ్ళటం మానేసింది. సత్యంలాగా అన్నింటిని తాను వదులుకోలేదు కాబట్టి సూరమ్మ బతికినన్నాళ్లు తాను బతికి ఉండాలనుకొనేది. పైకిచెప్పుకోలేని భయంకర స్థితిలో తాను చిక్కుకున్నట్లు కమలకు అనిపించింది. కమలకు ఆకలి తగ్గి నీరసంగా ఉంటుంది. శరీరం బెండులాగా ఎముకలు పొడుచుకొచ్చి మొత్తంమీద తనలో ఏదో మార్పు కలుగుతోందనిపించిది కమలకు. సూరమ్మ యింకా గతకాలం కబుర్లు చెబుతుంటే కమలకు విసుగ్గా ఉండేది. పద్మ, రామశేషు వచ్చారు. కమలకు కామెర్లు ముదరటంతో ఆసుపత్రిలో చేర్పించినా ఫలితం లేకపోయింది. కమల కన్నుమూసింది. కమల అనారోగ్యం తెలియని సూరమ్మ తాను కమలను చిన్నప్పటినుండి ఎలా పెంచింది చెపుతుంటే ఎవరూ వినిపించుకొనేవారుకాదు. పక్కయింటివాళ్ళు అన్నంతెచ్చిస్తే ఆకలికి ఆగలేక సూరమ్మ ఆబగా తినేది. కమల తన ఆఖరి క్షణంలో సత్యం తనని రమ్మంటున్నాడు, వస్తున్నానని, భర్తను ఉండమంటూ కమల తన ఆఖరి శ్వాసను విడిచింది. రామశేషు కష్టం వచ్చినప్పుడే ధైర్యంగా ఉండాలని పద్మను ఓదార్చాడు. సత్యం పోయినప్పటినుండి కమల ఆరోగ్యం బాగాలేదని అందరు వచ్చి చూసి వెడుతుంటే ఆమెకు ఇంతబలగం ఉందా అని పద్మ ఆశ్చర్యపోయింది. ఆమె స్కూల్ టీచర్లు భౌతికకాయం వెంట నడిచారు. రామశేషు కమలచితికి నిప్పుపెట్టాడు. రామశేషు స్మశానంనుండి రాగానే పద్మ మమ్మీ అంటూ పెద్దగా ఏడ్చినా, సూరమ్మ కూతురు చనిపోయినట్లు తెలుసుకోలేక పోయింది. కమలను ఎక్కడ దాచారంటూ అడుగుతుంటే ఆ వృద్ధురాలిని పద్మ అత్తగారు వాళ్లు ఓదార్చారు. పద్మ తన తండ్రికోసం ఏడుస్తోందనుకొన్న సూరమ్మ సత్యం వస్తాడనిచెప్పి పద్మను ఓదార్చేది. సూరమ్మకు ఆకలి అయి అర్ధరాత్రిలేచి అన్నంపెట్టమని అడిగి తినేది. మతిపోయిన పెద్దావిడనుచూసి తోడికోడళ్ళు నవ్వుతుంటే పద్మకు కోపం వచ్చేది. కమల యింటిపేరుగలవాళ్ళు ఎవరూ లేరని, ఎవరికీ మైల లేదంటే పద్మకు దుఃఖం వచ్చి సంప్రదాయాలమీద కోపం వచ్చేది.

ఆడపిల్లకు పెళ్ళయితే తల్లిదండ్రులకు ఏమీకాకుండా పరాయిదయిపోయి పుట్టింటివారితో సంబంధం లేకుండాఉంటుందా? ఆస్తిహక్కు లేకపోయినా, ప్రేమలో, కష్టసుఖాలలో సమానత్వం ఉండకూడదా! అని, ఆలోచిస్తూ తనకు తల్లియింటిపేరుతో సంబంధంలేదన్న ఆచారాన్ని పద్మ ఏవగించుకొంది.

సూరమ్మను తీసుకొని యిల్లు అద్దెకు యిచ్చివిశాఖపట్నం వెళ్లాలనుకొని సామాన్లు సర్దుతుంటే పద్మకు లాకర్లో ఒక ప్లాస్టిక్ కవరు కన్పించింది. దానిని తీసి చూడగా పద్మ చిన్నప్పటి బూట్లున్నాయి. వాటినిచూసి ఏడుపువస్తుంటే పద్మ 'ఏ తల్లీ యింత మమకారంతో పిల్లలను పెంచుకోకూడదని అనుకొంది. ఇంకా ఇన్సూరెన్సుకాగితాలు, పాతికేళ్ళనాడు రాయించిన దస్తావేజులు ఉన్నాయి. మర్నాడు ప్లీడర్ని పిలిపించి సూరమ్మగారి ఆస్తిమీద సర్వహక్కులు కమలపేరుమీద ఉన్నట్టు ఉంది. కాని ముందుగా కమలపోవటంతో ఆస్తి తిరిగి దాతకే చెందుతుందని ప్లీడరు చెప్పాడు. ఎనభైనాలుగేళ్ళ సూరమ్మ కుటుంబంలో ఆమె ఒక్కతే మిగిలింది. చట్టందృష్టిలో వివాహితస్త్రీకి పుట్టింటి ఆస్తిరాదని, సూరమ్మమనోవర్తితో కొన్న ఆస్తికాబట్టి ఆమెతరపువాళ్ళుఎవరైనా ఉన్నారా అని ప్లీడరు అడిగి, సూరమ్మ బతికినప్పుడు ఎవరూ చూడకపోయినా ఆమె ఆస్తి మాత్రం వారసులకు చెందుతుందన్నాడు.సూరమ్మ దత్తత తీసుకొని పెంచుకొన్నాకూడా కమల ఆడపిల్లకాబట్టి ఆస్తి రాదని చెప్పాడు. అప్పటికింకా అంధ్రదేశంలో కూతురుకి ఆస్తి హక్కు రాలేదని అర్థమౌతుంది. అంటే ఇది 1985 కు ముందుజరిగిన విషయం.ఇప్పుడు పద్మ పేరునరిజిష్టరు చేయటానికి సూరమ్మచేత సంతకం చేయించాలనుకొన్నారు. ఆ ప్లీడరు కమల స్నేహితురాలి భర్త అవటంచేత తాను అన్నీ చేయించి పెడతానన్నాడు. కాని ఆ సమయానికి మహిళలకు ఆస్తిహక్కురావటంలో కమలపేరున ఉన్న ఆస్తికిపద్మ వారసురాలయ్యే అవకాశంకూడా వచ్చి ఉంటుంది. పితృస్వామ్యంలో స్త్రీలకు వారసత్వ ఆస్తిహక్కులేకుండా చేయటానికే వివాహానంతరం యింటిపేరును మార్చే సంస్కృతిని అభివృద్ధిచేయటం జరిగింది. పరిస్థితులు ఊహించని విధంగా మారిపోతున్నాయి. ఆ తరం ముసలివాళ్లు సొమ్ము కూడపెడితే

తామిప్పుడు సామాన్లు పోగేస్తున్నామని రామశేషు అనుకొన్నాడు. పద్మ, రామశేషుకలిసి సామాన్లన్నీ సర్ది ఇంటికి తాళంపెట్టి, కమలవస్తేకాని తాను రానని సూరమ్మ అన్నా ఆ పండుముసలమ్మను టాక్సిలో బలవంతంగా ఎక్కించి విశాఖపట్నానికి ప్రయాణమయ్యారు. ఇక సూరమ్మజీవితంలో మరో అధ్యాయం మొదలైంది.

పద్మకు జీవితం ఎంత కఠినమైందో తెలిసి వస్తోంది. కమల బతికి ఉన్నప్పుడు చదువు,ఉద్యోగం,పెళ్ళి,భర్త,పిల్లలువంటి కమ్మని కలలతో సాగింది. పద్మకు దైహికశ్రమ, మానసిక వత్తిడి లేకుండా కమల, రామశేషులు చూసుకునేవారు. ఇప్పుడు సూరమ్మను ఎలా చూసుకోవాలో పద్మకు తెలియటంలేదు. సూరమ్మ కొన్నిసార్లు మతిస్థిమితం లేనిదానిలాగా, మరికొన్నిసార్లు పసిపిల్లలాగా ప్రవర్తించేది. పద్మకు ఎందుకలా చేస్తోందో అంతుబట్టేదికాదు.

సూరమ్మను పిల్లలగదిలో పడుకోపెడితే ఆమె పెద్దపెద్దగా పద్యాలు చదువుతుంటే తాము చదువుకోలేక పోతున్నామని పిల్లలు గగ్గోలు పెట్టేవారు.పైకి చదవద్దంటే సూరమ్మకు కోపం వచ్చేది. తనకు స్వతంత్రంలేదని, పరాయికొంపలో పడి అఘోరిస్తున్నానని, నోరు తెరిస్తే కూడా ఊరుకోకపోతే తానెలా బతకగలననేది. ఎవరన్నా యింటికి వస్తే వాళ్ళకు పెళ్ళయిందా అని, ఎంతమంది పిల్లలు అని అడుగుతూ చికాకు కలిగించేది. పద్మ ఆఫీసు వాళ్ళువస్తే వాళ్ళముందు అన్నంపెట్టమని గోలచేసేది. ఆమెను బాల్కనిలో పడుకోపెడితే కిందకు నీళ్లుపోస్తే, కింది యింటివాళ్లు అరుస్తున్నదానికి సూరమ్మను పద్మ అడిగితే తాను పండ్లతొక్కల్ని బుట్టలోవేసానని అబద్ధం ఆడేది. బాత్‌రూమ్‌కి తీసికెళ్లినప్పుడు మూత్రం రాదనేది. తరువాత బాల్కనీలో పోసేది. కిందవాళ్ళు దోమలు కుడుతున్నాయని అనేవాళ్లు. అభద్రతతో సూరమ్మ అబద్దాలు ఆడేదని అర్థమౌతుంది. సూరమ్మపనులతో పడలేక పద్మవాళ్ళునాలుగు యిళ్ళుమారాల్సివచ్చింది. సూరమ్మకోసం కాలేజికి దూరమైన పద్మకు కిందయిల్లు ఒకటి అద్దెకు దొరికితే

తీసుకుంది. సూరమ్మ తనవల్ల పద్మకు కష్టాలు వచ్చాయనుకొంది. ఆమెను కార్లో కొత్తయింటికి తీసుకెడుతుంటే తనయింటికి తీసుకెళ్ళమనేది. అక్కడ ఎవరూ లేరంటే తనకూతురు తనని అన్యాయం చేసిపోయిందని ఏడ్చేది. సౌజన్య క్రాఫ్, నిక్కరు, టీషర్టు వేసుకొంటే సూరమ్మకు నచ్చక ఆడపిల్ల ఆడపిల్లలాగా ఉండాలనేది. గతంలో పద్మషోకులను విమర్శిస్తుంటే పద్మతన శరీరం తనయిష్టమని అంటే కమల ఊరుకొనేదికాదు. కాని యిప్పుడు పద్మ సౌజన్యను ఏమి అనటంలేదని సూరమ్మ దెప్పిపొడిచేది. సూరమ్మ ఎప్పుడూ తనడబ్బు అంటుందని సౌజన్య ఆవిడ డబ్బు ఆవిడ ముఖాన కొట్టమనేది.

సూరమ్మ తనని దేవుడు తీసికెళ్ళటంలేదని, తాను దిక్కులేనిదాన్నంటూ తనని సముద్రంలో పడేయమనేది. పద్మ సౌజన్యతో వృద్ధురాలిని అర్థంచేసుకోమనేది. సూరమ్మ అరుపులు సందుచివరివరకు వినపడేవి. రామశేషు పద్మతో తనతల్లితన పెద్దమ్మను చూసుకొన్న విషయాన్ని చెప్పేసరికి పద్మ తనతల్లి యిద్దరు పెద్దలను పెట్టుకొని ఎలాచేసిందో అన్నది. పద్మ తనలో ఓర్పు, సహనంపోయాయని అంటే సూరమ్మతాను అలా ఉండాలని ఉండటంలేదని, తోచక, ఒంటరితనాన్ని భరించలేక ఆమెను పట్టించుకోవటం కోసం యిలాచేస్తోందని రామశేషు అన్నాడు.

అంతేకాదు, తనని నిర్లక్ష్యంచేస్తున్నారని అనుకొన్నప్పుడు యిలా ప్రవర్తిస్తుందని, తన ఉనికిని గుర్తించటానికి ఈ హడావుడి చేస్తోందని, దానికి కాలమే పరిష్కారం చూపిస్తుందన్నాడు. సూరమ్మకు తెలివితక్కువతోపాటు మంకుతనంకూడా ఉండేది. ఇలా నాలుగుతరాలమధ్య ఉన్న అంతరాలు మానవసంబంధాలలో చిచ్చుపెట్టాయి.

పద్మలో మానసిక స్థిరత్వం తగ్గుతోంది. సమస్యలు వచ్చినప్పుడే మానవుల శక్తి తెలుస్తుందంటాడు రామశేషు. పిల్లలచదువులు పాడైపోతాయని పద్మ భయపడేది. తనకు అన్నీఉన్నా భయాన్నిమాత్రం తాను నియంత్రించుకోలేక పోతున్నానని పద్మ అంటే సూరమ్మ మనసులో ఎన్నిభయాలున్నాయో ఆలోచించమంటాడు రామశేషు. చిన్నప్పటినుండి సూరమ్మ ఓ సుఖం

ఎరుగలేదని, పెంచిన కూతురు, తన అక్క కొడుకు సత్యం తన కళ్ళఎదుటే చనిపోతే, ఆమెలో ఎంతటి అభద్రతా భావం ఉంటుందో ఆలోచించమంటాడు. అందుకే ఆమె అలా భయపడుతుందని నచ్చ చెపుతాడు. సూరమ్మ ఎప్పుడు ఎలాప్రవర్తిస్తుందో పద్మకు అర్థమయ్యేది కాదు. సూరమ్మ గది తలుపులు తీసుకొని బయటకు రావటం మొదలుపెట్టింది.ఇంట్లో సూరమ్మను చూసుకోవటానికి పనిమనిషిని పెట్టింది పద్మ. ఒకరోజు పనిమనిషి రానప్పుడు, సూరమ్మకాలుజారి పడి రక్తం గడ్డకట్టినప్పటికీ ఆమెకు తెలియలేదు.పద్మ డాక్టరుకు చూపించి కట్లుకట్టించింది. తాను సూరమ్మను ఎప్పుడూ ఒంటరిగా ఉంచకూడదనుకొంది.మంచి పనిమనిషిని పెట్టింది. పద్మకు కాస్త విశ్రాతి దొరికింది.

ఒకరోజు పనిమనిషి తన కూతురు దగ్గరకు వెళ్ళేందుకు సెలవుతీసుకొంది. ఆ తరువాత ఎప్పుడైనా పనిమనిషి లేనప్పుడు పద్మ బయటకు వెళ్లాల్సివచ్చి యింటికి తాళంవేసి వెడితే, తనని జైల్లోపెట్టారని అరిచేది. రోడ్డుమీద బస్సుఢీకొని చస్తే బాగుండేదని, తనని దేవుడు మర్చిపోయాడని వెక్కివెక్కి ఏడ్చేది. ఒకరోజుపద్మ కాలేజినుంచి యింటికి వచ్చేసరికి యింట్లో సూరమ్మ కనపడలేదు. పద్మకు భయమేసింది. పద్మ వీధులు వెదకుతుంటే పక్కవాళ్ళయిళ్లు, పద్మను ఉద్యోగం మాని ముసలమ్మను చూసుకోమని సలహాలిచ్చారు. ఎవరైనా గుర్తుపట్టటానికి ఫొటో యిద్దామన్నా తన అమ్మపెళ్లినాటి ఫొటోతప్ప తనదగ్గర ఏమీ లేదని పద్మ తాను ముసలావిడమీద మరింత శ్రద్ధపెట్టి ఉంటే బాగుండేదని, ఆమె వెళ్లిపోకుండా ఉండేదని తను తప్పుచేసినట్లుగా ఆ రాత్రంతా కుమిలిపోయింది.

తొంభైఏళ్ళు దాటిన సూరమ్మ తన యింటికి వెళ్ళాలనే తపనతో తన ట్రంకుపెట్టెలో దాచుకొన్న డబ్బును తీసుకొని ఒకపిల్లవాడి సాయంతో రైలుటిక్కెట్టుకొనుక్కొని తన ఊరికి వెళ్లింది. అప్పుడు రాత్రి కావటంతో తన యింటి అరుగుమీద ముడుచుకొని పడిపోతుంది. ఆ యింట్లో అద్దెకున్నవాళ్ళు తిట్టుకుంటుంటే పాలుపోయటానికి వచ్చిన పాలమనిషి ఆమెనుగుర్తించి,

ఆయింట్లోఉన్నవాళ్ళకు ఆమె గురించి చెప్పాడు. వాళ్ళు పద్మవాళ్ళకు ఫోన్ చేస్తే పద్మకు ప్రాణంలేచివచ్చింది.

రామశేషువెళ్లి సూరమ్మతో ఒక్కరూ రైలు ఎక్కి ఎలా వచ్చారని, డబ్బు ఎక్కడిదనీ అడిగితే, తన ఊరిని, తన యింటిని చూడాలనిపించిందని, అందరిని కష్టపెట్టటం యిష్టంలేక తాను ఒక్కతే వచ్చినట్టు సూరమ్మచెప్పింది. రామశేషు సూరమ్మను తిరిగి తామున్న ఊరికి తీసుకువచ్చాడు. పద్మకు కోపం వచ్చింనందుకు వృద్ధాప్యం, బాల్యం ఒకటే అని అంటాడు రామశేషు. ఇంటికి వచ్చిన సూరమ్మమాత్రం తనకేమి తెలియదన్నట్టు ఉండేది. అయితే సూరమ్మ తన ఊరికి వెళ్లివచ్చిన తరువాత ఆమెకు కొత్తశక్తి, కొత్తకంఠం వచ్చినట్లుగా ఉంది.

సూరమ్మకు చివరలో బతకాలని ఉండేదికాదని అర్థమౌతుంది. తనకోసం పద్మవాళ్లు ఎంత కష్టపడుతున్నారో అర్థం చేసుకొలేకపోయింది. పైపెచ్చు తన వాళ్ళందరిని, కూతురిని, సత్యాన్ని మింగేసానని, తానింకా బండరాయిలా బతికున్నానని, తనని తీసుకెళ్ళమని దేవుడికి చెప్పమని, నిర్భాగ్యురాలిపై మృత్యువుకుకూడా దయలేదని అంటుంటే ఈ ప్రాణానికి విముక్తి లభిస్తుందా అని పద్మవాళ్ళు ఆలోచించేవారు. తనయింట్లో ఏమైనా అసౌకర్యంగాఉందా అని అడిగితే చిన్నపిల్లచేత చేయించుకుంటుంటే తనకు పుట్టగతులుండని, మరోజన్మ అంటూ ఉంటే ఆ యింటికుక్కలా పుట్టి పద్మ రుణం తీర్చుకుంటానని అనేది. తనకోసం యితరులు కష్టపడుతున్నారనే స్పృహ మాత్రం సూరమ్మకి ఉండేది.

తనకూతురు ఉంటే తనకీ ఈ గతి ఉండేది కాదంటుంటే ఆవిడబాధ నిజమనిపిస్తుంది. తన కూతురు తనని మోసంచేసి వెళ్ళిపోయిందని అంటుంది. పద్మ సూరమ్మతో ఎవరినైనా చూడాలని ఉందా అని అడిగితే తనకెవరూ లేరని తనే అమ్మని, అన్నలను, అక్కని, కూతురిని పంపానని, తనని సాగనంపటానికి ఎవరూ లేరనేది. పద్మ తామున్నాముకదా అని అంటేవాళ్ళకు కష్టం కలగకుండా పోతేచాలని అంది. పద్మ సూరమ్మను యిక్కడకాక ఎక్కడ

ఉంటావని అడిగితే ఎక్కడికెళ్లాలో తెలియని బాధతో భగవంతుడు తనను బతికుండి పక్కవాళ్ళను ఏడిపించుకొని తినమని శాపంపెట్టాడని అంది. అప్పుడు పద్మ నీకూతురుంటే ఇలా అనేదానివా అంటే, తానుకూతురుని చిన్నప్పటినుండి పెంచి పెద్దచేసానని, కూతురు బతికుంటే తనకి ఆధారమయ్యేదని, తనని ఒక్కరోజుకూడా కూతురెప్పుడు కసురుకోలేదని, విసుక్కోలేదని అంది. అంటే ఆధునిక కాలంలో ఆడవాళ్ళు ఉద్యోగం చేసుకొంటూ వృద్ధాప్యం వచ్చిన తనలాంటివారికోసం కష్టపడటం చూడలేక తాను నాలుగోతరం వరకు బతికుంటే తనకు ,తన పక్కవాళ్ళకుకూడా కష్టమనుకునేది సూరమ్మ. సూరమ్మ ఒకసారి తన ఊరువెళ్లితన ఇంటికి వెళ్లివచ్చిన తరువాత ఆ ఒంటరితనం తగ్గి తనకిక జీవితంలో తాపత్రయ పడాల్సిన విషయాలు లేవనే వేదాంతధోరణి సూరమ్మకు ఎక్కువయింది. తల్లీకూతుళ్ళు ఇద్దరు అరుచుకొన్న రోజులున్నాయని పద్మకు తెలుసు. కాని కూతురుమీద ప్రేమ వాటన్నింటిని మరిచిపోయేటట్టుచేసిందని పద్మ గ్రహించింది. ముసలావిడ చిన్నపిల్లగా అనిపించి సూరమ్మకు కావాల్సినవన్నీ చేసిపెట్టాలనుకొంది. తనకే పిండివంటలు వద్దని, గుప్పెడు మెతుకులు చాలనిచెప్పినా పద్మ హోటల్ నుండి తెప్పిస్తే ఆబగా తినేది. అంటే పద్మ కష్టపడకూడదని అనుకొని సూరమ్మ తనజిహ్వాచాపల్యాన్ని కూడా చంపుకొన్నది.

సూరమ్మపిల్లలమీద, పనిమనిషిమీద తన దూకుడు తగ్గించి మంచంమీద పడుకొని గదికప్పువైపు చూస్తూ పడుకొనేది. పద్మకు ఏమి ముంచుకొస్తుందోనని భయం ఉండేది. పద్మకు తన ఫ్రెండ్స్ యింటికి వస్తారంటే భయం కలగటంతో వాళ్లతో గడిపే అవకాశంలేక పోయేది. కాలేజినుండి యింటికి వస్తున్నప్పుడు దారిమధ్యలోనే యింట్లో ఏమిగొడవలు ముంచుకొస్తాయో ననే అలోచనలతో సతమవుతుంటే పద్మకు మనశ్శాంతిలేకపోయేది. పద్మకు సమస్యలుతప్ప సరదాలు ఉండేవికావు. సూరమ్మవచ్చి ఆరేళ్లయింది పద్మ తన ప్రమేయం లేకుండానే తాను

సుడిగుండంలో చిక్కుకున్నట్టుగా అనుకొనేది. పద్మకు ఇంట్లోకంటె బయటకెళ్లినప్పుడు ధైర్యంగా ఉండేది. సూరమ్మ సరిగా అన్నంతినకపోతే డాక్టరుకు చూపిస్తే ఆమెకు ఆకలి వేసిందని అడిగినప్పుడు మాత్రమే పెట్టండని చెప్పి, ఆమెకూడావచ్చిన పద్మ ఆరోగ్యం సరిగా లేదని పద్మ మానసికంగా కుంగిపోయిందని, ఆమెకు ఒకనెల రోజులు విశ్రాంతి అవసరమన్నాడు డాక్టరు.

పద్మకు షుగరుపెరిగి ఒకరోజు తలతిరిగిపడిపోవటంతో తనకు విశ్రాంతి కావాలనుకొంది. పద్మకు యిష్టంలేకపోయినా రామశేషు పద్మను కొన్నాళ్ళు ఎక్కడికైనా తీసుకెళ్ళాలని అనుకొన్నాడు. సూరమ్మను ఒక వృద్ధాశ్రమంలో చేర్పించాడు. పద్మ, తాను ఆసుపత్రి నుంచి తిరిగివచ్చిన తరువాత తాామువచ్చి ఆమెను తీసుకొని వెడతామని సూరమ్మకు నచ్చచెప్పారు.పిల్లలను స్నేహితుల దగ్గర ఉంచి, ఊరు వెళ్ళినా పద్మకు తనతల్లి జ్ఞాపకాలకు ద్రోహంచేసిన ముసలమ్మను అలావదిలివేసి వచ్చినందుకు తప్పుచేసాననే పశ్చాత్తాపంతో సూరమ్మమీద పద్మ బెంగపెట్టుకుంది.

రామశేషు, పద్మావాళ్ళుయిరవై రోజులపాటు సెలవుపెట్టి ఊళ్ళు తిరిగివస్తారు. వచ్చిన రెండురోజులు తనకు క్యాంప్ ఉందని రామశేషు, తానువచ్చాక మామ్మగారిని యింటికి తీసుకొద్దామన్నాడు. అతడు ఊరునుంచి రాగానే సాయంత్రం ఆశ్రమానికి వెళ్ళి సూరమ్మను యింటికి తీసుకొద్దామనుకుంటుండగానే ఆశ్రమంనుండి ఫోన్ వచ్చింది. సూరమ్మకు రెండురోజులనుండి విరేచనాలు పట్టుకొన్నాయని, వైద్యుడికి చూపించినా ప్రయోజనంలేక పోయిందని, క్రితంరోజు ఆమె మరణించిందని, ఫోన్ చేస్తే అందుబాటులో లేరని, ఆమె విరేచనాలతో చనిపోవటంతో శవాన్ని ఎక్కువరోజులు ఉంచలేకపోయామని చెప్పారు. మిగతావృద్ధులు భయపడకూడదు కావున ఆశ్రమ పద్ధతి ప్రకారం క్రితంరోజే ఆమె అంత్యక్రియలు జరిపించామని, ఆమె తాలుకు వస్తువులను తీసికెళ్ళవలసిందని ఆశ్రమంవాళ్ళు చెప్పారు. పద్మ తనకు అమ్మమ్మచివరిచూపులు దక్కనందుకు

దుఃఖపడి, అప్పటికప్పుడే ఆశ్రమానికి వెళ్లి సూరమ్మపడుకొన్న మంచం ఉండే చోటుకు వెళ్ళిగుండె పగిలేలా ఏడ్చింది. ఆరేళ్లుపాటు తనదగ్గర ఉంచుకొని చివరికి ఏకాకిని చేసినట్టు పద్మ బాధపడింది. అమ్మమ్మ తనమీద బెంగతోనే పోయిందనుకొంది. అక్కడఉన్న నర్సులతో సూరమ్మ చివరి క్షణాలలో ఎవరినైనా అడిగిందా అని అడిగితే ఆమె చివరగా, తన బుల్లన్నయ్యను పలవరించిదని, సత్యం అనే అతడ్నిఅడిగిందని, కమలవచ్చిందా అని అడిగిందని, చిన్నక్కను అడిగిందని ఒకనర్సు చెప్పింది. పద్మ తనని అడగలేదా అంటే ఆనర్సు అడిగే ఉంటుందిగాని గుర్తులేదని అంటుంది. పద్మ తనతల్లి కమలకంటేకూడా సూరమ్మకోసం ఎక్కువ బాధపడింది.

సూరమ్మపోయిన అయిదారు నెలలకు ఆమెకు ఉన్న యింటిని రామశేషు అమ్మకానికి పెడితే, లక్షరూపాయలు వచ్చాయి. ఆ డబ్బును సుధీర్‌కి, సౌజన్యకు చెందుతుందని, వాళ్ళ చదువులకోసమని పద్మ ఫిక్సెడ్ వేయించింది. కాని రామశేషుకు ఆ డబ్బునువాడటం యిష్టంలేదు. యిప్పుడు సౌజన్యఉన్నత చదువుకోసం స్టేట్స్‌కి(అమెరికా) వెడుతుంటే సూరమ్మడబ్బును వాడారు. అందుకే పద్మకు సౌజన్యను అమెరికా విమానం ఎక్కించినప్పుడు గతరోజులు గుర్తుకొచ్చాయి. ప్రపంచీకరణ సందర్భంలో నాలుగవ తరానికి చెందిన సౌజన్య అమెరికా ప్రయాణానికి, సూరమ్మపెళ్లినాడే అంటే 1900 సంవత్సరపు మొదటి దశకంలోనే బీజాలు పడ్డాయి.

నాలుగోతరానికి చెందిన చిన్నపిల్లలకు పెద్దలపద్ధతులు నచ్చకపోవటం, ఇద్దరిమధ్య సర్దిచెప్పలేని తల్లిదండ్రులు, మొదటితరం వృద్ధులను చూడాల్సిన విధానం, వృద్ధులమనస్తత్వాలు, మహిళలు యింటాబయట వత్తిడికి తట్టుకొని నిలదొక్కుకునేతత్వంలేక మానసిక అశాంతికి గురికావటం, కలిసి వెరసి మానవసంబంధాలు పలచబడి బలహీన పడిపోతున్నాయి. ప్రపంచీకరణ మనుషులను భౌతికంగాకూడా దూరంచేస్తోందనే విషయాలతో 20 వ శతాబ్దం ముగిసింది.

* * * * * *

6. నవలాశిల్పం - ముఖ్యపాత్రల విశ్లేషణ

'శతాబ్దిసూరీడు' అనే ఈ నవలలో ప్రధానంగా నాలుగు స్త్రీపాత్రలు, నాలుగు పురుషపాత్రలు కథావికాసానికి తోడ్పడుతూ రచయిత్రి చెప్పాలనుకొన్న జీవితసత్యాలను సామాజిక జీవనసంస్కృతిని నవలాశిల్పంలో ప్రతిఫలింపచేసాయి. తమ చర్యలు, కదలికలు, సంభాషణలు, అనుభూతులు, సంఘర్షణద్వారా వ్యక్తం చేస్తూ ఆయా పాత్రలు కథను నడిపించటమే సజీవపాత్రచిత్రణ. ఆనుషంగికంగా ప్రాధాన్యత, నిడివి తక్కువ ఉన్నపాత్రలు కూడా కథను నడిపించటంలో తమవంతు భాగస్వామ్యాన్ని సమంజసంగా నిర్వహించాయి.

స్త్రీలపై లైంగిక అదుపు రూపంలో స్థిరపడిన పితృస్వామ్యంలో వివక్షాసంస్కృతి అంతస్సూత్రంగా ఉన్నదనే విషయం కథాసంవిధానంలోని సంఘటనలలోను, పాత్రల సంభాషణలలో, సంఘర్షణలలో స్పష్టమవుతుంది. అందుకే కథావస్తు విశ్లేషణలోనే అది అర్థమవుతుంది. స్త్రీలలైంగికతపై అదుపుకై పితృస్వామ్యసంస్కృతి నిర్దేశించిన మహిళాసంస్కృతి అర్థమైతేనే, అది తిరస్కరణకు గురిఅవుతుంది. దాని ఫలితమే మానవజీవన అభివృద్ధి అనికూడా అర్థమౌతుంది. ఈ నవలలోని పాత్రలన్నీ సామాజిక వాస్తవజీవన చిత్రణలోనుండి పుట్టటంతో అవి సజీవంగానే అర్థమౌతాయి.

నవలలోని ఒకశతాబ్దపుకాలపు కథలో మొదటినుండి చివరివరకూ తన ఉనికి ప్రభావాన్నిచూపిన సజీవపాత్ర సూరమ్మ. ఒక శతాబ్దపు ఆరంభంనుండి మొదటితరానికి చెందిన పాత్రద్వారా మొదలైన కథ, ఆ శతాబ్దపు చివరితరంవరకు విస్తరించి సూరమ్మపాత్ర చిరంజీవిత్వాన్ని పొందింది. సూరీడుగా చెప్పబడే సూరమ్మ పితృస్వామ్యసంస్కృతికి బలియైనపాత్ర. గతశతాబ్దపు చరిత్రను స్మరించుకొంటే ఆనాటి వాస్తవసమాజంలో జీవించి ఎన్నిశతాబ్దాలకైనా కళ్ళముందు గోచరమయ్యేజీవి సూరమ్మ. ఆచరణాత్మకమైన పితృస్వామ్య సంస్కృతికి మూర్తిమత్వమే ఈనవలలోని

సూరమ్మపాత్ర. అందుకే సూరమ్మపాత్రచిత్రణను వివరించటమంటే పితృస్వామ్య సంస్కృతిని వ్యాఖ్యానించటమే. అందుకే సూరమ్మజీవితం పితృస్వామ్య సంస్కృతి నుంచి విడదీస్తే అర్థమయ్యేది కాదు. అప్పుడే కథాగమనంలోనే సూరమ్మపాత్రచిత్రణపై సరైన అవగాహన ఏర్పడుతుంది. రచయిత్రి పితృస్వామ్యమనే పదాన్ని వాడలేదుగాని, సమాజంలో పితృస్వామ్య సంస్కృతి వాస్తవ విన్యాసాన్ని ఈ శతాబ్దపుజనం అర్థంచేసుకొని వివక్షాస్వభావాన్ని వదిలించుకోవటాని కివీలుగా సూరీడు పాత్రసృష్టి జరిగింది. అందుకే ఆ పాత్ర సజీవపాత్రగా అనిపిస్తుంది. కథాగమనంలో, పాత్రచిత్రణలో సామాజిక పితృస్వామ్యసంస్కృతిని స్ఫురింపచేయటం ఈ నవలాశిల్పపు ప్రత్యేకత. ఈ క్రమంలోనే సూరీడు జీవితాన్ని సందర్భానుసారంగా బలిపెట్టిన సంస్కృతీస్వభావాన్ని తెలుసుకోగలిగితే గతశతాబ్దంలో స్త్రీలు ఎటువంటి సంస్కృతీచట్రాలమధ్య నలిగి కృశించారో, నాటి స్త్రీలజ్ఞానం, శక్తిసామర్థాలు సమాజానికి పనికిరాకుండా పోయాయో తెలిసి, ఈశతాబ్దంలో పునర్నిర్మాణం చేసుకోవాల్సిన సంస్కృతిని అభివృద్ధికరం చేసుకోవటానికి తగిన చైతన్యాన్ని అందించే నవల యిది. పితృస్వామ్యసంస్కృతిని తన జీవితంలో చివరివరకూ పాటించి బతికిన సూరమ్మలో మానవీయత ప్రత్యేక విలువైనది. ఆడపిల్లను అవాంఛనీయబిడ్డగా భావించే సమాజంలో సూరమ్మలోని మానవత్వం ఒక ఆడపిల్లను బతికించి మహిళాతరాల ఆభివృద్ధికి బాటలువేసిందనే స్పృహ ఆమెను ప్రధానపాత్రగా రూపుదిద్దుకునేటట్టు చేసింది. సూరమ్మ మానవీయత ఆమె ఉనికికి విలువనిచ్చింది. దానికోసంకూడా సమాజందృష్టిలో అవాంఛనీయముఖంగా భావింపబడే వితంతువుకు ప్రాధాన్యతనిచ్చి సృజన చేయటం ఈ నవలాశిల్పంలోని ప్రత్యేకత.

1) సూరమ్మ / సూరీడు

కథాప్రారంభంలోనే ఏడేళ్ళ పెళ్ళికూతురుగా 'శతమానం భవతి', 'దీర్ఘసుమంగళీభవ' అనే దీవనలతో మొదటితరానికి చెందిన సూరమ్మపాత్ర ప్రవేశిస్తుంది. అంటే సూరమ్మపెళ్లి తాలుకుప్రభావం నవలఅంతా ప్రాధాన్యతను సంతరించుకొంది. కాబట్టే నాలుగోతరానికి చెందిన సౌజన్య అట్లాంటా ప్రయాణానికి వీలయిన విషయం అవటంతో ముందుగా పద్మచేత తలపింపచేసిన పాత్ర సూరమ్మదే. గత శతాబ్దపుమొదటి ఐదేళ్ళకాలంనాటికి సూరమ్మకు ఏడేళ్లని చెప్పటంచేత సూరమ్మ సుమారుగా కాలమానంప్రకారం 1898లో పుట్టిఉండాలి. తొంభైఆరేళ్ళు దాటేంతవరకు జీవించిందంటే బహుశ సూరమ్మ1995 వరకు బతికిఉందనుకోవాలి. గతశతాబ్దపుచరిత్ర కాబట్టి మనకు చాలాదగ్గరగా ఉండటంతో, సూరమ్మను సజీవంగా చూసామనే భావనఉంటుంది. ఈమె పెళ్ళినాటికి, సూరమ్మతల్లితరానికి చెందిన వివాహసంస్కృతిలో ఎటువంటి మార్పులు చోటుచేసుకోలేదు. అష్టమగర్భాన, ఆదివారంనాడు పుట్టటంచేత సూరమ్మ అనిపేరుపెట్టారనే దానికంటే, సూరమ్మ తన వెనకాల రెండుతరాలవారైన కమల, పద్మల జీవనవికాసానికి వెలుగులను పంచి పెట్టిందనటమే సమంజసం.ప్రధానపాత్రకు పేరు పెట్టటంలోనే రచయిత్రిచూపించిన మెలకవ నవలాశిల్పంలో ఆత్మను ప్రవేశపెట్టటమే. సమాజంలో మానవోత్పత్తిప్రక్రియలో ఇంటాబయటా తనసేవలనే వెలుగును అందించిన పరోపకారిణియైన మానవతామూర్తి సూరమ్మ. సూరమ్మకు ఐదేళ్లువచ్చేనాటికి ఆమె తండ్రిపొలంలో పాముకరచి చచ్చిపోవటంతో సూరమ్మబాల్యంకూడా నిర్జీవమవటం మొదలయింది. తల్లి నేలమీదపడి దొర్లుకుంటూ ఏడవటం, ఇంట్లో గొల్లుమనే ఏడుపులకు మరణమంటే తెలియని చిన్నిసూరమ్మ భయపడి ఏడ్చింది. ఆసమయంలో తనను ఎవరూ పట్టించుకోవటంలేదని, తాను ఒంటరిదాన్ననే భయంతోకూడిన దిగులు సూరమ్మలో చిన్నప్పుడే ఏర్పడింది. ఇలాబాల్యంలో ఏర్పడిన భావాలు జీవితాంతం ఉంటాయని మానసిక నిపుణులు చెబుతుంటారు. ఒకే

యింట్లోపుట్టిన అక్కచెళ్ళెల్లమధ్యన అశౌచికం అనే తేడాని అర్థంచేసుకోక మునుపే చీకటిగదిలో దీపం ముందు, గుండుతలమీద సైనుబట్టతో తల్లి కనపడేసరికి సూరమ్మ గుండె పగిలేలా ఏడ్చింది. తల్లికి వికారపు రూపం వచ్చేసరికి సూరమ్మకు ఆమె తనతల్లికాదని, ఆమె దగ్గరకు వెళ్ళాలంటే ఐదేళ్లసూరమ్మ భయపడే స్థితివచ్చింది. అంటే పితృస్వామ్యసంస్కృతి విశ్వరూపం ప్రకృతిసహజమైన తల్లీకూతుర్ల ప్రకృతిసహజ సంబంధాలలో, దానికి భిన్నమైన పరాయికరణాన్ని తెచ్చింది. తల్లిగుండునుగురించి బుల్లన్నయ్యను అడగ్గా తండ్రిపోయినప్పుడు తనకు, జుట్టు, బొట్టు, పువ్వులువద్దనుకొన్న తల్లి తనంతట తానే గుండుచేయించుకొందని చెప్పగా, తనతల్లికి తన తండ్రిమీదఉన్న కోపంతో తీసివేసిఉంటుందని, ఆ యింట్లో ఉండే వాతావరణాన్నిబట్టి చిన్నప్పుడే సూరమ్మ అనుకోగలిగింది. ఇది భార్యలకు భర్తలమీద కోపం ఉండేదని పరోక్షంగా తెలిపే పితృస్వామ్యం. తల్లి కొంగుపట్టుకొని తిరగాల్సిన వయసులో ఉన్న సూరమ్మ తన తల్లిదగ్గరకు వెళ్ళలేకపోయేది. తెల్లవారుతుంటే తల్లి ఎవరికంటా పడకుండా దాక్కొంటూ తిరుగుతుంటే సూరమ్మకు బాధకలిగేది. అభంశుభం తెలియని సూరమ్మలో భయం, బాధ కలిగేవి. ఆ తల్లికి భర్త బతికున్నప్పుడు ఆతని అదుపాజ్ఞలలో బతికింది, ఆ తరువాత, కొడుకుల దగ్గర తల్లికి మాట్లాడే స్వతంత్రంలేక ఎవరేమి చెప్పినా ముసుగుతో తలఆడించే బొమ్మలాగా తయారయింది. సృష్టికర్త ఆడపిల్లకు జీవాన్ని యిస్తే పితృస్వామ్యం వాళ్ళని అనతికాలంలోనే ప్రాణంలేని మరబొమ్మల్లాగా తయారుచేయగలదని పాత్రల మూర్తిమత్వం ద్వారా రచయిత్రి చెప్పకనే చెప్పటం నవలాశిల్పానికి మచ్చుతునక.

బుల్లన్నయ్య అక్షరాలను దిద్దించటంతో సూరమ్మ మరింత ఉత్సాహంగా అక్షరాలను చదవటం, రాయటం నేర్చుకొంది. సూరమ్మను ఎవరూ బడికి పంపలేదు. చుట్టుపక్కల పిల్లలతో ఆటలాడుకుంటూ ఉండేది. తండ్రిపోయిన సంవత్సరంలోపే సూరమ్మకు పెళ్లిచేస్తే తండ్రికి కన్యాదానఫలం దక్కుతుందని ఎప్పుడూ పితృస్వామ్యపు శాస్త్రాలు పట్టుకొని వేళ్లాడే చిన్నన్నయ్య

పెళ్లిసంబంధాలు చూడాలని భావించాడు. సూరమ్మపెళ్లివిషయాన్ని ఆమె కన్నతల్లితో కూడా చర్చించలేని యింటి వాతావరణం ఉందంటే సూరమ్మతల్లి తన యిష్టా అయిష్టాలను చెప్పలేని స్థితిలో ఉందనికూడా తెలుస్తుంది. సూరమ్మకు బాల్యంనుండే కొత్తమాటల అర్థాన్ని అడిగి తెలుసుకోవాలనే జిజ్ఞాస ఉండేసరికి బుల్లన్నయ్య పెద్దబాల శిక్షను తెచ్చి యిచ్చి అందులోని నీతి కథలను చదువుకోమని చెప్పాడు. దాన్ని యిష్టపడని చిన్నన్నయ్య ఆడదానికి చదువెందుకు! మగవాడు చదవక, ఆడది చదివి చెడిపోతారనే సామెతనుచక్కగా ఉపయోగించాడు. స్త్రీవిద్యావిషయంలో వివక్ష, స్త్రీల లైంగికతపై అదుపురూపంలో ఉండి పితృస్వామ్యానికి పెట్టనికోటగా తయారయింది. తనని చదువుకోవద్దన్నందుకే సూరమ్మకు చిన్నన్నయ్యఅంటే భయం. సూరమ్మజ్ఞానంతో ఎదగాలనుకొన్నా అడ్డుపడే శక్తులకు భయపడేది. అందుకే సూరమ్మ పితృస్వామ్యసంస్కృతిని జీర్ణింపచేసుకుంటూ పెరగటంతో ఆమె జీవితాంతం ఆ సంస్కృతినుండి బయటకు రాలేకపోయింది.

తండ్రి పౌరోహిత్యానికి వారసుడిగా ఉంటూ సంప్రదాయం, పరువు, ప్రతిష్ఠ అనే మాటలతో చిన్నన్నయ్య యింట్లో పెత్తనాన్ని చెలాయిస్తాడు. సూరమ్మపెళ్ళిచేసి అన్నదమ్ములు ఎవరికివారు వేరుపడదామనుకొంటారు. సూరమ్మకు ఎనిమిదవ ఏట వేదం చదువుకొని అర్చకుడిగా ఉన్న పదిహేడేళ్లకుర్రాడితో ఐదురోజుల పెళ్లిచేయగా, కొత్తబట్టలు, నగలు, పీటలమీదపక్కన పెళ్లికొడుకు దొంగచూపులు, అతడు తన చిటికిన వేలు పట్టుకోవటం, కొంగుముడులతోజరిగిన పెళ్లిసూరమ్మకు తమాషాగా అనిపించింది.

పెళ్లితో సూరమ్మ బాల్యంలోనే పెద్ద ఆరిందలా తయారయింది. వదినలు సూరమ్మచేత నోములు నోయింపచేసారు.రచయిత్రి సూరమ్మపాత్రకు బాల్యావస్థనుండే బలమైన పునాదులు వేయటం దార్శనికతగల రచయిత్రికి మాత్రమే సాధ్యమయ్యే విషయం.

ఒకరోజు తొమ్మిదేళ్ళసూరమ్మ పక్కయింట్లో బొమ్మలపెళ్ళిళ్లు చేయిస్తూ ఆడుకొంటున్న సమయంలో చిన్నవదిన తనని బరబరా లాక్కొని యింటికి తీసుకొని వెళ్ళగా, సూరమ్మతల్లి సూరమ్మతో 'నీకుచావురాలేదే, పాపిష్టిముఖందానా, దరిద్రపు ముఖందానా' అంటూ వీపుమీద చరచి తాను ఏడుస్తూ కావలించుకొనేసరికి సూరమ్మకు అర్థంకాక బిక్కచచ్చి భయంతో చూస్తుంది. తల్లి సూరమ్మను నూతిలో తోసి, తాను చస్తానని, 'దిష్టిమొహందానా వాడితోపాటే చచ్చిపో' అంది. అంటే ఆడవాళ్ళకు భర్త బతికుంటేనే జీవితం. తనలాగా కూతురు వితంతుజీవిత కష్టాలు సూరమ్మ బాల్యంనుండే పడేకంటే చచ్చిపోవటమే పరిష్కారమనే ఆ తల్లిభావన. భర్తపోయిన స్త్రీముఖం పాపిష్టిది, దరిద్రపుది అవుతుంది. పదోరోజు ఎముకలు కొరికే చలిలో సూరమ్మను కాలువదగ్గరకు తీసికెళ్లి నీళ్ళల్లో ముంచి, పుస్తెలు తీసి, బొట్టుచెరిపి బొమ్మకు చేసినట్టుచేసి, భర్తపోయాడుకాబట్టి యిక బొట్టును ఆమెపెట్టుకోకూడదన్నారు. సూరమ్మకు తన చిటికెనవేలు పట్టుకొన్న అబ్బాయి యిక కనపడడనేసరికి కడుపులోనుండి దుఃఖం తెరలుతెరలుగా వచ్చింది. చన్నీళ్ళస్నానంతోనో, భయపడటంవల్లనో, బాధకోగాని సూరమ్మకు పదిరోజుల పాటు జ్వరంవచ్చి శవంలా తయారయిందని రచయిత వర్ణించింది. అలాచెప్పటానికి కారణం పితృస్వామ్యం భర్తపోయిన స్త్రీని శవంలా తయారుచేస్తుందనే రచయిత భావన నిజమనిపిస్తుంది. తొమ్మిదేళ్ళ సూరమ్మను బయటకు వెళ్ళొద్దని, రంగుపరికిణీలుకాకుండా చీరె కట్టుకోమనటం వంటి కట్టుబాట్లలో తనవైధవ్యానికి కారణంగాతన ప్రమేయం అర్థంగాక అయోమయానికి సూరమ్మ చేరుకొంది. అంటే వితంతువుశరీరాన్ని తనది కాకుండాచేస్తూ, మెదడుని మొద్దుబారేటట్లు చేసిన సంస్కృతి స్పష్టమౌతుంది.

సూరమ్మను ముందుగదిలోకి రావద్దంటూ ఆమెను వంటయింటికి పరిమితంచేసే విధంగా పనులను పురమాయించటం, పెద్దబాలశిక్ష, పురాణసంబంధ పుస్తకాలనుకూడా చదువుకో వద్దనేవారు. ఆమె

చదువుకుంటుంటే చిన్నన్నయ్య గయ్యిమని లేవటంతో సూరమ్మకు దొడ్లోదాక్కోవటం అలవాటయింది. నిరంతరం చాకిరిచేయలేక తల్లినిపట్టుకొని సూరమ్మ ఏడిస్తే, ఆ తల్లికూడా వదినలు చెప్పినట్లుచేయమంది. పితృస్వామ్య ఉమ్మడికుటుంబాలలో తండ్రిమరణం తరువాత ఆస్తికి వారసులు కొడుకులేగాని భార్య కాకపోవటంతో కొడుకుల పెత్తనం వచ్చేసరికి కోడళ్లు కూడా అధికారవర్గంగా తమని తాము అధికులమనుకొనేవారు. అది అజ్ఞానమే తప్ప సాటి ఆడదానిని కష్టపెట్టకూడదని ఆలోచించగల మానవత్వం వారికి ఏర్పడే జ్ఞానాన్నియిచ్చే చదువువారికి లేకుండా పోవటమే కారణం. సూరమ్మ వదినెలు జుట్టుకు పెట్టే నూనె ఖర్చు దండగ అని, షోకులెందుకనే అభిప్రాయంలో ఉండేవారంటే మరికొన్నాళ్ళకు ఆ జుట్టు తీయించబడేదేకదా అని కావచ్చు. సూరమ్మకు కూడా తన తలకట్టుమీదనున్న అభద్రతతో ఎవరూ చూడకుండా పోషించుకుంటూ ఉండేది. సూరమ్మ వెట్టిచాకిరికి పనికి వస్తుందికాని, పసుపుకుంకాలపనిలో మాత్రం వేలుపెట్టటానికి పనికి వచ్చేది కాదు. సూరమ్మ రజస్వల అయినప్పుడు యింట్లో ఏడుపులు పెడబొబ్బలు పెడుతుంటే భయంతో గోడకు కరచుకొన్న బల్లిలాగా సూరమ్మ నిలుచుంది అని పేర్కొనటం సూరమ్మ భవిష్యత్తుకు అచలమైన గోడలుతప్ప చలించే మనుష్యుల అండ లేదనే స్ఫురణను కలిగించిన రచయిత్రి భావుకతతు నివాళిని అర్పించకతప్పదు.

వెధవమొహందానా ఇదొక్కటే తక్కువయిందని తల్లి సూరమ్మను దొడ్లోకి తీసుకుపోయింది. స్త్రీకి పునర్వివాహసంస్కృతిలేని పితృస్వామ్యంలో భర్తపోయిన తరువాత స్త్రీ ప్రత్యేకతకు, పునరుత్పత్తి శక్తికి కారణమైన వితంతువు గర్భసంచికి విలువలేకుండా పోతుంది. తనకు మొగుడులేనందుకు తనకు జరగాల్సిన పండగలనుకూడా లాగిపారేస్తుంటే, ఖూనీచేసిన ఖైదీలా సూరమ్మ కూర్చొని ఉంది. ఇక్కడసూరమ్మ ఎవరినీ చంపకపోయినా, ఆమె వితంతువుగా ఎదుగుతున్నకొద్దీ ఆమెలోని ఆనందాన్ని చంపేస్తూ మెల్లమెల్లగా స్త్రీ మనిషితనానికి నిర్జీవత్వాన్ని కలిగించే బలిపీఠపు సంస్కృతి యిది.

పితృస్వామ్యంలో వారసత్వపు సంపదలేని వితంతుస్త్రీలను తొందరగా చంపే పరోక్ష హంతక ప్రక్రియ అది. నాలుగోరోజు నీళ్లనాడే చిన్నన్నయ్య సూరమ్మకు జుట్టుతీయంచకపోతే ఏదోఒక వెధవపని చేస్తుందని అతడు అరుస్తుంటే బుల్లన్నయ్య సూరమ్మచిన్నదని యిప్పుడుకాదని అన్నాడు . కాని యింట్లోఎవరికి నలతగా ఉంటే దానికి సూరమ్మకు జుట్టు ఉండటమే కారణమని గొణుక్కునేవారు. ఆరకంగా స్త్రీలకు సహజాలంకారమైన జుట్టుచుట్టూ అపోహలను అల్లి వితంతుస్త్రీల శరీరంపై, లైంగికతపై అదుపునుపెట్టి పితృస్వామ్యం తన ఆధిక్యతను సంతరించుకొంది. ఇది పితృస్వామ్యపు వికృత కళాహేల.

సూరమ్మమామగారు ఆమెకు మనోవర్తి యివ్వాల్సిన అవసరం లేకుండా ఏడేళ్ళ పిల్లవాడిని సూరమ్మకు దత్తతనిచ్చే కార్యక్రమానికి తీసుకురావాలని మనిషిని పంపిస్తాడు. అన్న సూరమ్మను దింపాలనుకొనేసరికి సూరమ్మకు గుండెలో రాయిపడింది. తనబతుకు యింకాదుర్భరమౌతుందేమో అనే సందేహంతో సూరమ్మకు తనస్థితి అగమ్యగోచరమయింది. తల్లి చెంగువెనక నక్కినక్కి బతకటం తప్ప సూరమ్మకేమి తెలీదు. సూరమ్మజీవిత ప్రయాణంలో ఆమె తల్లిని గాని సూరమ్మఉద్దేశ్యంగాని ఎవరికీపట్టలేదు. అంటే సూరమ్మ జీవితం ఆమెది కాకపోవటంగా, పరాయికరణచెందినట్లని స్ఫురింపచేయటం నవలాశిల్పపు హృయతాదాత్మకతయే.

ఒకమంచిరోజు చూసుకొని బుల్లన్నయ్య సూరమ్మను అత్తవారింటికి తీసుకొనివెళ్ళి, అత్తవారింట్లో ఎలా ఉండాలో బోధపరచి తిరిగి వస్తూ, రెండు కార్డులు ఒకపెన్సిలుకూడా యిచ్చి పెట్టెలోపల భద్రంగా దాచుకోమనిచెప్పి వెళ్ళాడు. ఆవిధంగా చేయటంవల్ల ఆమె తనకష్టాలను పుట్టింటివారితో చెప్పుకొనే అవకాశం ఉంటుంది. అదేమేరకు ఉత్తరాలనురాసే కార్డు కోడలుదగ్గర ఉండటాన్ని అత్తవారింట్లోవారికి యిష్టముండదు కాబట్టి ఆమె వాటిని దాచుకొనే పరిస్థితి ఉంది. పదిహేనేళ్ళసూరమ్మ జీవితం యిలా మలుపు తిరగటంలో అన్యాయమేదో ఉన్నట్టు, వీరేశలింగంగారి పత్రికలు,

పుస్తకాలు చదవటంతో కాస్త సంస్కారంఏర్పడిన బుల్లన్నయ్య మనసుకు అనిపించి ఉండవచ్చు. వారి ఆశయాలలోని వితంతువుల చదువు, స్త్రీపునర్వివాహం వంటి విషయాలు నచ్చినా, తన చెల్లెలి విషయానికి వచ్చేసరికి ఆతని మనసు తిరగబడేది. సూరీడు దురదృష్టం వలననే తనకి పిల్లలుపుట్టలేదనే కసి సూరమ్మమీద అతనికి ఏర్పడటం దానికి కారణం. తనకి పిల్లలుపుడితే సూరమ్మ ఆ బాధ్యతను చూసుకొంటుందని, అమ్మ ఉన్నన్నాళ్లు అమ్మదగ్గర ఉంటుంది, లేదా తాను పోషించవచ్చులే అనుకొన్నాడు. కాని,కులాచారాన్ని, యింటిప్రతిష్ఠను మంటకలుపకూడదని భావించి సూరమ్మకు పునర్వివాహం చెయ్యాలని మాత్రం అనుకోడు. ఆతనిమనసు, సంప్రదాయానికి, చెల్లెలునిర్భాగ్యజీవితానికి మధ్యన ఊగిసలాడుతూ ఉంటుంది. ఐదేళ్ళక్రితం తనభర్త పోయినప్పుడు తనతల్లి మరొకముసలమ్మ కలిసి ఊళ్ళో కాలువగట్టుదగ్గర తనమెడలో మంగళసూత్రాలను లాగేసినప్పడినుండి సూరీడుకు తన ఊళ్లోని కాలువ అంటే అసహ్యం.దానివైపుకూడా చూడదు. ఆ పితృస్వామ్యసంస్కృతివల్ల స్త్రీ ప్రకృతిని కూడా ద్వేషించే స్థితికి చేరుకొన్నది. బహుశసూరమ్మ యిప్పుడు అదే కాలువదాటి అత్తగారి ఊరు చేరుకున్నట్లుంది.

అత్తగారిని చూడగానే సూరమ్మకి ఒకప్పటి అలంకారాలతో ఉన్న తన తల్లి గుర్తుకువచ్చింది. ఇళ్ళల్లో స్త్రీలను విభజించి, తమ ఆధిక్యాన్ని నిలబెట్టుకునే క్రమంలో పితృస్వామ్యం పుట్టించినట్లుగా కోడలికి అత్తగారంటే పడదనే సామెతను అబద్ధమని అనిపించేటట్లుగా ఆమెలో సూరమ్మ అమ్మను చూసింది. మామగారు జపతపాలు, పురాణశ్రవణం, శిష్యవర్గంతోకాలాన్ని గడుపుతుంటాడు. ఇంటికొచ్చిన వాళ్ళు సూరమ్మ దురదృష్టంవల్ల ఆయన కొడుకు పోయినట్లు మాట్లాడేవారు. అత్తమామలు ఆ మాటలను వ్యతిరేకించేవారుకాదు కాబట్టి వారి అభిప్రాయం కూడా అదే అని పరోక్షంగా స్ఫురింపచేయటం నవలాశిల్పంలోని చిత్రకళ. అత్తగారు నల్లపూసలవంటివి కొంటుంటే సూరీడు అక్కడ ఉండకుండా తప్పుకుతిరిగేది. సూరీడు

తడిబట్టలతో మడినీళ్లు తెచ్చే సమయానికి అక్కడ ఉండే మామచూపులు ఆమె శరీరాన్ని తడుముతుండేవి. రాత్రిపూట తన కాళ్లకు సూరమ్మ చేతులు మృదువుగా ఉంటాయంటూ మామగారు మర్దనాచేయమంటే సూరమ్మకు సిగ్గుకలిగేది. తొడలవరకూ మర్దనాచేయమనే ఆతని మాటలలోని ధ్వని సూరమ్మకు స్త్రీసహజ గ్రహణశక్తివల్ల అర్థమయ్యేది.

ఒకరోజు రాత్రిసమయంలో సూరమ్మ మామ ఆమెదగ్గరకు వచ్చికాలుపట్టి లాగేసరికి **'పాము'** అంటూ ఆమె అరవటంతో, మామపిల్లిలా తప్పుకుంటాడు. జరిగినది పైకి చెపితే ఎవరూ నమ్మరనుకొంది. తనమామ మరొక ఉద్దేశంతో తనని యిక్కడికి పిలిపించాడని సూరమ్మ గ్రహించింది. స్త్రీకి దైహికవాంఛ ఉంటుందని అది మగసాహచర్యాన్ని కోరుకుంటుందనికూడా తెలియని సూరమ్మకు, తనని మొగుడుతప్ప మరొక మగవాడు తాకరాదనీ, అది తప్పు అని తరతరాలుగా జీర్ణింపచేసుకొన్న పితృస్వామ్య భావజాలం ఉండటంతో, అక్కడ తనకు రక్షణలేదని నిర్ధారించుకొంది. ఇది జరిగిన మూడోరోజున సూరమ్మ ఎవరూ చూడకుండా తనని వచ్చి తీసుకొని వెళ్లమని బుల్లన్నయ్యకు కార్డు రాసింది. ఆనాడు సూరమ్మ నేర్చుకొన్న ఆ అక్షరాలే నేడు సూరమ్మను లైంగికదాడినుండి కాపాడాయి. అందుకే ఆనాటి స్త్రీలసాహిత్యం స్త్రీవిద్యకు అంతటి ప్రాధాన్యాన్ని యిచ్చి ప్రచారం చేసింది. ఇక్కడే నవలాశిల్పం తళుక్కుమంది.స్త్రీలు చదువుతో ఆత్మరక్షణ చేసుకోగలరని రచయిత్రి చూపిన సంఘటనా శిల్పం అజరామరం.

సూరమ్మ బుల్లన్నయ్యకు జరిగిన విషయం చెప్పకపోయినా గ్రహించాడంటే ఆ అన్నకు పితృస్వామ్యంలోని అసమనైతికసంస్కృతిపట్ల అవగాహన ఉండటమే. రెండునెలలకే సూరమ్మ తిరిగి పుట్టింటికి చేరినందుకు వదినలకు చాలా కోపంగా ఉంది. చిన్నన్నయ్య సూరమ్మవచ్చినందుకు కోపంతో ఎందుకొచ్చావని, పెద్దవాళ్ళయిన అత్తామామసేవ చేసుకొంటే వచ్చేజన్మకైనా పసుపుకుంకాలు ఉంటాయని, అత్తగారిల్లే ఆడది ఉండే యిల్లు అంటాడు. స్త్రీకి

పుట్టింట్లో స్థానంలేకుండా చేయటానికి పురుషాధిక్యసమాజం సృష్టించిన మాటలు అవి.

సూరమ్మ ఏడుస్తుంటే బుల్లన్నయ్య ఓదార్చాడు. చిన్నన్నయ్య యింటిని పంచుకొందామని, తానా యింట్లో ఉండాలంటే సూరమ్మజుట్టు తీయించాలని, యింట్లో జుట్టున్న వెధవముండని పెట్టుకొని శాస్త్రాలు వల్లించే అర్హత లేదని తోటివాళ్ళు
నవ్వుతున్నారని అంటాడు. సూరమ్మకు జుట్టుతీయించకపోతే తాను ఆ యింట్లో ఉండనని, పోతానని చిన్నన్నయ్య అన్నప్పుడు సూరీడుకు భూమిలోకి వెళ్ళి దాక్కోవాలనిపించింది. అంటే పితృస్వామ్యపు భావజాలమున్న భూమిమీద వితంతువులకు ఉండే స్థానం లేదనుకోవటమే. తనకు ఏర్పడిన వైధవ్యంలో తనతప్పులేకపోయినా అన్నగారికి తనకు గుండుచేయించాలని అంతపట్టుదల ఎందుకని, తనకు జుట్టు ఉన్నందుకు వదినషోకులని సాధించటం ఎందుకని సూరమ్మకు గుబులుగా ఉండేది. తనతల్లిలాగా తనకు కూడా గుండుచేయిస్తారనే ఆలోచనరాగానే సూరమ్మ నిలువెల్లా వణికిపోయేది. తన జుట్టుమీద ఎప్పటికప్పుడు అభద్రతా భావంతో ఉండేది. మామ తాను మగపిల్లవాడిని దత్తతతీసుకుంటున్నామని, కోడలిని కూతురుగా చూసుకొన్నా ఆమె షోకులు అవి నచ్చలేదని, పిల్లవెకిలిగా ప్రవర్తించిందంటూ తన మనసును చంపుకొంటూ ఆమె మామ గురివింద గింజ సామెతలాగా సూరమ్మపై అభాండాలువేసాడు. అన్నలిద్దరూ ఆమెను వెంటపెట్టుకొని మనోవర్తికోసం వెళ్ళినప్పుడు సూరమ్మను అక్కడ ఉంచుదామనుకొంటే తాను చావనన్నా చస్తానుకాని అక్కడ ఉండనన్నది సూరమ్మ. పెద్దమనుషులు కొడుకు చనిపోయాడుకాబట్టి ఆమెకు ఆస్తిలో వాటారాదన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం వితంతుస్త్రీకి భరణంకింద కొంత ముట్టచెప్పటమే కాని, భర్త వారసత్వపు ఆస్తిలో వాటా యిచ్చే చట్టంలేదు. అందుకే కనుపర్తి వరలక్ష్మిలాంటివారు రాసిన వ్యాసాలలో ఆనాటి ఒకస్త్రీ తనకు వారసత్వపు ఆస్తి రావాలని న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే వ్యవసాయభూములు కేంద్ర పరిధిలోకి రావని

నాటి ఫెడరల్ కోర్టు తప్పించుకోవటం ఒక చారిత్రక సత్యం. అందుకే భార్యల వారసత్వపు హక్కుకై బ్రిటిష్ పాలనలోని కేంద్రశాసనసభలలో బిల్లుపెట్టాలని నాటి స్త్రీలు ప్రయత్నించటం జరిగింది. రెండువేలరూపాయలు తీసుకొని అన్నదమ్ములిద్దరు సూరమ్మను తీసుకొని వెనక్కివచ్చారు.

అన్నదమ్ములిద్దరూ గోదావరి పుష్కరాలకని సూరమ్మను తీసుకొనివెళ్ళి రాజమండ్రిరేవుదగ్గర ఆమెకు నున్నగా గుండుచేయించారు. ఆ నిస్సహాయురాలి ఆక్రందన గోదావరి ఘోషలో కలిసిపోయుంటుందికాని వీరేశలింగంగారికి వినపడి ఉండదని రచయిత్రి స్పష్టంచేయటమంటేనే రచనాశిల్పం పాఠకులమనసు లలో ఆర్ధతనునింపటమే. తరతరాల స్త్రీజాతికి పితృస్వామ్యసంస్కృతిమీద అసహ్యం కలగకుండా ఉండటం సాధ్యమా అని సందేహం కలగక మానదు. సూరీడు ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి విరుచుకుపడిపోతే అన్నదమ్ములు బండిలో వేసుకొని ఆమెను సత్రానికి తీసుకొచ్చారు. అంటే ఆమెను ఒక జీవచ్ఛవంగా మార్చారు.ఆ ఘటనతో సూరమ్మ బండరాయి అయిపోయింది. ఆమెలోని మానవచైతన్యాన్ని పితృస్వామ్యసంస్కృతి చంపేసింది. తలమీద ముసుగుతో, ఆమె యవ్వనంబయటకు కనపడకుండా పొడవాటి చేతులుగల రవికలను అన్నలు కుట్టించి యిచ్చారు. తనని అడగకుండా అన్నలు, అక్కలయింటిచాకిరికి ఎవరు రమ్మంటే వారింటికి అన్నలు వెళ్ళమనేవారు. చాకిరి చేయటం ఇరవైఏళ్ళు వచ్చిన సూరమ్మకు అలవాటుగా మారింది. ఆమెకు విశ్రాంతి కావాలని ఆలోచించేవారే లేరు. అయితే పూజలప్పుడు సువాసినులకు కనపడకూడదని దొడ్లలోకి వెళ్లి గడిపేది. వితంతువైన సూరమ్మ అందరిలాగా మధ్యాహ్నపు కునుకు తీయకుండా ఏదో ఒకపనిచేస్తూనే ఉండాలి. అన్నలందరూ ఎవరిల్లువారుకట్టుకొని వెడితే పడిపోయే ఆ పాతయింట్లో సూరమ్మ తన తల్లితో ఉంది. వీరేశలింగంగారి పత్రికలుచదివితే స్త్రీలు చెడిపోతారని యింట్లో చిన్నన్నయ్య చదవనిచ్చేవాడుకాదు. ఐనా సూరీడు బుల్లన్నయ్యతెచ్చిన వివేకవర్ధినివంటి పత్రికలు రహస్యంగా తెచ్చుకొని ఎవరూచూడకుండా చాటుగా చదివేది. ఆ

పుస్తకజ్ఞానంతో సూరమ్మకు తనతల్లి యిష్టంతో, బొట్టూగాజులుతీసి, గుండుచేయించుకోలేదని ఏ స్త్రీ తనంతటతానుగా అలా గుండు చేయించుకోవటానికి యిష్టపడదని, తన అన్నలు బలవంతానతనకు గుండుచేయంచినట్లే తనతల్లి విషయంలోకూడా జరిగి ఉంటుందనుకుంది. ఆనాడు తనతల్లి విషయంలో స్వార్థంతో అన్నలు అబద్దాలు చెప్పారని సూరమ్మ గ్రహించింది. సూరమ్మకు మెల్లమెల్లగా పితృస్వామ్యసంస్కృతి స్వభావం అర్థంఅవటం మొదలయింది. వీరేశలింగం గారు రాసినట్లు మగవాళ్ళందరూ కలిసి, సంప్రదాయం, గౌరవం, ఆచారం అంటూ భర్తపోయిన తల్లుల్ని, చెల్లెళ్ళని, కూతుళ్లను, కోడళ్లని వికారంచేసి ఇంటిబానిసలుగా తయారు చేస్తున్నారని సూరమ్మ అనుకొంది.ఇదే నవలాశిల్పంలోని నరనరాల సంస్కృతి అని పాఠకులు గ్రహించేటట్లు చేయటం.

తాను ఒంటరిగా ఉన్నప్పుడు సూరమ్మకు తాను మళ్ళీ జుట్టుపెంచుకుంటే తప్పేమిటని, రాజమండ్రిలో ఆనాడు వీరేశలింగంగారి ఇంటికివెళ్లి ఆయన కాళ్ళమీద పడిఉంటే బాగుండేదని కలలు కంటుంటే సూరమ్మపిన్ని అని కేకపెట్టేసరికి వాస్తవప్రపంచంలోకి వచ్చేది. నిజానికి కలలోనే ఆలోచనలకు చైతన్యం వస్తుంది. ఆ పగటి కలలను సాకారంచేసుకొనే పరిస్థితులు ఉండవు. అలాంటి ఆలోచనల కలలను స్త్రీలు కనకుండా ఉండేందుకే స్త్రీలను ఎప్పుడూ పనులలో నిమగ్నమయ్యేటట్టు చేస్తుంది పితృస్వామ్యం. కానిఅది ఈ ఒక్క అన్నదమ్ముల వ్యక్తిగతస్వార్థమేకాదు, మొత్తం పితృస్వామ్యం వివక్షతో అందించిన ఆధిక్య అమానవీయ స్వార్థసంస్కృతి అని ఆనాడే స్త్రీలసాహిత్యం ఉటంకించింది. కాని నిన్నమొన్నటివరకు వెలుగులోకి రాలేదంటే ఆనాటి తరానికి చెందిన సూరమ్మకు తెలిసే అవకాశంలేదు. వీరేశలింగంగారి పుస్తకాలు అప్రాచ్యపు పుస్తకాలని తనయింట్లో ఉన్నప్పుడు చదవద్దంటూ వీరేశలింగంగారి పుస్తకాలనే నిషేధించిన చిన్నన్నయ్య లాంటి వాళ్ళుఉన్న సమాజంలో ఆనాటి స్త్రీలసాహిత్యం సెన్సారుకు గురికాబడటంలో ఆశ్చర్యమేమీలేదు. సూరమ్మకు సరదాలు, సంతోషాలు ఉండేవికాదు. కాని

నోములువంటి సమయాలలో చాకిరికి మాత్రం పనికివచ్చేది. ఆ తరువాత ఒంటరిగా దొడ్లో అరుగుమీద కూర్చొవాలిగాని పుణ్యస్త్రీలకు కనపడకూడదని సొంత అక్కలే అనే స్థితిలో వితంతుస్త్రీలకు బానిససంస్కృతి నియమాలు పెట్టింది. అక్కలు తమ యిళ్లకు పిలిచిచాకిరి చేయించుకొనేవాళ్లేకాని వితంతువని సూరమ్మకు కొత్తసైనుపంచెకూడా కొనేవారుకాదు. వాళ్లయింట్లో శుభకార్యాలైతే సూరమ్మ పనికి మాత్రం పనికి వచ్చేది. కాని అందరుముందుకు వచ్చి ఆమె వెధవమొహం కనపడకూడదంటూ ఆమెను వెలివేసినట్టు చూస్తుంటే ఆమె సముద్రంలో ద్వీపంలా కనపడేది. పనంతా పూర్తిచేసిన తరువాత అందరిలో కనపడకూడదు కాబట్టి పెరటిలోకి వెళ్లి ఒంటరిగా కూర్చొనేది. కాబట్టే సూరమ్మలో తాను ఒంటరినన్న భావం ఆమెలో చిన్నప్పటినుండి స్థిరపడింది. వచ్చేటప్పుడు అక్క పాత సైనుగుడ్డను యిస్తే వుడుకుమోతుతనం, నిస్సహాయత, ఏడుపు వచ్చి తనలో తానే కుమిలిపోయేది. ఇదే నవలాశిల్పంలోని అంతర్మథనం. యింటికివస్తూ తనచాకిరీకి విలువలేదని బస్సులో ఏడుస్తూ కూర్చొన్న సూరమ్మను తోటి ప్రయాణికురాలు ఎందుకేడుస్తున్నావని జాలిపడి అడిగినందుకు ఆమె తనని పట్టించుకొన్నందుకే సూరమ్మ సంతోషపడుతుంది. తనగురించి తనవాళ్లెరూ పట్టించకోరనే బాధ సూరీడుకి ఉండేది. సూరమ్మమనస్తత్వ చిత్రీకరణకు రచయిత్రి సహజ సంఘటనలనే ఆధారంచేసుకోవటం అనేది ఉత్తమరచనశిల్పానికి గీటురాయి వంటిది.

సూరమ్మతల్లి చనిపోయినప్పుడు అన్నా, వదినలు కర్మకాండలుచేస్తూ సూరమ్మ బోడిగుండుతో వంటచేయటం వల్లనే తాముపెట్టిన పిండాలను తమతల్లి తృప్తిగా తిని తన భర్తదగ్గరకు వెళ్లిందని అంటుంటే సూరమ్మకు నవ్వువచ్చింది. అలా నిజంగా జరుగుతుందని హామీ యిస్తే తానుకూడా తనభర్తకు పిండాలు పెట్టి, భర్తదగ్గరకువెళ్లి కలిసిపోతానని అనుకొనేది. సూరమ్మ తనభర్తతో కాపురం చేయకపోయినా పుస్తెకట్టిన పుణ్యానికే అలాజరిగితే బాగుండునని అనుకొందంటే పితృస్వామ్యం పెళ్లితో స్త్రీలను వారు

చచ్చేంతవరకు చనిపోయిన మొగుడినే తలచుకొంటూ బతికేటట్టు చేసిందనుకోవాలి. తల్లి చనిపోయిన తరువాత సూరమ్మకు తానెంత నిస్సహాయస్థితిలో ఉందో తేటతెల్లమయింది. మరోపక్కన అన్నలు, అక్కలు సూరమ్మను తమదగ్గర ఉంచుకుంటామంటూ తమయింటి చాకిరీకోసం, ఆమె డబ్బుకోసం పోటీపడుతుంటే, బుల్లన్నయ్య సూరమ్మ మనోవర్తిమీద వచ్చిన వడ్డీ నగదుతో, ఆమె నగలను అమ్మి ఆ డబ్బుతో సూరమ్మకు యిల్లు కొనిపెడ్తానంటాడు. సూరమ్మ బుల్లన్నయ్య యింట్లో ఐదేళ్ళపాటు గడిపింది. బుల్లొదినకు తోడుగా నాటకాలకు వెళ్లినా, ఆమె వెనకాల సూరమ్మ భయంభయంగా కూర్చొనేది. కుటుంబసంబంధాలలో సూరమ్మ భయం భయంగా బతికేది. అంటే సామాజికసంస్కృతి తండ్రిపోయినప్పుడు, తల్లిని వికృతంగా మార్చినప్పుడు, బాల్యంలోనే సూరమ్మలో ఏర్పడిన భయానికితోడు, ఆమెకు వైధవ్యంవచ్చి గుండు చేయించినప్పటినుండి ఆ భయం రెట్టింపుఅయి, సూరమ్మశరీరం, మనసునిండా నిరంతరభయం చోటుచేసుకొనేటట్టుగా నాటి సంస్కృతి చేసింది. స్త్రీకి శిరోముండనంచేయించటం శిరచ్ఛేదంవంటిదని ఆనాటి స్త్రీలసాహిత్యం ఘోషించినా సమాజానికి పట్టలేదు. వితంతుస్త్రీలపై లైంగికఅదుపు చేయటంలో భాగంగా పితృస్వామ్యం దానిని సామాజిక సంస్కృతిగా ఆచరణలో పెట్టింది. అందుకే ఎక్కడికక్కడ పితృస్వామ్య సమాజంలోని లింగవివక్షాస్వభావానికి స్త్రీలు ఎలాబలి అయ్యారో ఆలోచింపజేయటానికే సూరమ్మపాత్రసృష్టి జరిగింది. పితృస్వామ్యసంస్కృతిని వాచ్యం చేయకుండానే రచయిత్రి నవలలోని ప్రతి సన్నివేశంలో అడుగడుగునా ఆ సంస్కృతిని ప్రతిఫలింపచేస్తూ రచన చేయటంలోనే నవలాశిల్పం యిమిడి ఉంది.

చిన్నక్కతనకూతురు పురిటిచాకిరికి, వివేకం అనిపిలువబడే పిరికితనం చోటుచేసుకొన్న సూరమ్మను పంపమనగానే బుల్లన్నయ్య తనని అడగకుండా నిర్ణయించి పంపుతుంటే సూరమ్మకు ఉడుకుమోతుతనం ఏర్పడింది. సూరమ్మలో వ్యక్తిత్వపుస్పృహ కలగసాగింది. సూరమ్మను తన బుల్లన్నయ్య

దగ్గరనుండి మనోవర్తి డబ్బును తెప్పించమని చిన్నక్క ఒకటే గోలపెడుతుంటే చిన్నక్కయింట్లో సూరమ్మకు మనశ్శాంతి ఉండేది కాదు. చిన్నక్కకూతురుకు వంట్లోనీరుపట్టి ఆయాసం వచ్చి పురుడుకష్టమై, తల్లిచనిపోగా ఆ పసిగుడ్డును ఎవరూ పట్టించుకోచేదు. అంతేకాదు, తల్లినిపోగొట్టుకొన్న అనాథఅని భావిస్తుంటే సూరమ్మ వెంటనే ఆ పసిగుడ్డును మంత్రసాని సలహాతో పంచదారనీళ్ళను నాకించి బతికించింది.

మగపిల్లాడైతే వంశాంకురమని పెంచేవాళ్ళమని, ఆడపిల్లను తామేమి చేసుకుంటామని, పైపెచ్చు తనకొడుకు మళ్ళీపెళ్ళిచేసుకోవటానికి పిల్ల అడ్డుగాఉంటుందని, పాపిష్టిదని చెప్పి ఆపిల్లను తీసికెళ్ళటానికి ఆ పిల్ల బామ్మయిష్టపడదు. 'తల్లిని మింగిన పిల్ల' అని తనను అన్నట్లే 'దరిద్రపుగొట్టుపిల్ల' అని చిన్నక్క ఆ పసిపిల్లను అంటుంటే, అలా అనవద్దని అన్నందుకు సూరమ్మకు కడుపుకోత తెలియదని అవమానించగా సూరమ్మ బాధపడింది. సమాజంలో స్త్రీ మాతృమూర్తి అయితేనే ఆమెకు అన్నీ తెలుస్తాయనేది ఒకమిథ్య. ఆ మాటల్లోని అంతరార్థంగా పితృస్వామ్యంలో స్త్రీకంటే వంశాంకురాన్నిచ్చే స్త్రీగర్భసంచికే ఎక్కువ విలువ ఉంటుంది. అందుకే తనిక కనే అవకాశంలేనందువల్లను, తనవలె ఆ పిల్లకూడా దిక్కులేని అనాథ అయిందనే సహానుభూతితో సమాజసంస్కృతిపరంగా అవాంఛితమైన ఆ ఆడపిల్లను తనపిల్లగా భావించి పెంచుకొంటానంది సూరమ్మ. మానవత్వంగల ఇరవైఆరేళ్ల సూరమ్మకు ఇటువంటి సాహసోపేత నిర్ణయం తీసుకొనే అవకాశం వచ్చింది. ఆపిల్లతండ్రిచేత సమ్మతిపత్రాన్ని రాయించుకొన్నారు. ఎటువంటి ఆస్తిత్వపు విలువలేక భయం భయంగా తనకంటూ ఎవరూ లేరని నిరాశానిస్పృహలతో గాల్లో కొట్టుకుపోతూ జీవిస్తున్న తనకు తనని ప్రేమించే జీవి లభించినట్లుగా సూరమ్మ భావించింది. ఇరవైఆరేళ్ళసూరమ్మలో మానవత్వం ప్రకాశించటం అంటే యిదే. బావ పాలడబ్బాలకు డబ్బులివ్వకపోయినా సూరమ్మ బుల్లన్నయ్యదగ్గరనుండి డబ్బుతెప్పించుకొని ఆ పిల్లను సాకుతూ అక్కడే మూడునెలలపాటు ఉంది.

పసిపిల్ల ఏడిస్తే బావకు, అక్కకు కోపం. అన్ని విషయాలలో తనవైధవ్యంతో సూరీడు తన అస్తిత్వాన్ని పోగొట్టుకొని క్షణంక్షణం భయంతో ఏకాకిగా నిరాశానిస్పృహల్లో గాలికి కొట్టుకూపోతూ గడిపిందని విశదమౌతుంది.

సూరమ్మ తాను దత్తతతీసుకొన్న మూణ్ణెల్ల ఆ పసిపిల్లను తీసుకొని బుల్లన్నయ్య యింటికి వస్తుంది. పిల్లరాత్రిళ్లు ఏడుస్తుంటే తనకు మెలకువరాదేమోనని సూరమ్మ రాత్రిపూట అన్నంతినటం మానేసింది. కారణం ఒకందుకైనా చిన్నన్నమాత్రం వితంతువు రాత్రిళ్లు తినకూడదనే పితృస్వామ్య సంస్కృతీ నియమాన్ని సూరమ్మ పాటిస్తోందని సంతోషిస్తాడు. ఆ పసిపిల్ల ఏడుస్తుంటే, బుల్లివదిన విసుక్కుంటుంటే, సూరమ్మ తనకువేరేయిల్లు చూడమనిచెప్పగా బుల్లన్నయ్య ఒకపాతయిల్లు కొనిపెడ్తాడు. సూరమ్మకంటూ ఒకకూతురుపిల్ల, ఒకసొంతగూడు ఏర్పడటమే సూరమ్మజీవితాన్ని మరొకమెట్టుమీదకు తీసుకెడుతుంది. కూతురుకు ఆన్నావదినలచేత కమల అనే పేరు పెట్టిస్తుంది. తనకంటూ కుటుంబం ఏర్పడేసరికి సూరమ్మకు ఇరవైనాల్గుగంటలూ పిల్లధ్యాసే ఉండటంతో స్వార్థంచోటుచేసుకుంది. ఆమెలో కొంత విశాలదృక్పథం తగ్గింది. తమ యింటిచాకిరికి అక్కలు పిలిచినా నిర్మొహమాటంగా రానని చెప్పేది. అంటే సూరమ్మలో వ్యక్తిత్వస్పృహపెరగటం మొదలయింది.కమలను బడికి పంపుతోంది.

పాతయిల్లుపడగొట్టి రెండువాటాలుగా ఉండేటట్లుగా సూరమ్మ మనోవర్తి మీద వచ్చిన వడ్డీ డబ్బులతో బుల్లన్నయ్య కొత్తయిల్లు కట్టించాడు. సూరమ్మ కమలను సంప్రదాయబద్ధంగా పెంచింది. చిన్నన్న కమలకు పెళ్ళిచెయ్యాలని చెప్పినా సూరమ్మమాత్రం రజస్వతలానంతర వివాహం చేయాలనుకొంది. కమల ఇంగ్లీషుమీడియం స్కూల్‌కి మారింది. భారతదేశంలో విదేశీ వస్త్ర బహిష్కరణోద్యమంలో భాగంగా ఖద్దరుతయారీ ముమ్మరంగా సాగుతున్న రోజులు అవి. కమలస్కూల్‌కి వెళ్ళినతరువాత సూరమ్మకు ఖాళీ సమయాన్ని వృథాచేయటం యిష్టంలేక, కమలమాస్టారి భార్యతో కలిసి ఖద్దరునేయటం నేర్చుకొని ఖద్దరుబట్టలను యింటింటికి తీసుకొనివెళ్ళి అమ్ముతుండేది.

సూరమ్మ యింటి పరువు తీస్తోందని, ఆడముండలు ఖద్దరు అమ్మటమేమిటని, ఆలాచేస్తే ఆడపిల్లపెళ్లికావటం కష్టమని, వదినలు వెళ్లుతున్నారా అని చిన్నన్న అంటే సూరమ్మకు కమలపెళ్ళి గూర్చి భయంఏర్పడి ఆ పని మానుకొంది. మొదటినుండి భయంతో పెరిగిన సూరమ్మకు కమలపెళ్లికి, ఖద్దరు అమ్మటానికి ఉన్నసంబంధాన్ని ప్రశ్నించే ధైర్యంగాని, తర్కంగాని వివేచనగాని లేకపోవటంలో ఆశ్చర్యపడాల్సింది లేదనిపిస్తుంది. దానికితోడు వితంతువైన సూరమ్మలో మొదటినుండి ఆత్మన్యూనత ఏర్పడి తననితాను తక్కువ చేసుకోవటం అలవాటైంది. పితృస్వామ్య సంస్కృతిలోని స్త్రీలలైంగికతపై ఉన్న అదుపు స్త్రీలను దేశసేవ చేయకుండా అడ్డుకొన్న విషయంకూడా అర్థమౌతుంది. వితంతువైన సూరమ్మను మాత్రమే అదుపుచేయటంకాక చిన్నన్న యింట్లోని స్త్రీలందరిని పితృస్వామ్యభావజాలంతో అదుపు చేస్తున్నాడని అర్థమౌతుంది, అందుకనే వీరేశలింగంగారు ముందుగా స్త్రీలకు స్వతంత్రం వస్తే దేశానికి స్వతంత్రం వచ్చినట్లని భావించాడు. సూరమ్మ బయటకివెళ్లి ఖద్దరు అమ్మటాన్ని మానిందిగాని, స్వదేశీ వస్త్రధారణ మీద మక్కువతో యింట్లోనే రాట్నంవడికి తను ధరించే ఖద్దరు బట్టలను తయారుచేసుకొనేది. అణచివేతకు గురికాబడుతూకూడా స్త్రీలు ఖద్దరు తయారిని ఆపలేదంటే భారతమాత సూరమ్మవంటి స్త్రీలను చూసుకొని తనకు స్వతంత్రం రాకతప్పదని అనుకొనిఉండే ఉంటుంది. సూరమ్మ తానుకోల్పోయిన సరదా సంతోషాలను కమలపెంపకంలో చూపించి ఆనందపడేది. కమలకు రాజభోగం పట్టిందని చుట్టపక్కాలు అసూయపడేవారు. కమలపుట్టినప్పుడు దరిద్రపుబిడ్డ అన్నవాళ్లే సూరమ్మపెంపకంతో కమలను చూసి గొప్పదనేస్థితికి చేరుకున్నారంటే అదంతా సూరమ్మగొప్పతనమే. కమలనుపెంచుతున్నందుకు సూరమ్మతో ఆడపిల్లను పెంచుకొని ఏమిబావుకుంటావని, కొడుకైతే తలకొరివి పెట్టేవాడని, ఇంటిపేరు నిలబెట్టేవాడని సూరమ్మను నిరుత్సాహపరిచేవారు.అంటే సమాజందృష్టిలో ఆడపిల్లపుట్టుకకు ఉన్నవిలువేమిటే అర్థమౌతుంది. అటువంటి సమాజంలో సూరమ్మ ఒకఆడపిల్లను తెచ్చిపెంచటం అనేది

సాహసోపేత కార్యక్రమంగా, సన్మానించతగ్గది అనుకోవాలి.అందుకే సూరమ్మను స్త్రీజాతికి చుక్కానివంటిదిగా పాఠకులు గుర్తించేలాగా పాత్రచిత్రణ చేసి ఒకస్త్రీపాత్రకు విలువలను సంతరింప చేయటంలోనే నవలాశిల్పంయినుమడించింది.

కమలకూడా తాను స్కూల్ ఫైనల్ వరకు చదువుకొనిగాని పెళ్లిచేసుకోనన్నది. అయినా సూరమ్మ మాత్రం కమల 9వ తరగతిలో ఉన్నప్పనుండి సంబంధాలు చూస్తుండేది. కానిసంబంధం కుదరటంలేదు. చిన్నక్కవచ్చి కమలను తన కొడుకు సత్యానికి యిచ్చి పెళ్ళిచేయమంది. కాని సూరమ్మదృష్టిలో సత్యం సరియైనవాడు కాదని సూరమ్మ ఒప్పుకోలేదు. ఆ సందర్భంలో చిన్నక్క సూరమ్మకు కమలపై హక్కులేదంటూ భయపెట్టుంది. కాని ఆ హక్కులను తనకు కమలతండ్రి రాసిచ్చిన విషయాన్నిగుర్తుచేస్తుంది సూరమ్మ. అయినా కమలతాతగా తన మొగుడు ఒప్పుకోవాలికదా అంటూ తిరకాసు పెడుతుంది. కమల ఒప్పుకోవాలిగదా అని సూరమ్మ అంటే ఆడపిల్ల ఒప్పుకోవటమేమిటని చిన్నక్క అనటమేకాక, “నీకేస్వతంత్రంలేదు, ఇక నీ పిల్లకెక్కడిది స్వతంత్రం” అని అన్నదమ్ములు సూరమ్మతో అంటారు. అలావారు అనగలిగారంటే పితృస్వామ్యంలో స్త్రీలకు స్వతంత్రం లేదని, ఆడపిల్లకు తనపెళ్లివిషయంలో నిర్ణయం తీసుకొనే అధికారం అసలే లేదనేది బయటపడుతుంది. తనకొడుకైన సత్యానికి యిమ్మని, లేకపోతే చిన్నక్క చస్తానని బెదిరిస్తూ పట్టుబడుతుంది.

మొదటినుండి సూరమ్మతో ఆడముండవు, నీకేమి తెలియదు, మూలనకూర్చో అంటూంటే చిన్నప్పటినుండి నిరాధారంగానే ఉన్న సూరమ్మ మరొకసారి నిస్సహాయస్థితిలోకి వెళ్ళింది. సత్యం చదువులో గట్టెక్కలేదని, సిగరెట్ల అలవాటుకూడా ఉందనితెలిసి సూరమ్మకు యిష్టం లేకపోయినా చిన్నక్క, అన్న బలవంతపెట్టటంతో చేసేదిలేక ఒప్పుకుంది. పన్నెండేళ్ల కమలకు పెళ్ళిగురించిన అవగాహన లేనప్పుడే కమలకు పెళ్ళి అయింది. మొగుడి హోదాలో ఉన్న సత్యం కమలను చదువు మానమంటే సూరమ్మ

కమల చదువును వచ్చేఏడాదికి వాయిదావేయమని చెప్పింది. సత్యానికి కోపం తెప్పించవద్దని చెప్పిందంటే సూరమ్మకు కమలచదువు మానటం యిష్టం లేదుకాని, తానేకాక మరొకతరం కూడా పితృస్వామ్యానికి తలవంచక తప్పదనే ఉద్దేశంలోనే సూరమ్మ ఉన్నది. కమలకు మామయైన చిన్నక్కమొగుడు, చనిపోయినప్పుడు పదోరోజు చెరువుదగ్గర ఆమెకుచేసే వితంతుప్రక్రియకు సూరమ్మను వెళ్ళమంటే వెళ్లనంటుంది. తనకు జరిగిన శిరచ్ఛేదంలాంటి పనినిచూసి తిరిగి బాధపడటం యిష్టంలేదు సూరమ్మకు. అంటే ఎంత పితృస్వామ్యసంస్కృతిని వంటబట్టించుకొనిపెరిగినా సూరమ్మలోని మానవత్వం ఆమెను ఆ పనికి సబకరింపచేయలేదని భావించాలి. ఇలాంటి సూక్ష్మమైన సందర్భాలలోకూడా సూరమ్మ మానవత్వం ప్రకాశించేటట్లు రచనచేయటం చేయితిరిగిన సృజనకారులకే పరిమితం.ఇక్కడ సమాజంలో వితంతువు మరొకస్త్రీవితంతుప్రక్రియకు పనికివస్తుందని, అశుభకార్యాలలో ఆమెసేవలను అలాకూడా పితృస్వామ్యం తన సంస్కృతీ పరిరక్షణకు ఉపయోగించుకొనేది.

తండ్రిచావుకు వచ్చిన కమలను పన్నెండురోజుల కార్యక్రమం తరువాత తనదగ్గర కొన్నాళ్ళయినా ఉండమని సత్యం అడగనందుకు అతనికి భార్యమీద ప్రేమలేదని భావించిన సూరమ్మ కమలను సత్యానికిచ్చి గొంతుకోసినట్లు బాధపడింది. సత్యం మాత్రం కమలదగ్గరకు అప్పుడప్పుడు వచ్చేవాడు. కమలకు నెలతప్పినప్పుడు పిల్లలుపుట్టిన తరువాతైనా సత్యం మారతాడని ఆశపడింది. సత్యానికి అంతకుమునుపే పెళ్ళయి పిల్లలున్న విషయంతెలిసి సూరమ్మ విరుచుకు పడింది. తను కమలగొంతుకోసానని తనే కమలజీవితాన్ని నాశనంచేసానని బాధపడింది. పుట్టిన ఆడపిల్లకు కమల సత్యంలేకుండా తానొక్కతే పీటలమీదకూర్చొని పేరుపెడతానంటే సూరమ్మ భర్తబతికుండగా ఎలాగని మొత్తుకుందంటే సత్యం అంత అన్యాయంచేసినా యింకా సత్యాన్ని కమలమొగుడిగా భావించటమంటే మగవాడు ఎన్నిపెళ్ళిళ్లుచేసుకొన్నా సంస్కృతి దృష్టిలో తప్పుకాదనే భావన సూరమ్మకు ఉండటమే. దానికి కారణం పితృస్వామ్యసంస్కృతిని పటిష్ఠంగా ఆచరించే వాతావరణలో ఆమె పెరగటం

వల్ల ఆసంస్కృతిని తన నరనరాలలో జీర్ణింపచేసుకునేట్లు చేసుకొంది. రచయిత్రి ఆ పాత్ర స్వభావానికి కారణమైన బలమైన వాతావరణ ప్రభావాన్ని వర్ణించటమే రచయిత్రి చూపిన కథనశిల్పం..

కమల తనచదువును కొనసాగించటం మొదలుపెట్టేసరికి కూతురైన పద్మ ఆలనాపాలన అంతా సూరమ్మ చూసుకొనేది. కమల ఉద్యోగం చేస్తానంటే సూరమ్మ అవునని, కాదని అనలేదు. కమలతల్లి అయినతరువాత సూరమ్మ రాత్రిళ్లు అన్నంతినకపోతే తాను తినను అని అనేసరికి తనగురించి పట్టించుకొనే వాళ్ళు ఉన్నందుకు సూరమ్మకు సంతోషంవేసింది. అంటే ఇన్నాళ్లు సూరమ్మ తిండిసంగతి ఎవరూ పట్టించుకొనేవాళ్లే లేకపోయారు. సూరమ్మచిన్నన్న, చిన్నవదినలకు రోగాలువచ్చి మంచానపడితే వాళ్ళ పిల్లలువచ్చి చూడకపోయినా, సూరమ్మ వాళ్ళకు అన్నిపనులు చేసిపెట్టింది.

చిన్నన్నయ్యఅంటే సూరమ్మకు చిన్నప్పటినుండి కోపం ఉన్నా దాన్ని మనసులో పెట్టుకోక మానవత్వంతో, పుట్టింటిమీద ప్రేమతో సూరమ్మ సేవలుచేసిందంటే కేవలం ఆమెలోని మానవత్వమే ఆమెనలా చేయించింది. సూరమ్మను చిన్నప్పటినుండి బాధపెట్టినందుకు కఠినచిత్తంగల చిన్నన్నయ్య పశ్చాతప్తుడయ్యే విధంగా సూరమ్మ తన మానవసేవతో వారిలో చివరిక్షణంలోనైనా మార్పును తేగలిగిందని వర్ణించటం ఆ పాత్రకు విలువలను సంతరింపచేసే రచయిత్రి కళాశిల్పనైపుణ్యం స్పష్టమవటమే. తల్లిదండ్రుల విషయంలో కొడుకులు, కోడళ్లు పట్టించుకోకుండా ఉన్నందుకు సూరమ్మకు బాంధవ్యాలు, బంధువులు కాలగర్భంలో కలిసిపోతున్నట్లు, తనచుట్టూ ఉన్న ప్రపంచం కూలిపోతున్నట్టు అనిపించింది. అత్తారింట్లో వితంతువుగా జీవితం వెళ్లబోసుకుంటున్న సూరమ్మకు ఆమె పెద్దక్కచనిపోయిన విషయం వెంటనే తెలియపరచలేదు. అంతేకాక ఎవరూ వెళ్ళలేదు అంటే తోడబుట్టిన వివాహితను తమ కుటుంబవ్యక్తిగా కూడా భావించలేనితనాన్ని స్వభావంగా చేసింది ఆ పితృస్వామ్యసంస్కృతి. సూరమ్మ బుల్లివదినకు రోగంవచ్చి బెండులాగా తయారైతే సూరమ్మ ఆమెకు సేవలుచేసేది. ఒకరోజురాత్రిపూట

ఆమె చనిపోతే అక్కడ తను ఒక్కతే ఉన్నా భయపడకుండా సూరమ్మ నిబ్బరంగా ఆమెమీద గుడ్డకప్పిన తరువాత అందరికి తెలియచేసిందంటే వరుసగా కుటుంబసభ్యులు అందరూ మరణించటంతో సూరమ్మలో నిబ్బరం పెరిగిందని తెలుస్తుంది. బుల్లన్నయ్యభార్య చనిపోతే ఆతనికి తానే వండిపెట్టేది. ఆమె సేవాభావం ఆమె నిస్వార్థచింతనకు నిదర్శనం.

పితృస్వామ్యసంస్కృతి నిర్దేశించిన పాతివ్రత్యాన్ని పాటించే క్రమంలో సూరమ్మ తనకు సంసారబంధం లేకపోయినా పుస్తెకట్టిన పాపానికి ప్రతిఏటా భర్తకు తద్దినాలుపెట్టిస్తుంది. అందుకే తానువద్దన్నా తనతల్లి ఆ కర్మకాండల్ని నమ్ముతూ జరిపించటంలోనే ఆమెకు జీవితంమీద పట్టు ఏర్పడిందని కమల భావించింది. అయినా తృప్తిలేని సూరమ్మ గయవెళ్ళి తన భర్తకు పిండాలుపెట్టి తర్పణాలు వదలాలని, ఆతనిని సరాసరి స్వర్గానికి పంపాలనే ఆలోచనతో బుల్లన్నయ్యను తీర్థయాత్రలకు రమ్మని అడిగితే అతడు రానంటాడు. బుల్లన్నయ్య ఊరికెళ్ళటంతో సూరమ్మకు తీరికదొరికి, కమలతెచ్చే వారపత్రికలు, పుస్తకాలు చదవటం అలవాటుచేసుకొంది. బుల్లివది నసేవ సాయంకాలంవరకు మాత్రమేచేసి సూరమ్మ రాత్రిళ్లు యింటికొచ్చి పడుకొనేది.తానుచిన్నప్పుడు తన అన్నావదినలు సరసాలాడకుంటుంటే దొడ్లోకివెళ్లి కూర్చోవటాన్ని తలచుకొని యవ్వనంలో ఉన్నకమల తనలాగా రాత్రిపూట పక్కింటివారి సరసాలకు కమల బాధచెదకుండా, ఆమెకు కబుర్లుచెప్పవచ్చు అని సూరమ్మ అనుకుంది. అంటే ఆమెతన యవ్వనకోర్కెలను ఎలా అణచుకుందో తెలుస్తుంది. బుల్లితాతయ్య తన భార్య చనిపోయిందని దిగులుపడటం లేదని కమల అంటే, దానికి సూరమ్మ అతడు భార్యచనిపోయిన గుర్తుగా గుండుచేయించుకోవాలా? అని అంది. కమల అలాంటి రోజులువస్తే బాగుండునని అన్నందుకు, సూరమ్మ కమలకు అటువంటి అప్రాచ్యపు ఆలోచనలు వస్తున్నాయని బెదిరిపోయింది. సూరమ్మయింకా సామాజిక సంస్కృతిలోని వివక్షను అర్థంచేసుకోవటానికి విముఖురాలిగా ఉన్నట్టుతెలుస్తుంది. దానికి కారణం సూరమ్మబాల్యంనుండి

కుటుంబ వ్యక్తులు పితృస్వామ్యసంస్కృతిని ఆమె తన నరనరాలలో వంటబట్టించుకునేటట్టుగా ఆమెను తయారుచేసారని అర్థం చేసుకోవాలి.

బుల్లన్నయ్య వస్తున్నానని చెప్పగానే ఆతని యింటినిశుభ్రంచేసి వంటచేసి సిద్ధంచేసిన సూరమ్మకు అతడు పదిహేడే ళ్ళపిల్లనుపెళ్ళిచేసుకొని వస్తే సూరమ్మకు నోట్లో మాటరాలేదు. ఇంటికొచ్చి ఏడ్చింది. మొదటి భార్యతో ఏభైఏళ్ళుకాపురంచేసి ఇప్పుడు మళ్ళీసుభద్రను పెళ్లిచేసుకున్నందుకు సూరమ్మ తనకు సిగ్గుగాఉందని అంటుంది. కాని బుల్లన్నయ్యకు సిగ్గులేదని అనలేదంటే పితృస్వామ్యపు అసమనైతికసంస్కృతిని విమర్శించే ధైర్యం సూరమ్మకు లేదని అర్థమౌతుంది. పైగా ఆ పిల్ల ఏదో ఉపద్రవాన్ని తెచ్చిపెట్టినట్టుగా చిన్నక్క రాగానే కావులించుకొని ఏడుస్తుంది. సత్యం అలా కమల జీవితంతో చెలగాటమాడినా సూరమ్మకు తన చిన్నక్కమీద కోపంరాలేదు. అందుకే డబ్బుకోసం తన అన్నను బుట్టలో వేసుకొన్న అమ్మాయిమీద జాలి చూపించటమెందుకు అని కమలతో అంటుంది. సూరమ్మచిన్నక్క కలిసి చీటికిమాటికి వగలాడి అంటూ సుభద్రను ఎత్తిపొడుస్తారుగాని డెబ్బయ్ ఏళ్ళవయసులో బుల్లనయ్య పెళ్ళిచేసుకోవటం ఏమిటని ఆలోచించలేదు. అంటే స్త్రీలు వివక్షాసంస్కృతిని ప్రశ్నించే స్థాయిలో లేనందుకే సమాజంలో పితృస్వామ్యసంస్కృతి రాజ్యమేలుతోంది. సుభద్ర సినిమాలకు వెడుతుంటే తోడుగా కమలను పంపేవాడు ఆమె భర్త. పితృస్వామ్యంలో అసమవయో వివాహసంస్కృతి ఆచరణీయం అవటంవల్ల, వయసులో చిన్నదైన సుభద్రమీద ముసలి భర్తకు అనుమానం ఉండి నిరంతరం నిఘాపెట్టటం ఆచరణలో ఉండేది. ఎంతనిఘాఉన్నా గోడలు బద్దలుకాకమానవు అన్నట్టుగా ఒకరోజు యింట్లో నగలన్ని తీసుకొని ఆ సుభద్ర వెళ్లిపోతుంది. భార్యలేచిపోయిందనే అవమానంతో బుల్లన్నయ్య మంచానపడితే సూరమ్మయే సేవలుచేసింది. చివరి క్షణాలలో పద్మకు యివ్వమని కమలకు పదివేలరూపాయలసంచిని యిస్తాడుకాని, తనభార్యపేరుమీద ఉన్న ఆస్తిని తనకు సేవచేసిన సూరమ్మపేరున రాయడానికి ఆతనికి మనసురాలేదు. పితృస్వామ్యంలో

ఆడవాళ్లు చాకిరీకే గాని ఆస్తిపాస్తులకు అనర్హులనే అభిపాయం వల్లనే అతడలా చేసాడనిపిస్తుంది. లేదా స్త్రీలను నిరాధారస్థితిలో ఉంచగలిగితే పితృస్వామ్య సంస్కృతి సజావుగాఉంటుందని అభిప్రాయం అనుకోవచ్చు.

బుల్లన్నయ్య చనిపోతే సూరమ్మ గొల్లుమని తనకిక దిక్కెవరని బాధపడుతుంది. నిజానికి సూరమ్మే అతనికి దిక్కయింది. కాని సూరమ్మకు తనశక్తిమీద తనకు నమ్మకంలేక అలా భావించేది. పితృస్వామ్యంలో ఆడదానికి మగవాళ్ల ఆధారం తప్పనిసరి అనే ఆలోచనలప్రభావం సూరమ్మను అలా అనుకొనేట్టుచేసింది. ఇరుగుపొరుగు వాళ్లు నిద్రలో సునాయాసంగా మంచి మరణాన్నిపొందాడని అన్నారుగాని, ఆతడుముసలి వయసులో చేసుకొన్నపెళ్లిని ఏ ఒక్కరు విమర్శించలేదు. అంటే ఆతని అసమవయో వివాహసంస్కృతిని పాతసినిమా కాలక్షేపంకింద వారు తీసుకోవటం నిజమని తేలింది. పితృస్వామ్యసంస్కృతిని జీర్ణించుకొన్న సూరమ్మ తన యింటిపైన కమల గదులువేయిస్తూ ఆ సూపరువైజరుతో మాట్లాడితే గొణిగేది. తనుపెంచిన కమల మీద కూడా సూరమ్మ నిఘా కన్ను ఉంచి అలోచింపచేస్తోంది. అది సూరమ్మలో జీర్ణించుకొన్న పితృస్వామ్య సంస్కృతి ప్రభావమే. కమలస్కూల్ లో రిటైరు అయినవాళ్ళు వెడుతుంటే సూరమ్మ వారితో మళ్ళీతీర్థయాత్రలకు వెడుతుంది. అయితే సూరమ్మలో భక్తితో పాటు మానవత్వంకూడా ఉండటంతో ఆవీధిలో, ఆ పక్కవీధుల్లో ఎవరింట్లో పురుడువచ్చినా సూరమ్మ ఆధ్వర్యంలో జరిగేది. పురిటిల్లు కడిగేవరకు దగ్గరుండి సూరమ్మ చూసుకొనేది. అంటే సమాజంలో ప్రధాన మానవసృష్టి కార్యక్రమం సజావుగా జరిగేవిధంగా బాధ్యత వహించటంలో ఆమె నిస్వార్థసేవ, పరోపకార పరాయణత్వం, మానవత్వం ఆదర్శనీయమని పాఠకులు భావించి తమను తాము చైతన్యపరిచుకొనేటట్టు రచించటమే నవలాశిల్పప్రయోజనం.

బొంబాయిలో కొడుకులు సరిగా పట్టించుకోకపోయేసరికి సూరమ్మ చిన్నక్క మెల్లగా సూరమ్మయింటికి చేరుకొంది. అనాదిగా వస్తున్న సంస్కృతీ

సంప్రదాయాలను పాటించటం సూరమ్మకు యిష్టం. అందుకే కమలకూతురు పద్మ పోనిటైలు, చుడీదారు వేసుకుంటే నచ్చక అప్పచెల్లెళ్ళిద్దరూ ఆడపిల్ల మొగరాయుడిగా ఉండకూడదనేదవారు. ఆ విషయంలో పద్మ యిష్టం అని, పద్మను మగరాయుడిలాగానే పెంచుతానని కమల అంటే, కమల చదువుకొని ఉద్యోగం చేయటమే అలా అనటానికి కారణమని అనుకొన్నారు. చిన్నచిన్నవిషయాలలోకూడా కమల ఆధునికసంస్కృతిని అలవర్చుకుంటుంటే అక్కచెళ్ళెళ్లు ఇద్దరికీ నచ్చక విభేదించేవారు. అప్పచెళ్ళెళ్లుకలిసి తీర్థయాత్రలకు వెళ్ళేవారు. సూరమ్మ చిన్నక్క రోగంతో మంచానపడినప్పుడు సత్యం ఉపచారాలు చేస్తుంటే సూరమ్మ మగవాడని అతడ్నివద్దనేది. సూరమ్మదృష్టిలో కూడా పితృస్వామ్య కుటుంబసంస్కృతి చేసిన పనివిభజన ఆమెనలా మాట్లాడింపచేసింది. తన చిన్నక్కచనిపోతే సూరమ్మ ఆమె మీదపడి తనకు ఇక దిక్కెరున్నారంటూ గుండలవిసేలాగా ఏడ్చిందంటే చిన్నప్పుడే భర్తపోవటంతో తనకు భర్తతోడులేదనే బాధ ఉండేది. కాని ఆమెకు పుట్టింటివాళ్లపైన ఉన్న మమకారంతో తానెప్పుడు ఒంటరిదాన్నని, తనకు వారి తోడు అవసరమని సూరమ్మకు ఆలోచన ఉండేది. ఉద్యోగంచేస్తున్న పద్మ షోకులంటే సూరమ్మకు నచ్చక ఏదైనా అంటే కమల కాలం మారిందని అర్థం చేసుకోమంటే పద్మ షోకులకు ఖర్చుచేస్తోందని తనకు గుండె గుబేలుమంటోందని అనేది. సూరమ్మ ఖర్చుపెట్టుకునే స్వభావానికి ఆధునికపద్ధతులకు ఉన్న తేడాను గుర్తించలేదంటే సూరమ్మకాలంతో పాటు వస్తున్నమార్పును ఆహ్వానించక వెనకబడి ఉంది.

సూరమ్మ పద్మకు పెళ్ళిచేయాలంటూ వీధిగుమ్మంలో కూర్చొని తన ఆస్తి అంతా పద్మకే రాసిస్తానని పెళ్ళిసంబంధం చూసిపెట్టమని అడిగేది. అంటే ఆస్తిని వరకట్నంగా యిస్తేపద్మకు మంచి సంబంధం వస్తుందని సూరమ్మ అభిప్రాయం. కమల యింట్లోకి కొత్తవస్తువులు తెస్తే వాటిని కొనేబదులు బంగారం కొంటే పద్మపెళ్ళికి కన్యధారపోసేటప్పుడు ఉపయోగపడుతుందని అంది. అంటే సూరమ్మదృష్టిలో పెళ్లిఅంటే ఆడపిల్లకు నగలుపెట్టి అత్తింటివారికి ఆమెను ఒక వస్తువులాగా బదలాయింపు చేయటంలాంటిది. అందుకే

పితృస్వామ్యసంస్కృతి ఏర్పడుతున్న వేదకాలం రోజుల్లోజరిగిన మొదటిపెళ్లి తంతులో సూర్యుడు తన కూతురైన తపతిపెళ్లి సందర్భంలో పెళ్ళినాటినుంచి ఆడపిల్లమీద హక్కులను తండ్రినుండి భర్తకు బదలాయింపుచేసినట్లు చెప్పబడింది. పైపెచ్చు ఆడదానికి పెళ్లి,పిల్లలు ఉంటేనే అందం అంటుంది సూరమ్మ. తానుచచ్చిపోయేలోగా చేసుకుంటే హాయిగా కన్నుమూస్తానని అంటుంది. సూరమ్మజీవితానికి పరమావధి పద్మకు పెళ్ళికావటమే. పద్మపెళ్లిచేసుకోను అంటే నూతిలో పడి చస్తానని బెదిరించింది.

పద్మకి రామశేషుతో పెళ్ళిజరిగి కొడుకుపుడితే పసిపిల్లవాడి సంరక్షణలో సూరమ్మ పాతతరానికి ఆధునికకాలానికి చెందిన పద్మకు పిల్లపెంపకంలో వైరుధ్యాలు ఏర్పడేవి. కొన్నాళ్ళకు పద్మకు ఆడపిల్లపుట్టినప్పుడు సూరమ్మ పద్మకు ఐదుగురు కొడుకులుపుట్టి నలుగురు పాడె ఎత్తితే, ఐదవవాడు నిప్పు పట్టుకుంటాడని అంది. అంటే ఆమె పాతతరం అభిప్రాయాలనే వెల్లడిస్తూ పితృస్వామ్యంలో కొడుకులపుట్టుకకు ఉన్న విలువలనే వల్లెవేయటం స్పష్టమౌతుంది. అప్పటికే భారతదేశంలో ప్రజాస్వామ్యం ఏర్పడినా కూతురు,కొడుకు సమానమనే భావనలు ప్రచారంకాక, పాతకాలపు పితృస్వామ్యసంస్కృతి భావాలే పెద్దతరం వారిదృష్టిలో ఉండేవి. అన్నివిషయాలలో పద్మ ఆలోచనలకు, సూరమ్మఅభిప్రాయాలకు వైరుధ్యం ఉన్నందుకు తన మాటనెగ్గటంలేదని సూరమ్మ తననితాను పరాయిదానిగా భావించేది.

పితృస్వామ్యసంస్కృతి ఎప్పటికప్పుడు స్త్రీల అభిప్రాయాలను తక్కువచేసి స్త్రీలు తమని తాము పరాయి వాళ్లుగా భావించుకొనేటట్లు చేసింది. సత్యం గుండెపోటుతో చనిపోయినప్పుడు సూరమ్మ తనకంటె చిన్నవాడు తనకళ్లముందు పోవటంతో ముసలిదాన్నైన తనని తీసుకొనిపోయి సత్యాన్ని వెనక్కిపంపమని ఎవరూ ఆమెను ఓదార్చలేని విధంగా ఆ దేవుడ్ని అడుగుతూ ఏడుస్తుంది. పద్మ తన తల్లిని కొన్నాళ్ళపాటు తాను ఉద్యోగంచేసే ఊరికి తీసుకెళ్ళాలని భావించి యిద్దరిని తమతో రమ్మంటే సూరమ్మ, కమల గుళ్లో

నిద్రచేస్తేగాని వెళ్ళటానికి వీల్లేదంటుంది. అన్నివిషయాలలో సూరమ్మకు పద్మకు ఒకరిమాట ఒకరికి గిట్టకపోవటం పితృస్వామ్యానికి, ప్రజాస్వామ్యానికి మధ్యనున్నవైరుధ్యం. భిన్నసంస్కృతులను ప్రతిఫలిస్తూ రచించటం సృజనాశిల్ప సామర్థ్యసారథ్యం.

విశాఖపట్నానికి పద్మతో వెళ్ళిన కమల, సూరమ్మలు అక్కడ కొన్నాళ్ళుండి తిరిగి తమ ఊరుచేరుకొన్నారు. పద్మా, రామశేషువాళ్లు వచ్చినప్పుడు వాళ్ళిద్దరిని ఉత్సాహపరుస్తూ ఉంటారు. ఒకసారి పద్మకు సెలవులేక రామశేషు ఒక్కడే వచ్చినప్పుడు అల్లుడికి కమల పకోడీలు చేసి పెడుతూ ఉత్సాహంగా తన వయసులో సగం వయసున్న రామశేషుతో కబుర్లు చెపుతూ కాస్త ఆనందంగా ఉండేది. వాళ్లువెళ్ళగానే కమల మళ్లీ సత్యం గురించిన ఆలోచనలలోకి వెళ్లి నిరుత్సాహంగా ఉంటే, దానికి సూరమ్మ కమలా, రామశేషులమధ్యనున్న అనుబంధాన్ని సందేహిస్తు న్నచూపులతో వావివరసలు లేనికాలం అని ఆమె గొణిగేది. భర్తపోయిన స్త్రీ ఉత్సాహంగా ఉంటే స్త్రీలకున్న మానవ సంబంధాలను అనుమానించాలనే పితృస్వామ్యసంస్కృతి స్పష్టమౌతుంది. అందుకే మనువు, వాత్సాయనుడువంటివారు ఆ విషయాలకు ప్రాధాన్యతనిచ్చి రాయటం కనపడుతుంది. పితృస్వామ్య భావజాలసంస్కృతిలో పుట్టి,పెరిగిన సూరమ్మ దానికి మినహాయింపుకాదు. సత్యం చనిపోయినప్పటినుండి సూరమ్మ భూతకాలంలోకివెళ్లి గతస్మృతులను నెమరువేసుకుంటోందంటే గతకాలం, గతసంస్కృతి ఆమెకు యిష్టమని తెలుసుకోవచ్చు.

కమలకు కేన్సర్ వచ్చి ఆసుపత్రిలో ఉంటే తానెలాకమలను పెంచిపెద్ద చేసిందో రోజూ యిరుగుపొరుగు వారికి చెప్తూ కమలబాల్యంలోకి సూరమ్మ వెళ్ళిపోవటంతో సూరమ్మకు ఏదీ పట్టేదికాదు. సూరమ్మ భూతకాలంలోకి వెళ్ళి వర్తమానం నుండి పారిపోవాలనే మనస్తత్వం ఏర్పడింది. అందుకే కమలశవాన్ని యింటికి తెచ్చినా అర్థంకాక పద్మనే కమల అనుకొని ఆకలేస్తోందని అన్నంపెట్టమని అడిగింది. పక్కింటివాళ్లు అన్నంతెచ్చియిస్తే

తిన్నది. పద్మ పదమూడురోజులుండి తనతో సూరమ్మను విశాఖపట్నానికి తెచ్చుకొంది.

కాని సూరమ్మ చిత్తచాంచల్యంవల్ల పట్టణ నాగరికతలో పద్మ యిబ్బందులు ఎదుర్కొంటుంది. అపార్టుమెంట్లలో పిల్లలగదిలో పడుకోపెడితే పద్యాలు, శ్లోకాలను పెద్దగా చదువుతుంటే, పిల్లలిద్దరు తమ చదువులు పాడవుతున్నాయ నిగోలపెట్టారు. ఆమెనుపెద్దగా చదవద్దంటే తను పరాయికొంపలో పడి ఉండటంచేత తనకి స్వతంత్రం లేకుండా పోతోందని ఏడుపు మొదలెట్టేది. మొత్తంమీద సూరమ్మకు పరాయివారి పంచనపడి ఉండటం స్వతంత్రం లేకపోవటం అని, అందుకే తన భావాలకు విలువలేదనే గ్రహింపు కలిగింది. ఒంటరిగా గదిలో పడుకోపెడితే తనకెవరూ లేరని ఏడ్చేది. బాల్కనిలో ఉంచితే పండ్లతొక్కలను కిందకు పడేసేది. అంటే ఆమె ఏదో ఒకరూపంలో తన నిరసనను ప్రదర్శించేది. బాత్ రూములో మూత్రానికివెళ్ళకుండా బాల్కనీ పాడుచేస్తుంటే సూరమ్మను అడిగితే తాను ఆ పని చేయలేదని అబద్ధం ఆడేది. కిందనున్న యింటివాళ్లు యిల్లు ఖాళీ చేయమన్నారు. మెల్లగా కమలలేదనే విషయం సూరమ్మకు అర్థమయింది. అంటే కమల లేకపోయేసరికి సూరమ్మలో అభద్రతా భావం చోటుచేసుకొనేసరికి వృద్ధాప్యంలో చిన్నప్పటినుండి ఉన్న భయంతో తనని తాను కాపాడుకొనే మార్గంలో సూరమ్మ అబద్ధాలు ఆడటం నేర్చుకొన్నదని తెలుస్తుంది.

మొత్తానికి సూరమ్మభయానికి మాత్రం మతిమరపు రాలేదని తెలుస్తుంది. ఇల్లుఖాళీచేసి మరో యింటికిమారుతూ సూరమ్మను తీసుకెడుతుంటే తనవల్ల పద్మవాళ్ళకు కష్టాలు వచ్చాయని బాధపడిందంటే సూరమ్మకు అప్పుడప్పుడు తెలివి బాగానే ఉండేది. సూరమ్మ వృద్ధాప్యంలో బాల్యచేష్టలు ఆ పాత్రకు సహజత్వాన్ని కలిగించే పాత్రచిత్రణ..

పద్మకూతురు సౌజన్య టీషర్టు, నిక్కర్ వేసుకుంటే సూరమ్మఆడపిల్ల ఆడపిల్లగా ఉండాలిగాని మగరాయుళ్లుగా ఆ వేషాలేంటి అనగా, సూరమ్మ నాలుగోతరానికి చెందిన సౌజన్య తన యిష్టం, నువ్వెవరు చెప్పటానికి అన్నది.

అలా అనేసరికి సూరమ్మ ముసలిదాన్ని పట్టుకొని ఎవరివని అంటారా, తన సొమ్ముతిని అందరూ యింతవాళ్ళయారని, తనకూతురుంటే అంతమాట అననిచ్చేది కాదని, పద్మకాబట్టి ఊరుకొందని అంది. పద్మ తన కూతురిని ఊరుకోమంటే సౌజన్య ఎందుకు ఊరుకోవాలని అనేసరికి, సూరమ్మ తనకు తల్లీ, తోడుపోయి తాను పరాయిపంచన పడ్డందుకు అంటున్నారని, తనని సముద్రంలో పడేయమని అన్నది.

దేవుడిని వచ్చి తనను తీసుకొనిపొమ్మని, తనకింకా చావు రాలేదా మరచిపోయావా దేవుడా అని మొరపెట్టుకుంది. పద్మకు అప్పుడు యిద్దరు పెద్దవాళ్ళను పెట్టుకొని తన తల్లి ఎంతబాధపడిందో గుర్తుకు వచ్చింది. సూరమ్మపక్కింటివాళ్లతో దెబ్బలాడుతోందంటే రామశేషు ఆవిడ కావాలని అలా చేయటంలేదని, ఒంటరితనాన్ని భరించలేక అలాచేస్తోందని, పరాయివాళ్లను కష్టపెడుతున్నాననే భావన ఆమెలోఉందని పద్మకు నచ్చచెబుతాడు. సూరమ్మ తనవాళ్ళందరూ ఆఖరికి కూతురు, సత్యం తనకళ్ళముందు చనిపోవటంతో తాను ఒంటరిననే భావన సూరమ్మలో ఎక్కువైంది. పైపెచ్చు లాభార్జన ధ్యేయంగా ఉన్న పెట్టుబడిదారివ్యవస్థలో ధరలుపెరిగి ఒక్కజీతం సరిపోకపోవటంతో భార్యాభర్తలు యిద్దరూ ఉద్యోగానికి వెడుతుంటే వృద్ధులు మరింతగా ఒంటరితనంతో బాధపడతారు. తనవాళ్ళంటూలేరనే అభద్రతా భావం, ఒంటరితనం, వృద్ధాప్యపు చిత్తచాంచల్యంతో సూరమ్మకు మరొకదారి కనిపించక తను చచ్చిపోతే బాగుండునని అనుకోసాగింది.అందుకే రామశేషు ఆమె తనచిన్నప్పటినుండి ఏసుఖమూ ఎరుగక, భయంతో జీవించటంతో ఆమెలో అభద్రతాభావం ఉందని పద్మను అర్థంచేసుకోమంటాడు. చిన్నప్పటినుండి సూరమ్మమనసు మొద్దుబారితే యిప్పుడు శరీరంకూడా మొద్దుబారిందేమోకాని, ఒకరోజు పనిమనిషిరానప్పుడు ఒంటరిగా ఉన్న సూరమ్మ మంచంమీదనుండి పడిపోయి రక్తంకారి గడ్డకట్టినా ఆమెకు తెలియలేదు. మరొకసారి పనిమనిషి రానప్పుడు తలుపుతీసుకొని రోడ్డున పడేసరికి, పద్మ తను ఆఫీసుకు వెడుతూ తాళం

పెట్టినందుకు, తనని జైల్లోపెట్టారని గోలచేసేది. తనవాళ్ళందరిని తానుమింగేసానని తనకి చావురాలేదని, చిన్నపిల్ల చేత చేయించు కొంటున్నానని అనేది. తనని తీసుకెళ్లమని దేవుడికి ఉత్తరం రాయమని రామశేషుని కోరుకొంది. రోజులు గడుస్తున్నకొద్ది సూరమ్మకు తనకెవరూలేరని చచ్చిపోవాలని, చావుకు ఎదురుచూస్తూ రోజులు గడుపుతోంది.

సూరమ్మకు తాను చచ్చిపోయేలోగా ఒకసారి తన ఊరికెళ్ళి తనయింటికి వెళ్ళాలనుకొని పనిమనిషిరాని రోజుచూసుకొని చెప్పాపెట్టకుండా రైలుస్టేషన్ లో ఒక అబ్బాయిసాయాన్ని తీసుకొని రైలెక్కి ఊరుచేరుకొంది. అంటే సూరమ్మ ఒంటరిగా దేనినైనా సాధించగలుగుతుందని భావించవచ్చు. అందుకే రామశేషు ఆమె సాహసప్రయాణం నుండి కోలుకోలేకపోయాడు. పద్మవాళ్లు కంగారుపడి సూరమ్మయింట్లో అద్దెకున్నవారు ఫోన్ చేస్తే వెళ్లి తీసుకొస్తారు. సూరమ్మ తన యింటికి
వెళ్ళివచ్చినప్పటినుంచి అంతగా గొడవపెట్టకుండాపడుకొని గదిపైకప్పుచూస్తూ నిర్లిప్తంగా ఉండేది. అంటే తనకిక ఏ ఆరాటాలు, ఆందోళనలు లేనిస్థితికి ఆమె చేరుకొంది.

అటుఉద్యోగం చేస్తూ, ఇటు సూరమ్మనుకూడా చూసుకోవాల్సి రావటంతో వత్తిడి ఎక్కువవటంతో పద్మకు బి.పి, షుగరు పెరిగిమానసిక కుంగుదలకి లోనయింది. డాక్టరు సలహామేరకు వాతావరణమార్పు కోసంపద్మ, రామశేషు వేరే ప్రాంతానికి వెళ్ళాలనుకొన్నారు. సూరమ్మను ఒకనెలరోజులపాటు వృద్ధాశ్రమంలో పెట్టి, ఆమెతో ఒకనెలరోజులపాటు తన ఆరోగ్యంకోసం ఊరువెడతామని, తిరిగివచ్చితీసుకెడతామని చెప్పినప్పుడు అలాగే ఉంటానని, తప్పక తనని తీసుకెడతావుగా అంటూ సూరమ్మ పద్మవైపు నమ్మకంగా చూస్తూ అడిగింది. అంతేకాదు, పద్మ అనారోగ్యం గురించి తెలిసినా ఆందోళనకు గురికాలేదంటే ఆమెమనస్సులో ప్రశాంతత చోటుచేసుకుందని తెలుస్తుంది. స్థిరచిత్తం ఏర్పడేసరికి మనుషులమీద నమ్మకం కూడా ఏర్పడింది. పద్మవాళ్లను కళ్ళారచూసుకొంది. కుటుంబవ్యక్తుల ఆరోగ్యాన్ని పట్టించుకొనే

సూరమ్మ పద్మ ఆసుపత్రినుండి తిరిగి వచ్చాక తానే ఆమెకు పథ్యంపెడతానన్నది. వృద్ధుల మానసికస్థితి ఎలా ఉంటుందో అర్థమయ్యేందుకు ప్రతీకయైనపాత్రగా సూరమ్మ తొంభైఆరేళ్ల సుదీర్ఘ జీవితాన్ని గడిపింది. కుటుంబ సంబంధాల సంస్కృతిలో తనవాళ్ళమధ్యన చాకిరీతో నలిగి, చివరకు నిర్భయంగా, ఒంటరిగా సూరమ్మ తనజీవితాన్ని ముగించింది. ఒక తాత్త్వికతను, వేదాంతధోరణిని అందుకునేటట్లుగా పాత్రచిత్రణను మలచటంలో నవలాశిల్పం నిండుతనంలోని పరిపక్వతను పండుతనాన్ని సంతరించుకోవటమే.

సూరమ్మను వృద్ధాశ్రమంలో చేర్చిన యిరవైరోజులకు పద్మవాళ్లు చెప్పినట్లుగానే ఊరినుంచి తిరిగివచ్చిన రోజున ఉద్యోగానికి వెళ్లి సంతకంచేసి సాయంకాలం కాలేజినుండి వచ్చి ఆమె గది శుభ్రంచేసి పద్మ ఆమెను యింటికి తీసుకువద్దామనుకొంది. ఈ లోపు ఆశ్రమంవాళ్లు ఫోన్ చేసి సూరమ్మకు విరేచనాలు అయ్యి క్రితంరోజు చనిపోయిందని చెప్పారు. ఫోన్ కలవకపోయేసరికి, సూరమ్మ విరేచనాలతో చనిపోవటంతో ఆశ్రంమంలోని మిగిలినవాళ్లను దృష్టిలో పెట్టుకొని అదేరోజు దహనం చేసామని చెప్పారు. పద్మ ఆశ్రమానికి వెళ్లిసూరమ్మకు మంచంవేసినచోటుకు వెళ్లి , అమ్మమ్మ తన గురించి అడిగిందా అని అడగగా ఆమె చివరగా తన చిన్నక్కను, బుల్లన్నయ్యను, కమలను, సత్యాన్ని తలుచుకుంటూ చనిపోయిందని ఆశ్రమంలోనివాళ్లు చెప్పగా పద్మకు అర్థమైంది. పద్మ చివరిక్షణాలలో తన అమ్మమ్మను పట్టించుకోనందుకు తాను తన తల్లికి ద్రోహం చేసినట్లు బాధపడింది. తొంభైఆరేళ్ళ సూరమ్మజీవితం ముగిసింది. దాదాపుగా ఒకశతాబ్దకాలాన్ని సూరమ్మ చూడగలగటం సామాన్యంకాదు. పితృస్వామ్య సంస్కృతి పీడను జీర్ణించుకొని సూరమ్మ కష్టాలు పడింది.

అయినప్పటికి బుల్లన్నయ్యసాయంతో తనవైధవ్యపు మనోవర్తిడబ్బులతో యిల్లు, పొలము ఏర్పాటుచేసుకొని తన జీవితాన్నివెళ్ళబుచ్చుకోవటమే ఆమె స్వతంత్ర జీవనానికి చిహ్నం. తల్లిప్రసవమరణంతో అనాథయై, అందరిదృష్టిలో

అవాంఛనీయమైన పసిగుడ్డుగా మిగిలిన ఆ ఆడపిల్లలో తనకువలె ఉన్న దిక్కులేనితనాన్ని చూసుకొని సూరమ్మ సహానుభూతిని పొందింది. మానవత్వంతో దగ్గరకు తీసుకొని, ఉపచార వైద్యకారిణివలె బతికించి, దత్తతతీసుకొని కమలను కూతురిగా పెంచిపెద్దచేసి సూరమ్మ తనజీవితాన్ని సార్థకంచేసుకొంది. ఆడపిల్లపుట్టుకకు విలువలను చేకూర్చింది. సాంప్రదాయ పద్ధతులలో పుట్టిపెరిగి, ఆసంస్కృతి సాంప్రదాయాలను పాటించాలనుకొన్న సూరమ్మకు పితృస్వామ్యసంస్కృతిలోని లింగవివక్షాస్వభావం అంతుపట్టక, ఆ సంస్కృతికి బలి అయింది. కాని తరువాత గ్రహింపుకువచ్చినా అది తాత్కాలికమై నిస్సహాయస్థితిలోఉన్న సూరమ్మ ఒంటరిగా ఆ సామాజిక సంస్కృతిని ఎదిరించలేకదానికి తలఒగ్గి బతికింది. ఆమెకున్న అక్షరజ్ఞానంతో లైంగికదాడినుండి తననితానుకాపాడుకోగలిగింది.

కమలను చదివించటం, ఆమెకు రజస్వలానంతర వివాహం చేయాలనుకోవటం సూరమ్మలోని మహిళాభ్యుదయకోణాన్ని పట్టియిస్తుంది. సూరమ్మ ఆ పిల్లను కనకపోయినా అంతకంటే ఎక్కువగా మాతృమూర్తి అయింది. గర్భవతియైన కమల తనను పెంచిన సూరమ్మదగ్గర దీవనలు తీసుకోవాలనుకొంది. సూరమ్మదీవనలే ముఖ్యమనుకొందని భావించింది. వితంతువు అయినా కాకపోయినా తల్లిదీవెన ముఖ్యమని భావించాలని, నిజానికి మగవాడికి లేని వితంతుతనం ఆడవాళ్ళకెందుకనే సమానత్వపు ఆలోచనలను కలిగించి రచయిత్రి పరోక్షంగా హెచ్చరించటమే నవలాప్రయోజనం. డబ్బు విలువ తెలిసుండటం వల్ల పెట్టుబడిదారి వ్యవస్థలోని వస్తువులకొనుగోళ్ళను వ్యతిరేకించేది. ఆనాటి ఆర్థికరాజకీయాలలో భాగమైన జాతీయోద్యమాన్ని అవగాహనచేసుకొని,అడ్డంకులు ఉన్నా ఆచరణలో పెట్టిన దేశసేవిక. క్రియాశీలత్వంగల పాత్ర కాబట్టి క్రమానుగత సంఘటనలలోనుండి పుట్టుకొచ్చిన సూరమ్మ సజీవపాత్రగా స్పష్టమౌతుంది.

సూరమ్మలాంటివారికోసమే లింగవివక్షాసంస్కృతిని ప్రశ్నించే స్త్రీవాదం అభివృద్ధిచెందిందని అనిపించినా, అంతిమంగా సూరమ్మలోని అంతర్గత

మానవీయత, నిస్వార్థత, మానవసంబంధాల అభివృద్ధికి దోహదంచేసింది. ప్రపంచీకరణ ప్రారంభపు రోజులవరకు దాదాపుగా శతాబ్దపు జీవితంగడిపిన సూరమ్మ మరణానంతరం ఆమె యింటిని అమ్మగా వచ్చిన డబ్బును రామశేషు పిల్లలచదువుకు బ్యాంకులో వేయటంజరిగింది. గత శతాబ్దపు అంచున, అంటే ప్రపంచీకరణసందర్భంలో సూరమ్మ నాలుగోతరంలోని సౌజన్య అమెరికా చదువుకు ఆ డబ్బును వినియోగించటం వల్ల సూరమ్మడబ్బు మరెన్నో శతాబ్దాల వరకు స్త్రీలచదువుకు మూలధనమయింది. సూరమ్మ బతికినన్నాళ్ళు ఆమెకంటూ ఒక అస్తిత్వపు విలువలు లేకపోయినా, ఆమె మరణానంతరం ఆమె సంపదమాత్రం తరతరాల పర్యంతం విద్యాసంబంధ విలువలను సంతరించుకో గలిగింది.

గతశతాబ్దంలోని కష్టాలకొలిమిలో తాపంచెందిన సూరీడుగా కమల, పద్మలవికాసానికి కారకురాలిగా సూరమ్మను ఈ శతాబ్దంలోని వారు 'శతాబ్దిసూరీడు'గా ఈ నవలలో ఆమెనుగురించి తెలుసుకోవాల్సిందే. ఒక వితంతు స్త్రీని నాయికగా చేసి పాత్రచిత్రీకరణ చేయటమే రచయిత్రి మహిళాదృక్కోణం నవలాశిల్పంలో తొణికిసలాడింది.

2) కమల

నవలలో కమలపాత్రకు ఒకప్రత్యేకత ఉంది. సూరీడువెలుగులో వికాసాన్ని పొందిన ఆమె ప్రధానపాత్రలలో ఒకటి. అటుపాతతరానికి ఇటు ఆధునికానికి మధ్యనమార్పుకు గురిఅవుతున్న సంస్కృతికి ప్రతినిధి కమల. మహిళాపీడనకు అవకాశం లేని పూర్వసంప్రదాయాలను పాటిస్తూనే వ్యక్తిస్వాతంత్రపు కాంక్షనుకోరుకొనే ఆధునికకాలపు యువతి కమల. ఆమె పాత్రగుణాలివి అని వాచ్యార్థనివేదిక చేసేకన్నా వాస్తవికసమాజాన్ని ప్రతిబింబించే నవలలోని సంఘటనలు, సంభాషణలు, సన్నివేశాలకల్పనలలో, ఆపాత్రలు పుట్టుకొచ్చి సహజత్వాన్ని సంతరించుకొని సజీవపాత్రలుగా స్పష్టమయిన పాత్ర. కమలను ఆ క్రమంలోనే అర్థంచేసుకోవాలి. పితృస్వామ్యసంస్కృతికి బలియైనా

చచ్చిపోవాలనుకొనే కష్టాలుపడ్డా సూరమ్మ తన జీవితాంతం దానినే ఆచరించింది. రెండవతరం వాళ్ళకైనా పితృస్వామ్యసంస్కృతిలోని స్త్రీపురుష వివక్షాస్వభావాన్నితెలియాలని దానిని విశ్లేషించి చెప్పాల్సిన అవసరముందని భావించే కమలపాత్రసృష్టి జరిగింది. పితృస్వామ్య భావజాల నేపథ్యపుపెంపకంతో పెరిగినా పితృస్వామ్యసంస్కృతి స్త్రీపురుష వివక్షా స్వభావాన్ని అర్థంచేసుకుంటూ క్రమంగా కమల తన నిక్కచ్చితనంతో స్వీయవ్యక్తిత్వాన్ని అభివృద్ధిచేసుకొన్న పాత్ర.

తరతరాలుగా ఉన్న ఆ సామాజికసంస్కృతిని అధిగమించే చైతన్యస్పృహను పెంచుకొన్న భిన్నస్వభావంకల పాత్ర కమల. ఆ విషయం అర్థంకావటానికి ఎటువంటి సంఘటనలు ఆ పాత్ర అలా తయారుకావటానికి కారకం అయ్యాయో తెలుసుకోవాలి. దానికి ఆమె పుట్టుక, పెరుగుదలను అవసరంమేరకు గ్రహించాలి. ప్రసవానంతర మాతృమరణంతో భూమ్మీద కళ్ళుతెరచిన పసిమొగ్గ కమల. తల్లితండ్రులవైపున్న కుటుంబసభ్యులు అవాంఛనీయమైన ఆడపిల్లగా, తల్లినిమింగిన అనాథగా, దౌర్భాగ్యురాలిగా అనాదరించినప్పుడు, సూరమ్మ తనంతటతాను తనలాంటి అనాథ ఆ పసిగుడ్డు అనుకొని మానవత్వంతో దగ్గరకు తీసి, పంచదారనీళ్ళను నోటికి తాకిస్తే ప్రాణాన్ని నిలుపుకొన్న పాత్ర. పద్ధతిప్రకారం రాతకోతల అనంతరం ఆ పసిగుడ్డును దత్తకూతురుగా చేసుకొన్నది సూరమ్మ.

కన్నతల్లి స్పర్శలేని ఆ పసికూన రాత్రిళ్ళుకూడా ఏడ్చేది. మూణ్ణెళ్ళ తరువాత ఆ పసిదానికి కమల అనిపేరుపెట్టారు. ఐదేళ్లు వచ్చేటప్పటికి బడిలో చేరింది. ఏడేళ్లురాగానే సంగీతపాఠాలను నేర్చుకొంది. కమలకు చిన్నతనంనుండి చదువులంటే యిష్టం. రెండవ ప్రపంచయుద్ధానికి ముందే అంటే నవలాంశాన్ని బట్టి 1940 సం.ల కాలంగా భావించేనాటికి పన్నెండేళ్ళ కమలకు పెళ్ళిచేయమని చిన్నతాతయ్య చెప్పగా తాను స్కూల్ ఫైనల్ పరీక్షతరువాతనే పెళ్ళిచేసుకుంటానని చెప్పగలిగింది. ఆడపిల్లలు బొమ్మలపెండ్లిండ్లుచేస్తూ గడిపేరోజుల్లోనే కమల ఆలోచనలు కాలంకంటె ముందుండేవి. కమల

స్వీయవ్యక్తిత్వస్పృహకు పునాదులు యిక్కడే పడ్డాయి. ఇదే నవలాశిల్పనైపుణ్యం. బంధువులదృష్టిలో కమలకు రాజయోగం పట్టిందనుకొనేవారు. కమల రజస్వలానంతరం సూరమ్మచిన్నక్కవచ్చి తనకొడుకైన సత్యానికిచ్చి పెళ్ళిచేయమన్నప్పుడు కమల యిష్టాన్ని ఎవరూ అడగలేదు. కమలకు తాను ఫోర్త్ ఫారమ్ పాసయినందుకు సంతోషంగా ఉంది. పెళ్ళిలో ఆడదాని యిష్టమేమిటనే సామాజికకుటుంబ సంస్కృతిగల వాతావరణంలో పెరిగిన కమల తన పెళ్ళి గురించి పట్టించుకోలేదు.తనకు చదువుమీదున్న యిష్టంతో కమల ఫిఫ్త్ ఫారమ్‌లో చేరాలనుకొని సూరమ్మను అడిగితే సత్యాన్ని అడగమంది. ఆడపిల్లకు పెళ్ళయినతరువాత ఆమె అంతా మొగుడి యిష్టప్రకారమే ఉండాలనే సాంస్కృతిక భావాలవాతావరణంలో పెరింగింది కాబట్టి సూరమ్మ కమలతో అలా అంది. కాని కమల తనకు సత్యాన్నిచూస్తే భయంఅని సూరమ్మనే అడగమంది. ఎందుకంటే సత్యం అనబడే ఆమె భర్త పెళ్ళయినప్పటినుండి కమలతో నీదిమట్టిబుర్ర అని, నీకేమి తెలియదని అంటుంటాడు. పితృస్వామ్య కుటుంబవ్యవస్థలో మొగుడుతాను ఎక్కువ అనే భావంతో భార్యని క్షణక్షణం అలాఅంటూ ఆమెను అణచివేయాలని చూస్తుండటంతో భార్యకు భర్త అంటే భయం కల్గి తనని తానుతక్కువగా అనుకుంటుంది. ఆరకంగా కుటుంబంలో భర్త ఆధిపత్యం సజావుగా సాగుతుంది. సత్యం కమల దగ్గరకు వస్తూపోతుంటాడు. భర్తయింట్లో ఉన్నప్పుడు కమల గుడ్లనీరు కుక్కుకంటూ కందిపోయి మొహంతో తెల్లారి గదిబయటకు వచ్చేది. భర్తదృష్టిలో ఆమె ఒక ప్రాణంలేని బొమ్మ అని సూరమ్మ గ్రహించిందంటే కమల పడుతున్న లైంగికహింస తెలుస్తుంది.

కస్సుబుస్సుమనే భర్తసమక్షం కమలకు భయాన్నికలిగించేది. భర్త ఊళ్ళోలేకపోతే సంతోషంగాఉండేది. అంటే స్త్రీలు ఏదోవిధంగా కుటుంబాలలో భర్తకు భయపడుతూ బతికేట్టుగా పితృస్వామ్యసంస్కృతి వాళ్ళను తయారుచేసింది. మనిషినిచూస్తేనే వళ్లంతా కంపరం పుట్టే మృగంలాంటి భర్తకోసం, పదిహేనేళ్ళ వయసుగల కమల నోములుచెయ్యాలా అని

ప్రశ్నించుకొంది. అటువంటి దాంపత్యం తనకు కలకాలం ఉంటుందంటే తాను ఆ నోములను నోయకూడదని అనుకొనేది. నోముల్ని ఆడవాళ్లే నోయటంలోని పరమార్థం నిరంతరం స్త్రీలమనస్సులను భర్తలబాగోగులందే నిమగ్నంచేయించే ప్రక్రియ. కమల స్వానుభవపు సహేతుక ఆలోచన ఆమెలోని విప్లవాత్మక ఆలోచనలకు నాందియైనది. కమల తాను భూమ్మీదపడ్డప్పటినుండి గుండెల్లో పెట్టుకొన్నతల్లి ఒకపక్క,దాంపత్యజీవితంపై రోతపుట్టించిన భర్త మరొకపక్కన ఉండి రెండు వ్యతిరేకశక్తులు తన జీవితాన్ని శిలాశాసనంలా పాలిస్తున్నాయని కమల అనుకొంది. కనుక ఆమె రెండు పితృస్వామ్యసంస్కృతుల విజాతీయ సమ్మేళనం.

కమల తనలోతాను అంతర్మథనం చెందుతూ సంతోషంతో తీసే కూనిరాగాలుకూడా మానేసి మరబొమ్మలాగా తయారయింది. తాను నెలతప్పినప్పుడు భర్త సంతోషిస్తాడని కమల అనుకొంటే బిడ్డనిస్తోందనే కృతజ్ఞత అతనిలో కనపడకపోయేసరికి కమలకు భర్త అంటే మరింత జుగుప్స ఏర్పడింది. అందరూ మగపిల్లాడిని కనమని ఆశీర్వదించినా కమలమాత్రం తనకులాగా తనబిడ్డకు అపవాదు రాకూడదని అనాథకాకుండా ఉండి తాను బతకాలనుకొంది. సత్యం తనకు ఇదివరకే పెళ్ళయి పిల్లున్నట్లు బయటపెట్టగానే సూరమ్మ తానే కమల గొంతుకోసానని బాధపడింది. దానికి కమల ఎవరూ ఎవరిజీవితాన్ని పాడుచేయలేరని, తనజీవితాన్ని తనబిడ్డ జీవితాన్ని తానే దిద్దుకొంటానని చెప్పింది. సూరమ్మ కోసమే తాను ఇన్నాళ్లు అటువంటిభర్తను భరించానని చెప్పింది. సూరమ్మను ధైర్యంగా ఉండమంది. స్త్రీ తన భర్తకు ఇంకొక భార్య ఉందనితెలిస్తే తన భవిష్యత్తును గురించి అధైర్యపడతుంది. కమలమాత్రం అధైర్యపడకుడా ఉండటమేకాక, సూరమ్మను కూడా ధైర్యంగా ఉంచగలిగింది. కమల స్థిరవ్యక్తిత్వాన్ని రూపొందించుకొందని అర్థమౌతుంది. సత్యం తల్లిగా, తనకు అత్తగా మారిన అమ్మమ్మ సీమంతానికి వచ్చి అక్కడే ఉండటంతో ఆమె కమలను సర్దుకుపొమ్మని చెప్పింది. కమల ఆమెతో సత్యం స్కూల్ ఫైనల్ తప్పినట్లు తెలుసని, అమ్మమ్మమాత్రం

ధృతరాష్ట్రప్రేమతో అతడు పాసయ్యాడని అబద్ధాలాడిందని అంది. అమ్మమ్మ తనకొడుక్కి యిదివరకే మరొక స్త్రీతో సంబంధం ఉందని తెలిసికూడా అతనికిఇంక ఎవరూపిల్లనివ్వరని గ్రహించియిక్కడికొచ్చిందని అంది.

సత్యం ఆలా తయారవటానికి అమ్మమ్మేకారణం అని తనకి పెళ్లికిముందు తెలిస్తే తాతయ్యదగ్గర మొరపెట్టుకొనేదాన్నని అంది. కమల అమ్మమ్మతో సత్యానికి భర్తగా తనమీద హక్కుఉన్నట్టు మాట్లాడావని, తనమీద సత్యం నేరాలుచెప్పినప్పుడు తాను కాపురానికి రానంటే మొగుడంటే గౌరవం భయంలేదనన్నావని గుర్తుచేసింది. అయినా ఆ అమ్మమ్మ తనకు ఆతనిపెళ్లి గురించి తెలిసి అడిగినప్పుడు చాలామందిలాగా మగనికి రెండు కుటుంబాలున్నా సర్దుకుపోవాలని, మగాడు ఏమిచేసినా చెల్లతుందని ఎగదోశావని, సత్యం తన యింటికి వస్తే పోలీసులను పిలిపిస్తానని అన్నది. అంటే పురుషాధిక్యసమాజంలో భర్తలు చేసేపనులను తల్లులు ఎగదోయటాన్ని ఖండించింది. తల్లులకు ఆడా,మగా అనే పితృస్వామ్యపు వివక్షాసంస్కృతిని ఆమోదించి సంసారాలు నిలబెట్టుకోవాలను కుంటారు. కమల తనతాతయ్యతో ఆ పరమకిరాతకుడ్ని తాను తొందరగా వదిలించుకోవాలని అనుకుంటున్నట్టు, ఆతని సామానుకూడా తనయింట్లో ఉండటానికి వీల్లేదని తనయింటితో సత్యానికి పనిలేదన్నట్టు తనఅభిప్రాయాన్ని ఖరాఖండిగా చెప్పింది.

పిల్లమీద తండ్రి హక్కును ముందుకుతెచ్చిన అమ్మమ్మతో తన పిల్లమీద తనకే హక్కుందని, సత్యం తనపెళ్లిని దాచిపెట్టి పెళ్లిచేసుకొన్నవిషయాన్ని కోర్టులో తానుచెప్తే ఆతనికి తన కూతురిమీద హక్కు ఉండదని అంది. సత్యానికి మునుపే మరొకరితో పెళ్లయినట్లు తనకి తన స్నేహితురాలి భర్తద్వారా ఆర్నెల్లకిందటనే తెలియటంతో చట్టప్రకారం పిల్లమీద తన హక్కును తెలుసుకున్నానని కమల చెప్పింది. కమల జ్ఞానానికి, ఆమె తనభవిష్యత్తు ప్రణాళికకై చేసుకొన్న ముందుచూపు నిర్ణయాలకు, స్థిరచిత్తానికి అందరూ ఆశ్చర్యపోయారు.

అమ్మమ్మ కమలపెళ్లికి తాను పెట్టిన నగలగురించి అడిగితే సత్యం ఆ నగలను ఎప్పుడో తీసేసుకునేవాడని, వాటిని యివ్వకపోతే సత్యం తమ తలకాయలు పగలగొట్టి మరీతీసుకొంటాడని అంటూ అమ్మమ్మపెట్టిన హారాన్నితెచ్చి ఆమెకు యిచ్చేసింది. పురుషాధిక్యసమాజంలో భర్తల ప్రవర్తన ఎలా ఉంటుందో గ్రహించగల శక్తి పదహేడేళ్ల కమలకున్నది. మునుపే పెళ్లిచేసుకొని మోసంచేసి పెళ్లిచేసుకొన్నభర్తతో కాపురంచేయాల్సిన అవసరం లేదని, అటువంటి మగాడికి గృహన్యాయస్థానంలో వేయాల్సిన శిక్షను కమల వేయాలనుకోవటం ఆమె ముందుచూపుకు నిదర్శనం.

న్యాయబద్ధంగా విడివిడిగా జీవించే విధానపు ఏర్పాటునుగురించిన భావనలు, చట్టాలు ఏర్పడని ఆరోజుల్లోనే స్త్రీలఆలోచనలలో అవి ఉండేవనే స్పృహను కలిగించే విధంగా రచన చేయటం జ్ఞానకాంతుల్ని వెదజల్లే కళానైపుణ్యానికి ఉదాహరణ. సత్యంతో కమలకు పెళ్ళయినప్పటినుండి అతడు ఒక మృగంలా అనిపించినా, అతనికి మునుపే పెళ్లిజరిగి మరొక ఆమెకు భర్త కాబట్టి, ఆమె దృష్టిలో ఆ మనిషి తనకిక పరాయివాడనే భావన ఏర్పడింది. దేశస్వాతంత్రపోరాట సమయంలో విదేశీవస్త్రబహిష్కరణ ప్రభావంతో కుటుంబంలోని స్త్రీపురుషసంబంధాలలో కూడా పరాయితనం, బహిష్కరించే మనస్తత్వం ఏర్పడే వీలుంటుంది. ఆ రోజుల్లో స్త్రీ వ్యక్తి స్వాతంత్ర్యోద్యమం దేశస్వాతంత్ర్యోద్యమాలు సమాంతరంగా జరిగాయని నాటి స్త్రీసాహిత్యం తెలియచేస్తుంది. అందుకే ఆనాడే స్త్రీలు విడాకులబిల్లును ప్రతిపాదించగలిగారు. పరాయితనాన్ని పారద్రోలక తప్పదనే భావన ఆనాటి సమాజంలో అందరిలో ఏర్పడిందే. కమల స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనలేకపోయినా, స్త్రీల వ్యక్తి స్వాతంత్ర్యాన్ని చైతన్యపరచే ఆ నాటి పత్రికలను చదివే అలవాటు ఆమెకు ఉండటంతో, బహుశ భర్తను కుటుంబం నుండి బహిష్కరించే చర్యకు పూనుకొని ఉండొచ్చు. అందుకే పితృస్వామ్య కుటుంబ సంస్కృతిని అధిగమించే చైతన్యాన్ని తెచ్చుకోగలిగింది కమల. పితృస్వామ్యసంస్కృతికి వ్యతిరేక విప్లవాత్మకమైన నిర్ణయానికి వచ్చి ఉంటుంది.

కూతురికి పేరుపెట్టేటప్పుడుకూడా అతడు రానక్కరలేదని తాతయ్యచేత పద్మావతి అనిపేరు పెట్టిస్తుంది కమల. తాను తిరిగి చదువులో కొనసాగలనే నిర్ణయానికి వచ్చి, ఫిఫ్త్ ఫారంలో చేరి టీచరు ట్రైనింగ్ పూర్తిచేయాలనుకుంది. అంటే ఆమెది చాలాప్రణాళికాబద్ధమైన జీవితం. అప్పుడప్పుడే బాలికా పాఠశాలలుకూడా ఏర్పడటంతో టీచర్ల అవసరం ఎక్కువగా ఉండేది. నవలలోని స్త్రీల ఆలోచనలు అన్నీ ఆనాటి సమాజంలో ఉన్నవే కాబట్టి నవలలో వాస్తవికత ప్రతి సన్నివేశంలో స్పష్టమౌతుంది. అందుకే కమలకూడా ఒకపాత్రలాగా కాక సమాజంలోని ఒకవ్యక్తిగా కనపడుతుంది.

అందరు చాకిరీకితప్ప పనికిరాదనుకొనే సూరమ్మ తిండి గురించి పట్టించుకొని కమల సూరమ్మను రాత్రిపూట కూడా తప్పనిసరిగా అన్నం తినమని చెప్పి ఆమె ఆనందానికి, ఆరోగ్యానికి కారకురాలయింది. వారసత్వపు ఆస్తిలేని వితంతుస్త్రీ కుంగికృశించి పోవటానికే వారికి ఒంటిపూటతిండిని పితృస్వామ్యం ఆహారనియమంగా నిర్దేశించింది. కమల తన చదువుకొనసాగిస్తూనే ఆర్థికస్వావలంబనకై పిల్లలకు ట్యూషన్లు చెప్పి సంపాదించిందంటే యింటినిర్వహణలో ఆర్థికలోటులేకుండా చేసుకొన్నదని తెలుస్తుంది.

కమలటీచరుగా ఉద్యోగంలో చేరుతుంది. ఒకరోజు సత్యం వచ్చి కమలతో తన నాన్నచేయించిన నగలమీద తన తల్లికి తన యిష్టానుసారం యివ్వటానికి వీలులేదని వాదించగా ఆ నగలు తనకు అనవసరమని కమల బుల్లితాతయ్యతో చెప్పి యిప్పించింది. భార్యకు భర్త నగలుచేయిస్తే ఆ నగలమీద తల్లి బతికున్నప్పుడే కొడుకుగా తనకు వారసత్వపు హక్కుఉందని సత్యం వాదించాడంటే పురుషాధిక్యసంస్కృతి స్వభావం అర్థమౌతుంది. కమల మితభాషి అయినా, స్కూల్ టీచర్లు తమ భర్తకున్న కుటుంబేతర లైంగికసంబంధాలను కమలతో చెప్పుకుంటుంటే సమాజసంస్కృతి అంతటా అలాగా ఉందని గ్రహిస్తుంది. సత్యంవిషయంలోను, బుల్లితాతయ్య తన భార్యపోయినప్పడు దిగులుపడనందుకు పితృస్వామ్యసంస్కృతిలోని

వివక్షాస్వభావం కమలకు అర్థమయింది. చలంగారి కథలు చదివినప్పుడు కూడా స్త్రీకి ఒకన్యాయం పురుషుడికొకన్యాయం ఉండదని గ్రహించింది. డెబ్బైఏళ్ళ బుల్లి తాతయ్య భార్యచనిపోయిన ఏడాదికే తనవయసులో సగంకన్నా తక్కువవయసు ఉన్న పదహేడేళ్ళపిల్లను పెళ్ళిచేసుకొని తెచ్చినప్పుడు బుల్లితాతయ్య అంటే జుగుప్స, అసహ్యం కలిగాయి. ఆయనకూడా సత్యంలాంటివాడేనని అనుకొంది. పితృస్వామ్యసంస్కృతి వివక్షాస్వభావం మరింతగా స్పష్టమై, ముసలివాడ్ని పెళ్లిచేసుకొన్న ఆ చిన్నపిల్లమీద జాలిచూపించాలంటుంది. పురుషాధిక్యసామాజిక సంస్కృతికి బలియైన తోటి స్త్రీని అర్థంచేసుకొనే మానవత్వం కమలకు ఉన్నది. ఆ పిల్లమీద సూరమ్మ, తన అమ్మమ్మ ఆడబడుచుల హోదాతో, అవమానిస్తూ సూటిపోటిమాటలంటుంటే పిల్లని అనేకంటే వారి తమ్ముడు చేసినపనిని గురించి ఆలోచించమంటుంది. సామాజిక వివక్షాసంస్కృతిని వేలెత్తిచూపిస్తుంటే, తట్టుకోలేక అక్కచెల్లెళ్ళు కమల గర్వంతో ఉందనుకొంటారే తప్ప ఆమె మాటల్లోని వాస్తవాన్ని ఒప్పుకోరు. బుల్లిమామ్మ బతికున్నప్పుడు తన నగలను పద్మకి ఇవ్వమని చెప్పినా, బుల్లితాతయ్య ఇవ్వకపోయినా, ఆతని రెండవభార్య ఆ నగలన్నీ తీసుకొనివెళ్ళిపోయినా, కమల బాధపడదు. బుల్లితాతయ్య చనిపోతూతన భార్యపద్మావతి పేరును కమల తనకూతురుకు పెట్టినందుకు పద్మకు అందించమని పదివేలరూపాయలు చేతిలో పెడతాడు.పద్మపెళ్ళికి ఉంటుందని, అమ్మమ్మ వద్దన్నా కమల తన యిష్టం అంటూ ఆ డబ్బుతో యింటిపైన, వెనక, రెండేసి గదులుకట్టించి అద్దెకు యిస్తుంది. అప్పుడు కమల తెలివికి ముసలమ్మలిద్దరూ సంతోషపడతారు.

తనకు చివరివరకూ చాకిరి చేసిన ఆస్తిని సూరమ్మపేరన రాయనందుకు కారణం ఆలోచిస్తూ సమాజసంస్కృతిలో ఆడవాళ్లు చాకిరికి పనికివస్తారుగాని, ఆస్తిని అనుభవించటానికి పనికిరారని అనుకొంది. అంటే కమలకు మరొకసారి పితృస్వామ్యసంస్కృతిలోని వివక్షాస్వభావం విశదమైంది. ఇక్కడే రచయిత పితృస్వామ్యసంస్కృతి అని దానిని ప్రత్యేకంగా చెప్పకపోయినా ఆ

సమాజసంస్కృతిని అడుగడుగునా సంఘటనలపరంగా స్ఫురింపచేయటం నవలాశిల్పానికి ఉన్న ప్రత్యేకత. కమల యిల్లుకట్టిస్తున్న సూపరువైజరుకు నిర్మాణవిషయంలో సలహాలను యిస్తుంటే అమ్మమ్మ అతనితో మాట్లాడుతున్నందుకు అనుమానిస్తే అందరిలా కమల బాధపడకుండా తాను చెడిపోదలచుకుంటే స్కూల్ వంకతో బయట చెడుతిరుగుళ్లు తిరగొచ్చని, తాను చెడిపోదలచుకుంటే ఎవరూతనని ఆపలేరని, ఆమె కొడుకువల్ల మగవాడంటేనే అసహ్యం వేస్తోందని ధైర్యంగా చెబుతుంది. స్త్రీలలో పురుషద్వేషం కలగటానికి కారణాన్ని చెబుతుంది. కమల ఏ విషయాన్ని మాట్లాడుతున్నా నిర్భయంగా, నిక్కచ్చిగా మాట్లాడింది. అత్తగా అమ్మమ్మ తనమీద నిఘాపెట్టినట్లు గ్రహించి పితృస్వామ్య సంస్కృతి అనుమాన స్వభావానికి పరోక్షంగా కమల హెచ్చరించింది.

కమలకు మగవాళ్ళతో మాట్లాడటం యిష్టమే. కాని స్కూల్ టీచర్ల భర్తలు చనువు తీసుకోవాలని ప్రయత్నిస్తే మగవాళ్లందరు సత్యంలాండివారేనని వాళ్లమీద బుసలుకొట్టే స్వభావాన్ని కమల కలిగి ఉండేది. పద్మకు తనయిష్టంవచ్చినట్లు పెరిగే స్వేచ్ఛఉండాలని, పద్మ చుడీదారులువేసుకొని మగవాళ్ళలాగా ధైర్యంగా పెరగాలని కమల అనుకొనేది. అంటే సమాజంలో కూతురును మగవాళ్ళతో సమానంగా పెంచాల్సిన అవసరాన్ని కమల గుర్తించింది. కమలకు తన అనుభవంతో సమాజంలోని లింగవివక్షను తెలుసుకున్నది. అంతేకాదు, పత్రికలు చదివేఅలవాటున్న కమలకు అప్పటి స్త్రీలసాహిత్యంలోని వ్యాసాలు, కథలవల్ల స్త్రీపురుషులు సమానమనే చైతన్యం కలగటంతో, తన ఆలోచన సరియైనదనే నమ్మకం ఆమెకు ఏర్పడింది.

సూరమ్మ తనకు జుట్టుతీయించిన నాటి సంప్రదాయాన్ని మరిచిపోయి ఆడవాళ్లు ఆడవాళ్లుగానే ఉండాలని అనుకునే స్థితికి సూరమ్మ చేరుకుందని కమల అనుకొంది. అంటే స్త్రీలు తమకు కష్టాన్ని కలిగించినా ఆ పాతసంప్రదాయాన్నే అలవాటు చేసుకోవటానికి వాళ్లు కష్టాలను మరచి పోవటమే కారణం అనుకొంది. కమల తనకూతురు పరిస్థితులతో

రాజీపడకుండా ముందడుగువేస్తే, తాను వెనక్కి లాగదలచుకోలేదు. సంప్రదాయం, పరువు ప్రతిష్ఠ స్త్రీలకుమాత్రమే పరిమితం కాదని, వాటిని మగవాళ్లుకాలరాసి స్త్రీలను రక్షించమంటే పాతతరంవాళ్లు ఒప్పుకున్నట్టు, రాబోవుతరంవాళ్లు ఒప్పుకోరని అనుకొంది. ఇక్కడే కమలనాటి సామాజికసంస్కృతిస్వభావం భవిషత్తులో అంగీకరింపబడదని క్రాంతదర్శిగా, ఆశావహిగా రచన నిలబడింది. నాటినుంచి స్త్రీలు తమ కష్టాలను ఎదిరించి ఉంటే పితృస్వామ్య సమాజసంస్కృతి బీటలువారేదని అనిపిస్తుంది. కాని, అనాదిగా బలంగా స్థిరపడ్డ దాన్ని స్త్రీలు సామూహికంగానే ఎదిరించగలరు. అది ఒక్కస్త్రీనుండి మొదలయినా విస్తృతమై సమాజసంస్కృతి మారే అవకాశం ఉంటుందని కమల పాత్ర ద్వారా వ్యక్తపరచింది.

సత్యంమొదటి భార్య (అప్పటికింకా హిందూ లా,1955 లేదుకాబట్టి మగవాళ్ళు ఎన్ని పెళ్ళిళ్లయినా చేసుకునేవారు.) ఆకలికి తట్టుకోలేక మతంమార్చుకొని మిషనరిలో చేరిందని, అప్పటికి మూడురోజులనుండి తిండిలేక ఆకలితో, మాసినబట్టలతో తన తల్లివద్దకు సత్యం వచ్చాడని అమ్మమ్మ మాటలవల్ల తెలుసుకొన్నది కమల. అమ్మమ్మ తన కన్నకొడుకు స్థితికి బాధపడి అతనికి అన్నం పెడదామని అంటే, మానవత్వపు జాలితో కమల ఆకలిగొన్న శత్రువుకైనా అన్నంపెట్టాలని అనుకొంది. కమల తాను చాలా నిక్కచ్చిమనిషినని, సత్యం తన మొగుడుగా కాకుండా నీకొడుకుగా వచ్చి అన్నం తినవచ్చని, బట్టలుకొనియిస్తానని అందరితో పాటు అతనికి సమాన భోజనం పెట్టమంటుంది. కాని, సత్యం రాత్రిపూట తనయింట్లో ఉండటానికి వీల్లేదనే షరతుపెట్టింది. ఇక్కడ మృగసమానుడైన సత్యం రాత్రిపూట తన యింట్లో ఉండరాదనే భావన కమలకు ఉన్నది. ఇక్కడ కమలకున్న పురుషద్వేషం మానవత్వం ముందు నిలబడలేకపోయింది.

పద్మ యూనివర్సిటి చదువుకు కావాల్సిన అప్లికేషన్ల విషయంలో తండ్రిగా సత్యం సహాయపడుతుంటే బాధ్యతను వహించే తండ్రిగా అతనిలోని మార్పును కమల గుర్తిస్తుంది. పద్మచదువుకు అవసరమయ్యే డబ్బును ఎలా తేవాలని

కమల ఆలోచిస్తున్న సమయంలో అమ్మమ్మ తాను పద్మ చిన్నప్పుడు కమలతల్లి నగలనుఅమ్మి ఇన్సూరెన్స్ చేసానని, యిప్పుడు గడువు తీరిందని చెప్పింది. ఆ డబ్బుతో పద్మను చదివించమని, సత్యానికి తెలియకుండా దాచి ఉంచానని అమ్మమ్మ చెప్పింది. సూరమ్మ యింకా ఆ తరంలోనే ఉంటే అమ్మమ్మలోని ఆధునికకాలపు ఆలోచనలకు కమల ఆశ్చర్యపోవటమేకాక, అమ్మమ్మకు తన కొడుకు మీద కంటె తనమీద ఉన్న నమ్మకానికి విస్తుపోయింది. దానికి కారణం కమల తన మానవత్వంతో సత్యాన్ని ఆదరించి అమ్మమ్మ నమ్మకాన్ని పొందటంగా అర్థంచేసుకోవచ్చు.

పద్మ విశాఖపట్నంలోని యూనివర్సిటిచదువుకు వెళ్లినతరువాత కమల పెద్దవాళ్ళిద్దరిని పిండివంటలు చేసుకొని తినమని చెప్పటంతో, వారికోసం రోజూ ఆసుపత్రినుంచి మందులు తేవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమ్మమ్మ మంచానపడితే సత్యం ఆతని తల్లి బాగోగులు చూస్తుంటే తనయందుకూడా సత్యం అలా ఉండుంటే బాగుండేదనుకొంది. అమ్మమ్మ చనిపోతూ సత్యాన్ని మేనమామగా యింట్లో ఉండనీయమని కమల దగ్గర మాట తీసుకొంది. అమ్మమ్మ పద్మ చదువువిషయంలో స్త్రీవిద్య, స్త్రీస్వాతంత్ర్యం అని వాదిస్తుంటే కమలకు ఆశ్చర్యమేసేది. అంటే భారతదేశ స్వాతంత్ర్యానంతరం ఆడవాళ్ళ దృష్టిలో కూడా స్త్రీలవిద్యపట్ల, స్వేచ్ఛపట్ల ఆలోచనలు పెరిగాయి.

పద్మ ఊళ్ళోనే లెక్చరరు ఉద్యోగంలో చేరి కాస్తషోకులు చేసుకొంటే, పద్మ డబ్బును వాటన్నిటికి తగలేస్తోందని సూరమ్మ అనేది. కాలం మారుతున్నపుడు, సంస్కృతికూడా మారుతుందని, యిదివరకటి వైధవ్యపు సంస్కృతిలో ఎంతమార్పు వచ్చిందో గ్రహించమని కమల ఆమెతో అంది. కమల తను పనిచేసే స్కూల్లో రిటైర్ అయిన టీచర్లు తీర్థయాత్రలకు వెడుతుంటే సూరమ్మను వాళ్లతో పంపింది.

ఆరోజు సెలవుదినం అయినా పద్మకాలేజికి వెళ్ళినప్పుడు కమల పనిపూర్తి చేసుకొని, తనగదిలో పడుకొని వార్తాపత్రిక చదువుకుంటుంటే సత్యం గదిలోకి రాగా ఎందుకొచ్చావని అరుస్తుంది. సత్యం మంచం దగ్గరగా వచ్చి తాము

భార్యాభర్తలుగా కలిసి ఉంటే తప్పేమిటని అనగానే కమల ఆడపులిలాగా గర్జిస్తూ అతనితో "నువ్వు మారావనుకొన్నా. పొరపాటయింది. నీతో భార్యాభర్తలసంబంధం ఏనాడో తెగిపోయింది, బయటకు నడు" అంటూ చింతనిప్పులాంటి కళ్లతో ఆగ్రహంతో మాట్లాడింది. అంతేకాదు, కమల ఇంకా ధైర్యం తెచ్చుకొని "తిండిలేక పస్తులుంటున్నావని, యిల్లూ, వాకిలిలేక రోడ్లమీద తిరుగుతున్నావని, మీ అమ్మ ఏడిస్తే, మేనమామగా తిండిపెడుతున్నాగాని నీకూనాకూ ఎటువంటి సంబంధమూ లేదని" కమల నిక్కచ్చిగా అంది. మళ్లీ చెబుతున్నానంటూ "నువ్వు నాకేమి కావు, దయాధర్మంగా తిండిపెట్టి చోటిచ్చాను. కావాలంటే ఉండు, లేదా పెట్టె,బేడ తీసుకుపో"అని అరిచింది. దానికి సత్యం"నువ్వు రాత్రిళ్ళు గడియ పెట్టుకోకపోతే" అంటూ నసిగాడు. దానికి కమల "నీ తెలివికేం తక్కువలేదు. గొప్పగా కనిపెట్టావ్, సిగ్గుందా?, చీము, నెత్తురు ఉన్న మనిషివేనా?తిండిపెట్టి చోటు యిస్తే నెత్తినెక్కుతున్నావు, నీతల్లికి జబ్బుగా ఉన్నప్పుడు అర్ధరాత్రి లేపుతుందేమో అని తలుపు గడియపెట్టుకోకుండా పడుకుంటున్నా దౌర్భాగ్యుడా!"అని తిట్టింది. అంతేకాక,"నీమీదమోహంతో తలుపు వెయ్యకుండా ఉన్నాననుకొన్నావా! మరోసారి ఇలాంటి ఆలోచన చేసావంటే పెట్టె, బేడ రోడ్డుమీదకు విసిరేస్తా, జాగ్రత్త. పో,బయటకుపోరా,పో" అంటూ కమల అపరకాళిలా ఉండేసరికి సత్యం భయపడి బయటకు వెళ్ళిపోయాడు. పితృస్వామ్యస్కృతికి ప్రధాన లక్షణంగా ఉన్న స్త్రీలపై ఉండే లైంగిక అదుపును కమల తనకున్న ధైర్యం, నిక్కచ్చితనంతో ఎదుర్కొని పితృస్వామ్యఆధిక్యతను నిర్వీర్యం చేయగలిగిన స్త్రీశక్తిగాకనపడింది. తరతరాలుగా కుటుంబస్త్రీల సమస్యకు మార్గదర్శక కర్తవ్యాన్ని ప్రబోధించిన గీతాచారిణిగా అర్ధమౌతుంది. స్త్రీకి తన జీవితంమీద తనకే అధికారముండాలని, ఎవరికీ తనమీద అధికారం ఉండకూడదని భావించటం చేతనే పితృస్వామ్యపు లైంగిక అదుపును శక్తిమంతంగా ఎదుర్కొంది.

ఇక్కడ ఓల్గా రాసిన'విముక్త' నవలలోని అహల్య,ఊర్మిళపాత్రలు చెప్పిన“నీమీద అధికారాన్ని ఎవరికి ఇవ్వకు. నీఅధికారాన్ని నువ్వే ఉంచుకో,అప్పుడే నీ అస్తిత్వంనిలుస్తుంది” అనే మాటలు గుర్తుకు వస్తాయి.

ఇక్కడ భార్యాభర్తల సంబంధాలలోని వైరుధ్యం పతాకస్థాయికి చేరుకుంది. పురుషుడు స్త్రీని సరిగ్గా అంచనా వేయలేకపోయాడు. లైంగికసంబంధాలలో తనవైపునుండి మాత్రమే ఆలోచించాడు. పురుషునివలె స్త్రీ చంచల స్వభావికాదు. స్వీయసంపాదన, స్వీయవ్యక్తిత్వంతో స్థిరత్వంగల కమలవంటి స్త్రీవిషయంలో సామాజిక కుటుంబ ఆధిక్యత, మదాహంకారం జీర్ణించుకొని పెరిగిన సత్యంవంటి పురుషుడు స్త్రీముందు ఎన్నికంచెలు ఉన్నా అవకాశంకోసం ఎదురుచూస్తుంటాడు. మొగుడనే సామాజిక అర్హతలోని నీచసంస్కారం తేటతెల్లమయింది.

అంతకుముందే తాను ఒంటరినని బాధపడ్డాకూడా కమల మనసు లొంగలేదంటే కమల సత్యంతోడి లైంగిక సంబధాల విషయంలో ఎంత నిక్కచ్చిగాఉందో తెలుస్తుంది. ఆమె ధృఢసంకల్పానికి, యింద్రియనిగ్రహానికి జోహార్లనిపించ వలసిందే. కమలకు కోపంవస్తే తనబతుకు రోడ్డుమీదేనని తెలుసుకొన్న సత్యం అక్కడినుండి తప్పుకున్నాడు.

అనుభూతులకు, ప్రేమలకు ఆస్కారము ఉండాల్సిన వైవాహిక స్త్రీ,పురుష సంబంధాలలో ఆధిపత్యభావాలు చోటుచేసుకొని, అది స్త్రీలలైంగికతపై అదుపు రూపంలో ఉంటుంది. పితృస్వామ్యంలోని ఆధిక్యసంస్కృతిని ఒక సవాల్‌గా తీసుకొని, అదేస్థాయిలో వ్యక్తిగతంగానైనా స్త్రీశక్తి ఎదుర్కొన్నప్పుడే దాని ఉద్ధృతి తగ్గుతుంది. అది మెలమెల్లగా సామూహికత్వాన్ని సంతరించుకొంటుందని, పితృస్వామ్య ఆధిక్యసంస్కృతిని నామరూపాలు లేకుండా చేయటం సులభసాధ్యమే అవుతుందని, దానికోసం స్త్రీలలో కమలకున్న నిక్కచ్చితనం అవసరమౌతుందనే స్ఫూర్తిని ఇచ్చిన రచన ఇది. అందుకే స్త్రీలు జాగ్రత్తగా ఉండాలని కమల అనుకొంది. దానికి కమల,సత్యం మధ్య జరిగిన ఘర్షణలో సున్నితవిషయం తెలుసుకొనేలా రచనచేయటం సంభాషణలపరంగా ఉన్న

నవలాశిల్పానికి మచ్చుతునక. అటువంటి ఏకపక్ష వైవాహికలైంగికదాడిని ప్రజాస్వామ్యప్రభుత్వాలు చట్టపరంగా నిషేధించ గలిగినప్పుడే స్త్రీకి నిజమైన స్వేచ్ఛ వస్తుంది.

ఆరాత్రికి సత్యం యింటికివెళ్ళలేకపోయాడు. కాలేజినుండి వచ్చిన పద్మ తల్లిముఖం గంభీరంగాఉండి ఏడ్చినట్లు కళ్ళు, ఉబ్బినట్లుగా, ముఖం ఎర్రగా తీవ్రంగా ఉంటే ఏదోజరిగిందని గ్రహించుకొంది. కాని ఏంజరిగిందని అడిగే సాహసం చేయలేకపోయింది. ఆరాత్రి సత్యం యింటికి రాకపోవటంతో పద్మకు అర్థమయింది. కొన్నాళ్ళ తరువాత తిరిగివచ్చిన సత్యం యింట్లో ఉంటే రాత్రుళ్ళు కమల మరిచిపోయినా ఆమెగది లోపలిగడియను పద్మ పెట్టేదంటేనే తల్లి విషయంలో సత్యంమనస్తత్వం పద్మకు అర్థమైందని తెలుస్తుంది.

తీర్థయాత్రలనుండి నెలనాళ్ళకు యింటికి వచ్చిన సూరమ్మ యింట్లో సత్యంలేకపోవటానికి కమలను అడిగితే తానంతట తనే వెళ్ళిపోయాడని కమల అంటుంది. కారణంలేకుండా ఎందుకువెడతాడని అనుకుంటూ కమలే అతడ్ని బయటకు పంపించి ఉంటుందని సూరమ్మ సందేహిస్తుంది. సత్యం బయటకు వెళ్లి తిరిగి రానందుకు కమల మనసు పీకుతుంటే తానలా సత్యాన్ని అన్నందుకు, రైలుకిందపడి చచ్చిపోయాడా లేదా సన్యాసుల్లో కలిసాడా అంటూ ఆలోచించింది. తాను కఠినంగా ఉండకుండా ఉంటే బాగుండేదేమో అని అనుకుంటూనే అతడ్ని అలా అనకపోతే వెనకటి జంతువు అయిపోయేవాడని, ఒకసారి లొంగితే జుట్టుచిక్కించుకొని ఆటబొమ్మలా ఆడిస్తాడని, పంజా విప్పిన పులిలా సత్యం అవకాశంకోసం ఎదురుచూసాడని భావించింది. అటువంటి పరిస్థితి రానివ్వటం తనదే తప్పని అతడు గదిలోకిరాగలిగే అవకాశంయివ్వటం తనదే తప్పని అనుకొంది.కాని సత్యం యింట్లో ఉంటే సూరమ్మకు తృప్తిగా ఉంటుందని అనుకొంది.

నెలరోజులతర్వాత సత్యం తిరిగి యింటికి రాగానే సూరమ్మసాక్షాత్తు విష్ణుమూర్తిని చూస్తున్న ఆనందాన్నిపొంది, కాశీసమారాధనచే యాలని హడావుడి పడుతుంటే సూరమ్మ నిజంగా పిచ్చిదని అమ్మమ్మ అన్నమాటల్లో

నిజం ఉందని కమలకు అనిపించింది. కాని సత్యంవిషయంలో అమ్మమ్మ తన కొడుకు చచ్చిన పాము అన్న మాటలు మాత్రం అబద్ధమని కమల అనుకొంది. అతను కోరలు తీసిన పాము, చచ్చినపాముఅని అనుకొంది. పాము ఎప్పుడూ పామేఅని, సరీసృపానికి చావు ఉండవచ్చుగాని, మనిషిలో బుసలుకొట్టే కోర్కెలకు చావుండదని అనుకొంది. డెబ్బై ఏళ్ళ బుల్లితాతయ్య తనలోని పామును చంపలేకపోయాడని, సత్యంకూడా అలాంటివాడేనని, సత్యంలాంటి పాము కాటెయ్యకుండా తానే జాగ్రత్తపడాలని కమల అనుకొంది. సూరమ్మకు ఇన్ని అనుభవాలు అయినా పితృస్వామ్యసంస్కృతిని జీర్ణించుకొన్న వాతావరణంలో పెరగటంచేత జీవితాలను ఆ కోణంలోనే చూస్తుంది. కాబట్టే అతను ఎలాంటివాడైనా సత్యంఅంటే తల్లికి యిష్టమనిపించింది కమలకు.

పద్మ పెళ్ళివిషయంలో రామశేషు వరకట్నం తాము తీసుకోవటానికి కారణాలు చెప్పి దానిని అప్పుకింద తీర్చేస్తానని చెప్పినప్పుడు, ఆతని మాటల్లోని స్త్రీలమనోభావాలకు విలువిచ్చే లక్షణం కమలకు నచ్చాయి. తాను ఉద్యోగంలో కూడబెట్టిన పాతికవేలు ఉండటంతో, ఒంటరిగాపెరిగిన పద్మను అప్పచెల్లెళ్ళు, అన్నదమ్ములు ఉన్న పెద్ధసంసారంగల యింటికి పంపిస్తే పద్మకు ఆప్యాయతలు అనురాగాలు, బంధుప్రేమలు తెలుస్తాయని భావించిన కమల అతనితో పద్మ వివాహాన్ని జరిపిస్తుంది.కూతురుని యిచ్చేచోట అవతలివాళ్ళది చిన్నకుటుంబం అయితే బాగుండుననే రోజులలో కమల కుటుంబసంబంధాల అభివృద్ధివృద్ధిని కోరుకోవటంలో కమల నిస్వార్థత, మానవసంబంధాల అభివృద్ధి స్పష్టమవుతాయి.

పద్మకు పిల్లవాడుపుట్టగా, సత్యం వాడిపనులన్ని చూసేవాడు. పద్మకొడుకు పుట్టినప్పటినుండి సత్యం, కమలలమధ్యన తాత అమ్మమ్మలవంటి కొత్త అనుబంధం ఏర్పడింది. కాని వారిద్దరు దగ్గరగా ఒకేయింట్లో సహజీవనంలో ఉంటున్నా భార్యాభర్తలుగా ఉండలేదని నవలలోని సంఘటనలనుబట్టి తెలుస్తుంది. కమల సత్యంతో కొద్దిగా మాట్లాడుతూ ఆతని గతజీవితం గురించి తెలుసుకుంది. సత్యంకూడా తాను కమలగదిలోకి వచ్చినందుకు క్షమించమని

అడగగా, తానాసంగతి మర్చిపోయానని కమల చెప్పింది. అంటే కమలకు సత్యం యిక తనజోలికి రాడనే భరోసా ఏర్పడింది. పద్మ పిల్లలకోసం తమతో రమ్మంటే, సత్యం వాళ్ళతో వాళ్ళూరువెళ్ళి ఉండొచ్చాడు. వచ్చిన కొన్నాళ్లకు సత్యం డీలాపడి నీరసంగా ఉంటుంటే అతనికి హార్లిక్స్ కలిపి యిచ్చేది.

కానిఒకరోజు రాత్రిపూట పక్కనపెట్టిన హార్లిక్స్ తాగకుండానే సత్యం నిద్రలోనే చనిపోయాడు. దానికి కమల తనమీద సత్యానికి కోపం ఉండబట్టే తానిచ్చిన హార్లిక్స్ తాగలేదని, తనతో ఒక్కమాటకూడా పిలిచి చెప్పలేదని అనుకొంది. సత్యాన్ని పట్టించుకోకుండా ఉన్నందుకు బాధపడి, తానట్లా ఉండకపోతే బాగుండేదనుకున్నది కమల. అందుకనే ఆతని కర్మకాండలకు ధారాళంగా ఖర్చుపెట్టి కమల తృప్తినిపొందింది. కమల బొట్టూ మంగళసూత్రాలను తనంతట తానే తీసినప్పుడు,తన తండ్రి ఉన్నప్పుడు ఆతనియెడల యిష్టంచూపని తల్లి అలాచేసినందుకు పద్మ ఆశ్చర్యపోయింది. దానికికారణం రామశేషు చెపుతూ వారిద్దరిమధ్య పరస్పర అభిమానం ఉందన్నాడు. అంతేకాదు, ఆమెపట్ల అతడు చేసినపనులు మాటిమాటికి ఆమెకు గుర్తుకురావటంతో, ఆతడు చేసిన పనులను ద్వేషించి, ఆద్వేషాన్నే ప్రేమించింది. అంతేకాని, వ్యక్తిని కాదని, అందులోనే తన వ్యక్తిత్వం ఉందని ఆమె భావించిందని రామశేషు అన్నాడు. భర్త బతికున్నప్పుడు అతడ్ని న్యాయంగా చూడలేదనే బాధతో అతనికి అన్నిక్రతువులు జరిపించి మనోభారాన్ని తగ్గించుకోవటానికి ఆమె ప్రయత్నం చేస్తోందన్నాడు. కమల తిరిగి ఉద్యోగంలో చేరింది. కాని నిరాశా నిస్పృహలతో గడిపేది.

పద్మ, రామశేషు పిల్లలు వస్తూపోతూ ఉండేవారు. వాళ్ళున్నప్పుడు కమలకు కాస్త ఆనందంగా ఉండేది. వాళ్ళువెళ్లిపోగానే తిరిగి నిరుత్సాహంగా ఉండేది. కొన్నాళ్ళకు తిండికూడ తినలేకపోతే పద్మావాళ్లు వచ్చి కమలను ఆసుపత్రిలో చేర్పించారు. ఆమెకు కేన్సరు అని తేలి, పదిరోజులవైద్యం తరువాత అక్కడే కమల చనిపోయింది.

కమలకు చిన్నతనం నుండే తన జీవితంమీద సరైన అవగాహన ఉండేది. కాబట్టే ఆంగ్లప్రభుత్వం ఉన్నరోజులలో ఇంగ్లీషుమీడియంలో చదువుకోవాలని తనంతటతానే మరో స్కూల్ కి మారి చదువుకొంది. పత్రికలు చదవటమేకాక తనకు యిష్టమైన సినిమాలకు ఒక్కతే స్వేచ్ఛగా వెళ్ళేది. కమల సంప్రదాయబద్ధంగా ఉన్నా, తన యిష్టమైనరీతిలో తన జీవితాన్ని గడిపింది. ఫోర్త్ ఫారమ్ చదువుతున్న పదిహేనేళ్ళ కమల అభిప్రాయం తెలుసుకోకుండానే సత్యంతో పెళ్ళిచేశారు. అప్పటినుండి కమల తన చదువును ఆటంకపరుస్తూ జరిగిన లైంగిక అదుపును, వైవాహిక లైంగికదాడిని కొన్నాళ్ళపాటు సూరమ్మ కోసం తట్టుకుంది. వైవాహిక స్త్రీపురుషసంబంధాలలో 'సున్నితత్వం' కావాలనుకొంది. సున్నితత్వం లేకపోతే అది లైంగికదాడిగానే భావిస్తారు. మనసుకు శరీరానికి ఉన్న అవినాభావసంబంధాన్ని గుర్తించటమే ఆ సున్నితత్వమని తరువాత వచ్చిన రామశేషుపాత్ర సంభాషణలో భాగంగా అర్థమయేటట్లు రాయటమే నవలాశిల్పం. అన్నికుటుంబాలలో ఇది సాధారణ విషయంగా ఉండటానికి కారణం పితృస్వామ్య సంస్కృతిలో స్వేచ్ఛాయుత లైంగికసంబంధాలకు అవకాశంఉన్న పురుషులకు స్త్రీలమనసులను పట్టించుకొనాలనే అవసరం లేకుండాపోయింది.

ఆ రకంగా పితృస్వామ్య కుటుంబాలలో భార్యాభర్తలమధ్యన ఉన్న స్త్రీపురుష సంబంధాలలో అసమాన నైతిక సంస్కృతి స్త్రీలమనస్సులను పట్టించుకోకుండా చేసి పురుషులలో సున్నితత్వంలేకుండా చేయటంతోనే అది వివాహవ్యవస్థలోని 'లైంగికదాడి'గా భావింపపడేటట్లుచేసింది. కాని సత్యానికి మరొకపెళ్ళయిందని తెలిసినప్పటినుండి తాను గర్భవతియైనా, తన బిడ్డను తానే పెంచగలననే నిర్ణయానికి
వచ్చింది. ఆతనితో తనకిక లైంగికసంబంధాలు లేకుండా చేసుకొని సామాజికసంస్కృతిని ఎదుర్కొనేక్రమాన్ని అలవాటుచేసుకొని కమల తన జీవితాన్ని తనే నిర్మించుకొన్న ధీర, ధీశాలి. ఇదంతా రెండవ ప్రపంచ యుద్ధానికి ముందే అంటే 1940 సం.లకంటే ముందే జరిగినట్లుగా నవలాంశాన్నిబట్టి తెలియటంతో, అప్పటికింకా దేశస్వాతంత్ర్యం,రాజ్యాంగం

రాలేదుకనుక విడాకుల చట్టం అమలులో లేదు. ఆనాటికది విప్లవాత్మక ఆలోచన. కమలకు సామాజికసంబంధాలు తక్కువ కాబట్టి కమలకు సామాజిక, సామూహిక బలంకూడా లేని రోజుల్లోనే సంస్కృతికి ఎదురీదగల శక్తిని కమల ఒంటరిగా కూడగట్టుకోగలిగింది. ఆనాటికే ఒకస్త్రీగా వైవాహిక లైంగికదాడిని అధిగమించే చైతన్యాన్ని తెచ్చుకోవటం పితృస్వామ్యసంస్కృతీ భావజాలానికి చెంపపెట్టువంటిదిగా భావించాలి. తనబాధలను తనలోనే పెట్టుకొని తన వ్యక్తిగతసమస్యలను తన మేధతోనే పరిష్కరించుకొంది. ఆనాటి స్త్రీలు తమ సమస్యలను వ్యక్తిగతంగా తీసుకొన్నారుగాని, వాటికున్న సామాజికసంస్కృతీ స్వభావాన్ని గుర్తించలేకపోవటంతో, దానిని ఎదురించగల ధైర్యంగాని, మేధాశక్తిగాని వారికి ఉండేదికాదు. సామూహికచైతన్యం తెచ్చుకొనే ఆలోచనలు ఉండేవికావు. భారతదేశ స్వాతంత్ర్యానంతరంకూడా ప్రజాస్వామ్యరాజ్యాంగం వైవాహికలైంగికదాడిని యింకా చట్టవిరుద్ధమని నిర్ణయించలేదంటే పితృస్వామ్యపు భావజాలాల ఆధిక్యత కొనసాగింపు ఉన్నట్లే. ఈనాటికీ స్త్రీలసమస్యగా ఉన్న జటిలవిషయాన్ని ఆనాడే ఒంటరిగా కమల ఎదుర్కొనగలగటమే ఆమెవిప్లవాత్మక సాంస్కృతిక ఆలోచనలు నేటికీ తలచుకొనేటట్లు ఉన్నాయని అనిపించకమానదు. కుటుంబనిర్మాణపు వైవాహికసంస్కృతిలోని స్త్రీపురుషసంబంధాలలో సూరమ్మకాలం నాటికి కమలనాటికి వచ్చిన సాంస్కృతిక పరిణామం అంటే ఇదే.అంతేకాదు, అది తాత్కాలిక నిర్ణయంకాదని నవలవల్ల తెలుస్తుంది. భార్యాభర్తలమధ్య ఉండే లైంగికసంబంధాల విషయంగా సత్యంముందుకు రావటానికి ప్రయత్నించినా కమల చాలా నిక్కచ్చిగా ఉండి యింట్లోవాళ్ళకోసంకూడా తననిర్ణయాన్ని మార్చుకోలేదంటే కమల ధృఢచిత్తం ఆశ్చర్యాన్నికలిగిస్తుంది. స్త్రీలపై లైంగిక అదుపుగా వచ్చిన కుటుంబసంస్కృతి అసమాననైతికతని, పురుషాధిక్యతను సంతరించుకొంటే దానంతట అదే తలకిందులైనట్లే. అప్పుడే అసమనైతిక పితృస్వామ్య వ్యవస్థపుట్టకీళ్లు కదిలి, స్త్రీలపై లైంగికఅదుపుపోయి ప్రజాస్వామిక సంబంధాలు ఏర్పడే అవకాశం ఉంటుంది.

తిండిలేకవచ్చిన సత్యాన్ని తన అమ్మమ్మ కోరికమేరకు, కమల మానవత్వంతో యింట్లో ఉండనిచ్చింది, కాని సత్యం భర్తగా తిరిగి ఆమెపై తన లైంగికహక్కును వినియోగించుకొనే ప్రయత్నంచేస్తే భద్రకాళికగా మారి ఆత్మగౌరవాన్ని నిలుపుకొని ఆదర్శమూర్తి అయింది. ఆతనిహక్కును గృహన్యాయస్థానంలోనే రద్దుచేయగలిగిన మేధాశక్తికలిగింది కమల. కమలకు మిత్రసంబంధాలు బాగున్నాయికాబట్టే, ఆమె చనిపోయినప్పుడు తోటి టీచర్లు భౌతికకాయం వెంటవచ్చారు. సూరమ్మవలె పితృస్వామ్య సంప్రదాయాన్ని పాటించినా స్త్రీగా తనగౌరవానికి హానికరమైనప్పుడు ఒక పరిధిని సృష్టించుకొని వైవాహికసంస్కృతిని పాటించాల్సిన అవసరంలేదని కమల నిర్ణయించుకొంది.

మనిషి సంఘజీవి అయినా వ్యక్తిగతంగా ఒంటరిగానే సమస్యలు ఎదుర్కొవాలని నిశ్చయానికి వస్తుంది. అందుకే తనవాళ్ళుపోయినప్పుడు సూరమ్మ తనని ఒంటరిదాన్నిచేసి పోయారంటూ ఏడుస్తుంటే, కమలకు కోపం నసాళానికి అంటేది. భర్తతో తెగతెంపులయినందుకు బాధపడకుండా, ధైర్యం తెచ్చుకొని క్షణం తీరికలేకుండా చదువుకుంటూ టీచరుగా ఉద్యోగంలో నిలదొక్కుకుంది. తనకు పుట్టినపిల్లను చూసుకుంటూనే ఎక్కడికక్కడ సామాజికసంస్కృతిలోని లింగవివక్షా స్వభావాన్ని విశ్లేషించుకుంటూ తనజీవితాన్ని అభివృద్ధిచేసుకొంది. చిన్నతనంలోనే కుటుంబబాధ్యతను తీసుకొని, ఆగిన చదువును తిరిగికొనసాగించి,ఉద్యోగానికి కావలసిన అర్హతలను సంపాదించుకొంది. సరైన ఆర్థికప్రణాళికతో ముందుకుసాగి యిద్దరు ముసలివాళ్ళకు సేవచేయగలిగి తనజీవితధ్యేయాన్ని సాధించి తరువాత తరాలవారికి స్ఫూర్తినిచ్చింది.

కమల ధనవంతురాలు, సౌందర్యవంతురాలు కాకపోయినా పెద్ద ఉద్యోగహోదాలో ఉండకపోయినా, నిశ్శబ్ద విప్లవకారిణిగా, పితృస్వామ్య సంస్కృతిని ప్రశ్నించే విధంగా దిశానిర్దేశం చేసిన మహిళగా ప్రతివివాహితస్త్రీ ఆలోచనలలోశాశ్వతంగా ఉంటుంది.

3) పద్మ

గతశతాబ్దంలో మొదటితరం మహిళగా సూరమ్మ పితృస్వామ్యసంస్కృతిని విధిగా ఆచరించటం స్త్రీధర్మం అనుకొంటే, రెండవతరానికి చెందిన కమల దానిలోని లింగవివక్షస్వభావాన్ని విశ్లేషించి, విమర్శచేసుకుంటూ, అవసరమైనప్పుడు దాన్ని అధిగమించింది. ఇక మూడవతరానికి చెందిన పద్మ చిన్నప్పటినుండి తనయిష్టంతో బతకాలనుకొని పెరిగి స్త్రీస్వేచ్ఛకు ఆటంకప్రాయమైన సామాజికసంస్కృతిని ప్రశ్నించటం నేర్చుకొంది. పద్మ స్త్రీవాదదృక్పథం అంతిమంగా ప్రజాస్వామికంగా స్థిరపడింది. పద్మ పితృస్వామ్యసామాజికసంస్కృతితో పడిన ఘర్షణను తెలుసుకుంటూ, ఆమెలో పెరిగిన ప్రజాస్వామిక చైతన్యం అర్థం కావాలంటే కథాసన్నివేశాలలో జీవించిన ఆ పాత్రను విశ్లేషించాలి.

కమల, సత్యంల కూతురు పద్మ. పుట్టినప్పటినుంచి ఆమె డిగ్రి చదువులోకి వచ్చేంతవరకు తండ్రిమోహం ఎలా ఉంటుందో తెలియకుండా పెరిగిన పిల్ల. సూరమ్మ బుల్లొదినకు సేవలు చేయటానికి వెడుతూ పద్మను తీపకెళ్ళటంతో, ఆ భార్యాభర్తలిద్దరికి పద్మ అంటే యిష్టం. బుల్లన్నయ్యదంపతులు సూరమ్మ కనక కమలను పెంచుకోకపోతే బంగారుకొండవంటి పద్మ తమకు కనపడేది కాదనుకొనేవారు. పాతతరానికి చెందిన అమ్మమ్మ సూరమ్మతో పద్మ సంప్రదాయాల ఆచరణలో ఘర్షణపడేది. పద్మ స్కూల్ ఫైనల్ పాసయింది. పద్మహైస్కూల్ లో హాఫ్ స్కర్టు, షర్టు వేసుకున్నా యూనిఫారమ్ అని సర్దుకొన్న సూరమ్మ, పరికిణి వోణీ యిష్టంలేదని షెల్వార్, కమీజు వేసుకుంటుంటే విమర్శించేది.

ఆరకంగా సూరమ్మ ఆలోచనలకు, పద్మయిష్టాలకు వైరుధ్యం ఉండేది. పద్మ తన కాలేజిలో వేడుకలు జరిగేటప్పుడు ఆలస్యం అవుతుందని వచ్చేటప్పుడు తీసుకురావటానికి పద్మ సత్యాన్ని రమ్మని చెప్పుకొని ముందుజాగ్రత్తలు తీసుకొనేది. అత్యున్నత మార్కులతో టాపర్ గా బి.ఏ.పాసయి పద్మ విశాఖపట్నంవెళ్ళి యూనివర్సిటీలో చేరటానికి తండ్రిగా సత్యం అన్నివిధాల

సహకరించినా అతనితో చనువుగా ఉండేదికాదు. పద్మకు తాను రీసర్చ్ చెయ్యాలను యూనివర్సిటిలో చేరుతుంది. అప్పటినుండి పద్మ ఆఫ్ షర్టుని వేసుకొని ఇన్ షర్టు టక్ చేసుకొని, పోనిటైల్ వేసుకుంటూ ఆధునికానికి తగిన వేషభాషలతో ఉండేది. అంటే పద్మ కాలంమార్పు అనివార్యం అనుకొనేది. పద్మ తనచదువుకు సహాయంచేసిన పెద్దమ్మమ్మకు అనారోగ్యం కలిగితే తన చదువుపాడవకుండా పుస్తకాలనుతెచ్చుకొని ఆమెకోసం సెలవుమీద యింటికి వచ్చింది. ఎవరేమి అడిగినా నవ్వుతూ సమాధానం చెప్పేది పద్మ. అంటే ఎవరినీ నొప్పించే స్వభావం ఆమెది కాదు. పద్మఎమ్మెస్సీ పూర్తిచేసివచ్చి కాలేజిలో లెక్చరరుగా చేరుతుంది. తల్లికి ముందుగా చెప్పలేదని కోపం వచ్చిందంటే, పద్మ తానుచేసే పనులను అందరికి చెప్పి హంగామా చేసేది కాదని అర్థమౌతుంది. ఉద్యోగంచేసున్న పద్మ బాబ్ చేయించుకొని, స్లీవ్ లెస్ జాకెట్టువే సుకొనేదంటే కొత్తగావచ్చిన ఫ్యాషన్ ను పద్మ ముందుగా అనుకరించేది. అంటే, పద్మస్వేచ్ఛా ప్రియత్వం,నిర్భీతి స్పష్టమౌతాయి. కాలేజినుండి యింటికి వచ్చిన పద్మకు తన తల్లికి సత్యంతో జరిగిన ఘర్షణను ఊహించగలిగి కమల పడుకొనే గదిలో రాత్రిళ్ళు ఆమెతల్లి గడియవేసుకోవటం మరిచిపోయినా పద్మ వేసేదంటేనే, పరిసరాలను మనుషులనుబట్టి మానవ మనస్తత్వాలను అర్థంచేసుకోగలిగే శక్తి పద్మకు ఉందని తెలుస్తుంది. కమల టి.వి.కొన్నందుకు సూరమ్మ దానిబదులు బంగారం కొంటే పద్మపెళ్ళికి కన్యధారపోసేటప్పుడు పనికి వస్తుందంటే, పద్మ తనేమన్నా గొడ్డునా కన్యాదానం యివ్వటానికని గయ్యిన అరిచింది. పితృస్వామ్య వివాహ సంస్కృతిలో కన్యాదానం చేయటమంటే కన్నవాళ్ళు కూతురును ఒక వస్తువుగా భావించి ధారపోయటమనే ఆచారమది. అందుకే పద్మ దానిని వ్యతిరేకించింది.

పితృస్వామ్యంలో స్త్రీని మనిషిగాకాక, ఒక వస్తువుగానో, సంతానాన్ని కనియిచ్చేజంతువులాగానే చూస్తారని, దానిని పద్మ వ్యతిరేకించింది. ఇక్కడ ఆధునికభావాలు, సహేతుకత గల పద్మకు పితృస్వామ్యసంస్కృతిని

ప్రశ్నించేతత్వం ఏర్పడిందని స్ఫుటమయింది. పేరుకు చదువు, డబ్బు ఉన్న యువకుడు వచ్చినా, ఆతని పోకిరీతనం నచ్చక అతనితో పెళ్ళివద్దంది. వరకట్నం అడిగిన రామశేషు పెళ్ళిసంబంధాన్ని పద్మ ముందు వొప్పుకోదు. రామశేషుకు పద్మకు వరకట్నం విషయంలో వాదోపవాదాలు జరిగాయి. కట్నం యివ్వటం ఆటవికఆచారం అని ఆ ఆచారాన్ని తాను వ్యతిరేకిస్తానని పద్మ అంటే అతను అదొక గొలుసుపక్రియ అని, తాను కట్నం తీసుకోవటం తన చెల్లికి పెళ్ళికోసమేనని చెప్పాడు. అంతేకాదు, ఇద్దరిమధ్యన ఇరవైవేలు అడ్డంకికాదని తాను అప్పుగా తీసుకొని రెండేళ్ళలో తన సంపాదనతో తీర్చేయగలనని, పద్మ నియమాలు నచ్చి చేసుకోవాలనుకుంటున్నానని చెప్పాడు. ఆతని ఆత్మవిశ్వాసం నచ్చి, పద్మ అతనితో పెళ్ళికి ఒప్పుకుంది. అంటే పద్మలో మొండితనంలేదని, సందర్భాన్నిబట్టి విషయాన్ని అర్థంచేసుకొనే తత్వం, సానుకూలదృక్పథం ఉందని తెలుస్తుంది. పెళ్ళి అంటే ఒకరిమీద ఒకరికి నమ్మకం ఉండటం ముఖ్యమని రామశేషు అంటాడు. కాని పద్మ తనకు తెలిసిన తన అమ్మమ్మపెళ్ళి, తల్లిపెళ్ళి, బుల్లితాతయ్య పెళ్ళిళ్ళల్లో నమ్మకం నిలవలేదని అంది. పితృస్వామ్య కుటుంబాలలోని పెళ్ళిళ్ళల్లో పురుషాధిక్యతవల్ల నమ్మకానికి చోటుతక్కువ. పద్మకు రామశేషుమీద నమ్మకం కుదిరేసరికి ఆతడు తనని వదిలి వెళ్ళడనే నమ్మకం ఏర్పడి, అతనిమీద పద్మ పొసెసివ్ నెస్‌ని అనుభూతి చెందదని నవలా కథనాన్నిబట్టి తెలుస్తుంది. ఎందుకంటే పితృస్వామ్యసంస్కృతిలోని అసమనైతికసంస్కృతివల్ల స్త్రీ భర్త విషయంలో నమ్మకంలేకనే అభద్రతకు లోనై ఎప్పటికప్పుడు భర్తను తన అధీనంలో ఉంచుకోవాలని సత్యభామలాగా తాపత్రయం పడటటం సాధారణంగా కనపడుతుంది. అది భార్యాభర్తల సంబంధాలలోని అపనమ్మకమే.

పద్మ తనకు మగపిల్లవాడు పుట్టినతరువాత ఆరునెలలవరకుఉండి పిల్లవాడిని కమలకు అప్పగించి తాను మళ్లీ విశాఖపట్నం వెళ్ళిపోతుంది కాని పిల్లవాడి పెంపకం అంటూ ఉద్యోగం చేయటం మానదు. పద్మమళ్లీ గర్భవతిగా

ఉన్నప్పుడు సూరమ్మ పద్మతో చనిపోయినప్పుడు పాడెమోయటానికి నలుగురు కొడుకులు, నిప్పుపట్టుకురావటానికి ఒకకొడుకుకావాలని అంటే, అమ్మమ్మ యింకమారదని ఆమెతో పద్మ వాదించదు. పెళ్ళిళ్ళలో, చావుల్లోకూడా పురుషుని ఆధిక్యతను నిలపటంకోసమే దాన్ని ఆచారరూపంలో చెప్పటం పితృస్వామ్యపు మాయాజాలం. పద్మకు కూతురు పుట్టినప్పుడు సూరమ్మ తనకాలంనాటి పద్దతులుగా సున్నిపిండి, ఆముదం వాడాలంటే, పద్మ బేబిసోపులు, బేబిఆయిల్ వాడాలంటూ వాదనలు చేసుకున్నారంటే పాతతరం, కొత్తతరం పద్ధతులలో కాలం వైరుధ్యాన్ని తెచ్చిందని అర్థమౌతుంది.

రామశేషుని పేరుపెట్టిపిలుస్తుంటే భర్తను గౌరవంగా పిలవాలని సూరమ్మఅంటే పద్మ తన మొగుడ్ని తన యిష్టానుసారం పిలుస్తాననేది. మొగుడ్ని పేరుపెట్టి పిలిస్తే భార్యాభర్తలకు సమానస్థితివచ్చే వీలుంటుంది కాబట్టే పురుషాధిక్యతను నిలపటానికే భర్తలను పేరుపెట్టి పిలవకూడదనేది పితృస్వామ్యసంస్కృతిలోఆచారంగా తయారయింది. పెద్దమ్మమ్మ పద్మ తన కొడుకును గారాబంచేసి పాడుచేయటం యిష్టంలేనిపద్మ వాడిని కమల వాళ్లదగ్గర గారాబం ఎక్కువ అవుతుందని తనతోపాటు తీసుకొనివెడతాను అంది. కొరివిపెట్టేవాడు కొడుకనే భావనతో తల్లులు కొడుకుని గారాబంచేయటం, వాళ్ళు బలాదూరు తిరుగుడు తిరగటం సమాజంలో గమనించే విషయమే. తల్లులు కొడుకులకు ఎక్కువవిలువనిచ్చి గారాబంతో వివక్షతో పెంచటంచేతనే మగపిల్లలు సరిగా చదువుకోక రోడ్లంబట పడి తమనెవరూ యింట్లో ఏమి అనరనే ధీమాతో యిష్టారాజ్యంగా తిరుగుతంటారు. ఇదేస్త్రీలు లైంగికవేధింపులకు గురి కాబడటానికి కారణం అవుతుంది. అందుకనే పద్మ తన కొడుకుని సరైనపద్ధతిలో పెంచాలనుకుంది. సత్యం చనిపోయిన తరువాత కమల బొట్టు, సూత్రాలు తీసి తెల్లచీరె కట్టుకుంటే పద్మ వద్దంది. అయినా విననందుకు, హేతుబద్ధంగా ఆలోచించే తనతల్లి సత్యం బతికున్నన్నాళ్ళు ఈసడించుకొని ద్వేషించిన ఆమె ఎందుకిలా చేస్తోందని రామశేషుతో అంది. దానికి అతడు పద్మతో ఆమె ఆతడు

చేసినపనులను అసహ్యించుకుంటూ ద్వేషించిందని, వ్యక్తిగాకాదని, ఆ ద్వేషంలోనే తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుందని అన్నాడు. అంతేకాదు, భర్త ఉన్నప్పుడు న్యాయం చేయలేకపోయాననే భావంతో ఆతనికి ఆఖరిక్రతువు చేసి తన మనోభారాన్ని తగ్గించుకోవాలనుకొంది అనిచెప్పాడు. అందుకే కమల చివరగా సత్యందగ్గరకు వెళ్ళాలనుకొంటున్నట్టుగా పలవరించింది. ఆమె నమ్మకాలమీద మన అభిప్రాయాలు రుద్దితే ఆమెకు మనశ్శాంతి దూరమవవచ్చేమో అని ఆలోచించమంటాడు. పద్మ తనతల్లి మనశ్శాంతికై ఆవిషయాలలో వాదించటం మానుకొంది. సంస్కృతి, సంప్రదాయం ఒక్కరోజులో మార్పుకు గురికాలేదు. పాతతరం సంస్కృతి సహేతుకతతో మార్పును సంతరించుకోవాలంటే ముందుగా మధ్యేమార్గంలో వెడుతూ మానసికస్థితికి ప్రాముఖ్యత ఇవ్వాలి.

పద్మ ఆ విషయంలో తల్లిని సానుకూలధోరణిలో అర్ధంచేసుకొనే ప్రయత్నం చేసింది. ఎవరికివారే ఆలోచించుకుంటేగాని మార్పు రాదని గ్రహించింది. వితంతు ఆచారం ప్రకారం తల్లి గుళ్ళోపడుకొనిగాని మరొకచోటికి వెళ్ళకూడదని సూరమ్మచెప్పినా 'ట్రెడిషన్' ని బద్దలుకొట్టి పద్మ తల్లిని విశాఖపట్నం తీసుకొనివెళ్ళింది. అంటే పితృస్వామ్యసంస్కృతి భర్త చావుకు భార్యకారణమని, ఆ పాపపరిహారార్థంగా గుళ్ళోపడుకొని పవిత్రమైన తరువాత మరొకచోటికి వెళ్ళే ఆచారాన్ని పెట్టిందని తెలుస్తుంది. ఋగ్వేదకాలంనాడు భర్తచనిపోయిన స్త్రీని స్మశానంలో ఆతని చితికి పక్కన పడుకోబెట్టి ఆరోజునుండి ఆతని శరీరంతో ఆమెకుఉన్న అనుబంధంపోయినట్లే అని, ఆ స్త్రీ తిరిగి కొత్త జీవితానుబంధాలను ఏర్పరచుకోవచ్చనే పద్ధతిని పెడదారి పట్టించటంవల్ల ఏర్పడిన సంస్కృతి ఇది.

ఇక్కడ పద్మ విప్లవాత్మక నూతనజీవన విధానానికి బాటలువేసింది. కమల సత్యానికి చివరగా తాను ఇచ్చిన హార్లిక్స్ తాగిఉంటే బాగుండేదని బాధపడుతుంటే, పద్మ తల్లితో ఆతనికి యింట్లో ఆశ్రయం ఇచ్చి అన్నంపెట్టి చూసావు కదా అంటూతల్లి బాధను తగ్గించటానికి పద్మ ప్రయత్నించింది.

తల్లికేన్సర్ తో పోయినప్పుడు మైలపట్టటానికి కమల యింటిపేరుగలవాళ్ళు ఆ యింట్లో ఎవరూ లేరని అన్నందుకు పద్మకి కోపం వస్తుంది. అంటే వివాహానంతరం స్త్రీలకు అంతవరకు ఉన్న పుట్టింటి యింటిపేరును కొనసాగనీయకుండా చేస్తూ స్త్రీలకు వివాహానంతరం భర్తయింటిపేర్లతో మార్చటంకూడా పురుషాధిక్యతకు ప్రాధాన్యతను ఇవ్వటమే. ఆ విధంగాకూడా స్త్రీలకు సొంతవ్యక్తిత్వంలేకుండా చేయటమే పితృస్వామ్యసంస్కృతి ధ్యేయం.

అందుకే పద్మ ఆవిషయాన్ని ప్రక్కకు పెట్టింది. తల్లిప్రేమతో తనచిన్ననాటి బూట్లుకూడా బీరువాలో గుర్తుగా దాచినందుకు పద్మకు దుఃఖంవచ్చి, పిల్లలను తల్లులు యింతమమకారంతో పెంచకూడదనుకుంది. ఇదేవిషయంలో ఇంకొకరైతే తనతల్లికున్న ప్రేమను గోరంతలు కొండతలుగాచేసి బాహాటం చేస్తారు. కాని మమకారాలు దుఃఖాలకు కారణం అని యుక్తవయసులోనే పద్మగ్రహించిందంటే ఆమె అపరబుద్ధజ్ఞానిలా స్పష్టమౌతుంది. సూరమ్మతన ఆస్తిని కమలకు ధారాదత్తంచేస్తూ మునుపే రిజిష్టరుచేసింది. కాని సూరమ్మకంటే కమల ముందు చనిపోవటంతో తిరిగి ఆ ఆస్తిదాతకుచెందదని, అయినా దత్తత తీసుకొన్న కూతురుకు ఆస్తిని రిజిష్టరుచేసినా చెల్లదని, సూరమ్మ మనోవర్తిడబ్బుతో కొన్న ఆస్తికాబట్టి తిరిగి ఆ ఆస్తి సూరమ్మభర్తవైపువారికే వెళ్తుందని లాయరు అంటాడు. ఆమె తరఫువారెవరూలేరని చెపితే, పద్మపేరున ఆస్తిని రిజిష్టరు చేయాలని లాయరుఅంటాడు. అంటేకొడుకులకు వారసత్వపు హక్కుగా ఆస్తివచ్చినట్లుగా కూతుర్లకు రాదనే పితృస్వామ్యన్యాయవ్యవస్థ స్వభావం ఇక్కడ పద్మకు అవగతమయింది.

పద్మకు తనతల్లిమరణానంతరం జీవితం ఎంత కఠినమైందో తెలిసి వచ్చింది. సూరమ్మ బతుకు వెళ్ళతీసేంతవరకు తనతల్లిని చూసుకోవాలనుకొన్న ఆమెఆకాంక్షను తీర్చటంకోసం పద్మ సూరమ్మను తమతోపాటు విశాఖపట్నానికి తీసుకొని వెళ్ళింది. కమలమరణం, వృద్ధాప్యం కలిసి సూరమ్మలో చిత్తచాంచల్యాన్ని కలిగించింది. పట్టణనాగరికత తెలియకపోవటంతో సూరమ్మచేసే పనులకు పద్మ, పిల్లలు యిబ్బంది

పడుతున్నప్పటికి ఆమెను చూసుకోగలిగింది. కాని అప్పుడప్పుడు రోడ్డుమీదకు వెళ్ళిపోతుండే వృద్ధురాలైన సూరమ్మ భద్రతవిషయంలో, నిరంతరం భయానికి గురవుతూ పద్మఅటు ఉద్యోగనిర్వహణలోని వత్తిడిని తట్టుకోలేనిపరిస్థితిలో ఆమెకు రక్తపోటు,షుగరు వచ్చాయి. పద్మకు ఒకనెలపాటువిశ్రాంతి అవసరమని, మార్పు కోసమై మార్పు ఉండటానికి మరొకచోటుకు తీసుకెళ్ళమన్న డాక్టరు సలహాను అనుసరించి పద్మసూరమ్మను వృద్ధాశ్రమంలోపెట్టటం జరిగింది.

ఇరవైరోజులపాటు విశ్రాంతికోసం పద్మ వేరొక ఊరు వెళ్ళినా అక్కడా సూరమ్మనుగురించి ఆలోచిస్తూనే ఉంది. ఆమెను ఆశ్రమంలోపెట్టి తనతల్లికి ద్రోహంచేసాన నేబాధతో ఉండలేక పద్మ ఇరవైఐదురోజులకే తిరిగి వచ్చింది. క్రితంరోజే సూరమ్మవిరేచనాలతో చనిపోయిందని తెలిసింది. పద్మ తాను వృద్ధురాలైన తన అమ్మమ్మను చివరివరకూ చూడనందుకు తప్పుచేసినట్లుగా బాధపడుతుంది. అందుకే నాలుగవ తరానికి చెందిన తనకూతురైన సౌజన్యను సూరమ్మయిల్లు అమ్మగా వచ్చినడబ్బుతో పంపిస్తున్నప్పుడు గతంలోకి వెళ్ళిసూరమ్మ, కమలల జీవనయానాన్ని తలచుకోవటం జరిగింది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాతనే పద్మ జీవితంలో ఎదుగుదల ప్రారంభమైంది. అప్పటికే స్త్రీల ఉన్నతచదువులకు ప్రాధాన్యతపెరగటంతో స్త్రీలు మారుతున్న ప్రజాస్వామ్యపు ఆధునికతను సంతరించుకోవటం జరిగింది. స్త్రీపురుషసమానత్వ సాధనలోభాగంగా ముందుతరం స్త్రీలకంటె తాను వేషభాషలలోను స్వేచ్ఛను అనుభవించాలనుకొంది.

1960సం.ల అనంతరం ఆంధ్రదేశంలో స్త్రీవాదప్రభావం ఎక్కువవటంతో పితృస్వామ్యాన్ని ప్రశ్నించేతత్వం పద్మలోకూడా ఏర్పడి ఉండవచ్చు. స్త్రీవాదమంటే కేవలం పురుషద్వేషం అనే అపోహను పోగొడుతూ, పురుషద్వేషం కంటే కూడా మానవసంబంధాలలో ప్రజాస్వామ్యసంబంధాల అభివృద్ధిముఖ్యమనే భావనకు ప్రతీకగా పద్మపాత్ర ఆలోచిస్తుంది. పెళ్ళినాటికే పద్మ, రామశేషులకు స్త్రీపురుషసమానత్వ భావనలు ఉండటంచేత

ప్రజాస్వామిక కుటుంబాన్ని ఏర్పరచుకోగలిగారు. అటువంటి దృక్పథం వారికుంది కాబట్టే అందరూ అబ్బాయిలను విదేశాలలో చదువుకోవటానికి పంపినట్టే అమ్మాయినికూడా అమెరికా పంపాలనుకున్నారు. భారతదేశంలో నేటి ప్రపంచీకరణసందర్భంలో అవసరమైన ప్రజాస్వామ్యసంస్కృతి ఆచరణలోకి రావాలంటే అది సామాజిక కుటుంబసంస్కృతినుండే ప్రారంభమవ్వాలని పద్మ, రామషశేషులదాంపత్యం స్ఫురింపచేస్తుంది. ఇదిసాహిత్యచైతన్యపు కాంతులను వెదజల్లే కళాసౌందర్యం.

4) సూరమ్మ చిన్నక్క

పేరులేని సూరమ్మచిన్నక్క పాత్రనుకూడా ప్రత్యేకంగా తెలుసుకోవాలి. పితృస్వామ్య సామాజికసంస్కృతికి సూరమ్మలాంటి స్త్రీలు బలికావటానికి ఆమె అన్నలు, వైవాహికసంస్కృతి ప్రధానకారణం. ఆ సంస్కృతిని ఆచరణాత్మకం చేయటానికి, స్త్రీలజీవితాలలో జీర్ణింపచేయటంతో, పాతివ్రత్య నియమాలను పాటించటాన్నే స్త్రీలు తమ జీవితాశయం చేసుకొంటారు. పాతతరపు స్త్రీలందరి ఆలోచనలు అలాగే ఉంటాయి. ఆక్రమంలోనే, స్త్రీలు బాధితులుగా ఉంటున్నా తమతోటి స్త్రీని బాధిస్తున్న విషయం వారికి తెలియదు. అది పితృస్వామ్యం పకడ్బంది ప్రణాళికకాబట్టే అనాదిగా చెక్కుచెదరకుండా ఉంది. అసమాన నైతికసంస్కృతిగల పితృస్వామ్యపు కుటుంబపు గోడలు బద్దలుకొట్టాలనే స్త్రీల ఆలోచనలు మధ్యయుగాల సామాజికచరిత్రను ప్రతిఫలించిన తెలుగు స్వతంత్రకథాకావ్యాలలో స్పష్టమైంది. అయితే అవి వ్యక్తినిష్ఠంగా ఉండేవి. ఆధునికయుగం ఆరంభంలో సంఘసంస్కరణోద్యమ ఫలితంగా సమాజంలో స్త్రీలు కాస్తోకూస్తో విద్యావంతులయ్యే అవకాశం ఏర్పడింది.`స్వరాజ్యంమన జన్మహక్కు' అనే తిలక్ వంటివారి నినాదాలతో స్త్రీలుకూడా సామూహికత్వాన్ని పొంది, తాము స్వతంత్రులు కావాలని, ముందుగా తమకు గృహ బానిసత్వం నుండి విముక్తికావాలని, దానికి సామాజిక పితృస్వామ్యసంస్కృతి తమకు

అడ్డుగా ఉందని భావించారు. అందుకే అటువంటిసంస్కృతిని ఆధిగమించే చైతన్నాన్నితెచ్చుకొనే దిశగా స్త్రీలు అడుగులు వేశారని స్వాతంత్ర్యానికి పూర్వం వచ్చిన స్త్రీలసాహిత్యం తెలియచేస్తుంది. సూరమ్మ అదేకాలానికి చెందినదిగా ఆ చైతన్య స్పృహను పొందినా తన వ్యక్తిత్వంలో స్థిరంచేసుకోలేకపోయింది. కాని చిన్నక్కజీవితంలో ఆ చైతన్యం ఆలస్యంగా వచ్చి, పద్మ జీవితానికి చుక్కాని అయింది. ఆధునికయుగంలో పాతతరానికి ప్రతినిధిగా ఉన్న సూరమ్మచిన్నక్క తాను కొడుకును కన్నతల్లిగా పితృస్వామ్య అధికారవర్గానికి చెందినదిగా తనని తాను ఊహించుకొంది. దీన్ని సమగ్రంగా అర్థంచేసుకోవటానికి సూరమ్మ చిన్నక్క ఆయింటికి వెళ్ళటందగ్గరనుం డిచిన్నక్కను తెలుసుకోవాలి.

చిన్నక్క తనకూతురిపెళ్లికి చాకిరి చేయటానికి సూరమ్మను పిలిపించుకొంది. సూరమ్మ తన డబ్బుపెట్టి పెళ్ళికూతురికి జడకుప్పెలు కొన్నా చిన్నక్కమాత్రం పెళ్లికి చాకిరిచేయించుకొని సూరమ్మ తిరిగి ఊరికి వెడుతుంటే పాతసైనుబట్ట యిచ్చేది. వితంతువును తోడబుట్టినవాళ్ళుకూడా పట్టించుకోవాల్సిన అవసరంలేదనే పితృస్వామ్య సమాజంలో చిన్నక్క ఉంది. చిన్నక్క సూరమ్మచేత కూతురిపెళ్లికి చాకిరి చేయించుకుంటున్న సమయంలో సూరమ్మ తన డబ్బులను బుల్లన్నయ్యదగ్గర నుండి తెప్పించి బావకిస్తే వడ్డీలకు తిప్పుతాడని చెబుతుంది. అన్నలు తమ యింటి చాకిరి చేయించుకోవటానికైనా సూరమ్మకు తిండిపెడతారని, ఆమెకు డబ్బు అవసరంలేదని, చెల్లెలిడబ్బుకు ఆశపడడుతుందని తెలుస్తుంది. దీనికి కారణం స్త్రీలదగ్గర తమ అవసరాలకుకూడా డబ్బు ఉండే అవకాశం లేకపోవటమే. పైపెచ్చు ఆడవాళ్ళు తనభర్త, తనకుటుంబం బాగుండాలనే అనుకుంటారు. కాబట్టి ఆరకంగా సూరమ్మడబ్బును కావాలనుకొనే అవకాశం ఉంది. చిన్నక్క ఎప్పటిలానే కూతురు పురిటిచాకిరికీ సూరమ్మను పిలిపించుకొంది. కూతురుదిగులుకు, ఆమెవళ్ళంతా నీరుపట్టటానికి కారణంగా చిన్నక్క అల్లుడి తాగుడు అలవాటును, పరాయి స్త్రీలతో ఉన్నసంబంధాల సంగతిని సూరమ్మతో చెప్పేసరికి కూతురుకావమ్మ ఏడుస్తూ తల్లిని ఊరుకో అమ్మా అని

ఆపింది. అంటే భార్యలు భర్తల అనైతికతను ఎవరికి తెలియకండా జాగ్రత్తపడుతూ తమలో తామే కుమిలిపోయేవారు. కాబట్టే పితృస్వామ్య సంస్కృతి నిరాటంకంగా ఏళ్ళతరబడి జరుగుతోంది. అందుకే చిన్నక్కసూరమ్మ పరాయిదికాదని, చెప్పవచ్చని, డబ్బున్నవాళ్ళు అనుకొని కూతురిని యిచ్చామని కుటుంబంలోని మగవాళ్ళందరూ సానికొంపలచుట్టూ తిరిగే వాళ్లేనని సూరమ్మతో చెప్పింది. దానికి ఆ కూతురుకు తనఖర్మ అంటూఏడవటమే తెలుసు. చిన్నక్కకూతురు ప్రసవమరణం చెందటంతో చిన్నక్క ఆ పసిపిల్లమీద జాలిలేకుండా కూతురుని మింగేసినపిల్ల అని ఆ పసిపిల్లను పట్టించుకోలేదు. మరోపక్క కూతురు అత్తగారుకూడా ఆడపిల్ల వంశాంకురంకాదు కాబట్టి ఆపిల్ల తమకు అక్కరలేదని అంటుంది. సూరమ్మ ఆపసిగుడ్డుసంగతి పట్టించుకోవాలంటే తన కడుపుకోత సూరమ్మకు తెలియదంటుంది. నిజానికి ఆ పసిపిల్లను అవాంఛనీయమైనబిడ్డగా భావించటానికి చిన్నక్కకూడా పితృస్వామ్యభావాలను జీర్ణింపచేసుకోవటం ఒకకారణం. చిన్నక్కమాటలకు, సూరమ్మ బాధపడుతుంటే చిన్నక్క బావ పాలడబ్బాలకు డబ్బులేదంటున్నాడని అందుకే అలా అన్నానని అంటుంది. సూరమ్మ తన బుల్లన్నయ్యదగ్గరనుండి పాలడబ్బాలకు డబ్బుతెప్పించకోకపోతే కమలప్రాణం కొనసాగేదికాదు. సూరమ్మ దత్తతతీసుకొంది కాబట్టి ఆ ఖర్చులు సూరమ్మే భరించాలని చిన్నక్క భావించింది.

సూరమ్మ కమలకు పెళ్ళిసంబంధాలు చూస్తోందని తెలిసి సూరమ్మ యింటికి వచ్చి తనకొడుకైన సత్యం బాగా చదువుకున్నాడని, ఎటువంటి చెడ్డ అలవాట్లులేవనిచెప్పింది. సూరమ్మ వెలిబుచ్చిన సందేహాలకు బుకాయించటమే కాక, అన్నలను తనవైపు తిప్పుకొనేటట్లు చేసుకొని, కమలను ఇవ్వకపోతే తాను నూతిలోపడి చస్తానని బెదిరిస్తుంది. తనకొడుకుకి యిదివరకే పెళ్ళాం, బిడ్డలున్నారని తెలిసినా, సూరమ్మడబ్బు భవిష్యత్తులో కమలకు చెందుతుందనే దూరాలోచనతో చిన్నక్క ఉందని అర్థమౌతుంది. చిన్నక్క తన భర్త అనారోగ్యంతో ఉన్నాడని, చనిపోయేలోపు పెళ్లిచూడాలని అనుకుంటున్నాడని

సూరమ్మను తొందరపెడుతుంది. సామాన్యంగా తనకు ఏర్పడబోయే వైధవ్యసంస్కృతి గుర్తొచ్చి తథాస్తు దేవతలుంటారనే భయంతో, పాతివ్రత్య నిబంధనలలో భాగంగా, పాతతరం స్త్రీ తన భర్త చావుగురించి ముందుగానే ఊహించి ఆ మాటను ఉచ్చరించటానికి భయపడుతుంది. కాని అటువంటి భయాలు ఏవీ చిన్నక్క డబ్బాశముందు నిలబడలేకపోయాయి. రెండు కుటుంబాలు ఒకటవుతాయని, కమలలో తన కూతురుని చూసుకొంటానని తన భవిష్యత్తు ప్రణాళికను ముందుపెడుతుంది. చిన్నక్క తనకొడుకుకు కమలను ఇవ్వటానికి ముందుగానే తన మాటల్లో మొగుడిని చంపేసిందంటే స్త్రీలకు భర్తసంపదను అనుభవించే స్వేచ్ఛలేకపోవటమే కారణం. చిన్నక్కకు సూరమ్మడబ్బుమీద ఆశలేకపోతే పెళ్ళైనకొడుకుకు మళ్ళీపెళ్ళిచేయాలని యింతపట్టుపట్టాల్సిన అవసరంలేదు. పాతతరం స్త్రీలకు చిన్నప్పుడే పెళ్ళిళ్లుకావటంతో అక్కచెళ్ళళ్లమధ్య ఆర్థికదృష్టేతప్ప ప్రేమానుబంధాలకు తక్కువ అవకాశం ఉండేది. అందుకే చిన్నక్కకు తనపెద్దక్కతో అంతరాకపోకలు లేవు. సూరమ్మయింకా కమల చదువుకుంటానంటోందని అంటే ఆడపిల్లలకు చదువెందుకని అన్నదంటే చిన్నక్కలో జీర్ణించుకొన్న పితృస్వామ్యభావజాలం స్పష్టమౌతుంది.చిన్నక్క చివరికి సూరమ్మమీద గెలిచి కమలకు సత్యానికి పెళ్ళిజరిగేటట్టు చేసింది.

చిన్నక్కఅనుకున్నట్లే ఆమె భర్త చనిపోయినప్పుడు ఆమె కొడుకులు ఆస్తిపంపకాలు చేసుకొని తల్లికితాము ముగ్గురుకొడుకులు కాబట్టి తలా నాలుగునెలలు ఉంచుకొంటామని, తల్లిని పంచుకుంటామని అంటారుగాని భర్తమరణానంతరం ఆమెకు ఆస్తిలో వాటాయివ్వాలని ఆలోచించరు. ఎందుకంటే అప్పటికింకా దేశానికి స్వాతంత్ర్యంరాలేదు. అది 1955లో 'హిందూ లా' అమలులోకి వచ్చినప్పుడే వీలయింది. ఆమె నగలనుకూడా కావాలని కొడుకులు గొడవపడినా చిన్నక్కమాత్రం తనకొడుకులమీద నమ్మకంలేక, బుల్లన్నయ్యకు అప్పగించి సత్యం పిల్లలకు చెందేటట్లు రాయిస్తుంది. సూరమ్మ ఆ నగలను తమకు యివ్వద్దన్నా తాను జులాయివంటి

సత్యంతో కమలకు పెళ్లిచేసి దాని గొంతుకోసిన పాపానికి యిస్తున్నట్టు తాను దూరాలోచనచేసానని చెప్పి బుల్లన్నయ్యకు ఆ నగలను అప్పగిస్తుంది.

నగలు దక్కని కోడళ్ళు తమ అత్త అందరిమీద చాడీలుచెప్పి చిచ్చులుపెట్టి తమాషాచూస్తుందని, ఈవిడ ఎక్కడకాలుపెడితే అక్కడ నిప్పురాజుకొంటుందని అంటారు. బహశ కోడళ్ళసంగతి తెలిసి, దిక్కులేని పరిస్థితులు తనకు వస్తాయనే ముందుచూపుతోనే అవసరమైతే సూరమ్మదగ్గరే తన నివాసం ఉండే అవకాశాన్ని చూసుకొని పెట్టుకొనే చిన్నక్క అలాంటి నిర్ణయానికి వచ్చింది. భర్తపోయినతరువాత కొడుకులకు వారసత్వపు అధిక్యత వచ్చేసరికి కన్నతల్లికూడా వారికి భయేపడే స్థితివస్తుంది. అందుకే స్త్రీలకు కొడుకులతో మాట్లాడే స్వతంత్రం తగ్గుతుంది. అప్పటికే సత్యానికి మునుపే ఒకపెళ్లవటంతో అతడక్కడికే వెళ్లిపోతాడని భావించిన చిన్నక్క కమలను అక్కడ యిక ఉండనీయకూడదని సూరమ్మతో పంపిస్తుంది.

చిన్నక్క కమల సీమంతానికి వచ్చినప్పుడు చిన్నక్కను ఆశీర్వదించమంటే బిడ్డపుట్టి బతకటంకంటే కూడా కమలసంసారం నిలబడితే బాగుండునని మనసులో అనుకొంది. ఎందుకంటే సత్యానికి పెళ్ళయిందని తెలిసికూడా కమలను వంచించిదని తనుచేసిన తప్పుకు తిడతారనే భయం చిన్నక్కలో ఉంది. అయితే సత్యమే స్వయంగా తనకు కమలతో పెళ్ళికంటే ముందే పెళ్ళయిందని ,పిల్లలున్నారని ప్రకటించగానే, కమల తనకు మొగుడు అక్కరలేదంటుంది. చిన్నక్క కమలతో మొగుడ్నిపట్టుకొని అలా అనకూడదనేసరికి, ఆమె చిన్నక్కకు సత్యంపెళ్ళిగురించి ముందేతెలుసని అంది. చిన్నక్కది ధృతరాష్ట్రునిప్రేమ అని, ఆమెయే సత్యం పాడవటానికి కారణం అని కమల తన అమ్మమ్మను నిలదీసేసరికి చిన్నక్క మౌనంగా వొప్పుకుంది.

సత్యం తనమీద అబద్దాలు చెప్పినప్పుడు కమల అతనితో తాను కాపురంచేయలేని అనేసరికి, మొగుడంటే గౌరవం, భయంలేదని చిన్నక్క అన్న మాటలను గుర్తుచేసి అడుగుతుంది. దానికి సమాధానంగా చిన్నక్క సత్యం అంటే ప్రాణమనిచెప్పితే కమల తనప్రాణం తీయవద్దని, నీప్రాణాన్నియిచ్చుకో

అని నీ కొడుకు అక్కరలేదని తీసుకుపో అన్నది కమల. ఇంకా చిన్నక్క తనమేధాశక్తిని ఉపయోగించి తనకొడుకు అక్కరలేనప్పుడు ఆతనిబిడ్డమాత్రం ఎందుకని కమలను బెదిరింపజూసింది.

పితృస్వామ్యంలో చాలామంది స్త్రీలు మొగుడొద్దని అనుకొన్నా పిల్లలకోసమే రాజీపడి కాపురాలు చేస్తారని చిన్నక్కకు తెలుసు. అలా అన్నప్పుడు కమల తనకూతురుని యివ్వననేసరికి కమల పుట్టినప్పటిసంగతి ఎత్తి చిన్నక్క ఆనాడు పసిపిల్లగా ఉన్న కమలను అక్కరలేదని తనమొగుడు రాయలేదుకాబట్టి, కమలకూతురైన పద్మమీద తమకు హక్కు ఉందని ప్లీడరులా వాదిస్తుంది. తనకొడుకుకి బిడ్డగా ఆమె మీద తమకు హక్కుందంటే, పెళ్లివిషయం దాచినందుకు కమల కోర్టులో తేల్చుకుంటానంటుంది. కొడుకులు కోడళ్ళు అప్పటికే ఈసడించుకోవటంచేత నిస్సహాయస్థితిలోకి వెళ్లిన చిన్నక్క కమలగర్వాన్ని అణచాలని భావించి, తాను కమలకు పెళ్లినాడు పెట్టినచంద్రహారాన్ని అడిగేసరికి దానిని బుల్లితాతయ్యయ్యదగ్గర పెట్టానని, తాను యివ్వకపోతే నీ కొడుకెప్పుడో తలకాయలు బద్దలుకొట్టి తీసుకొనివెళ్ళేవాడని అన్నది. చిన్నక్కకు మరోమార్గంలేక కమలకు కృతజ్ఞతలేదంటూ తన తలకాయను గోడకు కొట్టుకొని ఏడ్చింది. అప్పుడు కమల బీరువాలోపెట్టిన ఆ చంద్రహారాన్నితెచ్చి యిచ్చినందుకు చిన్నక్కకు సిగ్గు కలిగింది.

బుల్లితాతయ్య రెండో పెళ్లి చేసుకొన్నాడని తెలిసి చిన్నక్క సూరమ్మదగ్గరకురాగానే యిద్దరూ కావలించుకొని ఏడ్చి ఆతనిని ఆ పిల్లబుట్టలో వేసుకోబట్టే ఆతడు మళ్ళీపెళ్ళి చేసుకోవాల్సి వచ్చినట్టుగా బాధపడతారు. కాని పితృస్వామ్య అసమనైతికసంస్కృతి పురుషుడికి అటువంటి స్వేచ్ఛనిచ్చిందనుకోరు. బుల్లన్నయ్య తన కొత్త భార్యకు రోజూ మల్లెపూలు తెచ్చిస్తున్నాడని చిన్నక్క అంది. కమలకు కోపంవచ్చి మీకుకూడా తెచ్చివ్వనా అన్నందుకు, కొడుకు అప్రయోజకుడయ్యేసరికి కోడలు ప్రకృతికి విరుద్ధంగా మాట్లాడుతోందని అనుకొంది. ఉద్యోగం చేస్తున్నందువల్లనే

కమలకు సంపాదనపరురాలనే గర్వం నిలువెల్లా ఉందని చిన్నక్క అనుకొంది. చిన్నక్కదృష్టిలో ఆడవాళ్ళు ఉద్యోగం చేయటం ప్రకృతివిరుద్ధంగా అనిపించి అలాంటిమాటలంది.

కాని కమల యింటినిర్వహణకు ఉద్యోగం చేస్తోందని పితృస్వామ్య కుటుంబంలోని అధికారవర్గసంస్కృతిని వంటబట్టించుకొన్న చిన్నక్కకు అర్థంకాదు. పురుషాధిక్య సంస్కృతికై కుటుంబనిర్మాణ పనివిభజనలో భాగంగా భార్యకు యింటిపని, భర్తకు సామాజిక ఉత్పత్తులపనిని కేటాయించింది. పురుషుడు పోషించేవాడయ్యేసరికి స్త్రీ తక్కువస్థాయికి చేరుకొంది. భర్త, అతనివైపు బంధువర్గమంతా అధికారవర్గం అనుకుంటారు. అందుకే ఆడబడుచు హోదాలో బుల్లన్నయ్య రెండోభార్య సుభద్రను వగలాడి అంటూ ఏడిపించేది.

చిన్నక్క వీలున్నప్పుడల్లా సూరమ్మయింటికి వస్తూపోతూ ఉండేది. బుల్లన్నయ్య పోయినప్పుడు వచ్చి సూరమ్మను కావలించుకొని ఏడ్చింది. బుల్లితాతయ్య చనిపోతూ తన మొదటిభార్యపేరు పద్మకుపెట్టినందుకు, యిచ్చిన ఆ పదివేలరూపాయిలతో పైనగదులు వేయిద్దామనుకొంటే చిన్నక్క ఆ డబ్బులను పద్మ చదువుకోసం ఉంచమని, వృథాచేయవద్దన్నది. కమల గట్టిగా తనకు ఏంచెయ్యాలో తెలుసని అన్నందుకు, చిన్నక్క అత్తగారి హోదాలో ఉండటంచేత కమల తనని విసిరికొట్టిందని అనుకొంది. కమల తన యిష్టానుసారం చేస్తానని, ఆమెకు యిష్టమైతేనే ఉండమంటుంది. దానికి చిన్నక్క తన మనవరాలిమీద ప్రేమకొద్ది ఉంటున్నానని అంటే కమల ఆమెతో కొడుకులు ఉండనివ్వకపోయేసరికి వచ్చావని తెలుసు, అక్కడికే వెళ్లి ఉండమనేసరికి చిన్నక్క గొల్లునఏడుపును అందుకొంది. సూరమ్మ ఆమెను ఓదార్చింది. తరువాత కమల ఆమె స్థితికి జాలిపడి యిష్టమైనవన్నీ వండుకొని యిద్దరిని తినమంది. అప్పుడు చిన్నక్కకు తన జీవితం గురించి అర్థమైంది.

పద్మ స్కూల్‌కి షూస్ వేసుకొని వెడుతుంటే మగరాయుడిగా పెంచుతున్నావని కమలను అడిగితే తాను పద్మను అలానే పెంచుతానని కమల

అంది. తమదగ్గర సమాధానంలేక అక్కచెల్లెళ్ళిద్దరు కమలను చదువుకోనిచ్చి, ఉద్యోగం చేయనివ్వటం తమదే తప్పనుకొంటారు. ఎందుకంటే పితృస్వామ్య సంస్కృతిని జీర్ణింపచేసుకున్న ముసలివాళ్ళిద్దరికీ సమాజంలో అమ్మాయిలు మగపిల్లలతో సమానంగా ఉండకూడదనే ఆలోచన ఉండటమే కారణం.

సత్యం తన మొదటి భార్యకు తిండిపెట్టలేక పోయేసరికి ఆమె ఆకలికి తట్టుకోలేక మతంమార్చుకొని మిషనరీలో చేరితే, దిక్కులేక సత్యం తల్లిదగ్గరకువచ్చి డబ్బులు అడిగుతాడు. చిన్నక్కకు అతడ్ని ఇంట్లోకి రమ్మనే ధైర్యంలేక రాత్రిపూట నిద్రపోకుండా ఆలోచిస్తూ చివరికి కమలను డబ్బు అడిగింది. అమ్మమ్మ బాధచూసి సత్యానికి అన్నంపెట్టటానికి కమల వొప్పుకుంటూ సత్యాన్ని తన మొగుడుగాకాక,నీ కొడుకుగా ఉండమంటుంది. అప్పటినుండి కమలను చిన్నక్క అర్థం చేసుకో సాగింది.

పద్మ బి.ఏ.చదువుతున్నప్పుడే పద్మకు పెళ్లిచేయాలని సూరమ్మ అన్నప్పుడు చిన్నక్కమాత్రం పద్మను ఉన్నతచదువులు చదివించమని అంది. పద్మ ఉద్యోగం చేయాలని, ఆతర్వాతే పద్మకు నచ్చి, ఆమెను గౌరవించే వ్యక్తితో పెళ్ళిచేయమంది. అలా అనేసరికి కమల యిప్పుడు తన అమ్మమ్మ సనాతనధర్మాన్ని పట్టుకొని వేళ్ళాడటంలేదని, ఆధునికంగా ఆలోచిస్తోందని తెలిసి ఆశ్చర్యపోతుంది. చిన్నక్క సూరమ్మను పిచ్చిదని, తనకుతీరని సరదాలను మనవరాలిద్వారా తీర్చుకోవాలనుకుంటోందని, అందుకే పద్మకు వెంటనే పెళ్ళిచేయమని అంటోందని అంటుంది. సూరమ్మ గతకాలంలోనే ఉందిగాని చిన్నక్క ఆధునికసమాజభావాలను అర్థంచేసుకోవటంచేతనే అలా మాట్లాడగలిగింది. పద్మ టాపర్ గాపరీక్షపాసై, విశాఖపట్నంవెళ్ళి చదువుకోవాలంటే కమల తనకూతురు చదువుకు డబ్బు ఎలాతేవాలా అని మథనపడుతుంది. అప్పుడు చిన్నక్క తాను పద్మచిన్నప్పుడే కమలతల్లి నగలను అమ్మి పద్మపేరున ఇన్సూరెన్స్ చేసినట్టు చెప్పింది. ఆ కాగితాలను సత్యం ఎత్తుకుపోకుండా దిండులో దాచిన విషయంచెప్పి గడువుతీరిందని, వెళ్ళిడబ్బును తెచ్చుకోమని చెబుతుంది. పద్మ యూనివర్సిటీచదువుల

తరువాత ప్రిన్సిపాల్ ఉద్యోగంకూడా చెయ్యాలంది చిన్నక్క. అమ్మమ్మ ధృడచిత్తానికి, ధైర్యానికి చదువుమీద ఉన్నమక్కువకు కమలకు ఆశ్చర్యం కలిగింది. తన అమ్మమ్మ పద్మచదువుకు రాచబాటవేసిందని కమల అనుకొంది. పద్మచదువుకు డబ్బులను సమకూర్చుకోవటానికి కమల తర్జనభర్జన పడుతున్నప్పుడు చిన్నక్క యిచ్చిన భరోసా ఆమెకు కొండంత ధైర్యాన్ని యిచ్చింది. అయినా కమల ఆ డబ్బును వద్దంటే చిన్నక్కతాను కమలకు చేసిన ద్రోహానికి పాపపరిహారంగానైనా తీసుకోమంటుంది. ఆరకంగా చిన్నక్క తన పశ్చాత్తాపాన్ని ప్రకటించుకొంది. చేసిన తప్పులకు పశ్చాత్తాపపడటం జ్ఞానిలక్షణం.

చిన్నక్కకు అనారోగ్యం ఏర్పడి మంచంలో ఉన్నప్పుడు సూరమ్మతోపాటు కొడుకు సత్యంకూడా ఆమె పనులన్ని చేసేవాడు. పద్మను ఆమె కలవరిస్తుంటే పద్మను విశాఖపట్నంనుండి పిలిపించనా అని కమల అడిగితే పద్మ చదువుపాడవుతుంది కనుక వద్దంటుంది. ఐనా పద్మ సెలవలకు వచ్చి చూసి వెడుతుంది. కమలకు అమ్మమ్మ మీద జాలికలిగేది. వృద్ధురాలైన అమ్మమ్మ ముందుగదిలో కూర్చొని ఉంటే ఆమె కొడుకుకూడా భయపడేవాడని, తన మొగుడు, కొడుకులు తనకు అన్యాయంచేసారని తిట్టి, నీ కొంపలోపడి తింటున్నానని అమ్మమ్మ అనేసరికి ఆమెకున్నమానసిక స్థైర్యం తమలో ఎవరికీ లేదని కమల అనుకొంది. తాను పద్మచదువుకై అవసరమైన డబ్బు విషయంలో తర్జనభర్జన పడుతూ అధైర్యానికి లోనయినప్పుడు అమ్మమ్మ ధైర్యాన్ని కూడా యివ్వగలిగిందని చిన్నక్క గురించి కమల అనుకొంది. చిన్నక్క చివరిక్షణంలో తన తరువాత సత్యాన్ని యింట్లోనుండి పంపననే మాటను కమలదగ్గర తీసుకొని చచ్చిపోయింది.

చిన్నక్కకూడా సూరమ్మలా పితృస్వామ్యసంస్కృతిని జీర్ణించుకొనే వాతావరణంలో ఎదిగేసరికి ఆసంస్కృతియే ఆమెలో బలంగా చోటు చేసుకొంది. అందుకే కొడుకులు ఎక్కువనుకున్న చిన్నక్కకు సంస్కృతిలోని డొల్లతనం తేటతెల్లమయింది. ఆస్తిహక్కులేక తనకు ఆర్థికస్వేచ్ఛలేదని

అనుభవపూర్వకంగా తెలుసుకుంది. కమలయింట్లో మగవాడితల్లిగా అధికారవర్గంలో ఉన్నాననుకొంది. కాని కొడుకులమీదఉన్న భ్రమతొలిగి, కొడుకులేకపోయినా తనని యింట్లో ఉండనిచ్చి అన్నంపెట్టిన కోడలు కమల మంచితనాన్ని తెలుసుకొని చిన్నక్క తన జీవితవిధానాన్ని మార్చుకొంది. ఆమె ఆలామారడానికి ఆమెకొడుకుల యిళ్ళకు వెళ్ళినప్పుడు బొంబాయిలాంటి ప్రదేశాలలో తిరిగి ఆధునికయుగపు మార్పులను ఒడిసి పట్టుకోగలిగింది. స్వాతంత్ర్యానంతరం స్త్రీల ఉన్నతచదువులకు ప్రాధాన్యత పెరిగిందని గ్రహించి పద్మచదువుకోసం బీమాచేయటం, పద్మ ఉన్నత ఉద్యోగం చేయాలనుకొన్నదంటే ఆమె కాలంతోపాటు మారుతూ ముందుకు నడిచిందని విశదమవుతుంది. కమలయింట్లో తన, తన కొడుకు స్థానాలను పదిలపరచుకోవటానికి ఆమె చేసిన తర్కం ఆమెనొక న్యాయవాదిని తలపుకు తెస్తుంది. ఎవరికీ భయపడేదికాదు. కాని కన్నప్రేమతో తన కొడుకుకోసం తాపత్రయపడినా చివరికి కోడలిచేతకూడా ధైర్యవంతురాలనిపించుకొంది. ఆమె అందరికీ ధైర్యాన్ని యిచ్చి, స్థిరమనస్తత్వం కలదని ప్రశంసలుపొంది చిన్నక్క జీవితాన్ని సార్థకంచేసుకొంది. చిన్నక్క ఆనాటి పరిస్థితులలో తాను చదువుకోకపోయినా ఆడపిల్ల చదువుకు పెద్దపీటవేసి తరతరాల స్త్రీలను విద్యావంతులు అయ్యేటట్లు చేసింది. చిన్నక్కను చదివిస్తే ఇంకఎలా ఆమెఉండేదోనని అనిపించకమానదు. చిన్నక్క పితృస్వామ్యసంస్కృతిని ఆచరణలో పెట్టినట్లు అనిపించినా, ఆధునిక సమాజంలో పొసగని ఆ సంస్కృతిని వదిలించుకొని, స్త్రీ విద్యాభివృద్ధిని ఆకాంక్షించిన మహిళగా

సూరమ్మచిన్నక్క చెరగని ముద్రను వేయించుకొంది.

5) సత్యం / సత్యనారాయణ

చిన్నక్కకొడుకుగా కమలను పెళ్ళిచేసుకొన్నవ్యక్తి సత్యం. మనుషులందరిలో మంచి-చెడు ఉన్నట్టే, రచనలోకూడా సమాజసంస్కృతిలో నుండి పుట్టినపాత్రలలోను చెడు, మంచి ఉంటాయి. కమల రజస్వలానంతరం సూరమ్మ పెళ్ళిచేయాలని పెళ్ళిసంబంధాలు చూస్తుంటే సూరమ్మ చిన్నక్కవచ్చి తన కొడుకుకి యిచ్చిపెళ్ళిచేయమని అడగటానికి వచ్చినప్పుడు నవలలో సత్యంగురించిన ప్రస్తావన మొదటిసారి వస్తుంది. సత్యం చదువుకోలేదని, సిగరెట్ల అలవాటు ఉందనిఅంటూ సూరమ్మ కమలను యివ్వటానికి యిష్టపడదు. సత్యం కన్నతల్లిగా చిన్నక్క కొడుకుపై ఉన్న ధృతరాష్ట్రప్రేమతో ఆమె సత్యానికి అలాంటి అలవాట్లు లేవని చెప్పింది. సత్యం ఫస్టునపాసవుతాడని, సత్యం తెలివిగలవాడని, అసూయతో మాస్టార్లు పక్షపాతంతో సత్యానికి మార్కులుతగ్గించి వేసారని చెప్పింది. సిగరెట్టు మానేసాడని అతనిమీద గిట్టనివాళ్ళు అలా చెపుతున్నారని సత్యం గురించి ఆతని తల్లి అదే చిన్నక్కచెప్పింది. నిప్పులేందే పొగపుట్టదుగా. కాబట్టి ఆ లక్షణాలుండబట్టే కమలకి సత్యం తగినవాడుకాదని సూరమ్మమనసు పదేపదే ఘోషపెట్టింది. తొమ్మిదవతరగతిపాసయిన సంతోషంలో ఉన్న కమలకు సత్యంతో పెళ్ళిజరిగింది.

పెళ్ళితరువాత కమలసూరమ్మతో తానుపదవక్లాసు చదువుకోవాలని తల్లిని అడిగితే సత్యాన్ని అడగమంటుంది. పితృస్వామ్యంలో ఒకసారి ఆడపిల్లకు పెళ్ళయితే అన్నిటికి భర్త అనుమతి ఉండాలి.పెళ్లయినప్పటినుండి భార్యను అదుపులో ఉంచుకొనే విద్యలో ఆరితేరిన సత్యం ముందునుండి తనంటే కమలకు భయం పుట్టేటట్లుగా ప్రవర్తిస్తాడు. 'నీదిమట్టిబుర్ర' అని,'నీకేమి తెలియదు నోర్ముయ్,షటప్' అంటూ ఆమెనుభయపెడుతు తనమాటకు ఎదురు చెప్పటానికి వీల్లేకుండా చేసుకుంటాడు. ఆమె మెదడును ఎదగనీయకుడా చూసుకుంటాడు. అందుకే తనచదువువిషయంలో సత్యం అంటే భయమని తాను అడగనని కమల అంది.

పైగా ఆడపిల్లలు స్కూల్‌కి వెడుతుంటే మగపిల్లలు ఏడిపిస్తారని, సత్యం మూడునిద్రలకు వచ్చినప్పుడే తన అభిప్రాయాన్ని చెప్పినట్టు కమల చెప్పింది. సూరమ్మ కమలతో ఆఏడాదికి చదువును ఆపమని, సత్యానికి కోపం తెప్పించవద్దని అంది. అంటే భార్య తన ప్రగతికోసం స్వేచ్ఛగా నిర్ణయం తీసుకంటే భర్తకు కోపం వస్తుంది. కమలను సినిమాకి వెంటబెట్టు కొని వెళ్ళటం పరువుతక్కువని, తనవెనకనే కమలను నడవాలంటాడు. కమలలోని సరదాలను చంపేస్తూ ఉండటమంటే భార్యలు తమంతటతామే మెల్లమెల్లగా కుంగిపోయేటట్టు చేయటమే. సూరమ్మతన అక్కకొడుకేకదా అని, 'ఏరాసత్యం పరీక్షకు కడుతున్నావా' అని అడిగినందుకు, తానిప్పుడు ఆయింటి అల్లుడినని 'ఏమండి' అని గౌరవంగా పిలవాలంటాడు. అల్లుడు తమకంటే చిన్నవాడైనప్పటికి సంఘంలో అధికారం కలవాళ్ళను పిలిచినట్టు గౌరవంగా పిలవాలని పతృస్వామ్యం నిర్దేశించింది. అంటే భార్యకే కాక భార్య తరపువారందరకి తాను అధికుడనే భావనను ఏర్పడేటట్టుచేసింది పితృస్వామ్యవైవాహిక సంస్కృతి. అలాగా సత్యంకూడా ఆయింటివారిమీద తనకు అధికారం ఉండేటట్టు చేసుకుంటాడు. అందుకే సత్యం పితృస్వామ్యాన్ని పుణికిపుచ్చుకొని పుట్టినవారికి ప్రతినిధిగా ఉంటాడు. తండ్రిచనిపోయినప్పుడు తల్లి తననగలను పద్మపేరన రాసినప్పుడు తనపిన్ని, కమలకలిసి అలా రాయించుకున్నారని వాళ్లమీదకోపంగా ఉంటాడు. తండ్రి కర్మకాండలన్నీ జరిగినతరువాత భార్య కమల వెడుతుంటే ఉండమనికూడ అనడు. అలా అననందుకు సత్యానికి కమల అంటే ప్రేమలేదని సూరమ్మ అనుకొని, అటువంటి సత్యానికి యిచ్చి కమలకు పెళ్ళిచేసినందుకు ఆమె గొంతుకోసినట్టు బాధపడుతుంది.

కమల దగ్గరికి సత్యం వస్తూపోతూ ఉన్నప్పుడు కమలకు క్షణక్షణం భయంభయంగా ఉండేదని, అతడు యింట్లో లేకపోతే ఆనందంగా ఉండేది. సత్యం వచ్చినప్పుడు కస్సుబుస్సులాడటం, తెల్లారి పడకగది నుండి గుడ్లనీరుకుక్కుకుంటూ కందిపోయిన ముఖంతో బయటకు వచ్చిన

కమలనుచూసి సత్యం స్వభావం సూరమ్మకు తెలిసేది. అందుకే కమల మృగంలాంటి మొగుడు కలకాలం చల్లగా ఉండాలని చేసే నోములను చేయకూడదనుకొనేది. అంటే స్త్రీపురుష లైంగికసంబంధాలలో సున్నితత్వంలేని జంతుస్వభావంగల సత్యం కలకాలం చల్లగాబతికుంటే తనకు అన్నాళ్ళు లైంగికహింస తప్పమరొకటి లేదనే కమలకు అర్థమయింది. స్త్రీలపై లైంగికఅదుపే పురుషాధిక్యతకు చిహ్నమని నమ్మకంగలవాడు కాబట్టే కమల గర్భానికి తనపురుషత్వం గొప్పతనమని అంటాడు. అందుకే కమలకు కూతురు పుట్టినసందర్భంలోనే తానింకా యిద్దరు పిల్లలకు తండ్రినని నిర్భయంగా ప్రకటించగలిగాడు. ఆ విషయంముందే కమలకు తెలిసినా సూరమ్మకోసం బయటపెట్టలేదు. కాని సత్యం తనంతటతానే బయటపెట్టేసరికి ఆ కిరాతకుడితో కమల తానిక కాపురం చేయలేనంటుంది. తన అవసరాల కోసం సూరమ్మయింటికి వచ్చిన సత్యం ఆనాడు తనతండ్రి తనతల్లికి చేయించిన నగలను కమలకు తల్లియిచ్చినా, ఆనగలపై తనకే వారసత్వపు హక్కులున్నాయంటూ సత్యాగ్రహానికి దిగి యింటిముందు బైఠాయిస్తాడు. అల్లుడు అలా గొడవచేస్తూ యింటిముందు కూర్చొంటే పరువుపోతుందనుకున్న సూరమ్మ బుల్లన్నయ్య దగ్గర నుండి నగలను తెప్పించి ఆతనికిచ్చి, ముట్టినట్టుగా వారిద్దరూ కాయితం రాయించుకున్నారు. అల్లుడు వాకిట్లో కూర్చోవటం పరువుకాదనుకుంది సూరమ్మ. అంటే పితృస్వామ్యంలో కుటుంబగౌరవాన్ని ,పరువుప్రతిష్ఠలను కాపాడే బాధ్యత స్త్రీలదేనని, దానికి ఆటంకం కలిగితే స్త్రీలనే సమాజం నిందిస్తుందనే భరోసా సత్యానికి ఉంది. అందుకనే సత్యం తనకు పితృస్వామ్యం యిచ్చిన ఆమోదాన్ని వాడుకోవటం కోసమే అందరికి తెలిసేలా యింటిబయట కూర్చొన్నాడు. కమల సత్యంతో తనకున్న ఆఖరిబంధంకూడా తెగిపోయినందుకు సంతోషించిందంటే కమల యిక ఆతని ముఖంకూడా చూడకూడదనుకున్న మృగస్వభావి సత్యం అని అర్థమౌతుంది.

సాధారణంగా యిలాంటి భర్తల అకృత్యాలను, లైంగికహింసను స్త్రీలు భరిస్తూ మరొకరికి తెలియకుండా గుట్టుపాటిస్తారు. ఎందుకంటే ''రోగం రట్టు- సంసారంగుట్టు'' అనే సామెతను పితృస్వామ్యంపుట్టించి స్త్రీలను బయటకు చెప్పుకోకుండా చేసింది. కాబట్టి ఇంటాబయటా లైంగికహింసలు బయటకు రావు. అందుకే కమల సత్యానికి యింటిలోపలనే శిక్షను ఖరారుచేస్తూ తనకు సత్యంతో లైంగిక సంబంధాలు లేకుండా చేసి భర్తకు యింటి బహిష్కరణను నిర్ణయించింది.

జులాయిగా ఏపనిచేయకుండా తిరిగే సత్యం తన భార్యను, బిడ్డలను పోషించుకోలేని స్థితిలో ఉండేసరికి సత్యం మొదటి భార్య అతడ్ని వదలిపెట్టి మతంమార్చుకొని మిషనరిలో చేరింది. అక్కడ మగవాళ్లకు ప్రవేశం ఉండదుకాబట్టి సత్యం మూడురోజులపాటు ఆకలికి అలమమటించి తనతల్లి సూరమ్మ యింటికిచేరి కమల స్కూలుకి వెళ్లినప్పుడు అన్నానికి ఇరవై రూపాయలు అడుగుతాడు. ఆస్తుల విషయంలో సత్యం తన అన్నలతో గొడవ పడ్డందుకు వాళ్ళుపట్టించుకొని తనని ఆదరించరని భావించి సత్యం వారి యిళ్ళకు వెళ్ళలేకపోయాడు. తిండి లభ్యమయ్యే అన్నిదారులు మూసుకుపోగా ఏమీ చెయ్యలేని పరిస్థితులలో సత్యం కమలవాళ్ళ యింటికి వచ్చాడు. తన దీనస్థితిని గ్రహించుకోగలిగినప్పుడే మనిషికి అహంకారం తగ్గుముఖం పడుతుంది. ఆర్థికబలంతో సంపాదించుకొన్న ఆధిక్యసంస్కృతి బీటలువారటం మొదలవుతుంది. అటుపక్క స్త్రీలుకూడా తమ ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులువేసి, స్వతంత్ర వ్యక్తిత్వాన్ని నిలుపుకొనే ధైర్యం వారిలో ఏర్పడితే పితృస్వామ్య సంస్కృతి తోకముడవక తప్పదనే సత్యం దీనస్థితివల్ల అర్థమౌతుంది. డబ్బులు ఇవ్వలేక సత్యంతల్లి బాధపడుతుంటే కారణం అడిగితెలుసుకొన్న కమల జాలితో అతడికి అన్నంపెట్టమని చెప్పింది. మొత్తంమీద తిండిలేక భార్యతనమీద జాలిపడే స్థితికి సత్యం చేరుకొన్నాడు.

మొదటినుండి పితృస్వామ్య సమాజంలో కొడుకు పుట్టుకకు ఉన్న విలువలతో తల్లి చేసిన గారాబం, తల్లి ధృతరాష్ట్ర ప్రేమతో పనిపాటలేకుండా

జులాయిగా మారిన సత్యానికి తాను మగవాడిననే అహంకూడా కలిసివెరసి సత్యం తిండికిమాడే పరిస్థితివచ్చింది.

కమల సత్యంస్థితిని తన అమ్మమ్మద్వారా తెలిసికొని జాలిపడి ఆమెతో అతనికి డబ్బుయివ్వనుగాని అతడు నా మొగుడుగాకాక నీ కొడుకు అనుకొని అన్నంపెట్టమంది. కమల యింట్లో లేనప్పుడు సత్యం పిల్లిలాగా వచ్చి అన్నంతిని బయటకూర్చొనేవాడు. కూతురు పద్మకాలేజికి వెళ్లివచ్చేటప్పుడు ఆలస్యమైతే పద్మ రమ్మంటే వెళ్లితీసుకొని వచ్చేవాడు. తండ్రికూతుళ్ళబంధం విచిత్రంగా ఉండేది. సత్యం మెల్లమెల్లగా ముందుగదిలోకి వచ్చిపడుకొనే అలవాటు చేసుకొన్నాడు. పద్మ యూనివర్సిటి చదువుకు కావలసిన అప్లికేషన్స్ తేవటం పోస్టుచేయటం వంటి బయటిపనులు చేసేవాడు. చెప్పకుండా కొన్నాళ్ళు బయటకువెళ్ళి సంపాయించుకొని వచ్చి పద్మకు చుడిదార్ తెచ్చి యిచ్చాడు. తన తల్లికి, సూరమ్మకు చిన్నచిన్న బహుమతులను తెచ్చి ఇచ్చేవాడు. పద్మ, సత్యం తండ్రికూతుళ్ళలాకాక స్నేహంగా ఉండేవారు. సత్యం తల్లి అనారోగ్యంతో మంచానపడితే తనే దగ్గరఉండి సేవచేసాడు. రాత్రిళ్ళు సూరమ్మ బదులు కమల తాను అమ్మమ్మను చూసుకుంటానంటే స్కూల్ లో కమలకు నిద్రవస్తుందని చెప్పి తల్లిదగ్గర తనే ఉండేవాడు. సత్యంలో ఈ సున్నితత్వం కమలతో పెళ్ళయినప్పుడే అతడిలో ఉండిఉంటే తనజీవితం ఇలా అయ్యేదికాదనే కమల అనుకునేటట్టుగా సత్యంలో మార్పుకనపడింది. సత్యం తల్లిచనిపోతూ తన మరణానంతరం సత్యాన్నియింటినుండి బయటకు పొమ్మని అనవద్దని కమలను చివరికోరిక కోరింది. సత్యం తనతల్లి చనిపోయినప్పుడు కర్మకాండలుచేసి యింటికివచ్చి తడిబట్టలతో నిర్లిప్తతతో కూర్చొని ఉన్నసత్యాన్ని చూసి బాధపడ్డ కమల ఆతడిని తడిబట్టలను మార్చుకోమంటూ చాలారోజుల తరువాత కమల సత్యంతో మాట్లాడింది. సూరమ్మను దగ్గరతీసుకొని ఓదార్చమంటుంది. సూరమ్మకు సత్యంమీద కోపంతగ్గింది. పద్మ యూనివర్సిటి చదువు పూర్తిచేసుకొని యింటికివచ్చి ఊళ్లోనే ఉన్న కాలేజిలో లెక్చరరుగాచేరింది.

సూరమ్మ తీర్థయాత్రలకు వెళ్ళింది. కమల వంటపని చేస్తుంటే పద్మకాస్త సహాయం చేసేది. సత్యంకూడా బజారుపనులు చేయటంతోపాటు నీళ్లుతోడటం వంటి యింటిపనులను చేసేవాడు. సత్యంమనిషిగా మారుతున్నాడనుకొంది కమల.

ఆ రోజు సెలవదినమైనా పద్మకు కాలేజిలో పనుండి వెళ్ళగా, కమల తన గదిలోపడుకొని పత్రిక చదువుకుంటున్న సమయంలో సత్యం ధైర్యంగా కమలగదిలోకి వెళ్ళాడు. కమల మంచంమీదనుండి లేచి 'తనపడకగదిలోకి రాకూడదని చెపితే, ఎందుకొచ్చావని' గద్దిస్తే, సత్యం మంచానికి దగ్గరగా వెడుతూ 'మనం భార్యాభర్తలం. కలిసి ఉంటే తప్పేమిటి?' అన్నాడు. దానికి కమల సత్యంతో 'తమ మధ్యన భార్యాభర్తల సంబంధం ఏనాడో తెగిపోయింది. నువ్వు మారావనుకున్నా. కాని మారలేదు' అంది. నీతల్లి అన్నంపెట్టమని, యింట్లో ఉండనీయమని అడిగినందుకు ఉండనిస్తున్నా. పో, బయటకు అని చింతనిప్పులాంటి కళ్ళతో ఆగ్రహంతో అరిచింది. అయినా పట్టుదల వదలని సత్యం కమలతో నువ్వు ఇదివరకటిలా రాత్రిళ్ళు నీ గదిలోపలి గడియ పెట్టుకోకుండా పడుకుంటే నేనలా అనుకున్నానని నసుగుతూ అన్నాడు. కమల 'జబ్బుగా ఉన్న అమ్మమ్మకు రాత్రిసమయంలో అవసరమొస్తుందని తానట్లా గడియపెట్టుకోలేదని, అతనిమీద మోహంతోకాదని చెప్పింది.' 'సిగ్గులేకుండా ఇంకొకసారి యిలాంటి ఆలోచనలను చేశావంటే పెట్టే, బేడ రోడ్డుమీదకు విసిరేస్తానని, యింట్లోనుండి గెంటేస్తాన'ని అంది. కమలకు కోపంవస్తే తనబతుకు రోడ్డుమీదేనని తెలుసుకొన్న సత్యం అక్కడినుండి తప్పుకుంటాడు.

పితృస్వామ్య కుటుంబంలోని వైవాహికసంబంధాలలో లైంగిక అదుపులో భాగంగా భార్యపైఅదుపు చూపడానికి భర్త అవకాశం ఉన్నంతవరకూ ప్రయత్నిస్తూనే ఉంటాడని, పురుషుడిలో అది కోర్కెలను తీర్చుకొనే రూపంలో ఉంటూ బుసలుకొడుతూనే ఉంటుందని సత్యం ప్రవర్తన తెలుపుతుంది.

తీర్థయాత్రల నుండి వచ్చిన సూరమ్మకు యింట్లో సత్యం కనపడక పోయేసరికి కమల అతనిని యింట్లోంచి వెళ్ళగొట్టే ఉంటుందని అనుమానంగా

ఉండేది. అందుకనే నెలరోజులపాటు సత్యం బయటగడిపి తిరిగి భయంగా వస్తూ తనపెట్టెబేడా కమల వీధిలోకి విసిరేస్తుందని బెరుకుగా యింట్లోకి వస్తాడు. ఆ రోజునుండి కమల మళ్ళీ తన గదికి లోపల గడియవేసుకొనేది. పద్మకు అర్థమై ఆరోజునుండి ఒకవేళ కమల మర్చిపోయినా పద్మ తల్లిగది తలుపు లోపల గడియ వేసేది. సత్యంయింటికి వచ్చినందుకు ఆతడు సాహస యాత్రచేసి వచ్చినట్లుగా సంతోషపడి కాశీ సమారాధన ఏర్పాట్లు చేసుకుంటూ సూరమ్మ కిందామీద అవుతుంటే, కమల తన తల్లినిగురించి అమ్మమ్మ చెప్పినట్టుగా సత్యం విషయంలో ఆమెనిజంగా పిచ్చిది అనుకొంది. ఇప్పుడు సత్యం కోరలుతీసిన పాము, చచ్చినపాము. కాని సరీసృపం చస్తుందేమోకాని మనిషిలో మాత్రం కోర్కెలు బుసలుకొడుతూ, చావకుండా ఉంటాయని, అందుకే డెబ్బైఏళ్ళ బుల్లి తాతయ్య తనలోని పామును చంపలేకపోయాడని అనుకొంది. సత్యం కూడా అలాంటి వాడేనని,పాము తన ప్రవృత్తిని మార్చుకోదు కాబట్టి యింట్లోఉన్న సత్యం అనే పాముతో తాను జాగ్రత్తగా ఉండాలని కమల అనుకొంది.

ఆ రోజునుండి సత్యం దేనిలోను కల్పించుకోకుండా ఉండేవాడు. కూతురు పద్మకు పెళ్ళయి పిల్లవాడు పుట్టినప్పుడు సూరమ్మకు ఆధునికపద్ధతులు తెలియవని ఆపిల్లాడికి పాలుపట్టటం, డైపర్సు మార్చటం వంటి వన్నీ సత్యమే దగ్గర ఉండి చూసుకొనే వాడు. వీపుమీద కూర్చోపెట్టుకొని గుర్రపు స్వారిచేయిస్తూ తనమనవడితో ఆడుకుంటుటే కమలకు వారిద్దరి సంబంధం విచిత్రంగా ఉండేది, సత్యాన్ని కమల యింటికి రానిచ్చినప్పటినుండి ఆ ఒక్కవిషయంలోతప్ప సత్యం అన్నివిషయాలలో బాధ్యతతో ఉండేవాడు. ఆ క్రమంలో మెల్లమెల్లగా కమలకు సత్యం అంటేభయం తగ్గింది. కాని వారిద్దరి మధ్య భార్యాభర్తలసంబంధం మాత్రం తిరిగి తలెత్తలేదు.

కమల యింట్లో పనికి కుట్టుమిషన్ కొన్నది. సత్యం దానిమీదకూర్చొని బట్టలుకుడుతుంటే ఆశ్చర్యపడి అతనిని ఎప్పుడు నేర్చుకొన్నావని అడిగింది. దానికి సత్యం తాను ఆకలితీర్చుకోవటానికి ఛీత్కారాలు, అవమానాలను

ఎదుర్కొనే క్రమంలో, తనబాధలను ఎవరితో చెప్పుకున్నా సానుభూతి లభించదనే పాఠాలు నేర్చుకొన్నానని అన్నాడు. 'ఆరోజు నీగదిలోకి వచ్చినందుకు క్షమించమని అడగటంకోసం చాలాసార్లు ప్రయత్నం చేసానని, చెప్పి తనని క్షమించమని యింకెప్పుడూ రాను' అని సత్యం కమలతో అన్నాడు. సత్యానికి చదువు లేకపోవటంచేతనే తెలివి,శక్తిఉండికూడా కూలిపనిచేసుకొని బతికాడని భావించిన కమలకు ఏడుపు వచ్చింది.

పద్మకు కూతురుపుట్టినప్పుడు ఆమె సత్యాన్ని తాను ఉద్యోగంచేసే ఊరికి రమ్మంటుంటే కమల తాను వస్తానంది. అప్పుడు పద్మ నాన్నఅయితే పిల్లలను బాగా చూస్తాడని అన్నదంటే ఒకానొకప్పుడు భాద్యతారాహిత్యంగా ఉండే సత్యం ఇప్పుడు పిల్లల పెంపకాన్ని నేర్చుకొన్నాడని కమల చూసింది. పురుషులకు ఆఆధిపత్య ధోరణి తగ్గితే అతడు, ఆతనితోపాటు ఉన్న వ్యక్తులు కూడా ప్రశాంతంగా బతుకుతారని, అప్పుడే సమాజం బాగుంటుందనే ఆలోచన రాకమానదు. పద్మ సెలవులకు తల్లి దగ్గరకు వచ్చినప్పుడు అతడుకూడా వారితోపాటు తిరిగి వస్తాడు. పద్మ మళ్ళీ తనతోపాటు సత్యాన్ని తీసుకొని వెడతానంటే కమలకు యిష్టంలేదని సత్యం భావించి, వెళ్ళకుండా ఉండిపోతాడు. ఒకరోజు సత్యానికి ఒంట్లో నలతగా ఉండి పడుకొంటే కమల పద్మదగ్గరకు వెడతావా అని అడిగితే తనకు ఇక్కడే బాగుందని, పిల్లలు, ప్రేమలు, పెంపకాలు తాత్కాలికమంటూ వేదాంత ధోరణితో మాట్లాడాడు. కమల హార్లిక్స్ చేసియిచ్చి తాగమని మంచం పక్కనపెట్టి తనగదిలోకి వెళ్లిపడుకొంది. తెల్లవారిచూస్తే సత్యం ఆ హార్లిక్స్ తాగకుండానే గుండెపోటుతో చనిపోయాడు. దానికి కమల సత్యాన్ని తనగదిలోకి రావద్దన్నందుకు బాధపడింది. ఆతనికి నొప్పివచ్చినప్పుడు తనగదిలోకి వచ్చిచెప్పి ఉంటే బతికేవాడని అనుకొంది.

సత్యం చనిపోయినతరువాతనే అందరూ ఆతనిసేవలను ఊళ్ళోవాళ్ళు, విశాఖపట్నంవాళ్లు కమలను పరామర్శించటానికి వచ్చిచెపుతుంటే సత్యం అంతగా అందరికి సహాయపడినందుకు కమలకు ఆశ్చర్యం వేసింది. సత్యం

బతికున్నప్పుడు తాను సత్యాన్ని బాగా చూడలేదని, చివరకు తనిచ్చిన హార్లిక్స్ తాగలేదనే బాధతో కమల కుమిలిపోయింది. అంటే సత్యం ఆకలి ఆతనిని తిరస్కారాలకు గురిచేసినప్పుడు మానసికంగా పితృస్వామ్య సంస్కృతి నుండి ప్రక్షాళనంచెంది ఆధిపత్యపు ధోరణిపోయి మానవత్వంతో ఉండటమే జీవితపువిలువని ఆతడు గ్రహించటమే. అందుకే సూరమ్మ చెప్పిన గతకాలపు సంఘటనల ఆధారంగా సత్యం ప్రవర్తనను తెలుసుకొన్న రామశేషు, సత్యంగురించి చెపుతూ ఆతడు మునుపు అన్ని విషయాలలో అహంకారంతో ప్రవర్తించినా, అతడు చివరికి యింద్రియాలను నిగ్రహించుకొనే స్థితికి చేరుకొని, దేనికీ చలించని స్థిరమైన మనస్సును సాధించాడని అన్నాడు. అంటే రామశేషు మాటల్లో సత్యం ద్వేషాన్ని త్యజించాడని అర్థం. పద్మతల్లి జయించలేదని పద్మ తండ్రి జయించాడన్నాడు. పితృస్వామ్య సంస్కృతిని ఆచరించినన్నాళ్ళు ఆతనిలో జంతుస్వభావమే ఉందని, తనకు ఎదురైన అనుభవాలతో తాను అధికుడనుకానని ఆతనికి అర్థమై, ఆతనిలో చిత్త సంస్కారం కలిగిందన్నాడు. తన యింద్రియాలను జయించటంతో చివరికి సత్యం మనశ్శాంతిని పొందినట్లు రామశేషు మాటల్లోకూడా బయట పడుతుంది. అతడు అలా మారటానికి కమల నిక్కచ్చితనమే కారణమని గ్రహింపునకు వచ్చి సమాజంలో సత్యంలాంటి వాళ్ళు వైవాహికసంబంధాలలో తారసపడితే, వారికి లొంగిపోతే ఆ జంతుస్వభావం సమాజంలో రాజ్యమేలుతుందనే స్ఫురణ కలుగుతుంది.

6) రామశేషు

ఈ నవలలో రామశేషు సంస్కారవంతుడైన ఆధునిక యువకుడు. ఆచరణసాధ్యమైన ఆదర్శాలకు నమూనా. ప్రజాస్వామ్యదృక్పథం కలవాడు. సహనశీలి. ముక్కుసూటి మనస్తత్వంగలవాడు. తనచుట్టూఉన్న వారిని అర్థంచేసుకొనే క్రమంలో వారిని బలహీనలతలతోసహా ప్రేమించి, అగౌరవపరచకుండా వారి మనస్సులను ఆనందపరచేవాడు. ఆధునిక యుగంలో చదివిన ఇంజనీరింగ్ విద్యతో ఇంటాబయటా మానవసంబంధాల అభివృద్ధికారక నిర్మాణాత్మకఅల్లికను పటిష్ఠంచేసిన సామాజిక ఇంజనీరుపాత్ర రామశేషుది. పద్మతో వైవాహికసంబంధం ఏర్పడేసందర్భంలో రామశేషుపాత్ర పరిచయం అవుతుంది. పద్మతో పెళ్ళిచూపులు జరిగిన మూడవరోజున సంప్రదాయాన్ని విచ్ఛిన్నం చేస్తూ వస్తున్నందుకు క్షమించమని కమలను అడిగాడు .ఆమెతో మాట్లాడటానికి వచ్చానంటూ యింట్లోకి వచ్చాడు. అంటే ఆతని రాక అంతవరకు ఉన్నపాత పితృస్వామ్య సాంప్రదాయాన్ని విచ్ఛిన్నంచేసే దిశగా అడుగులువేసింది. సామాన్యంగా పెద్దలుగాని, వధూవరులుగాని పరస్పరం మాట్లాడుకుంటారుగాని యిక్కడరామశేషు సరాసరి పద్మ తల్లితోనే తన అభిప్రాయాలను పంచుకోవటానికి రావటంలో ప్రత్యేకతఉంది. సమస్యలకు కారణమైన పరిస్థితులను అర్థంచేసుకోవటం మొదలుపెడితే సమస్యమూలాలు అర్థమవుతాయని, అప్పుడే సమస్యలను సానుకూలదృక్పథంతో పరిష్కరించుకోవచ్చని చెప్పి తన చుట్టూఉన్నవారిని ఒప్పించగలుగుతాడు. రామశేషుకు పద్మను చేసుకోవటానికి వాళ్ళ తరపువారు ఇరవైవేల వరకట్నం అడగటానికి కారణాలను చెప్పిపోదామని వచ్చాడు. తన మూడవ చెల్లిపెళ్ళికి కట్నం యివ్వాలి కాబట్టి తాము తీసుకోవాల్సి వస్తోందని, ఆ విషవలయాన్ని బ్రేక్ చేసే శక్తి ఎవరికీలేదని అన్నాడు. డబ్బాశతో కట్నం అడగటంలేదని, తనతండ్రి దేశసేవలో చాలా పోగొట్టుకున్నారని, తమకిప్పుడు ఆస్తిపాస్తులు లేవనిచెప్పాడు. కమల తనకూతురుకు కట్నంయివ్వటం యిష్టంలేదని చెప్తే, తాను అప్పుగా మాత్రమే కట్నం తీసుకుంటున్నానని

తరువాత తీర్చేస్తానని చెప్పాడు. కట్నం విషయంలో ముందుగా మిమ్మల్ని నమ్మించి ఆతర్వాత పద్మను ఒప్పిస్తానన్నాడు. కట్నందురాచారమని మును పెన్నో ఉపన్యాసాలిచ్చినా దానిని ఆచరణలో పెట్టటం కష్టంగా ఉందని తనచెల్లి పెళ్ళివిషయంలో మథనపడి మీ పర్మిషను తీసుకొని పద్మతో కూడా మాట్లాడాలని చెప్పాడు. రామశేషుతో కమల తనయింటి విషయాలు పంచుకున్న సమయంలో సత్యం విషయం తెలిసి, పూర్తిగా ఆతడ్ని తప్పుపట్టలేమని పరిస్థితులు మనిషిని అలా మారుస్తాయని, మనుషులను వారివారి బలహీనతలతోసహా స్వీకరించటం ఒకటే సుఖపడే మార్గమంటాడు. స్త్రీలమనోభావాలను గౌరవించగల యువకుడు తటస్థపడినందుకు కమల సంతోషించింది.

పద్మ, రామశేషుల మద్య కట్నం గురించి వాదోపవాదాలు జరిగాయి. పద్మ కట్నం అనే ఆలవాటుని తాను ఎదిరిస్తున్నానంటే, తానుకూడా ప్రతిఘటిస్తున్నానని రామశేషు అన్నాడు. కాని తనచెల్లెలికి యివ్వబోయే కట్నండబ్బు వాళ్ళదగ్గరకూడా ఉండదని, కట్నం చేతులుమారుతుందనే పరిస్థితులను ఆలోచించమని, దానిని డబ్బుఆశ అనకూడదని అన్నాడు. ప్రతిమనిషికి ఆదర్శాలు ఉండాలి. కాని అవితలవారి మీదకు ఎక్కిజీవితాల్ని మింగేయకూడదని, వాటిని అదుపులో ఉంచుకోవాలని, అవిమనిషిని మూర్ఖుడ్ని చేయకూడదని అంటాడు. కట్నంనియమంతో సంబంధం లేకుండా కట్నం యిస్తామనే వేరేసంబంధం వారుఉన్నా కట్నంవిషయంలో పద్మవాళ్ళు తెలివైనవారుగా అర్థంచేసుకోగలరని అన్నాడు. ఇరవైవేలు జీవితాల్ని దూరంచేయకూడదని ఆ డబ్బును రెండేళ్ళలో తీరుస్తానని, సంపాదనకంటె మనిషిమీద నమ్మకం ముఖ్యమనిచెప్పగా పద్మ సమ్మతించింది. శుష్కోపన్యాసాలకంటెకూడా రామశేషు ఆచరణసాధ్యాన్ని ఆలోచించటం కనపడుతుంది. ఇరవైవేల కట్నం విషయాన్ని యిరువైపులవాళ్ళు సర్వసాధారణంగా తీసుకున్నారంటే ఆ మేరకు ఎవరికి యిబ్బంది, ఆశలేకుండా అవసరాలను మాత్రం తీర్చగలిగిన రుణంగా భావించటమే.

రెండేళ్ళరువాత రామశేషు అప్పుగాతీసుకున్న కట్నం డబ్బులను తన జీతంలోనే మిగిల్చి, తిరిగి యిచ్చేసి చెప్పినట్లుగా మాటనిలబెట్టుకున్నాడు. భార్యభర్తలమధ్య నమ్మకం ముఖ్యంగాని డబ్బుకి ప్రాధాన్యత ఉండకూడదంటాడు. పద్మకు తన తల్లిమీదతప్పు నిజం దాచిపెట్టి తమయింట్లో యిప్పటివరకు చేసిన పెళ్ళిళ్ళ విషయంలో పద్మకు నమ్మకంలేకపోయింది. పెళ్లితరువాత కూడా పద్మ ఆ ఊళ్ళోనే ఉద్యోగం చేస్తుండటంవల్ల రామశేషు సూరమ్మవాళ్ళింటికి వస్తూపోతూ అందరి అభిమానానికి కేంద్రస్థానమయ్యాడు. భార్యాభర్తలమధ్య స్త్రీపురుషులమధ్య సమానత్వాన్ని,స్నేహాన్ని కోరుకుంటాడు కాబట్టే పద్మ తనను పేరు పెట్టి పిలిచినా పట్టింపు ఉండేదికాదు. సొంత పిన్నినికూడా సత్యం ఆ యింటికి అల్లుడు అవగానే పురుషాధిక్య పితృస్వామ్యపు భావజాలం కల సత్యం తనని గౌరవించి పిలవాలని చెప్పిన విషయంలో, రామశేషు మనస్తత్వంలో ఉన్న తేడా అర్థమయితే రామశేషు గొప్పతనం అర్థమౌతుంది.

సత్యం చనిపోయినప్పుడు అల్లుడైనా ఆతనికి తాను కొడుకువంటివాడినని సత్యాన్ని తనతండ్రిలా భావించి రామశేషు తానే కర్మకాండలను చేసాడు. తండ్రి బతికినన్నాళ్ళు అతనిని తనతల్లి ద్వేషించి, అతడు పోయినతరువాత దుఃఖిస్తూ కుమిలి పోతున్నందుకు ఆశ్చర్యమేస్తోందని పద్మ రామశేషుతో అంది. అప్పుడు రామశేషు పద్మతో వారిద్దరిమధ్య పరస్పర అభిమానం ఉందని, అతడు చేసిన పనులను ఆమె ద్వేషించి మరిచిపోలేక మాటిమాటికి ఆ ద్వేషాన్ని ద్వేషించిందని అన్నాడు. ఆ వ్యక్తినికాదని, అతనిలోని ద్వేషమనే భావాన్నిమాత్రమే ఆమె ద్వేషించిందని అన్నాడు. ద్వేషాన్ని ప్రేమించటంలోనే తన వ్యక్తిత్వం ఉందనుకొని, ఆద్వేషానికి అంతర్మథనం చెందుతోందని అన్నాడు. హేతుబద్ధంగా ఆలోచించే ఆమె తన మనశ్శాంతికోసమే సత్యం మరణానంతరం బొట్టు, మంగళ సూత్రాలను తీసేసి ఉండవచ్చు అంటాడు. ఇది మనుషులను రామశేషు సానుకూలధోరణిలో అర్థంచేసుకోవటానికి నిదర్శనం. పద్మ తనతండ్రి మరణానంతరం తల్లిని తనతో పాటు విశాఖపట్నం

తీసుకొని వెడదామనుకుంటే, ఆమెతాను గుడిలో నిద్రచేసిగాని రానని అన్నప్పుడు పద్మ'చాదస్తం' అంది. దానికి రామశేషు పద్మతో బంధువులందరూ పోయి ఒంటరియైన ఆమె, తనపిల్లలు బాగుండాలనే అట్లామాట్లాడుతోందని అన్నాడు. పద్మతల్లి మరోదెబ్బను తట్టుకోలేని స్థితిలో ఉండి ఆమె అలా అంటోందని చెప్పి,'నీవు నమ్మని విశ్వాసాలవిషయాలలో ఆమె సంశయంగా ఉంటే బలవంతంగా నీ అభిప్రాయాలను రుద్దవద్దు' అని రామశేషు అన్నాడు. పద్మ తల్లి మూడురోజులుమాత్రమే గడిపి తన ఊరికివెళ్ళిపోయింది. పద్మ, రామశేషులు వెళ్ళి ఆమెను చూసి వస్తుండేవారు. రామశేషు వాళ్ళతో ప్రపంచలోని అన్ని విషయాలను అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్లుగా చెప్పి మాట్లాడుతూ వారిని ఉత్సాహపరుస్తాడు. ఎదుటి మనిషి తనకు సంభవించిన కష్టాలకు దుఃఖిస్తూ మనోవ్యథతో బాధపడుతుంటే, వాళ్లను ఉత్సాహపరచి వారిలో జీవనచైతన్యాన్ని మేల్కొల్పటంలో నేర్పరియైన మానసిక వైద్యనిపుణునిగా రామశేషు అర్థం అవుతాడు. సమాజానికి కావలసినది ఇటువంటి మనుషులే. కమలను తన తల్లిగాభావించి అన్ని అడుగుతూ చిన్నపిల్లాడిగా అనిపించేవాడు. పద్మతల్లి కమలకు కేన్సర్ వచ్చి చనిపోయినప్పుడు పద్మతన తల్లిలేకుండా, సూరమ్మను, ఆ యింటిబాధ్యతను తీసుకోలేనేమోనని అధైర్యపడుతుంటే రామశేషు 'క్లిష్టపరిస్థితుల్లోనే మనిషి ఆత్మస్థైర్యం' బయటపడుతుందని, ధైర్యం తెచ్చుకోమ'ని ఓదార్చుతాడు. గతంలోనే బతుకుతూ వర్తమానంనుండి పారిపోయే సూరమ్మను తమతో విశాఖపట్నం తీసుకెళ్ళటమే కర్తవ్యం అన్నాడు. ఇల్లుఅద్దెకు యివ్వటానికి యింటిసామాను సర్దుతూ బీరువా లాకరులోని డాక్యుమెంట్లు సర్దుతూ, వాటిలోని వివరాలు తమకి సమస్యను తెస్తాయని గ్రహించాడు. అత్తగారిని తాను విశాఖపట్నం తీసుకెళ్లి ఉంటే బాగుండేదని భావిస్తాడు. కమల ఆస్తికి వారసత్వంలో ఉన్నక్లిష్టతలను తొలగించే విదంగా లాయరును పిలిపించి సంప్రదించగా, ఆతడు చట్టప్రకారం విచారించి అది ఎవరికీ వెళ్లే అవకాశంలేదని తెలుసుకొని చివరికి పద్మ పేరున రిజిష్టరు చేయాలంటాడు.

విశాఖపట్నంవంటి నగరజీవితంలో తాము ఉద్యోగాలు చేసుకుంటూ తమ పిల్లలు పెద్దచదువులు చదువుకోవటానికి వీలుగా అపార్టమెంట్ అద్దెకు తీసుకొంటారు. సూరమ్మను పిల్లలగదిలో పడుకోబెడితే సూరమ్మ పెద్దపెద్దగా పద్యాలు చదువుతుంటే తాము చదువుకోలేమంటూ పిల్లలు గొడవచేసారు. పద్మకు కోపంవచ్చి అలా చదవద్దని అన్నందుకు సూరమ్మ ఏడుపు లంకించుకొంది. పద్మ పిల్లలను తమగదిలో పడకోపెట్టుకోవటం మొదలుపెట్టింది. కాని రామశేషుకు అది నచ్చేదికాదు. పిల్లలను తమగదిలో పడుకోబెట్టుకోవటంతో రామశేషుకు పిల్లలముందు యింటి విషయాలు మాట్లాడాలంటే యిబ్బందిగా ఉండి మూడుగదులున్నయింటికి మారతారు. పిల్లలముందు అన్ని విషయాలను, సమస్యలను చర్చించి వారికి చిన్నప్పుడే అనవసర విషయాలను తెలియచేయాల్సిన అవసరంలేదని, ఆతని అభిప్రాయం.

సూరమ్మ చిత్తచాంచల్యానికి భయపడుతూ తన తల్లి యిద్దరి పెద్దవాళ్లతో ఎలానెగ్గుకొచ్చిందో, ఎంత బాధపడి ఉండి ఉంటుందో అని పద్మ అంటే, అప్పుడు ఆమెకు నీ తండ్రి సహాయం ఉండేదని అన్నాడు. అంటే యింట్లో మగవాళ్ళ సహాయసహకారాలుంటే వృద్ధులను చూసుకోవటం కష్టంకాదనే అభిప్రాయాన్ని వ్యక్తంచేసాడు. అంతేకాక అక్కడ చుట్టుపక్కలవాళ్ళు తెలిసినవాళ్ళు ఉంటంతో అంత ఇబ్బంది ఉండేదికాదని, 'మీ అమ్మమ్మను ఇప్పుడు కొత్తపరిసరాలు, కొత్తఊరూ, కొత్త యింట్లోకి బదిలీ చేసాంకాబట్టి ఆమె సర్దుకుపోలేక గొడవపెట్టూ అరుస్తోంద'ని చెప్తాడు. 'ఆమె వయసుకు నీ వయసుకుతేడా ఉంది. ఆమె మరి ఎన్నాళ్లోబతకదు. ఓర్పు వహించాలి' అన్నాడు. 'మనం ఆమెను పట్టించుకోవటంలేదనుకొని, తన ఉనికిని గుర్తించటం కోసమే ఆమె అలా హడావుడి చేస్తోంది. ఆ వృద్ధురాలిని అర్థంచేసుకో' అని అన్నాడు. పద్మ దానికి పరిష్కారంలేదా అంటే 'కాలమే పరిష్కారం. ఆమె పిచ్చిదికాదు, అప్పుడప్పుడు మంకుపట్టుతో, తెలివిగాను మాట్లాడుతుందని, చిన్నవాళ్ళచేత చాకరి చేయించుకుంటున్నందుకు, మనసు

బరువుగా ఆమె నొచ్చుకుంటూ ఉంటుంది. గ్రహించు అని అన్నాడు. ఇంట్లోవారు పెద్దలకు సేవచేస్తూ తాము కష్టపడుతున్నామని తమ గురించి మాత్రమే ఆలోచించుకుంటారుగాని వృద్ధులవైపునుడి ఆలోచించగలిగితే బాగుండునని రామశేషు మాటల్లో అర్థమౌతుంది. పద్మ కాలేజికి వెళ్లినా యింట్లో ఏమిగొడవలౌతున్నాయోనని, పిల్లలచదువులు ఏమవుతాయోనని, వృద్ధురాలిని పెట్టుకొన్నందుకు ఆమెతో యింటివాళ్లకు ఏమన్నాయిబ్బంది అయితే యింటివాళ్ళు ఖాళీచేయమంటారో అని ఆమె రోజూ భయపడుతూ ఉంటుంది. అటువంటి అన్ని భయాలతోఉన్న పద్మతో ధైర్యం కోల్పోవద్దని అంటాడు రామశేషు. 'చదువు, సెక్యూరిటి ,భర్త, పిల్లలు వయసు ఉన్న నీవే భయాన్ని అదుపు చేసుకోలేకపోతే, చిన్నప్పటినుండి ఏ ఒక్క సుఖమూ ఎరగకుండా కూతురుతో సహా తనవాళ్ళను పోగొట్టుకున్న ఆమె ఎంత అభద్రతగా ఉంటుందో ఆలోచించి క్రాంతిగా ప్రవర్తించమ'ని కోరాడు. రామశేషు వృద్ధుల మనస్తత్వాలను కాచి వడబోసినట్టుగా చేసిన సంభాషణలు పిల్లలకు, పెద్దలకు ప్రతియింట్లో మనోవిజ్ఞానశాస్త్ర పఠనాంశాలుగా ఉండాలి. సూరమ్మ ఒకరోజు యింట్లో పనిమనిషి లేనప్పుడుచూసి రోడ్డుమీదకు వెళ్లితిరిగి వచ్చిన సూరమ్మచుట్టూ పక్కింటివాళ్లు చుట్టుపక్కలవాళ్లు మూగినందుకు కాలేజినుండి వస్తున్న పద్మ చూసి 'ఏమిటని' అడిగితే, పద్మను ఉద్యోగం మానేసి వృద్ధురాలిని చూసుకోమని సలహా యిచ్చారు. దానితో కోపం వచ్చిన పద్మ తన అమ్మమ్మపై అరుస్తుంటే రామశేషు తొంభైఏళ్ళువచ్చిన ఆమెను కేకలేయవద్దని, వృద్ధాప్యం బాల్యంతో సమానమని పద్మకు చెప్పి సూరమ్మతో అలా ఒంటరిగా వెళ్ళవద్ధని చెప్పాడు. దానికి సూరమ్మ తాను పరాయియింట్లో పడి ఉంటున్నందుకు అంటున్నారని అంటే, 'తాను అలా అనటంలేదని, తాను సూరమ్మకూతురి అల్లుడిగా మనవడ్ని అవుతానని,"మామ్మగారూ!" అని చక్కగా సంబోధిస్తాడు. తామున్న యింటినే కూతురుయిల్లుగా అనుకోమంటే, అలా అనుకోరుకదా అంటే, సూరమ్మ తనకూతురు ఉంటే విసుక్కునేది కాదంది. ఆ తల్లికూతురు ఒకరని ఒకరు విసుక్కోవటం తెలిసినా అతడు

ఆమెనేమి ప్రశ్నించదలచుకోలేదు. తనకూతురుంటే తినుబండారాలుచేసి పెట్టేదన్నట్టుగా సూరమ్మమాట్లాడితే ఆమె జిహ్వాచాపల్యాన్ని గుర్తించిన రామశేషు యికనుండి పద్మకూడాచేసి పెడుతుందని చెప్పాడు, ఉద్యోగంచేసే పద్మకు వీలు అవదని అనుకొని, ఆమెకు హోటల్ నుండితెచ్చిపెడితే సూరమ్మ ఆబగా తినేది. అంటే వృద్ధులకు జిహ్వాచాపల్యం ఉంటుందని తెలుస్తుంది. అంతేకాక, ఆమె బయటకు పోవాలనుకోవటానికి కారణాన్ని తెలుసుకోవాలని భావించి, ఆమె తనవాళ్ళను ఎవరినైనా చూడాలనుకుంటుందేమోనని రామశేషు అడిగితే, ఆమె తనకెవరూలేరని అంది. సూరమ్మ అప్పటినుండి మంచంమీద కప్పువేపుచూస్తూ పడుకొనేది.

పద్మ తనసరదాలను అన్నింటిని చంపుకొని తన అమ్మమ్మను చూసుకుంటున్నప్పటికి సూరమ్మ మళ్లీ ఒకనాడు యింట్లో ఎవరూలేని సమయంచూసుకొని తనపెట్టెలో ఎప్పటినుండో దాచుకొన్న డబ్బును తీసుకొని తనఊరికివెళ్ళింది. ఆమెకోసం వెతుకుతుంటే ఆమె తన వూరికి చేరుకొని తన యింటికి వెళ్లినట్లు ఆ యింట్లోవాళ్ళు ఫోన్ చేస్తారు. రామశేషు ఆమెను తానువచ్చి తీసుకొనివెళ్ళేలోపు ఆమెకు అన్నంపెట్టమని చెప్పాడు. ఆమె వెళ్లిన తీరుకు ,ఆమె సాహసానికి ఆశ్చ్యపోయాడు, కాని ఆమెను ఏమి అనలేదు. పద్మకూడా ఆమెను ఏమి అనకుండా “మామ్మా ఇంకెవరినన్నా చూడాలనిఉందా అని మరిరెండురోజులుందామా!” అని పద్మ అనగలిగేటట్లుగా రామశేషు ఆమెలోని భయాన్ని, కోపాన్ని తగ్గించాడు. సమాజంలో వృద్దులమనస్తత్వాన్ని అర్థం చేసుకోలేనివాళ్ళకు సూరమ్మ వృద్ధాప్యాన్ని ఆసరాచేసుకొని రామశేషుపాత్రద్వారా వృద్ధమంత్రాన్ని ఉపదేశించటం, రామశేషు పాత్రచిత్రణ నవలా శిల్పానికి ఒక పరిపక్వత సంతరింపజేసిందని స్పష్టమౌతుంది.

సూరమ్మ తన ఊరినుండి తిరిగి యింటికి వచ్చినప్పటినుండి నిశ్శబ్దంగా నిర్లిప్తత్తతో ఉంటే రామశేషు ఆమెను డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్ళారు. ఆమెతోకూడా వచ్చిన పద్మ మానసికస్థితికి కారణమైన వత్తిడిని గుర్తించిన

డాక్టరు పద్మకు రెస్టు ఉండేలా చూసుకోమని చెప్పాడు. పద్మచేత నెలరోజులపాటు శెలవుపెట్టి వేరే ఊరికి తీసుకెళ్ళమని సలహా యివ్వటంతో, సూరమ్మను నెలరోజులపాటు ఆమెను వృద్ధాశ్రమంవారిని చూసుకోమని చెప్పి, వారు అడగకపోయినా రామశేషు వేయిరూపాయలను ఆ ఆశ్రమానికి యిచ్చాడు.

పద్మ సూరమ్మను ఆశ్రమంలో వదిలిపెట్టి వేరే ఊరువెళ్ళినా ఆమెనుగురించి ఆలోచనలే వెంటాడేవి. ఇరవైఐదు రోజులకే తిరుగుముఖంపట్టి వచ్చిన పద్మ సూరమ్మపడుకొనే గదిని సర్ది ఆమెను తీసుకువద్ది అనుకొంది. ఈలోపే, ఆమె క్రితంరోజు విరేచనాలతే చనిపోయినట్లు ఆశ్రమంవాళ్ళు ఫోన్ చేసారు. పద్మవాళ్ళ ఫోను కలవనందుకు ఆమెను దహనంచేసినట్లు ఆశ్రమంవాళ్ళు తెలియచేసారు.

సూరమ్మపోయిన ఐదారు నెలలతర్వాత ఆమె యింటిని అమ్మిన డబ్బును తెచ్చి పద్మకిస్తే ఆమె పిల్లలచదువుకు ఉంటుందని బ్యాంకులో వేసింది. రామశేషుపిల్లల చదువుకు తనడబ్బుపనికి రాదా అన్నాడు. పద్మ ఆ డబ్బుతోనే పిల్లలనుచదివించాలని అంది. సూరమ్మకు వచ్చిన మనోవర్తితో కొన్న యిల్లును అమ్మగా వచ్చిన ఆ డబ్బుతోనే రామశేషు, పద్మలకూతురైన సౌజన్య విదేశాలకు బయలుదేరింది.

ఆధునికకుటుంబాలలో ప్రజాస్వామ్య సంస్కృతిని పాటించటాన్ని ఆచరణాత్మకంగా చూపిన రామశేషు పాత్ర గొప్పతనం తెలియాలంటే కుటుంబాలలో ప్రజాస్వామ్య సంస్కృతి ఉండాల్సిన అవసరానికి ఉన్న 20.వ శతాబ్దపు నేపథ్యాన్ని తలచుకోవాలి.

ఆధునికయుగంలో స్వాతంత్ర్యానికి పూర్వంనుండి అంటే 20వశతాబ్దపు స్త్రీలసాహిత్యంలో ప్రతిఫలించినట్లుగా స్వాతంత్ర్యోద్యమ సమయంలో స్త్రీలు కూడా స్త్రీపురుష సమాత్వాన్ని కోరుకొని ఆదిశగా స్త్రీలు ఉద్యమాలు చేసారు. దాని ఫలితంగా భారతదేశ స్వాతంత్ర్యానంతరం వచ్చిన ప్రజాస్వామ్య రాజ్యాంగం స్త్రీపురుష సమానసంస్కృతికి బాటలువేసింది. కాని అది

కుటుంబస్థాయినుండి ఆచరణాత్మకంగా విస్తృతంకావటానికి రామశేషువంటి వాళ్ళ అవసరం ఎంతైనా ఉంది. అతడు కుటుంబ సంబంధాలలోకి ప్రవేశించినప్పటి నుండి స్త్రీపురుషసమానత్వాన్ని ఆచరణలో పెడుతూ, ప్రజాస్వామిక కుటుంబాన్ని అభివృద్ధిచేసాడు. సామాజికకుటుంబాలలో పురుష పరంగా ఆరంభమైన ఆధిక్యసంస్కృతి పురుషులవల్లనే రూపుమాపబడాలి. అప్పుడే స్త్రీపురుషసమానత్వంగల ప్రజాస్వామ్యకుటుంబానికి మనుగడ ఏర్పడుతుందనటం రామశేషు పాటించిన కుటుంబ సంస్కృతిలో ప్రతిఫలిస్తుంది. రామశేషు అన్ని విషయాలలో ఆ దృక్పథంలో ఉండటంవల్లనే అతడు అందరి అభిమానాన్ని పొందాడు. ఏ రకమైన పితృస్వామ్యపు అధికార సంస్కృతి ప్రభావమూలేని కుటుంబంలో పద్మ సమాన, సాధికారికంగా ఉండటానికి రామశేషు కారకుడయ్యాడు, కారణమయ్యాడు. ఆధునిక యుగంలో యవతకు అవసరమైన చైతన్యస్ఫూర్తిని ఇవ్వగలపాత్రగా రామశేషు సదా స్మరణీయుడు.

7) బుల్లన్నయ్య

నవలాంశంలో కొంతవరకు నిలబడగలిగి గోరంతసౌజన్యాన్ని యివ్వగలిగిన పాత్ర సూరమ్మ బుల్లన్నయ్యది. ఆతడు పితృస్వామ్యసంస్కృతిని ఆచరణలో పెట్టటానికి కాస్త ఆలస్యంగా నడుంకట్టి పూనుకున్నాడు. తన చిన్నన్నకు తనకీ అదే తేడా. ఇతనికి తనచిన్నన్నవలె కందుకూరి రాసిన పుస్తకాలంటే గిట్టనితనంలేదు. అప్పుడప్పుడు ఆ పుస్తకాలను చదవటంవల్లనే ప్రేరణపొంది సూరమ్మకు అక్షరాలు నేర్పించాడు. దానిఫలితంగానే సూరమ్మ మామ లైంగికదాడినుండి తననితాను రక్షించుకోగలిగింది. తనజీవనహక్కును నిలబెట్టుకోగలిగింది. సూరమ్మపాత్ర దీనికి స్పష్టమైన ఉదాహరణ. సూరమ్మ వైధవ్యంవల్ల వచ్చిన మనోవర్తిడబ్బును వడ్డీలకుతిప్పి పెంపుచేసి ఆమెకు సొంతయింటిని ఏర్పాటుచేసాడు. కాని మిగిలిన విషయాలలో బుల్లన్నయ్య కూడా అందరిలాగా పితృస్వామ్యసంరక్షకుడిగానే స్పష్టమవుతాడు. అందుకే

చిన్నన్నతో కలిసి సూరమ్మకు తెలియచేయకుండా గోదావరిపుష్కరాలకు అని ఆమెను తీసుకువెళ్ళి నిర్దాక్షిణ్యంగా ఆమెకు గుండుగీయించాడు. అంతేకాదు, పితృస్వామ్య అసమసంస్కృతిని పాటిస్తూ భార్య చనిపోయిన తర్వాత తనకు డెబ్భైఏళ్లువచ్చినా తన కంటేసగంకన్నా తక్కువ వయసుగల పదహేడేళ్ల కన్యను పెళ్లాడాడు. ఆమెను యింటికి తెచ్చినా, ఆమె లైంగికతపై అనుమానంతో సినిమాలకు వెదతానంటే కమలను తోడుగా పంపటంవంటివి చేసేవాడు. చివరకు ఆమెకు అతడుపెట్టిన మొదటిభార్య నగలతో సహా ఆమె వెళ్ళిపోయినప్పుడు యింటిపరువుతీసి పెళ్ళాం లేచిపోయిందనే అవమానపువ్యథతో మంచానపడి తీసుకొని చచ్చిపోయాడు.నిజానికి యింటిపరువు తీయటమనే దానికన్నా తాను సరిగా తనరెండవభార్యపై లైంగిక అదుపును సజావుగా నిర్వహించ లేకపోయాననే అవమానభారంతో చనిపోయిఉంటాడు.

పితృస్వామ్యం పురుషుడిజీవితానికి ప్రాణం.పితృస్వామ్యపు మనుగడ స్త్రీలపై ఉండే లైంగిక అదుపుపై ఆధారపడి ఉటుంది. ఆరకంగా సూరమ్మబుల్లన్నయ్య కాస్తమంచీ,ఎక్కువ చెడూ కలిసినవ్యక్తిగా చీకటిలో సినీవాలివంటి వాడిగా పాఠకుల మనస్సులలో నిలిచిపోతాడు.

8) చిన్నన్నయ్య

సూరమ్మ చిన్నన్నయ్య తన తండ్రి మరణానంతరం పితృస్వామ్యసంస్కృతి పరిరక్షణలో భాగస్వామ్యంగల పౌరోహిత్యపువృత్తి బాధ్యతను వారసత్వంగా అందిపుచ్చుకొన్నాడు. అందుకే స్త్రీలలైంగికతపై అదుపుకు, తనవృత్తికి సంబంధం ఉందనుకొని తండ్రిపోయిన ఏడాదిలోపే ఐదేళ్ళసూరమ్మకు పెళ్ళి చేయాలన్నాడు. పితృస్వామ్యసంస్కృతిలో వారసత్వపు ఆస్తి లేని సూరమ్మకు తొందరగా పెళ్ళిచేసి పరాయి యింటికి పంపించి భారం దించుకోవాలని అనుకొన్నాడు. అంతేకాక సూరమ్మ లైంగికతను నిరంతరం సంరక్షించుకుంటూ ఉండే బాధ్యత తనకు తప్పుతుందనుకొన్నాడు. ఇంట్లోనే

సూరమ్మకు బుల్లన్నయ్య పుస్తకాలనుతెచ్చి యిచ్చేసరికి ఆడపిల్లలకు చదువెందుకని, చదువుకుంటే ఆడపిల్లలు చెడిపోతారని అన్నాడు.

పితృస్వామ్య సంస్కృతిని తూ.చ. తప్పకుండా ఆచరణలో పెట్టే ఆధిక్యవివక్షా సంస్కృతిగల స్వార్థపరుడు. పెళ్లి అంటే తెలియని ఏడేళ్ళునిండిన సూరమ్మకు పెళ్ళిచేసాడు. కాపురానికి వెళ్ళకమునుపే చిన్నపిల్లయైన సూరమ్మ భర్తమరణిస్తే, నాలుగు రోజులకే ఆమెకు జుట్టుతీయించి గుండుగీయించాలని అంటాడు. కాని సూరమ్మ యింకా చిన్నదని ఆ కార్యక్రమాన్ని బుల్లన్నయ్య వాయిదా వేయిస్తాడు. సూరమ్మ రజస్వలానంతరం చిన్నన్నయ్య తన పౌరోహిత్యపు వృత్తిలోని తోటివాళ్ళు తనను జుట్టున్న వెధవముండను యింట్లోపెట్టుకొని శాస్త్రాలు వల్లిస్తే పనికిరాదనేసరికి, తానుచేసేవృత్తికి భంగంకలగకుండాను, పితృస్వామ్యాన్ని రక్షించాల్సిన బాధ్యత తమమీద ఉండటంచేత చిన్నన్నయ్య బుల్లన్నయ్యతో కలిసి సూరమ్మకు చెప్పకుండా ఆమెను గోదావరి పుష్కరాలకని తీసుకొని వెళ్ళి ఆమెకు గుండుచేయించి ఆమెను జీవచ్ఛవాన్ని చేసిన కర్కోటకుడు.

పితృస్వామ్యం తనఆధిక్యతను నిలుపుకునే క్రమంలో శాస్త్రాలు, సంప్రదాయాల రూపంలో ఉండేటట్లుగా చేసిన పితృస్వామ్యసంస్కృతిని పకడ్బందీగా అమలుచేయించే బాధ్యతను అంటగట్టటానికే పురోహితవర్గం వారికి అగ్రహారాలవంటి భూములను యిచ్చి సత్కరించేది.

సూరమ్మవంటి బాలవితంతువులు ఎవరైనా కఠిన వైధవ్యపుసంస్కృతిని పాటించాల్సిందే. వితంతువు తన గురించి తాను ఆలోచించుకోవటానికి సమయం చిక్కనంతగా వారికి తీరికలేకుండా చేసే పనిసంస్కృతిని ఆచరణలో పెట్టింది. అందుకే సూరమ్మ ఒకనాడు పనిని తొందరగా పూర్తిచేసి, మధ్యాహ్నసమయంలో బుల్లన్నయ్యతెచ్చే కందుకూరివారి పత్రికలను, పుస్తకాలు చదువుతుంటే, చిన్నన్నయ్య చూసి అటువంటి అప్రాచ్యపు పుస్తకాలు చదివితే ఆడవాళ్ళు చెడిపోతారంటాడు. వాటిలోని స్త్రీవిద్య, వితంతు పునర్వివాహాన్ని గురించి రాసిన వ్యాసాలు చదివితే ఆడవాళ్లు

పనికిరాకుండాపోతారని, అప్పుడు పితృస్వామ్య ఆధిక్యసంస్కృతిని ఆచరణలో పెట్టటం కష్టమవుతుందనీ చిన్నన్నయ్య ఆవేదన.

తల్లిప్రసవ మరణాంతరం పుట్టిన పసిపిల్లను అవాంఛనీయంగా అందరూ వదిలేస్తే సూరమ్మ తన చిన్నక్క మనుమరాలైన ఆ అనాథపిల్లను తాను పెంచుకుంటానంటే, చిన్నన్నయ్య వద్దంటాడు. కొడుకైతే తలకొరివి పెడతాడుగాని,ఆడపిల్లను పెంచుకొని ఏమిచేస్తావని అంటాడు. పితృస్వామ్య సంస్కృతి భావాలను రంగరించుకొని ఎదిగి, దాని ప్రచార బాధ్యత గల వ్యక్తిగా ఆతడు ఆడపిల్ల అవాంఛనీయం అనుకోవటంతో, అలా మాట్లాడాడు. ఇటువంటి వాళ్ళవల్లనే సమాజంలో ఆడపిల్లపుట్టుకను నిరసించే భావాలు అభివృద్ధిచెందాయి. పితృస్వామ్యం అజేయంగా కొనసాగుతూంది. స్త్రీల జీవనహక్కులను హరింపజూసాయి. పద్దెనిమిదేళ్ళ సూరమ్మ దత్తకూతురు రాత్రిళ్ళు నిద్రపోకుండా ఏడుస్తుంటే ఆ పిల్ల పెంపకంలో భాగంగా రాత్రిళ్లు సూరమ్మ అన్నం మానేస్తుంది. దానికి సూరమ్మ వితంతువుగా ఏకభుక్తమనే సంస్కృతిని పాటిస్తోందని ఆమె చిన్నన్నయ్య ఎంతో ఆనందించాడు. తిండి విషయంలోకూడా ఆంక్షలు, నిబంధనలుపెట్టి స్త్రీలను ఆరోగ్యకరంగా పెరగనీయలేదు. ఇటువంటివే మెల్లమెల్లగా వితంతుస్త్రీలను శక్తి హీనంచేసే ప్రయత్నాలు.

సూరమ్మతన సొంతగూట్లో ఉన్నప్పుడు తీరికచేసుకొని ఖద్దరు జాతీయోద్యమంలో భాగంగా నూలువడికి, ఖద్దరు వస్త్ర తయారీచేసి అందరివలె యిటింటికి వెళ్ళి ఖద్దరును అమ్మేతుంటే, అలా చేయటం ఇంటి సాంప్రదాయం కాదని, పరువుప్రతిష్ఠలు మంటగలుస్తాయని, సూరమ్మ కూతురుకు పెళ్ళికాదని భయపెట్టాడు. చిన్నన్నయ్య పితృస్వామ్యదృష్టి పరాకాష్ఠస్థితికి చేరుకొన్నది. ఆఖరికి దేశసేవకు స్త్రీశక్తిని వినియోగపడేందుకు కూడా వీలులేకుండా చేస్తూ ఆడపిల్లపెళ్ళికి, యింటి సంప్రదాయానికి సంధానపరచి మాట్లాడుతుంటే చిన్నన్నయ్య ఒక స్త్రీద్రోహిగా, దేశద్రోహిగా స్పష్టమౌతాడు. అయితే ఆ పితృస్వామ్యసంస్కృతే ఆతడిని కాటేసింది. అతని

కొడుకులే అవసానదశలో చూడలేదు. ఆడపిల్లగా సూరమ్మను కష్టపెట్టినందుకు పశ్చాతప్తుడవుతాడు. అతడు చచ్చిపోవటం సమాజంలో వితంతుస్త్రీలపాలిటి అమానవీయతాపాలు తగ్గటమే. వితంతువైన సూరమ్మ యింట్లోనే వెలివేయబడి ఆమెకు గౌరవంగా బతికే జీవనహక్కును లేకుండా చేసేవిధంగా పితృస్వామ్యసంస్కృతిని ఆచరించిన చిన్నన్నయ్య లాంటివారు సమాజంలో స్త్రీలపాలిటి మృత్యుదేవుళ్ళు.

ఈ నవలలో సందర్భానుసారంగా కనపడిన పాత్రలన్ని వ్యక్తిత్వంలేనివారుగా పితృస్వామ్య సంస్కృతికి సామాన్య ప్రతినిధులుగా కనపడినా సూరమ్మయొక్క మామవంటివారు మరికాస్తఎక్కువగా ఆ ఆధిక్యసంస్కృతితో లైంగికప్రయోజనాలను పొందాలనుకొన్నారు. ఆతరానికి చెందిన సూరమ్మతల్లికి, సూరమ్మకు పితృస్వామ్యసంస్కృతిని పాటించటంలో పెద్దతేడా కనపడదు. ముఖ్యంగా చిన్నపాత్రగా నవలావస్తువులో కొంతనిడివి తక్కువ ఉన్న పాత్ర అయినా బుల్లన్నయ్య అసమవయోవివాహ ఫలితాలను సమాజం గుర్తించేలా చేసింది.

ఈ నవలా రచయిత్రి శ్రీమతి మాలతీచందూర్ తనరచనోద్దేశ్యానికి, ఆశయ సాధనకు తగ్గ ఫలితాలను రాబట్టే క్రమంలో కథావస్తువులోసామాజిక వ్యక్తులకు నమూనాగా ఆయా సంఘటనలలో, సందర్భాలలోనుంచి పుట్టిన పాత్రల చర్యలు, ప్రతిచర్యలలో ఆయాపాత్రలనడక, నడతలద్వారా పాఠకులు తెచ్చుకోవలసిన చైతన్యంఉట్టిపడేలా రచనసాగింది. వారివారి స్వభావాలను, అంతర్గతమానసిక సంక్షోభాన్ని వ్యక్తంచేస్తూ సామాజిక సజీవపాత్రచిత్రణ చేయటంవల్లనే రచన శాశ్వతమైన సాహిత్యచైతన్యాన్ని యివ్వగలిగింది. గతశతాబ్దంలో జరిగిన సాంస్కృతికపరిణామ స్రవంతిని ప్రతిఫలించే రచనలో పాత్రచిత్రణ ప్రముఖపాత్ర వహిస్తుంది. భూస్వామ్యవ్యవస్థకు ఆయువు పట్టువంటి పితృస్వామ్యంలో గతశతాబ్దపు ప్రారంభంలో పుట్టిపెరిగిన సూరమ్మ మొదటితరానికి చెందిన వ్యక్తిగా ఆ పితృస్వామ్యసంస్కృతికి నమూనాపాత్ర. అటు పాతతరానికి ఇటు పెట్టుబడిదారివ్యవస్థలోని

ఆధునికయుగ సంస్కృతికి మధ్యకాలంలో జీవించి విద్యావంతురాలైన కమల ఆ పితృస్వామ్యసంస్కృతి స్వభావాన్ని విశ్లేషణపెట్టి, వివక్షాసంస్కృతిని అధిగమించే చైతన్యాన్ని పొంది ఒకసంధియుగసంస్కృతికిప్రతీకగా నిలిచింది. అదే ఉన్నతచదువులు చదివిన పద్మ ఆధునికయుగంలో కూడా పితృస్వామ్యం కొనసాగుతుండటంతో, దాన్ని ప్రశ్నకుపెట్టి ప్రజాస్వామ్యసంస్కృతికి కరదీపికగా పద్మపాత్ర పరిపుష్టం చెందింది. గతశతాబ్దపు చివరివరకు సూరమ్మజీవించిందంటే సామాజిక ఆచరణలో పితృస్వామ్యసంస్కృతి సజీవంగా ఉందనే అనుకోవాలి. అత్యాధునికపరిణామంగా వచ్చినమార్కెట్ శక్తుల ఆర్థికపెట్టుబడివిధానమైన ప్రపంచీకరణ ప్రభావంతో విదేశీచదువులకై ఒంటరిగా ఆడపిల్ల అమెరికాప్రయాణానికి సంసిద్ధురాలవటం పరిపూర్ణ ప్రజాస్వామ్య సంస్కృతిలోని స్త్రీ స్వేచ్ఛాచిహ్నంగా భావించాలి.

అటువంటి రచయిత్రి ఆశయానికి నమూనా సౌజన్యపాత్రచిత్రణ. ***గతశతాబ్దకాలంలో పరిణామశీలతగల సాంస్కృతికస్రవంతికి ప్రాతినిధ్యం వహించిన పాత్రల సమ్మేళనమే 'శతాబ్దిసూరీడు'.*** ఈ నవలారచన తరతరాల సాంస్కృతిక చరిత్ర. పదాల పోహళింపుతో చెక్కినసజీవ సాహిత్య చైతన్యశిల్పాలలో ప్రతిబింబించిన గతశతాబ్దపుసాంస్కృతిక చరిత్ర ఈ'**శతాబ్దిసూరీడు'.**

7. నవల -సాహిత్యచైతన్యం

సామాజికచైతన్యం సాహిత్యప్రధాన లక్షణం.అప్పుడే అది ప్రయోజనకర చైతన్యాన్ని యివ్వగలుగుతుంది. ప్రాచీనలాక్షణికులు వ్యవహారజ్ఞానాన్ని ఒక కావ్యప్రయోజనంగా చెప్పారు. అయితే అది కాంతాసమ్మితంగా ధ్వనిపూర్వకంగా ఉండాలనేసరికి సమాజంలో ఆధిక్య సంస్కృతితో వ్యవహరించే వారి వర్గ ప్రయోజనంగా ఉంది. కాని ఆధునికయుగంలో వచ్చిన సామాజిక, ఆర్థిక, రాజకీయపరిణామాల ఫలితంగాఏర్పడిన ప్రజాస్వామ్యంలో పెరిగిన అభివృద్ధికర ఆలోచనలు, సాహిత్యం కాంతా సమ్మతంగా ఉంటే మానవసంబంధాలను పటిష్ఠపరిచే దిశగా సామాజికప్రయోజనాన్ని సాధించగలుగుతుందని భావించటంజరిగింది. ఆ సామాజిక ప్రయోజనం సిద్ధించాలంటే సాహిత్యం సహృదయపాఠక చైతన్యాన్ని కలిగించగలగాలి. ఆ చైతన్యాన్ని కలిగించటానికై రచన దోహదంచేయాలంటే రచయిత చారిత్రకగమనంలో మానవనాగరికతా వికాస చిత్రణ చేయాలి. నాగరికత సాంస్కృతిక జీవనవిధానానికి దర్పణం. అందుకే ఆయాకాలాల చరిత్రలో స్త్రీపురుషజీవన విధానచిత్రణ ప్రముఖపాత్ర వహిస్తుంది. సామాజికజీవనంలో పురుషసంస్కృతి స్త్రీలు పాటించిన సంస్కృతిని గురించిన అవగాహన అవసరం. ఆ సామాజిక సంస్కృతి అలా ఆచరణలో ఉండటానికి దోహదంచేసిన సామాజిక, ఆర్థిక, రాజకీయాలను అర్థంచేసుకొనే క్రమంలో, దానికున్న ఆధిక్యస్వభావం అర్థమై, స్త్రీపురుషసంబంధాలలో వివక్షాసంస్కృతి చోటుచేసుకోవటం జరిగింది. ఆ కారణంగానే అసమసమాజం ఏర్పడింది. దానివల్ల మానవసంబంధాలు విచ్ఛిన్నమై మానవజాతి ప్రగతినిరోధక సమాజంగా మారింది. దానిపరిణామంగా ఆధునికయుగంలో కుటుంబనిర్మాణం బీటలువారటం మొదలైంది. స్త్రీపురుషసంబంధాలకు నిలయమైన కుటుంబనిర్మాణసంస్కృతిని స్త్రీపురుషసమానత్వ ప్రాతిపదికన పునర్నిర్మాణం చేసుకోవాల్సిన అవసరం

ఏర్పడిన సందర్భంలో ఆసంస్కృతి పూర్వాపరాలవిశ్లేషణ జరిగాలి. అది ఎంత అమానవీయతను సృష్టించిందో గ్రహించగలగాలి. అప్పుడు అసమాన సంస్కృతి తిరస్కారానికి గురికాకతప్పదు.

అసమానసంస్కృతిని అధిగమించే జీవనవిధానాన్ని ఎన్నుకుంటే, అది కుటుంబాల సాముదాయక సామాజికసంస్కృతిని పెనుమార్పులకు గురిచేసి, మానవసంబంధాలు మరింతగా బలపడేటట్లు చేస్తుంది. కాబట్టి సమాన నైతికత గల సమానత్వసంస్కృతిగల కుటుంబాలు ఏర్పడాల్సిన అవసరం కలిగింది. అయితే పనికట్టుకొని ఊకదంపుడు ఉపన్యాసాలతో అది సాధ్యంకాదు. దాని సాధనకై, కుటుంబంలోని స్త్రీపురుషులమధ్య ఉన్న అన్ని సంబంధాలు ఆధిక్యసంస్కృతికి అద్దంపట్టినట్లుగా అవగాహనను ముందుగా కల్గించి, సమాజంలో ప్రజాస్వామిక కుటుంబనిర్మాణదిశగా ఆడుగులువేసే చైతన్యాన్ని అందించటానికై పూనుకొని చేసిన రచన ***శతాబ్దిసూరీడు***. అయితే ఆచైతన్యం స్థూలరూపంగా కనపడినా ఆయా సామాజికక ఆర్థికపరిస్థితుల నేపథ్యాలలో కుటుంబాలలో జరిగే ప్రతి సంఘటనలో వ్యక్తులు ప్రవర్తించిన తీరులోను, వారి స్వభావాలు వెలికివచ్చే వారిసంభాషణలలోను ప్రతిఫలించిన హేయమైన పీడనాసంస్కృతి పరిణామశీలతను సంతరించుకోవాలి. అది ప్రజాస్వామ్యపు మార్గంలోకి మళ్ళగలిగితేనే, మానవసంబంధాల అభివద్ధికారకం అవుతుంది. అట్టి స్పృహను కలిగించే వ్యూహరచన ఈ **శతాబ్దిసూరీడు**. అందుకే యిందులో ప్రధానంగా సాంస్కృతికపరిణామ స్రవంతి ముందుకెడుతూ, పీడనను వదిలించుకొని స్త్రీపురుషసమానత్వంగల ప్రజాస్వామ్యమార్గంలోకి తోవను చూపుతుంది. దానిని అర్థంచేసుకోవటానికి ముందుగా తగిన సాంస్కృతికస్పృహ కలగటం అత్యవసరం. అప్పుడే అదిచైతన్యస్వభావాన్ని సంతరించుకుంటుంది. ఈ చైతన్యస్పృహను కలిగించగలిగిన రచనా సంవిధానం నిండిన రచన ఇది. అందుకే సూరమ్మ నాలుగోతరానికి చెందిన మునిమనుమరాలి చూపులు భవిష్యత్తువైపు చూస్తున్నాయి అంటూ కథాప్రారంభం జరిగింది.''శతమానం

భవతి'' అనే దీవనలతో తొంభైఅరేళ్ళపాటు జీవించిన సూరమ్మపాత్ర పరిచయం అయింది. అంటే ఒకహేయమైనసంస్కృతి పరిణామం చెంది హిత సంస్కృతిగా మార్పును సంతరించుకోవటానికి దాదాపు నూరేళ్ళు పట్టిందని అద్దంలో చూపబడింది.

ప్రారంభంలోనే సూరమ్మతండ్రి మరణానంతరం పితృస్వామ్య సంస్కృతిలోని వివక్షతను, దానివికృతస్వభావాన్ని పరిచయంచేయటం రచనోద్దేశం స్పష్టమై, ముందుముందు దానిని సమగ్రంగా అవగాహన చేసుకొనే చైతన్యక్రమానికి నాంది పలకటం స్పష్టమౌతుంది. అందుకే తల్లి వికృతరూపానికి చిన్నపిల్లఅయిన సూరమ్మ భయపడుతుంది. తల్లికూతుళ్ల మధ్య ఉండే సహజసంబంధాలలో ప్రకృతివిరుద్ధ పరాయికరణ చోటుచేసుకున్నప్పుడు ఆసంస్కృతిలోని పొసగనితనం గురించి ఆలోచించే చైతన్యం ఏర్పడుతుంది. పితృస్వామ్య వివక్షాసంస్కృతి స్త్రీల అస్తిత్వపు విలువలను పోగొడుతూ వారిలో నిరంతర భయాన్ని కలిగిస్తూ శరీరాలను, మనసులను నియంత్రిస్తుందని అర్థమై, ఆర్ద్రతతో మనసు అల్లకల్లోలమై పాఠకులు తమలోకి తాము చూసుకొనేటట్టుచేయగలుగుతుంది. అంతేకాదు, స్త్రీలు అటువంటి సంస్కృతికి బలి అవటానికి కారణం, దాన్ని ఎదిరించే ధైర్యం స్త్రీలకు లేకపోవటానికి పురుషాధిక్యత కారణమనే స్పృహ కలుగుతుంది. పితృస్వామ్యం తన ఆధిక్యతా బలాన్ని స్థిరీకరించుకోవటానికి స్త్రీలను ఎప్పటికప్పుడు భయోత్పాతాలకు గురిచేస్తూ వారిలో అధైర్యాన్ని కలిగిస్తుంది. స్త్రీలకు పుట్టుకతోవచ్చిన సహజభూషణంవంటి జుట్టును బలవంతంగా శాశ్వతప్రాతిపదికన తీయించటం శిరచ్ఛేదనంతో సమానం అని అవగతం అవుతుంది. అటువంటి మహిళలనుపీడించి, వేధించే సంస్కృతి పాఠకుల మనసులలోతుల్లోకి చొచ్చుకొని ఆకత్తితోనే కారకులను కోస్తేగాని పీడాపోదని కసి పుడుతుంది. వితంతు స్త్రీలను కట్టుబాట్లతో సంస్కృతీ చట్రంలో బంధించి యింటిచాకిరీకి, అశుభకార్యాలకు పరిమితం చేయటం స్పష్టంగా పాఠకుల హృదయాలను తాకుతుంది. మానవీయ

కుటుంబ సంబంధాల ఆవశ్యకతను మనసుకు హత్తుకునేటట్లు చేసిన రచన యిది.

చిన్నప్పుడు చదువుమీద ఉన్నమక్కువతో అన్నయ్యనేర్పిన అక్షరాలతో పెద్దబాలశిక్షకు, నీతికథలకు పరిమితమైన చదువును సూరమ్మ కొనసాగించే పరిస్థితిలేకపోయినా, ఆ పాటి విజ్ఞానంతోనే తనకు పునర్వివాహం అన్నా జరిగితే బాగుండునని ఆమెకు అనిపించినా, దానికి ఆటంకంగా కరుడు గట్టిన పితృస్వామ్యం, వికృతసంస్కృతిని ఆచరణలో పెట్టిందన్నవిషయం అర్థమవుతుంది.

అక్షరజ్ఞానంగల సూరమ్మ చుట్టూ నిఘాగా ఉన్నపితృస్వామ్య పరిసరాలలో, వీరేశలింగంగారి పత్రికలను ఒంటరిగా దొంగచాటుగా చదువుకోగలిగే స్థితిలో ఆమె ఉండటంతో ఆమెలో కలిగిన చైతన్యస్పృహ కార్యాచరణలోకి రాలేకపోయింది. అయితే ఆ అక్షరజ్ఞానమే ఆమెను లైంగికదాడినుండి తననితానురక్షించుకొనేటట్టు చేసింది. ఆ సందర్భంలో సూరమ్మ నీతికథలను చదువుకొనేటట్టుగా బుల్లన్నయ్యచేసిన గోరంత సహాయమే సూరమ్మజీవన హక్కును కొనసాగించిందనే స్పృహ కలుగుతుంది.

సూరమ్మ పెంచుకొన్నకూతురైన కమల జీవితంలో వైవాహికసంస్కృతి 'స్త్రీలది మట్టిబుర్ర అని, ఆమెకు తెలివి లేదని, ఆఖరికి భర్తతో సమానంగా నడవకూడదని, ఆతనికి వెనకగానే నడవాలని 'నిర్దేశించిన పితృస్వామ్య సంస్కృతితో పాటు స్త్రీలను లైంగికహింసకు గురిచేయటం, ఆమెను చదువుకోనీయకుండా ఆమె లైంగికతను అదుపుచేయటం గ్రహింపుకు వస్తుంది. పితృస్వామ్య ఆధిక్యసంస్కృతి యువతలో సున్నితత్వాన్ని లేకుండా చేసినందుకు స్త్రీలు పితృస్వామ్యకుటుంబాన్ని అసహ్యించుకొనేటట్టు చేసిందని అర్థమౌతుంది. భార్యాభర్తసంబంధాలలో సమస్థాయీ సంబంధాలులేక అది కుటుంబసంస్కృతిని స్త్రీలు అధిగమించేటట్టుగా చేసి మార్పును సంతరించుకొందని అర్థమై, సమాజం బీటలు వారటం స్పష్టమై దాన్ని

బాగుచేసుకోవాలనే దిశగా సాగాలనే స్పృహ ఏర్పడుతుంది. అయితే అటువంటి పరిస్థితులలో స్త్రీలునిస్సహాయస్థితిలో ఏడుస్తూ కూర్చుంటారనేది పితృస్వామ్యపు అపోహ. దానిని తలకిందులుచేస్తూ స్త్రీలు చైతన్యవంతులై మహిళలు ఆగిన తమ చదువును కొనసాగించగల పట్టుదలను పెంచుకోవాలని, ఉపాధిని పొంది ఆర్థికంగా తమ కాళ్ళమీద తాము నిలబడగలమనే చైతన్యాన్ని ఈ నవల కమల పాత్రద్వారా యివ్వగలిగింది.

ఆనాడుస్త్రీలను చదువుకోనీయకపోయినా సూరమ్మ చిన్నక్క బొంబాయిలాంటి పట్నాలలో కొడుకుల యిళ్ళకు వెళ్ళినప్పుడుపొందిన సంచారజ్ఞానంతోనే ఆడపిల్లచదువుకు ఉన్న విలువ అర్థమై తన మనమరాలైన పద్మచదువులకు బీమాచేయటం, తరతరాల మహిళలవిద్యాభివృద్ధికి అది పెట్టుబడి కావటం అర్థమై, ఆడపిల్లల ఉన్నతచదువులకై ముందునుండి ఆర్థిక ప్రణాళిక వేసుకొనే చైతన్యాన్ని యివ్వగలిగింది.

స్త్రీలకు ఆస్తివారసత్వపులేమి, ఆమె ఆహారానికై పుట్టింట్లోచాకిరిచేసే కూలిగా ఆమెను పరిమితంచేసిన అసమస్వార్థసంస్కృతి అవగాహనకు వస్తుంది. స్త్రీలకు ఆస్తివారసత్వం లేని వివక్షాసంస్కృతి అర్థమవటానికి వితంతువును మనోవర్తిని అడుక్కొనే స్థితిలో ఉంచిందని అర్థమవుతుంది. అత్తగారింట్లో అగచాట్లుపడే స్త్రీలు పితృస్వామ్యపు కాలిగోకుడు రూపంలో మామచేసిన లైంగికదాడికి గురై, కారుకూతలను భరించాల్సివచ్చిందనే అవగాహన ఏర్పడినప్పుడు, చదువుతున్న నవలను మధ్యలో ఆపి అక్కడకువెళ్ళి అవతలివ్యక్తుల తల పగలగొట్టాలనిపిస్తుంది. కాని దాని పరిణామఫలితంగా పితృస్వామ్య సంస్కృతి వేగాన్ని పెంచుకొని సూరమ్మను వికృతంగా చేసిందనే గ్రహింపు కలిగితే దాన్ని తన్ని తగలేయాలనిపిస్తుంది. సూరమ్మనుచాకిరికోసం పుట్టింటివారు యింట్లో ఉండనివ్వకపోతే ఆమెకు చావే శరణ్యమనేస్థాయికి పితృస్వామ్య వివక్షాసంస్కృతి ఆమెను తీసుకెళ్ళిందని ఆమెమాటల్లోనే అర్థమవుతుంది.

పితృస్వామ్యసంస్కృతి ప్రభావంతో పెరిగిన స్త్రీలుకూడా సూరమ్మ మనోవర్తిడబ్బుకై మోసం చేయాలనుకోవటంలోని ఉద్దేశ్యం స్త్రీలకు సొంతసంపద, యింట్లో ఆర్థికస్వేచ్ఛ లేనితనాన్ని స్ఫురింపచేస్తుంది. పుట్టింటివారికి భారం కాకుండాను, తనతదనంతరం స్వీయపోషణ చేసుకోవటానికి గాని గోరంతసహాయసహకారాన్ని అందిస్తూ సూరమ్మ బుల్లన్నయ్య ఆమెకొక సొంతగూటిని ఏర్పడేటట్టుచేయటం చైతన్యస్పృహకు మైలురాయివంటిది. సూరమ్మ వైధవ్యానికి పణంగా వచ్చిన మనోవర్తి రూపంలోని డబ్బు అవాంఛితంగా భావింపడిన, ఒకఆడపిల్ల పుట్టుకకు వారసత్వ సంపదగా మార్పుచెందటం జరిగిందనేది అర్థమౌతుంది. సమాజంలో ఆడపిల్లపుట్టుకను అందరూ ఏవగించుకొటే సూరమ్మ మానవీయత తరతరాల స్త్రీజాతి అభివృద్ధికి సోపానమయిందనే స్పృహకలిగి ఆడపిల్లపుట్టుకకు విలువ ఉందనే చైతన్యాన్ని యివ్వగలిగింది.

పితృస్వామ్యం స్త్రీలకు ఆస్తివారసత్వమంలేకుండా చేసిందని, స్త్రీధనంగా భావింపబడే ఆమెపెళ్ళినాటి నగలమీదకూడా కొడుకులు తమకు వారసత్వం ఉంచటంకోసం ఆమె తన భర్త తదనంతరం కొడుకులమీద తిండికి ఆధారపడేస్థితిలో ఆమెను ఉంచిందనే అవగాహన కలుగుతుంది. వాళ్ళుసరిగా తిండిపెట్టకపోయినా, తాము పాలిచ్చిపెంచిన కొడుకులే తమ జీవనయానాన్ని ముక్కలుచేయగలరని, వారికికూడా కూడాభయపడుతూ బతుకును వెళ్ళదీసుకొనే స్థితిలో స్త్రీలను ఉంచిందనే అవగాహన ఏర్పడుతుంది. తరతరాలకు భయాందోళనలను గురిచేసే ఈ పురుషాధిక్య సంస్కృతి స్వభావం అర్థమై, దాన్ని పుట్టకీళ్ళతోసహా పెకిలించాలనే స్పృహకలుగుతుంది.

పితృస్వామ్యసంస్కృతిని స్త్రీలప్రగతికి జీర్ణింపచేయటంచేత వాళ్లుకూడా మగవాడి పుట్టుకకు విలువున్నదనే భ్రమతో కుటుంబంలో పురుషపరమైన బంధుత్వంతో తమనితాము అధికారవర్గంగా భావించుకోవటం అనేది అజ్ఞానమని, అది స్త్రీలకు కంటకప్రాయమనే చైతన్యం చిన్నక్క పాత్రద్వారా

కలుగుతుంది.. కొడుకుతల్లిగా కుటుంబంలో స్త్రీ తాను అధికారాన్ని చెలాయించాలనని అనుకొనేటట్లుగా చేయటమే అత్తాకోడళ్ళమధ్యన పొసగని శత్రుపూరితసంబంధాలు ఏర్పడేటట్లుగా చేసిందని, ఆ విధంగా పితృస్వామ్యసంస్కృతిని ప్రశ్నించనీయకుండా చేస్తుందనేదికూడా స్ఫురిస్తుంది. స్త్రీలమధ్య ఐక్యత పెరిగితేనే దానికి విరుగుడు ఉంటుందనే స్పృహకలుగుతుంది. కొడుకుపుట్టుకకు విలువ ఉందనే సంస్కృతిని అనుసరించి మగపిల్లవాడిని గారాబంచేస్తూ ధృతరాష్ట్రప్రేమతో పెంచితేవాడు చదువుచట్టులేకుండా జులాయిగా తిరుగుతాడని, స్త్రీలంటే గౌరవంలేక ఆమెనొక లైంగికవస్తువుగా భావించటం, ఎన్నిపెళ్ళిళ్ళయినా చేసుకోవటం సత్యంపాత్రవల్ల అర్థమై, సమాజంలో తల్లులు మగపిల్లలను నిక్కచ్చిగా పెంచాలనే చైతన్యాన్ని యిస్తుంది. భర్తనే తలచుకుంటూ, భర్త కలకాలం జీవించాలని చేసే నోములను నిర్దేశించి, నిరంతరం స్త్రీలను తమని తాము ఆలోచించుకోనీయకుండా చేస్తున్న పితృస్వామ్య సంస్కృతిలోని మాయాజాలం, డొల్లతనం అర్థమై అర్థాంతరంగా వాటిని కొనసాగనీయకుడా చేయాలనే స్పృహ కలుగుతుంది. ఇలాంటిదే స్త్రీలు తమ భర్తల ఆయుష్యుకై గుళ్లు, గోపురాలచుట్టూ తిరగటంకూడా అని అర్థం అవుతుంది.దీనికి మద్దతుగా ఇటువంటి ఆలోచనలు స్వాతంత్ర్యానికి పూర్వమే స్త్రీలలో అభివృద్ధిచెందినట్లుగా ఆనాటిసమాంతర స్త్రీలసాహిత్యం ప్రతిఫలింపచేసింది.

స్త్రీ తన రక్తం ధారపోసి కన్న సంతానంమీదకూడా ఆమెకుహక్కులేదనే వాదన కొడుకుతల్లిగా సత్యంతల్లి మాటల్లో తెలిసి పాఠకులు పితృస్వామ్యకుటుంబంలోని ఆ ఆటవికన్యాయంపట్ల తగిన చైతన్యం తెచ్చుకోగలుగుతారు.

అదేమేరకు ఆస్తిని కావాలనుకుంటారుగాని ఆ కొడుకులు ముసలి తల్లిదండ్రులను పట్టించుకోరని తరతరాల కుటుంబాల అనుభవాలు తెలియచేస్తున్నా, పితృస్వామ్య మాయాజాలం నుండి స్త్రీలు

బయటపడలేనంతగా వారిలో ఆ సంస్కృతి జీర్ణించుకుని ఉందనే స్పృహకలిగి స్త్రీపురుషసమానత్వదిశగా అడుగులువేయించే చైతన్యం కలుగుతుంది.

కమల కాలాన్ని వృథాచేయకుండా చదువుకోవటంవల్లనే పోషింపబడే స్థితిలో ఉండకుండా ఉద్యోగం చేసుకునే స్థితికి చేరుకుందని, అప్పుడే స్త్రీలలో ఆత్మవిశ్వాసం పెరిగి ఆత్మగౌరవంతో బతకగలరని కమలపాత్ర సామాజిక చైతన్యాన్ని కలగచేస్తుంది. ఆధునికకాలంలో స్త్రీలు కాలాన్ని వృథా చేయకండని స్వాతంత్ర్యానికి పూర్వమే స్త్రీలసాహిత్యం ఘోషించింది. స్వాతంత్ర్యానంతరకాలంలో స్వేచ్ఛసమానత్వ భావనలు ఏర్పడటంతో యువత తొందరగా ఆధునికమార్పులను అందిపుచ్చుకుంటుందని, వాళ్లు చదువుకుంటూ బాధ్యతాయుతస్వేచ్ఛను అనుభవంచగలుగుతుంటే ఆడపిల్లలైనా వారిని నియంత్రిచాల్సిన అవసరంలేదని పద్మ పెంపకంలోని కమల భావాలలో అర్థమౌతుంది. అందువలన ఆధునికయుగంలో పిల్లలకు కొన్ని విషయాలలో స్వేచ్ఛనివ్వాలని అర్థమౌతుంది. కన్నపిల్లలమీదకూడా ఆధిక్యసంస్కృతికి చోటు ఉండకూడదనే అభిప్రాయాన్నికలిగిస్తుంది.

అనాదిగా వ్యక్తిగత ఆస్తి అభివృద్ధిచెంది సంపదలు పోగయిన క్రమంలోనే పితృస్వామ్యం ఏర్పడిందనేది ఒకచారిత్రకస్పృహను కలిగించి అంటే భూస్వామ్యఉత్పత్తిపై రక్షణక్రమంలో పనివిభజనలో భాగంగాపురుషుడికి సంపదపై స్వామ్యం ఏర్పడి ఆ ఆర్థికతయే పితృస్వామ్యానికి కారణమైన చక్రభ్రమణంలో ఆర్థికత తలకిందులయినప్పుడే పురుషాధిక్యత, పురుషాహంకారం తగ్గుతాయనే స్పృహ పెరుగుతుంది. మరోపక్కన స్త్రీల ఆర్థికస్వావలంబన కలిసి వెరసి పురుషాధిక్యతకు విరుగుడు మందు అవుతుందనే స్పృహను సత్యం పాత్రకలిగిస్తుంది. తల్లిపై పెత్తనంచూపించిన వాడు తల్లికి సేవచేసే స్థితిలోకి వస్తాడని కూడా అర్థమౌతుంది.

తిండికోసం, తల్లికిసేవచేయటంవంటి విషయాలలోను కమల తన అమ్మమ్మకు మాట యివ్వటంవల్లను మెల్లగా సత్యానికి కమల యింట్లో ఆమెకు మొగుడుగా కాకుండా కమలకు మేనమామగా స్థానం ఏర్పడింది.

మనిషిలోని ఆకలి కొద్దిగా సత్యాన్ని మార్చినా, అనుకూలవాతావరణం ఏర్పడగానే అతనిలోని మృగస్వభావం పంజాలువిప్పు తుందనేది, ఆతడు కమలపై చేయాలనుకొన్న వైవాహికలైంగికదాడి ప్రయత్నం స్పష్టంచేస్తుంది. సమాజందృష్టిలో భార్యయైనాకూడా ఏమాత్రంతను లొంగకుండా ఆతనిని బయటకువెళ్ళమనే ధైర్యం స్త్రీలలో ఉండాలనేస్పృహను కలిగించింది. అంతేకాక, ఈ నవల స్త్రీపురుషలైంగికసంబంధాలలో స్త్రీలపై లైంగిక అదుపును ప్రధానంగా చేసుకొని స్త్రీ ద్వితీయస్థానంలోకి నెట్టబడిందనే అవగాహనను కలిగించింది. పితృస్వామ్యసంస్కృతికి చెంపపెట్టువంటి పనిని కమలఆచరించటంతో, యింటాబయట స్త్రీలు ఎదుర్కొనే లైంగికదాడి స్వభావాన్ని తెలుసుకుంటూ స్త్రీలు ధైర్యాన్నిపుంజుకొనే చైతన్యాన్ని కలిగించిన సాహిత్యం ఇది.లైంగిక అదుపురూపంలో ఉన్న పురుషాధిక్య సంస్కృతిని పూర్తిగా నిర్వీర్యంచేయటంలోనే స్త్రీశక్తి ఉందనే స్పృహను కలిగించటంలో ఈ నవల నేటిస్త్రీలపాలిటి భగవద్గీత అనిపిస్తుంది. పురుషులలైంగిక అదుపును ధైర్యంగా నియంత్రించటమే పితృస్వామ్యసంస్కృతికి చేసే అంతిమసంస్కారం వంటిదనే చైతన్యం కలుగుతుంది. అప్పుడే పురుషులలోని మదం, అహంకారంపోయి చిత్తసంస్కారం కలిగిన మానత్వం వెలుగులీని స్త్రీపురుషసంబంధాలలో మానవీయత చోటుచేసుకుంటుంది. అదే ప్రజాస్వామిక కుటుంబాలపునర్నిర్మాణానికి మార్గదర్శిని, జ్ఞానదాయని అనే స్పృహ కలుగుతుంది.

భర్తమరణానంతరంకూడా ఆ భర్తనే తలచుకుంటూ ఆతని స్వర్గప్రాప్తికోసం పుస్తె కట్టినపాపానికి, పిల్లలులేకపోయినా పరాయి మగవాడితోనైనా తద్దినాలు పెట్టించేబాధ్యత భార్యబతికినన్నాళ్ళు ఆమెపై ఉండేటట్లు చేయటంచేతనే సూరమ్మలాంటి వారు కర్మకాండలకు అంతటిప్రాధాన్యతనిచ్చినట్లు కనపడుతుంది. ఆరకంగా స్త్రీలు జీవితాంతం పితృస్వామ్యసంస్కృతిని మరిచిపోకుండా చూసుకొనేటట్లుచేసిన దాని పకడ్బందీ వ్యూహాన్ని, ఆ సంస్కృతిలోని లొసుగులను అర్థంచేసుకునే

స్పృహను కలిగిస్తుంది. భర్త చనిపోతే స్త్రీ వికారరూపంలో ఆ భర్తనే తలచుకోవాలని నిర్దేశించిన సంస్కృతి, భార్యచనిపోతే మగవాళ్ళకు దుఃఖం ఉండాల్సిన అవసరం లేదని తెలియజేయటం వివక్షాసంస్కృతి అర్ధమౌతుంది. ఆతడు తన వయసులోసగంకంటె తక్కువ వయసున్న ఆడపిల్లను మళ్లిపెళ్ళి చేసుకునే అసమవయోవివాహ సంస్కృతిలోని వైరుధ్యాలే పితృస్వామ్య కుటుంబసంస్కృతిని ధిక్కరించేటట్లు చేస్తుందని బుల్లన్నయ్య రెండవ భార్యయైన సుభద్ర విషయం తేటతెల్లంచేస్తుంది

సూరమ్మ చిన్నన్నయ్య ఆమెను భయపెడుతూ యింట్లోని ఆడపిల్లకు పెళ్ళికాదని, ఆమె చేస్తున్న దేశసేవ సంప్రదాయవిరుద్ధమని చెప్పిరాట్నం వడికి నూలుబట్టలు తయారుచేయటంలో ఆమెను పాలుపంచుకోనీయలేదని అర్థమైనప్పుడు పితృస్వామ్యసంస్కృతి భారతదేశస్వాతంత్ర్యోద్యమానికి కూడా అడ్డుతగిలిందని అర్థమౌతుంది. దాని ఆచరణకు ప్రధానకారకులను ఆనాడు జైళ్ళల్లో పెట్టిఉండి ఉంటే భారతదేశానికి మరింత తొందరగా స్వాతంత్ర్యం వచ్చి ఉండేదనిపిస్తుంది.

ఈ నవలలో ప్రతిఫలించిన సాంస్కృతిక పరిణామస్రవంతిలో స్త్రీలను గౌరవించేవిధంగా ఎటువంటి ఆధిక్యతలేని సమస్థాయీ ప్రజాస్వామిక కుటుంబసంబంధాలను అభివృద్ధిచేయటం, స్త్రీపురుషుల పనివిభజనలో మార్పు అనివార్యం అవటం, ఆదర్శకుటుంబసంస్కృతికి గట్టి పునాదులు ఏర్పడటంగా పద్మారామశేషులకుటుంబ వ్యవస్థ అర్థం అవుతుంది. ఆ ఆదర్శమే వృద్ధుల మానసికస్థితిని అర్థంచేసుకొనే చైతన్యాన్ని కలిగిస్తుంది. అదే ప్రజాస్వామ్యకుటుంబాలలోని మానవత్వానికి ప్రతీక అవుతుంది.

గతశతాబ్ది ఆఖరున ఏర్పడిన ప్రపంచీకరణలో ఆడపిల్లలు ధైర్యంగా విదేశీచదువులకై ఒంటరిగా వెళ్ళటం, పరిణామసంస్కృతి అభివృద్ధికరమైన మరో ముందడుగు వేయటమే అనే చైతన్యాన్ని ఈ నవల కలిగిస్తుంది.'నేటి యువతకు సమాజంలోని మానవసంబంధాల అభివృద్ధికి అవసరమైన అన్నివిషయాలలో సమగ్రసంస్కారచైతన్యాన్ని ఇవ్వగలిగే మహాకావ్యం' అని

ఈ నవల గురించి ఓల్గా పేర్కొన్నారు. నిజంగా యువతకు ఇది ఒక దిక్సూచి. కాలక్షేపానికి కాక, సమాజాన్ని అర్థంచేసుకోవటానికి పిన్నాపెద్ద చదవాల్సిన నవల యిది అనటంలో అతిశయోక్తిలేదు. కాబట్టి ఈ నవలను పాఠ్యాంశంగా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని భావిస్తూ మాలతీచందూర్ గారికి హృదయపూర్వక వందనాలను సమర్పించటమే ముందున్న కర్తవ్యం.

* * * * * *

8. ఉపయుక్తగ్రంథావళి

1) తెలుగు నవలావికాసం - మొదలి నాగభూషణ శర్మ - 1971 - స్వీయ ప్రచురణ
2) సాంఘికనవల - కథనశిల్పం - మృణాళిని - 1988 - తెలుగు పరిశోధన ప్రచురణలు, హైదరాబాద్
3) తెలుగులో స్వతంత్ర కథాకావ్యాలు - మహిళాజీవన చిత్రణ - జె.కనకదుర్గ - 1995 - స్వీయప్రచురణ
4) సాహిత్యాకాశంలోసగం - కాత్యాయనీవిద్మహే - 2010,2013 - స్త్రీజనాభ్యుదయ అధ్యయన సంస్థ ప్రచురణలు
5) తెలుగులో స్త్రీలసాహిత్యం - సంపాదకత్వం - కాత్యాయనీవిద్మహే - 2003 - కాకతీయ యూనివర్సిటి ప్రచురణ - వరంగల్లు
6) జండర్స్పృహ - ఆధునిక తెలుగుసాహిత్యంలో ప్రతిఫలనాలు - సంపాదకత్వం - కాత్యాయనీవిద్మహే - 2005 - కాకతీయ యూనివర్సిటి ప్రచురణ - వరంగల్లు
7) నవలామాలతీయం - సంపాదకత్వం – ఓల్గా - 2006 - అస్మిత(రిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్), హైద్రాబాద్.
8) విముక్త - కథాసంపుటి - ఓల్గా - 2018 - స్వేచ్ఛా ప్రచురణలు,సైదరాబాద్.
9) స్వతంత్రత నుండి.... స్వాతంత్ర్యానికి - జె.కనకదుర్గ - 2021 - జంకదు ప్రచురణ
10) శతాబ్దిసూరీడు - మాలతీచందూర్ - 2021 - క్వాలిటీప్రచురణ, విజయవాడ

రచయిత : **జంధ్యాల కనకదుర్గ**

పుట్టిన తేది : 10-04-1953

తల్లిదండ్రులు : శ్రీ జంధ్యాల కుమారస్వామి,
శ్రీమతి లక్ష్మీప్రసన్న

భర్త : శ్రీ ఎమ్.వి.శాస్త్రి



విద్యార్హతలు :

1. ఎమ్.ఏ. - ఆంధ్రా విశ్వవిద్యాలయం (బంగారుపతకం) 1974
2. ఎమ్.ఫిల్. - కాకతీయ విశ్వవిద్యాలయం (రెండు బంగారుపతకాలు) 1990
3. పిహెచ్.డి. - కాకతీయ విశ్వవిద్యాలయం 1994

వృత్తి అనుభవం:

34 సం॥లు - లెక్చరర్, రీడర్, ప్రిన్సిపాల్ -

సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ కళాశాల, కొత్తగూడెం, ఖమ్మం జిల్లా.

సత్కారం - ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారం, 1984.

BOLT అవార్డు ఆఫ్ ఎయిర్ ఇండియా మరియు ఇతర సంస్థల పురస్కారాలు.

పరిశోధనలు :

1. యు.జి.సి. మైనర్ రీసెర్చి ఫెలోషిప్ అవార్డు - 1975
2. యు.జి.సి. మైనర్ రీసెర్చి ప్రాజెక్ట్ - సింగరేణి గని కార్మిక జీవనచిత్రణ 1998
3. యు.జి.సి. మేజర్ రీసెర్చ్ ప్రాజెక్ట్ - ప్రపంచీకరణ సందర్భంలో స్త్రీ పురుష సంబంధాలు - 2004

ప్రచురణలు :

(1) కొఱవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక (2) తెలుగు స్వతంత్ర కథా కావ్యాలలో మహిళా జీవనచిత్రణ (3) తెలుగు సాహిత్యం-మహిళా చైతన్య ప్రస్థానం (4) సింగరేణి సాహిత్యం-గని కార్మికజీవననం (5) సాహితీ సుమాలు (6) సాహిత్యం-సత్త్వదర్శిని (7) స్వతంత్రత నుండి... సాహిత్యానికి-(తెలుగులో స్త్రీల సాహిత్యం 1900-1947) (8) గత శతాబ్దపు సాంస్కృతిక స్రవంతి (9) హృదయనేత్రి-సహృదయ సంధాత్రి (ప్రచురణలో) (10) ఆకాశమే...హద్దుగా (ప్రచురణలో)

వివిధ పత్రికలలో ప్రచురింపబడిన విమర్శ వ్యాసాలు - 40

అభిరుచి - నిరంతర తెలుగు సాహిత్యాధ్యయనం - పరిశోధన

మాలతీచందూర్

శతాబ్ది సూరీడు -

సాంస్కృతిక ప్రవంతి

జె. కనకదుర్గ

'సజీవ మానవజగత్తుతో పరిచయంచేసే కళాకృతి నవల'

-లార్డ్ డేవిడ్

'శతాబ్ది సూరీడు' మాలతీచందూర్ రాసిన విశిష్ట నవల. సూరమ్మ ప్రధానపాత్రగా నాలుగుతరాల జీవితాల్ని చిత్రించినది ఈ నవల. ఈ సమయంలో సంతరించుకొన్న రాజకీయ పరిణామాలు, ఆర్థిక పురోగతి, సాంస్కృతిక చైతన్యం అనేక రంగాలపురోగమనం నవలలో అంతర్లీనంగా కలిసిపోయి నిలిచాయి. అవి అన్నీ మానవజీవితాలపై విశ్లేషణగా ప్రభావం చూపాయి అని డా. జె. కనకదుర్గ గారు తన విశ్లేషణలో భాగం చేశారు. పితృస్వామ్య పరిరక్షణ బాధ్యతలను మోసే (చిన్నన్న) పురుషపాత్ర. అటువంటి భావాలకు, ఆధునికభావాలకు మధ్య నలిగే (బుల్లన్నయ్య) పురుషపాత్ర. అసమర్థ (సత్యం) పురుషపాత్ర, ఆధునిక భావజాలంతో ఉన్న పురుషపాత్ర (రామశేషు) లను సందోర్భోచితంగా ఈ రచనలో విశ్లేషించారు. రామశేషు పాత్ర వ్యక్తిత్వాన్ని రచయిత్రి రూపొందించినంత విశేషంగాను డాక్టరు జె. కనకదుర్గగారు విశ్లేషించారు.

- ఆచార్య కొలకలూరి మధుజ్యోతి

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఒక శతాబ్దకాలపు చరిత్రలోని రాజకీయ-ఆర్థిక చలన సూత్రాల ప్రభావం వల్ల పరిణామశీలతను సంతరించుకొన్న మహిళా సంస్కృతి అభివృద్ధికరంగా ఉందా లేదా అని ఈ 'శతాబ్ది సూరీడు' నవల ఆలోపింపచేస్తుంది. అటువంటి సాంస్కృతిక ప్రవంతి మానవ సంబంధాలలో మార్పులు తేగలిగి చిత్తసంస్కారాన్ని కలిగించిందా లేదా అనీ, అది తరతరాలను ఆలోపింపచేస్తుందా లేదా అని తర్కించుకోగలిగిన పాఠకులకు ఆ సాహిత్యపు విలువ అర్థమౌతుంది.

- జె. కనకదుర్గ

రిటైర్డ్ ప్రిన్సిపల్,

సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ కళాశాల,

కొత్తగూడెం, పూర్వ ఖమ్మం జిల్లా.